

'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ మురా కక్షల జోలికి వెళ్లరు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 302

మంగళవారం 23-1-2024



ఆలయంలోకి నో ఎంట్రీ

రాహుల్‌గాంధీని అడ్డుకున్న అధికారులు.. ధర్నాకు దిగిన కాంగ్రెస్ అగ్రనేత -7లో



రెండు టెస్టులకు దూరం

వ్యక్తిగత కారణాలతో హైదరాబాద్, వైజాగ్ మ్యాచ్‌లనుంచి తప్పుకున్న కోహ్లి -14లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

మన రాముడొచ్చాడు

అయోధ్యలో కొలువైన బాలరాముడు

జగదానందకారకం.. దివ్యమంగళ స్వరూపం.. మందస్మిత వదనం.. చేత బంగారు ధనుస్సు, బాణం.. స్వర్ణవజ్రాభరణాలు, తులసీమాలల అలంకారం.. కార్యక్రమ ప్రధాన యజమాని (కర్త) హోదాలో ఐదేళ్ల బాలరాముడి విగ్రహానికి ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రాణప్రతిష్ట జరిగింది.

సోమవారం గర్భాలయం లోపల నరేంద్ర మోదీ అభిజిత్ ముహూర్తంలో 84 సెకన్ల వ్యవధిలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. బాలరాముడి పాదాలకు నమస్కరించి, విగ్రహం చుట్టూ ప్రదక్షిణ చేసిన అనంతరం సాష్టాంగ ప్రణామం చేశారు.

ప్రాణప్రతిష్ట ముగిశాక 'మన రామయ్య అయోధ్య నగరానికి వచ్చేశాడం'టూ ప్రధాని అతిథుల హర్షధ్వానాల మధ్య ప్రకటించిన మరుక్షణమే దేశ విదేశాల్లో లక్షలాది మంది భక్తులు వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. రాత్రి తమ ఇళ్లలో రామజ్యోతి వెలిగించి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు.

ప్రాణప్రతిష్ట తర్వాత ప్రధాని మోదీ ఇదే ప్రాంగణంలో ఉన్న కుబేర తిల శివాలయాన్ని దర్శించుకొని, పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో జటాయువు పక్షి విగ్రహాన్ని ఆవిష్కరించారు. క్రతువు పూర్తికాగానే మోదీ 11 రోజుల అనుష్ఠాన దీక్షను విరమించారు.

అయోధ్య రామ మందిర నిర్మాణంలో భాగస్వాములైన కార్మికులను ప్రధాని మోదీ ఘనంగా సన్మానించారు. అంతకుముందు ఆయన ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన వేదికపై నుంచి ప్రసంగించారు.

వైభవోజ్వల ప్రాణప్రతిష్ట

ప్రధాన యజమాని నరేంద్రమోదీ చేతుల మీదుగా కమనీయ ఘట్టం 6లో

నేటి నుంచి భక్తులకు రామ్‌లల్లా దర్శనం

అయోధ్యలో ప్రధాని మోదీ పారవశ్యం

రాముడి ఆశీస్సులతో దేశం కోసం పనిచేద్దాం

వచ్చే వెయ్యేళ్ల భారతదేశ నిర్మాణంపై దృష్టి

రామ్‌లల్లా ప్రాణప్రతిష్ట అనంతరం ప్రధాని పిలుపు

అయోధ్య పురవీధుల నిండా ప్రతిధ్వనించిన 'మంగళ ధ్వని'

ఆహూతులను ఆకట్టుకున్న నృత్య, సంగీత ప్రదర్శనలు

రామభక్తి పారవశ్యంలో ఓలలాడిన భారతావని

ప్రపంచ నలుమూలల్లోనూ ప్రాణప్రతిష్ట వేడుకలు

ప్రపంచంలోనే అదృష్టవంతుణ్ని: శిల్పి అరుణ్ యోగిరాజ్

జాతి మందిరమిది: యూపీ సీఎం యోగి

ప్రముఖుల సందడి

ప్రతిపక్ష నేతలు ఏం చేశారంటే...

-వివరాలు 6,7 పేజీల్లో

"శతాబ్దాల ఎదురుచూపులు, ఎన్నో బలిదానాలు, లెక్కలేనన్ని త్యాగాలు, తపస్సుల తర్వాత ఎట్టకేలకు రాముడు మళ్లీ అయోధ్యకు చేరుకున్నాడు. మన రామ్‌లల్లా ఇకపై డేరాలో ఉండడు. దివ్య మందిరంలో ఆయనకు శాశ్వత స్థానం లభించింది. జనవరి 22 అనేది కేవలం ఒక తేదీ కాదు. కొత్త కాలచక్రానికి ప్రతీక, నవశకానికి నాంది. వెయ్యేళ్ల తర్వాత కూడా ఈ తేదీని ప్రజలు గుర్తు పెట్టుకుంటారు. 'వికసిత్ భారత్'కు ఈ రామ మందిరం సాక్షి. భవ్య మందిర నిర్మాణం పూర్తయింది. ఇక దేశ నిర్మాణంపై దృష్టి పెట్టాలి. ఇది భారతదేశ సమయం.

- ప్రధాని మోదీ



రామ్‌లల్లా విగ్రహం వద్ద ప్రాణప్రతిష్ట పూజలు నిర్వహిస్తున్న మోదీ



అక్కడ ఇళ్లు ఎన్నో.. గుడులు అన్ని

అయోధ్యలో 8 వేలకుపైగా ఆలయాలు -16లో

విద్యుద్దీప కాంతుల్లో అయోధ్య రామ మందిరం

'రియల్' అభివృద్ధికి ప్రాధాన్యం: భట్టి



- రియల్ ఎస్టేట్ ప్రతినిధి బృందానికి డిప్యూటీ సీఎం హామీ
- రీజనల్ రింగ్‌రోడ్డు నిర్మాణంతో హైదరాబాద్ మరింత అభివృద్ధి

-వివరాలు 8లో

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా మహేందర్‌రెడ్డి!



- సెర్చ్ కమిటీ సూచన మేరకు మాజీ డీజీపీ పేరు ఎంపిక
- సభ్యులకు సంబంధించి దరఖాస్తుల పరిశీలన కొలిక్కి
- త్వరలోనే నియామక ఉత్తర్వులు వస్తాయంటున్న ప్రభుత్వ వర్గాలు.. కమిషన్ ఏర్పాటైతే పరీక్షల నిర్వహణ, ఫలితాల ప్రకటన ప్రక్రియలు వేగవంతం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) చైర్మన్‌గా మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకానికి ఏర్పాటైన సెర్చ్ కమిటీ సూచన మేరకు ఆయన పేరును ఖరారు చేసిన సర్కారు.. గవర్నర్ తమిళిసై ఆమోదం కోసం పంపినట్టు సమాచారం. త్వరలోనే సభ్యుల నియామకాన్ని కూడా పూర్తిచేసేలా కసరత్తు ముమ్మరం చేసినట్టు ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి.

వేగంగా దరఖాస్తుల పరిశీలన

టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ వ్యవహారం నేపథ్యంలో కమిషన్‌లో మార్పులు చేయాలని కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో యూపీఎస్సీ చైర్మన్, సభ్యులను కలసి చర్చించారు. యూపీఎస్సీ తరహాలో

మిగతా 8వ పేజీలో ▶

శ్రీశైలం, సాగర్‌ను అప్పగించేది లేదు



- ఆ ప్రాజెక్టులపై కేంద్రానికి లేఖ రాయనున్న రాష్ట్రం
- నెల రోజుల్లో అప్పగించాలని ఇటీవల కేంద్రం గడువు
- వారంలో విధివిధానాల ఖరారుకు సూచన
- కేంద్రం నిర్ణయాన్ని తప్పు పడుతూ తెలంగాణ లేఖ


-వివరాలు 12లో



.. వాళ్ల దగ్గర ఎన్నికల టికెట్ ఊసెందుకెత్తార్సార్!!

నగరానికి నీటి ముప్పు

- నాగార్జునసాగర్ జలాశయంలో తగ్గుతున్న నిల్వలు
- ప్రస్తుతం 520 అడుగులకు చేరిన నీటిమట్టం
- మరో పది అడుగులు తగ్గితే ఆందోళనకరమే
- తాజా వివాదంతో అత్యవసర ఎత్తిపోతలకూ కష్టమే



సాక్షి, హైదరాబాద్: వేసవికి ముందే నగరానికి నీటిముప్పు పొంచి ఉంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీటినిల్వలు తగ్గుముఖం పట్టి తాగునీటి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 520 అడుగులకు చేరింది. సాగర్ నీటిమట్టం మరింత తగ్గి పుట్టంగండి పంపింగ్ కేంద్రానికి నీరు అందకపోతే అత్యవసర పంపింగ్ తప్పనిసరి అవుతుంది. జలాశయంలో 510 అడుగుల నీటిమట్టం వరకు ఎలాంటి పంపింగ్ లేకుండా నగరానికి తాగునీటిని తరలించవచ్చు. వేసవినాటికి జలాశయంలో నీటిమట్టం

మిగతా 5వ పేజీలో ▶




మెట్రో ఫేజ్-2 రూట్‌మ్యాప్ ఖరారు

రెండో దశలో 70 కి.మీ. మేర కొత్త మార్గం

ట్రాఫిక్ రద్దీ నివారణ, భవిష్యత్ రవాణా అవసరాలు, ఎయిర్‌పోర్టు కనెక్టివిటీని దృష్టిలో ఉంచుకొని మెట్రోరైలు రెండో దశ ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు.. 70 కిలోమీటర్ల పొడవుతో రూపొందించిన ఫేజ్-2 మెట్రో రూట్ మ్యాప్‌ను అధికారులు ఖరారుచేశారు.

-వివరాలు 16లో


ప్రెస్టీజ్ న్యూ ఇయర్ బొనాంజా
ఈ న్యూ ఇయర్ కి
ప్రెస్టీజ్ వారి విప్లవాత్మక ప్రొడక్ట్స్‌ని
ఇంటికి తీసుకురండి.
*ఈ ఆఫర్ డిసెంబరు 23, 2023 నుండి జనవరి 28, 2024 వరకు మాత్రమే.
75 Years of Prestige
భారతదేశంలో మొట్ట మొదటి చిందటం
నివారించే ఫ్లిప్ ఆన్ ట్రై ప్లై ప్రెషర్ కుక్కర్
లాక్
అన్‌లాక్
LASTS A LIFETIME
Prestige FLIP-ON
ఏదైనా (3L అంతకంటే ఎక్కువ) ఫ్లిప్ ఆన్ ట్రై ప్లై ప్రెషర్ కుక్కర్ (1 యూనిట్) కొనుగోలు చెయ్యండి మరియు ₹2 150.00 విలువగల ఒమేగా డీలక్స్ గ్రానైట్ ట్విన్ ప్యాక్ (1 సెట్) ఉచితంగా పొందండి
(కాన్‌కేవ్ తవ 25 సె.మి (1 యూనిట్) మరియు ఫ్రై ప్యాన్ 20 సె.మి (1 యూనిట్))
ట్రై ప్లై ఔటర్ లిడ్ మరియు ఇన్నర్ లిడ్ సీరీస్ (3L అంతకన్నా ఎక్కువ) పై కూడా ఈ ఆఫర్ వర్తిస్తుంది.
భారతదేశంలో మొట్ట మొదటి ఆటోమేటిక్
విజిల్ కౌంటర్ ఇండక్షన్ కుక్‌టాప్ తో
మీ వంట మరింత పర్ఫెక్ట్ గా చెయ్యండి
Prestige
AUTOMATIC WHISTLE COUNTER
ఏదైనా విజిల్ లెక్కించే ఇండక్షన్ కుక్‌టాప్ (1 యూనిట్) కొనండి మరియు పాపులర్ స్వచ్ఛ్ స్టెయిన్‌లెస్ స్టీల్ ప్రెషర్ కుక్కర్ (5L) (1యూనిట్) MRP పై 15% డిస్కౌంట్ మరియు ₹500.00 తగ్గింపు పొందండి
విప్లవాత్మక
ఈజీ క్లీన్ డిజైన్
ఎత్తండి
క్లీన్ చేయండి
ఏదైనా స్వచ్ఛ్™ గ్లాస్ టాప్ గ్యాస్ స్టవ్ (1 యూనిట్) కొనండి మరియు MRP పై 15% డిస్కౌంట్ పొందండి అంతే కాదు ₹2 895.00 విలువగల ఎక్స్‌ప్రెస్ ఇండక్షన్ కుక్‌టాప్ (1 యూనిట్) ఉచితంగా పొందండి.
14 విధాలుగా పనిచేసే
ఆల్ ఇన్ వన్
మిక్సర్ గ్రైండర్
POWERFUL 1000W MOTOR
5 YEAR WARRANTY ON MOTOR
14 Functionalities
ఎండ్యూరా ప్రో మిక్సర్ గ్రైండర్ (1 యూనిట్) కొనండి మరియు MRP పై 25% డిస్కౌంట్ పొందండి అంతే కాదు ₹1 795.00 విలువగల సాండ్‌విచ్ మేకర్ (1 యూనిట్) ఉచితంగా పొందండి.
ఈ ఆఫర్ ఎండ్యూరా 3, 4, 6 జార్ మిక్సర్ గ్రైండర్ మరియు డిలైట్ ప్రో మిక్సర్ గ్రైండర్ పై కూడా వర్తిస్తుంది.
ప్రవేశ పెడుతున్నాం
ఇండియాలోనే
మొట్ట మొదటి సేఫ్ సెన్స్
టెక్నాలజీ™ కలిగిన చిమ్నీ
ఆటోమేటిక్ పొగ మరియు గ్యాస్ లీక్ ని కనిపెడుతుంది.
SafeSense™ technology
Controlled through Mobile App - Prestige Smart Chef App
ఆస్కార్ సేఫ్ సెన్స్ చిమ్నీ (1 యూనిట్) కొనండి మరియు MRP పై 25% డిస్కౌంట్ పొందండి అంతే కాదు ₹14 145.00 విలువగల రాయల్ ప్లస్ గ్లాస్ టాప్ గ్యాస్ స్టవ్ (4B) (1 యూనిట్) ఉచితంగా పొందండి
ఒమేగా డీలక్స్ గ్రానైట్ కుక్ వేర్ సెట్, ఇండియాలోనే మొట్ట మొదటి 5 - లేయర్స్ డ్యూరబల్ నాన్ స్టిక్
ఒమేగా డీలక్స్ గ్రానైట్ 4 పీస్ కుక్‌వేర్ (1 సెట్) కొనండి మరియు MRP పై 20% డిస్కౌంట్ పొందండి అంతే కాదు ₹1 780.00 విలువగల స్వచ్ఛ్ పాపులర్ ప్లస్ అల్యుమినియం ప్రెషర్ కుక్కర్ (3L) (1 యూనిట్) ఉచితంగా పొందండి
*నిబంధనలు వర్తించును. పైన ఇచ్చిన ధరలన్నీ ప్రొడక్ట్ యొక్క MRP (అన్ని టాక్స్ లు కలిపి). MRP పై మాత్రమే డిస్కౌంట్స్ వర్తిస్తాయి. ఏ రెండు ఆఫర్స్ కలపకూడదు. సెలెక్టెడ్ మోడల్స్ స్టాక్ ఉన్నంత వరకు మాత్రమే ఈ ఆఫర్ వర్తిస్తుంది. ఎంచుకోబడిన స్టోర్స్‌లో మాత్రమే ఆఫర్ వర్తిస్తుంది. ఒమేగా డీలక్స్ గ్రానైట్ 4 pc కుక్‌వేర్ (1 సెట్) లో ఫ్రై ప్యాన్ – 24cm (1 యూనిట్), గ్లాస్ లిడ్ కలిగిన కడాయి – 28cm (1 యూనిట్), ఓమ్ని తవా – 28cm (1 యూనిట్) మరియు గ్లాస్ లిడ్ కలిగిన మిల్క్ ప్యాన్ – 16cm (1 యూనిట్) ఉంటాయి. ఆఫర్ ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ లో మాత్రమే వర్తిస్తుంది. ప్రెస్టీజ్® లోగో ఇది ఇండియాలో టిటికె ప్రెస్టీజ్ లిమిటెడ్ వారి ట్రేడ్ మార్క్. నిబంధనలు మరియు షరతులకు సంబధించిన మరిన్ని వివరాలు కోసం మీ సమీపంలోని ప్రెస్టీజ్ ఎక్స్‌క్లూజివ్/డీలర్ అవుట్లెట్ కి విచ్చేయండి లేదా మా వెబ్ సైట్ https://shop.ttkprestige.com/new-year-offer-tc ను సందర్శించండి.
Prestige®
తనవాళ్ళ మీద ప్రేమ ఉన్నవారు
ప్రెస్టీజ్‌ని ఎలా కాదనగలరు.
CUSTOMER CARE NO 080-6000 4411
Follow 'TTK Prestige' on
PRESTIGE XPERT on WhatsApp 97423 34411
Shop Online on shop.ttkprestige.com
ttk
Prestige Xclusive
KARIMNAGAR: Mankamma Thota, Ph: 8008797047; Vavilapally, Ph: 7032307491; SIDDIPET: Beside Srinivasa Theatre, Hyderabad Road, Ph: 9700003187; Mancherial: Near New Bus stand, Ph: 9866045646.
Also Available at: Karimnagar: Supreme Kitchen Mall, Ph: 9989455521; Supreme Enterprises, Ph: 9989455521; Anjaiah Malayala, Ph: 0878-2231072, 9246931072; Venkateshwara Shopping Centre, Ph: 9949443815; R.KistaiahHomeAppliances, Ph: 9949030588; Ravindra metal merchant, Ph: 9849540801; Mankeshwara Steel, Ph: 9866162213; Malyala Ajay metal, Ph: 9000900908; Godavarikhani: Sainath Home Needs, Ph: 9032558888; Jagityal: Gajanand Steel, Ph: 9014790960; Sri PadmajaEnterprises, Ph: 9985211109; SriVenkateswaraSteel, Ph: 9247289351; Susmitha furniture, Ph: 8555802418; Korutla: Sri Satya sai steel, Ph: 9849600050; Laxmi Priya Steel, Ph: 6302145976; Anand Shopping centre, Ph: 9700311666; Metpalli: Sambari prabhakar Metal, Ph: 9440070504; Anand Shopping centre, Ph: 8500305100; Sambari chinnaiah, Ph: 9848013870; Peddapally: Shankar enterprises, Ph: 9701677694; Sri venkateswara Stainless steel, Ph: 9849026824; Sircilla: Tirumala Electronics, Ph: 9553344255; Subhash electronics, Ph: 9849773376; Vemulawada: B.N. Metal, Ph: 9014712245; Rudrangi: Padmaja Super Market, Ph: 9848503810; Keshavapatnam: Mahalaxmi Steel, Ph: 7013004945; SIDDIPET: Sri Venkataramana Metal, Ph: 9949660096.

ఫ్లాగ్ డే ఫండ్‌కు మీ సహకారం ఎంతో గొప్పది

- విరాళమిచ్చిన ఎస్‌బీఐ సిబ్బందిని అభినందించిన గవర్నర్ తమిళిసై



సాక్షి, హైదరాబాద్: యుద్ధ నిపుణులు, మాజీ సైనికులు, యుద్ధ వితంతువులు, వారిపై ఆధారపడిన వారి సంక్షేమం కోసం విరాళమిచ్చిన ఎస్‌బీఐ సిబ్బంది, అధికారులను రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ అభినందించారు. ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే ఫండ్‌కు ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ (తెలంగాణ స్టేట్) నుంచి రూ.34,16,750 విరాళం చెక్కును హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్‌కుమార్ సోమవారం గవర్నర్‌కు అందించారు. రాజ్‌భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సైనిక్ వెల్ఫేర్(తెలంగాణ) డైరెక్టర్ కల్నల్ రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఎస్‌బీఐ ఉద్యోగులు ఇచ్చిన విరాళం ఇతర వ్యక్తులు, సంస్థలకు ప్రేరణగా నిలుస్తుందని అన్నారు.

సలహాదారుల్లో బీసీలకేది అవకాశం: జాజుల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రభుత్వ సలహాదారుల పదవుల్లో బీసీలకు అవకాశం కల్పించకపోవడం శోచనీయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వానికి సలహాలిచ్చే స్థాయి బీసీలకు లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వలేదని, మంత్రివర్గంలో కూడా పెద్దగా అవకాశం కల్పించలేదని, హైకోర్టులో కూడా అడ్వకేట్ జనరల్‌గా, అడిషనల్ అడ్వకేట్ జనరల్‌గా బీసీలకు అవకాశం కల్పించకపోవడం బాధకరమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లు, వివిధ ప్రభుత్వ కార్యదర్శులు, ముఖ్యమంత్రి కార్యాలయంలో కూడా బీసీలకు అవకాశాలు కల్పించకపోవడాన్ని కాంగ్రెస్ ప్రభుత్వపెద్దలు ఆలోచించాలని సూచించారు. బీసీలను విస్మరిస్తే పార్లమెంటు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

శ్రీశైలం, సాగర్‌ను అప్పగించేది లేదు

ఆ ప్రాజెక్టులపై కేంద్రానికి లేఖ రాయనున్న రాష్ట్రం

- నెల రోజుల్లో అప్పగించాలని ఇటీవల కేంద్రం గడువు
- వారంలో విధివిధానాల ఖరారుకి సూచన
- కేంద్రం నిర్ణయాన్ని తప్పుబడుతూ తెలంగాణ లేఖ



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్‌ఎంబీ)కి నెల రోజుల్లోగా అప్పగించే విషయంలో తాము ఎలాంటి సమ్మతి తెలపలేదని పేర్కొంటూ త్వరలో కేంద్ర జలశక్తి శాఖకు లేఖ రాయాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ నిర్ణయించింది. ఈ నెల 17న ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ నేతృత్వంలో జరిగిన సమావేశంలో ప్రాజెక్టుల అప్పగింతపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు సమ్మతి తెలిపినట్టు పేర్కొంటూ మినట్స్‌లో నమోదు చేయడంపై అభ్యంతరం తెలుపుతూ ముసాయిదా లేఖను సిద్ధం చేసింది. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించిన తర్వాత ఈ లేఖను ఒకటి రెండు రోజుల్లో కేంద్ర జలశక్తి శాఖకు పంపించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ప్రాజెక్టుల నిర్వహణకు సంబంధించిన ఆపరేషన్స్ ప్రోటోకాల్ సిద్ధం కావాల్సి ఉందని, దానిని సిద్ధం చేసినా కూడా తమ రాష్ట్రానికి ఆమోదయోగ్యంగా ఉండాల్సి ఉంటుందని లేఖ ద్వారా కేంద్రానికి స్పష్టం చేయనుంది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల తుది పంపకాలు సైతం జరగాల్సి ఉందని తెలియజేసుంది. కీలకమైన ఈ అంశాలపై స్పష్టత వచ్చిన తర్వాతే ప్రాజెక్టులను కృష్ణాబోర్డుకు అప్పగించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించి నిర్ణయం తీసుకుంటామని తెలియజేయనుంది.

ముందు వాటాలు తేల్చాలి

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య 50:50 నిష్పత్తిలో కృష్ణా జలాల పంపకాలు నిర్వహించిన తర్వాతే ప్రాజెక్టుల అప్పగింత విషయంలో ముందుకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుత ఏపీ, తెలంగాణ మధ్య 66:34 నిష్పత్తిలో తాత్కాలిక పంపకాలను జరుపుతున్నారు. రాష్ట్ర విభజన జరిగిన తొలినాళ్లలో ఈ మేరకు రెండు రాష్ట్రాల మధ్య తాత్కాలిక పంపకాలు జరిపారు. తొలుత ఒకే ఏడాది కోసం ఈ మేరకు తాతాల్కిక కోటాను నిర్ణయించగా, ఆ తర్వాత వరుసగా 9 ఏళ్ల పాటు కొనసాగిస్తూ వచ్చారు. తెలంగాణ ఏర్పడిన నాటితో పోల్చితే ప్రస్తుతం రాష్ట్ర సాగునీటి అవసరాలు పెరిగాయని, ఈ నేపథ్యంలో రెండు రాష్ట్రాల మధ్య 50:50 నిష్పత్తిలో కృష్ణా జలాల పంపకాలు నిర్వహించిన తర్వాతే ప్రాజెక్టుల అప్పగింత విషయంలో కేంద్రం నిర్వహించే సమావేశాలకు హాజరు కావాలని నిర్ణయించినట్టు అధికారవర్గాలు తెలిపాయి.

'రాష్ట్రం కోసం అలానే మాట్లాడతాం'

ఈ నెల 17న ఢిల్లీలో జరిగిన సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా మాట్లాడుతుండగా, కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ అడ్డుపడి రాజకీయ నాయకుడిలాగా మాట్లాడుతున్నారంటూ వ్యాఖ్యానించినట్టు తెలిసింది. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ కోసం మాట్లా డాల్సిన బాధ్యత తనపై ఉందని రాహుల్ బొజ్జా సమాధానం ఇచ్చినట్టు సమాచారం. ఇదిలా ఉండగా, ప్రాజెక్టుల అప్పగింతపై అధికారుల స్థాయిలో నిర్ణయం తీసుకుంటే సరిపోదని, ముఖ్యమంత్రి స్థాయిలో రాజకీయ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

కిక్కిరిసిన బస్సులు.. కొత్తవి ఎప్పుడు?

'మహాలక్ష్మి'పథకంతో 100శాతం దాటుతున్న ఆక్యుపెన్సీ

- పాత బస్సులు కావడంతో ఓవర్ లోడ్‌తో అదుపు తప్పుతాయన్న ఆందోళన
- కొత్త బస్సులు సమకూర్చుకునే ప్రక్రియలో తీవ్ర జాప్యం
- నిధుల లేమితో ఆర్టీసీకి ఇబ్బందులు.. సర్కారు సాయం, పూచీకత్తు రుణాలపైనా అస్పష్టత



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు కిక్కిరిసి ప్రయాణిస్తున్నాయి. సంస్థ చరిత్రలోనే తొలిసారిగా 100 శాతానికిపైగా ఆక్యుపెన్సీ రేషియో నమోదవుతోంది. 'మహాలక్ష్మి' పథకంతో ఉచిత ప్రయాణం నేపథ్యంలో మహిళలు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఈ పథకం విజయవంతంగా నడుస్తున్నా.. మరోవైపు ఇదే తీవ్ర ఆందోళనకూ కారణమవుతోంది. ఇప్పుడున్న ఆర్టీసీ బస్సుల్లో చాలా వరకు పాతబడ్డాయి. కొన్ని అయితే డొక్కుగా మారాయి. అలాంటి బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసి నడిస్తే ఎక్కడ అదుపు తప్పుతాయోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు బస్సుల్లోని సీట్లలో చాలా వరకు మహిళలతో నిండిపోతుండటంతో.. పురుషులకు సీట్లు దొరక్క ప్రైవేటు వాహనాల వైపు మొగ్గుతున్నారన్నదీ ఆందోళన రేపుతోంది. కొత్త బస్సులు అందుబాటులోకి వస్తే.. ఈ రెండు సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అధికారవర్గాలు చెప్తున్నాయి. కానీ ఎన్ని బస్సులు కొందాం, ఏ కేటగిరీలో ఎన్ని ఉండాలన్న ప్రతిపాదనలు, సమావేశాలకే సర్కారు పరిమితం అవుతోందన్న విమర్శలు వస్తున్నాయి.

అదనంగా 10లక్షల మంది..

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా తొలుత 'మహాలక్ష్మి'పథకాన్ని ప్రారంభించింది. కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ పుట్టినరోజు సందర్భంగా డిసెంబర్ 9న దీన్ని పట్టాలెక్కించారు. ఈ పథకం విజయవంతంగా నడుస్తోంది. బస్సుల్లో నిత్యం 10 లక్షల మందికిపైగా అదనంగా ప్రయాణిస్తున్నారు. గతంలో 66శాతంగా ఉన్న ఆక్యుపెన్సీ రేషియో 90శాతం దాటింది. ప్రత్యేక రోజుల్లో 101 శాతానికీ చేరుతోంది. ఉచిత ప్రయాణానికి సంబంధించిన సొమ్మును ప్రభుత్వం రీయింబర్స్ చేసే నేపథ్యంలో ఆర్టీసీ రోజువారీ ఆదాయం రూ.10 కోట్ల మేర పెరిగింది. ఈ నెల 17, 18 తేదీల్లో ఏకంగా రూ.22.50 కోట్ల చొప్పున ఆదాయం నమోదైంది. అయితే పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సులు లేక ఇబ్బందులు వస్తున్నాయి. కర్ణాటకలో ఇదే తరహాలో పథకాన్ని ప్రారంభించినప్పుడు బస్సులు సరిపోక తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. మన ఆర్టీసీ అధికారులు అక్కడికి వెళ్లి పరిశీలించినప్పుడు ఈ అంశం కూడా వారి దృష్టికి వచ్చింది. ఈ క్రమంలో యుద్ధప్రాతిపదికన కొత్త బస్సులు సిద్ధం చేసుకుని పథకాన్ని ప్రారంభించి ఉండాల్సిందని.. అలా చేయకపోవడంతో సమస్యలు వస్తున్నాయని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నాలుగు వేల బస్సులు అవసరం

ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలవుతోంది. ఈ కేటగిరీలకు సంబంధించి 7,292 బస్సులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. స్పేర్‌లో ఉంచే బస్సులను కూడా వాడేస్తున్నారు. ఇప్పుడున్న రద్దీని నియంత్రించాలంటే కనీసం నాలుగు వేల అదనపు బస్సులు అవసరమని అంచనా. ఇటీవల వచ్చిన కొత్త బస్సులు 50 మాత్రమే. గత ప్రభుత్వ హయాంలో వెయ్యి బస్సులకు ఆర్టీసీ ఆర్డర్ ఇచ్చింది. మరో వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులు కొనేందుకు ఏర్పాట్లు చేసింది. అవి అందేందుకు కొన్ని నెలలు పట్టవచ్చని అధికారులు అంటున్నారు. ముఖ్యంగా ఇప్పుడు ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సులు అవసరం. ఇప్పటికిప్పుడు కొత్త బస్సులు కొనేందుకు ఆర్టీసీ వద్ద నిధులు లేవు. ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తే, లేదా ప్రభుత్వ పూచీకత్తుతో రుణాలు తీసుకుంటేనే కొనుగోళ్లు సాధ్యం. దీనిపై ఇంకా ఎలాంటి స్పష్టత లేకుండా పోయింది.

న్యాయ్‌యాత్రలో రాహుల్‌పై దాడిని ఖండించిన కాంగ్రెస్

దాడికి వ్యతిరేకంగా కొవ్వొత్తులతో నిరసన



ర్యాలీలో మున్షీ, శ్రీధర్‌బాబు, వెంకట్, మహేశ్‌కుమార్, మధుయాష్కీ తదితరులు

కవాడిగూడ (హైదరాబాద్): భారత్‌జోడో న్యాయ్‌యాత్రలో రాహుల్‌గాంధీపై బీజేపీ దాడిని రాష్ట్ర కాంగ్రెస్ ఖండించింది. దాడికి నిరసనగా ఏఐసీసీ పిలుపు మేరకు సోమవారం బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు బీజేపీకి, మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ కేంద్ర మంత్రులు రేణుకా చౌదరి, బలరాంనాయక్, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, మహేశ్‌కుమార్, మాజీ మంత్రి పుష్పలీల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రాహుల్‌కు అసోం ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

రాహుల్ మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసే కుట్ర: సీఎం

అసోంలో రాహుల్‌గాంధీపై స్థానిక బీజేపీ నాయకుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాహుల్ భద్రత విషయంలో అక్కడి రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇలాంటి చర్యలతో ఆయన మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయాలన్న కుట్రలు ఫలించవని చెప్పారు.

న్యాయ్‌యాత్రకు భయపడే రాహుల్‌పై దాడి: జగ్గారెడ్డి

రాహుల్‌గాంధీ చేస్తున్న భారత్‌జోడో న్యాయ్‌యాత్ర ద్వారా ప్రజల్లో మార్పు వస్తుందనే భయంతోనే ఆయనపై దాడికి బీజేపీ గూండాలు ప్రయత్నం చేశారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆరోపించారు. రాహుల్‌గాంధీపై బీజేపీ దాడిని దేశంలోని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు.

1,804 మంది చిన్నారులకు విముక్తి

సాక్షి, హైదరాబాద్: అదృశ్యమైన, అపహరణకు గురైన, బాలకార్మికులుగా మారిన, భిక్షాటనలో ఉన్న చిన్నారులను గుర్తించేందుకు చేపట్టిన 'ఆపరేషన్ స్మైల్'1,804 మంది చిన్నారుల జీవితాల్లో తిరిగి చిరునవ్వులు పూయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 1 నుంచి ప్రారంభమైన ఈ ప్రత్యేక డ్రైవ్ ముమ్మరంగా కొనసాగుతోంది. ఈనెల 20 వరకు కాపాడిన చిన్నారుల వివరాలను మహిళా భద్రత విభాగం అధికారులు సోమవారం వెల్లడించారు. పోలీస్ శాఖ అధికారులు ఇతర ప్రభుత్వ విభాగాలు, ఎన్జీఓ ప్రతినిధులతో కలిసి బృందాలుగా ఏర్పడి రాష్ట్రవ్యాప్తంగా ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈనెల 20 వరకు నమోదైన వివరాల ప్రకారం..అత్యధికంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో 253 మంది చిన్నారులను గుర్తించారు. హైదరాబాద్‌లో 266 మంది, వికారాబాద్‌లో 107, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 187, సూర్యాపేటలో 92, ఆదిలాబాద్‌లో 76, వరంగల్‌లో 82 మంది చిన్నారులను గుర్తించినట్టు అధికారులు తెలిపారు. ఈనెల 31 వరకు ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందన్నారు.

ముగిసిన గురుకుల టీజీసెట్ దరఖాస్తు ప్రక్రియ

- 1.25 లక్షల దరఖాస్తులు
- ఫిబ్రవరి 11న అర్హత పరీక్ష నిర్వహణకు సన్నాహాలు
- ఏప్రిల్ నెలాఖరులోగా ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో ఐదో తరగతి ప్రవేశాలకు సంబంధించి అర్హత పరీక్షకు దరఖాస్తు ప్రక్రియ సోమవారంతో ముగిసింది. సాయంత్రం వరకు సాగిన దరఖాస్తు ప్రక్రియలో భాగంగా 1.25 లక్షల మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు అధికారులు ప్రాథమికంగా వెల్లడించారు. డూప్లికేషన్, పూర్తి వివరాలు లేని దరఖాస్తులను పరిశీలించిన తర్వాత మరింత స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్), తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్), మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్), తెలంగాణ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీఆర్‌ఈఐఎస్)ల్లో ఐదోతరగతికి ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోంది. నాలుగు సొసైటీల పరిధిలో దాదాపు ఏడువందల గురుకుల పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో ఐదో తరగతిలో 48,500 సీట్లున్నాయి. ఒక్కో సీటుకు సగటున రెండున్నర రెట్లు పోటీ ఉంది.

ఫిబ్రవరి 11న అర్హత పరీక్ష

ఐదోతరగతి ప్రవేశాలకు ఉమ్మడి పరీక్ష ఫిబ్రవరి 11న నిర్వహించనున్నట్లు సెట్ కన్వీనర్ ప్రకటించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష తేదీకి వారం రోజుల ముందు వెబ్‌సైట్‌లో విద్యార్థుల హాల్ టికెట్లను అందుబాటులో ఉంచనున్నట్లు అధికారులు చెబుతున్నారు. సొసైటీల వారీగా రిజర్వేషన్లు వేరువేరుగా ప్రాధాన్యతల క్రమంలో ఉంటాయి. అర్హత పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన వారికే ప్రవేశానికి అవకాశం కలుగు తుంది. ఏప్రిల్ నెలాఖరులో లేదా మే నెల మొదటి వారంలో పరీక్ష ఫలితాలను ప్రకటించే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఫలితాలు వెలువడిన వెంటనే ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రారంభిస్తారు. మూడు విడతల్లో కౌన్సెలింగ్ నిర్వహించేలా అధికారులు కార్యాచరణ రూపొందించారు. తొలి విడతలో దాదాపు 75 శాతం మంది ప్రవేశాలు పొందుతారని, ఆ తర్వాత రెండో విడత, చివరగా మూడో విడతతో వందశాతం సీట్లు భర్తీ చేయనున్నట్లు సమాచారం.

ప్రతి విద్యాసంస్థలో భారత రాజ్యాంగం పుస్తకం ఉండాలి

- మంత్రి సీతక్క వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ప్రతి విద్యా సంస్థలో భారత రాజ్యాంగం పుస్తకం ఉండాలని పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఈ పుస్తకం పట్ల విద్యార్థులకు అవగాహన పెంచేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పుస్తకంలోని అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించాలని, దీంతో వారికి రాజ్యాంగం కల్పించిన హక్కుల పట్ల అవగాహన పెరుగుతుందన్నారు. సోమవారం బంజారాహిల్స్ లోని బంజారా భవన్‌లో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల ప్రిన్స్‌పాల్స్, గిరిజన సంక్షేమ వసతిగృహ అధికారులతో సీతక్క సమీక్ష నిర్వహించారు. ఈ ఏడా ది జరిగే పదో తరగతి పరీక్షల్లో గిరిజన విద్యా సంస్థలన్నీ వంద శాతం ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉత్త మ ఫలితాలు సాధించిన సంస్థలకు బహుమతులందిస్తామని, ప్రోత్సాహకాలు ఉంటాయని తెలిపారు. గిరిజన విద్యాసంస్థల్లో పాఠ్యాంశ బోధనతో పాటు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

నాగర్‌కర్నూల్ ఎంపీగా పోటీ చేస్తా: మల్లు

సాక్షి, హైదరాబాద్: నాగర్‌కర్నూల్‌లో ఎంపీగా పోటీ చేస్తానని ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి అన్నారు. సోమవారం తెలంగాణ సచివాలయంలో ప్రభుత్వ సలహాదారుడు హర్కర వేణుగోపాల్, టీపీసీసీ అధికార ప్రతినిధి చరణ్ కౌశిక్‌తో కలిసి మల్లు రవి మాట్లాడారు. తనకు ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా అవకాశం కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డికి మల్లు రవి ధన్యవాదాలు తెలిపారు. మిగతా ముగ్గురిని ప్రభుత్వ సలహాదారులుగా నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. రాముడి గురించి కొత్తగా దేశ ప్రజలకు ప్రధాని మోదీ చెప్పాల్సింది ఏమీ లేదని, ఆయనకంటే సామాన్యులకే ఎక్కువ తెలుసునన్నారు. అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి రాకపోవడం చూస్తుంటే గిరిజనులు, దళితులపై మోదీ చూపిస్తున్న వివక్ష వైఖరి స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. రాజీవ్‌గాంధీ హయాంలోనే రామ మందిర నిర్మాణానికి పూనుకున్నారని, కోర్టు కేసుల వల్ల పెండింగ్ పడిందని మల్లు రవి అన్నారు.

మతిస్థిమితం లేని మహిళ ఎర్రగడ్డ ఆస్పత్రికి తరలింపు

- ఆమె బిడ్డను శిశువిహార్‌కు తరలించిన లీగల్ సర్వీసెస్ అథారిటీ

సాక్షి, హైదరాబాద్: మతిస్థిమితం లేని ఓ మహిళను వైద్య చికిత్స నిమిత్తం ఎర్రగడ్డ ఆస్పత్రికి, ఆమెకు పుట్టిన బిడ్డ(2)ను శిశువిహార్‌కు రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ తరలించింది. రాష్ట్ర సరిహద్దుల్లో తిరుగుతున్న తెలంగాణకు చెందిన హర్షిత అలియాస్ హరితరాజతో పాటు ఆమె బిడ్డను చత్తీస్‌గడ్ అధికారులు ముందుగా అక్కడి ఆస్పత్రిలో చేర్పించి తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీకి లేఖ రాశారు. ఈ లేఖపై స్పందించిన రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ శ్యామ్‌కోషి, అథారిటీ సభ్యకార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు జూనియర్ అసిస్టెంట్ కె.అనిల్‌కుమార్, కానిస్టేబుళ్లు స్వాతి, వెన్నెలదేవి అక్కడికి వెళ్లారు. హర్షితతోపాటు ఆమె బిడ్డను హైదరాబాద్‌కు తరలించారు. హర్షితను ఎర్రగడ్డ ఆస్పత్రికి తరలించి, చిన్నారిని శిశువిహార్‌లో చేర్పించారు. బంధువులు ఆమె కోసం 040–23446723 ఫోన్ నంబర్ లేదా జిల్లా అథారిటీ కార్యాలయాల్లో గాని సంప్రదించాలని గోవర్ధన్‌రెడ్డి సూచించారు.

మా తాత పీవీ ఆత్మ శాంతించి ఉంటుంది: ఎన్వీ సుభాష్

సాక్షి, హైదరాబాద్: అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వీక్షించి ఉంటే ఎంతో సంతోషించే వారని ఆయన మనవడు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ పేర్కొన్నారు. నాడు రామమందిర అంశంలో పీవీ అనవసర ఆరోపణలు ఎదుర్కొన్నారని, అయినప్పటికీ ఈ క్రతువుని చూసి ఆయన ఆత్మ శాంతించిందని భావిస్తున్నామని చెప్పారు. రామభక్తుల 500 ఏళ్ల పోరాటం ఫలించడంతో నోటి వెంట మాటలు రావడం లేదని సుభాష్ భావోద్వేగానికి లోనయ్యారు. రథయాత్రతో అయోధ్య పోరాటానికి నాంది పలికిన ఎల్‌కే అద్వానీ, వీహెచ్‌పీ సహా సంఘ్ పరివార్.. ప్రధాని మోదీ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగిందన్నారు. ఈ విషయంలో ఏ ఒక్కరి పాత్రను తక్కువ చేసి చూడలేమని, కరసేవకుల త్యాగాలు విస్మరించలేమని కొనియాడారు. కార్యక్రమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న ముస్లిం సోదరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని సుభాష్ చెప్పారు.

ఫిబ్రవరి 29లోగా టెన్త్ ప్రీ ఫైనల్స్ నిర్వహించాలి

అన్ని ప్రభుత్వ స్కూళ్లకు ఉన్నతాధికారుల ఆదేశం



సాక్షి, హైదరాబాద్: పదో తరగతి ప్రీ ఫైనల్స్‌ను వచ్చే నెల 29లోగా నిర్వహించాలని అన్ని ప్రభుత్వ స్కూళ్లను ఉన్నతాధికారులు ఆదేశించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ నెలాఖరుకు సిలబస్ పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులకు స్పష్టం చేశారు. దీనికోసం అవసరమైతే ప్రత్యేక తరగతులు నిర్వహించాలని పేర్కొన్నారు. సిలబస్ పూర్తవ్వని స్కూళ్ల జాబితాను పాఠశాల విద్యాశాఖ కార్యాలయం ఇటీవల పరిశీలించింది. వాస్తవానికి గతేడాది డిసెంబర్ 31 నాటికే సిలబస్ పూర్తి కావాల్సి ఉండగా అసెంబ్లీ ఎన్నికలు రావడం, పదోన్నతులు, బదిలీల హడావుడి, వరుస సెలవుల కారణంగా 18 శాతం స్కూళ్లలో సిలబస్ పూర్తి కాలేదని అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో మిగిలిన సిలబస్‌ను ఈ నెలాఖరులోగా పూర్తి చేసి ఫిబ్రవరి నుంచి రివిజన్‌కు వెళ్లాలని అధికారులు హెచ్‌ఎంలకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఈ సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా 5.07 లక్షల మంది టెన్త్ పరీక్షలు రాస్తున్నారు. గతేడాదితో పోలిస్తే 15 వేల మంది ఈ సంవత్సరం పెరిగారని అధికారులు తెలిపారు. మరోవైపు ప్రైవేటు స్కూళ్లతో పోలిస్తే గతేడాది టెన్త్‌లో రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలు (72.39 శాతం), స్థానిక సంస్థల పాఠశాలల్లో (79.14 శాతం) ఉత్తీర్ణత తక్కువగా నమోదైన నేపథ్యంలో ఈసారి ఆయా స్కూళ్లు వంద శాతం ఫలితాలు సాధించే దిశగా అడుగులేయాలని పాఠశాల విద్య డైరెక్టరేట్ కార్యాలయం హెచ్‌ఎంలకు సూచించింది.

ఆర్‌టీసీ బస్‌డిపోలో రెండు బస్సులు దగ్ధం

- దిల్‌సుఖ్‌నగర్ సిటి డిపోలో ఘటన
- కారణాలపై ఆర్‌టీసీ అధికారుల విచారణ



దిల్‌సుఖ్‌నగర్ సిటి డిపోలో అగ్నికి ఆహుతైన రెండు డీలక్స్ బస్‌లు



కాలిపోయిన బస్‌లను పరిశీలిస్తున్న టీఎస్ ఆర్‌టీసీ ఈడి వెంకటేశ్వర్లు, ఆర్‌ఎం వరప్రసాద్

హైదరాబాద్: దిల్‌సుఖ్‌నగర్‌లోని ఆర్‌టీసీ డిపోలో సోమవారం ఉదయం అనుమానాస్పదంగా మంటలంటుకుని రెండు మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్‌లు అగ్నికి ఆహుతయ్యాయి. అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూటా లేక మరేదైనా కారణం అయి ఉంటుందా అని ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.... ఉదయం 4.50 గంటలకు ధర్మయ్య అనే డ్రైవర్ విధుల కోసం బస్‌డిపోకు చేరుకున్నారు. తనకు కేటాయించిన బస్సు (టీఎస్04జెడ్0173) వద్దకు వెళ్లి తన బ్యాగ్‌ను బస్‌లో పెట్టి తాగు నీరు తెచ్చుకునేందుకు వాటర్ ఫిల్టర్ దగ్గరకు వెళ్లాడు. బస్ బయలుదేరేందుకు 45 నిమిషాలు సమయం ఉండటంతో అక్కడే సిబ్బందితో మాట్లాడుతున్నాడు. బస్ గ్యారేజ్ ఎదురుగా పార్కు చేసి ఉన్న బస్ నుంచి పొగలు రావటం గమనించిన మెకానిక్‌లు కొందరు బస్ దగ్గరకు పరుగెత్తారు. బస్ అడుగున బ్యాటరీ, గేర్‌బాక్స్ మధ్యలో మంటలు వస్తుండటంతో ఫైర్ సేఫ్టీ సిలెండర్ తీసుకొచ్చి ఆపే ప్రయత్నించారు. కానీ ఆగక పోగా క్షణాల్లోనే బస్‌మొత్తం వ్యాపించాయి. ఈలోగా కొంత మంది మెకానిక్‌లు మంటలు అంటుకున్న బస్ పక్కన ఉన్న మూడు బస్‌లను అక్కడ నుంచి తరలించారు. ప్రమాదం జరిగిన బస్ పక్కన ఉన్న మరో బస్ తీసేందుకు వీలు కాక పోవటంతో (టీఎస్ 04 జెడ్ 0193) బస్‌కు కూడా మంటలు వ్యాపించి పూర్తిగా కాలిపోయింది. ఈలోగా సమాచారం అందుకున్న మలక్‌పేట ఫైర్ స్టేషన్ సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పేశారు. రెండు బస్‌లు పూర్తిగా దగ్ధం కాగా మరో గూడ్స్ వాహనం కొద్దిగా కాలింది.

ప్రమాదానికి కారణం షార్ట్ సర్క్యూటేనా..?

దిల్‌సుఖ్‌నగర్ సిటీ డిపోలో రెండు బస్‌లు దగ్ధం కావటానికి కారణం షార్ట్ సర్క్యూటా లేక మరదైన కారణం ఉందా అని అనుమానాలు కలుగుతున్నాయి. మంటలు ముందుగా అంటుకున్న బస్ చౌటుప్పల్ రూట్‌లో నడుపుతారు. గేర్ బాక్స్‌లో ప్రాబ్లం ఉండటంతో రెండు రోజులుగా నడపటం లేదని తెలిసింది. గేర్‌బాక్స్ మరమ్మత్తు పూర్తి చేసిరాత్రి 9గంటల సమయంలో బస్ వాషింగ్ చేసి పార్కు చేసినట్లు మెకానిక్‌లు తెలిపారు. బ్యాటరీ నుంచి వచ్చే వైర్లు ఏవైనా షార్ట్ అయి మంటలు వ్యాపించి గాలి ఎక్కువగా ఉండటంతో పక్కన ఉన్న బస్‌కూడా దగ్ధం అయిందని అధికారులు తెలుపుతున్నారు. బస్‌లో తన బ్యాగ్ పెట్టి వాటర్ కోసం వేళ్లానని డ్రైవర్ ధర్మయ్య తెలుపుతుండగా మంటలు అంటుకున్న సమయంలో బస్ స్టార్టికీ ఆన్ చేసిఉందని కొంతమంది డిపో సిబ్బంది చెప్పటం గమనార్హం. టీఎస్‌ఆర్‌టీసీ ప్రధాన కార్యాలయం నుండి పలువురు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఘటనపై మలక్‌పేట పోలీస్ స్టేషన్‌లో డిపో మేనేజర్ హరి పిర్యాదు చేశారు.



ఏ అభిప్రాయం లేకుండా ఉండే అవకాశం నీకు ఎప్పుడూ ఉంది. నువ్వు నియంత్రించలేని విషయాల పట్ల, నీ ఆత్మను ఇబ్బంది పెట్టుకోవాల్సిన అవసరం లేదు. తీర్పు ఇమ్మని ఆ విషయాలు నిన్ను కోరడం లేదు.

– మార్కస్ అరేలియస్

సాక్షి

మంగళవారం, 23 జనవరి 2024

అవిస్మరణీయ క్షణాలు

కొన్ని క్షణాలు చరిత్రలో ప్రత్యేకంగా నిలుస్తాయి. భారత ప్రధాని మోదీ మాటల్లో చెప్పాలంటే, హిందువులు ఆరాధించే శ్రీరాముడికి పురాణప్రసిద్ధమైన ఆయన జన్మస్థలి అయోధ్యలో వెలసిన మందిర ప్రారంభం, అక్కడ అయిదేళ్ళ బాలరాముడి విగ్రహానికి సోమవారం జరిపిన ప్రాణప్రతిష్ఠాపన ఘట్టం అలాంటివే. మరో వెయ్యేళ్ళు గుర్తుండిపోయే రోజుగా మోదీ పేర్కొన్న మందిర ప్రారంభ దినాన కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా రామనామం ప్రతిధ్వనించింది. నేపాల్, బాలీ, ట్రినిడాడ్ సహా దేశదేశాల్లోని హిందువులు ఉత్సవం చేసుకున్నారు. వజ్రవైడూర్య ఖచిత స్వర్ణాభరణాలంకృత మందస్మిత బాలరామ రూపసాక్షాత్కారం, సాయంసంధ్యలో సరయూ తీరంలో లక్షల సంఖ్యలో దీపప్రజ్వలనంతో... అనంత కాలగతిలో ఒక చక్రభ్రమణం పూర్తి అయినట్టయింది. నాగరకతలో ఇదొక మహత్తర క్షణమనీ, రామరాజ్య స్థాపనకు తొలి అడుగనీ కొందరంటే... రామరాజ్యమంటే హిందూ రాజ్యం కాదు, ధర్మరాజ్యమనే గాంధీ భావనను ఇతరులు గుర్తుచేయాల్సి వచ్చింది.

అనేక మతఘర్షణలు, దశాబ్దాల రాజకీయ, న్యాయ పోరాటాలు ఈ మందిర నిర్మాణం వెనుక ఉన్నాయి. రామ జన్మభూమిలో 1528లో బాబర్ సైన్యాధ్యక్షుడు మీర్ బాఖీ కట్టినట్టు చెబుతున్న బాబ్రీ మసీదు 1992 డిసెంబర్ 6న కరసేవకుల చేతిలో కూలడం, చివరకు సుప్రీమ్ కోర్టు వేర్వేరుగా ఆలయ – మసీదు నిర్మాణాలకు ఆదేశాలివ్వడం... అలా అది ఓ సుదీర్ఘ చరిత్ర. వెరసి, అయిదు శతాబ్దాల తర్వాత రామ్ లల్లా (బాల రాముడు)కు అది మందిరమైంది. వేలాది ధార్మికుల మొదలు అద్వానీ, మురళీ మనోహర్ జోషీ, అశోక్ సింఘాల్, కల్యాణ్ సింగ్ లాంటి నేతల వరకు ఈ ఆలయ నిర్మాణ ఘట్టానికి ప్రేరకులు, కారకులు ఎందరెందరో. మూడు దశాబ్దాల క్రితం తమ పార్టీ చేసిన ఎన్నికల వాగ్దానాన్ని ఎట్టకేలకు నెరవేర్చిన ఘనత మాత్రం మోదీకి దక్కింది. తెరపై రామ జన్మభూమి ట్రస్ట్ లాంటి పేర్లున్నా, తెర వెనుక చక్రం తిప్పుతున్నదెవరో తెలియనిది కాదు. వచ్చే మేలో మరోసారి ప్రజాతీర్పు కోరి, వరుసగా మూడోసారి బీజేపీని గద్దెనెక్కించే పనిలో మోదీ ఉన్నారు. హడావిడి, అసంపూర్ణ ఆలయ ప్రారంభోత్సవాన్ని ఎన్నికల అస్త్రంగా విమర్శకులు తప్పుబడుతున్నదీ అందుకే. కోట్లాది శ్రద్ధాళువుల ఉత్సాహం అర్థం చేసుకోదగినదైనా, దేశమంతటా ఉద్వేగం రగిలించి, మందిరాన్ని సైతం మెగా ఈవెంట్‌గా మార్చేయడం వెనుక రాజకీయ ప్రయోజనాలు లేవనలేం.

'ఆనకట్టలే ఆధునిక దేవాలయాలు' అన్న భావన నుంచి పక్కకు జరిగి, అత్యద్భుత ఆలయ నిర్మాణాలు అవసరమనే విధాన మార్పు వైపు దేశం ప్రయాణించింది. బీజేపీ, మోదీల మందిర రాజకీయాలు ప్రాంతీయ నేతలకూ పాఠమయ్యాయి. ఆలయాలు అనంత రాజకీయ ఫలదాయకమని అందరూ గుర్తించారు. అయోధ్య అక్షతలను ఇంటింటికి పంపే పని ఒకరు చేస్తే, ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ రాష్ట్రంలో ప్రతి ఇంటా బియ్యం, తాంబూలం సేకరించి, గత బుధవారం పూరీ క్షేత్రంలో ఆలయ విస్తరణ ప్రాజెక్ట్ 'జగన్నాథ్ పరిక్రమ' ప్రారంభించారు. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ శక్తిపీఠాల్లో ఒకటైన కోల్‌కతాలోని కాళీఘాట్ ఆలయ పునర్నిర్మాణాన్ని తెరపైకి తెచ్చారు. మతానికీ, రాజకీయానికీ ముడివేసే ఈ ప్రయత్నాలు ఎంత దూరం వెళతాయో చెప్పలేం. అడుగడుగున గుడి, అందరిలో దేవుడున్నాడని భావించే భారతీయ సంస్కృతి నడయాడిన నేలపై... అయోధ్యలో మందిరావిష్కారం రోజునే మమత సర్వమత సౌభ్రాతృత్వ యాత్ర చేపట్టడం గమనార్హం.

నిజానికి, ప్రపంచవ్యాప్తంగా ధార్మిక స్థలాల సందర్శన పెరుగుతోంది. ధార్మిక పర్యాటకం పోటెత్తుతోంది. భారత్‌లో ఏటా 20 కోట్ల మందికి పైగా కాశీని సందర్శిస్తారనీ, రోజుకు లక్ష మందికి పైగా తిరుపతికి వస్తారనీ లెక్క. ఇప్పుడీ జాబితాలో కొత్తగా అయోధ్య చేరనుంది. దేశంలోనే పెద్ద హిందూ దేవాలయంగా నిర్మాణమైన రామమందిరం, సరయూ నదీ తీరంలోని సామాన్య పట్నాన్ని మహానగరంగా మార్చేందుకు వేసిన మెగా ప్రణాళిక, ప్రచార హంగామాతో పరి వ్యాప్త మైన ధార్మిక వాతావరణం... అన్నీ కలసి పురాణ ప్రసిద్ధ శ్రీరామ జన్మస్థలి అయోధ్యను సరికొత్త ఆధ్యాత్మిక గమ్యంగా మారుస్తున్నాయి. చరిత్ర ప్రసిద్ధ ప్రాంతాలను పర్యాటక క్షేత్రాలుగా తీర్చి దిద్దడం మన వారసత్వ వైభవానికీ, పర్యాటక వాణిజ్యానికీ మంచిదే. కాకుంటే, రూ. 15 వేల కోట్ల ప్రాజెక్టులు, 85 వేల కోట్ల పెట్టుబడులు అంటూ ఒకప్పుడు రోజుకు 2 వేల మందికి పరిమితమైన ప్రాంతాన్ని రోజుకు 3 లక్షల పర్యాటకుల స్థాయికి తీసుకెళ్ళే క్రమంలో తగు జాగ్రత్తలూ ముఖ్యం.

అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠాపన, మందిర ప్రారంభాలకు ఉత్సవం చేసుకోవడం సరే. ఈ సంబరాల వేళ సాటి వర్గాలను మానసికంగా ఒంటరివాళ్ళను చేస్తేనే కష్టం. సమస్త జనుల సౌభాగ్యానికి మారుపేరైన 'రామరాజ్యం' వైపు నడిస్తేనే సార్థకత. దేశంలోని అన్ని వర్ణాలు, వర్గాల మధ్య సమత, సమానత, సహనం, సామరస్యం, సౌభ్రాతృత్వం నెలకొనేలా చూడాల్సింది నాయకులే. ఆ కృషి చేస్తేనే అర్థం, పరమార్థం. శ్రీరాముడు చేసింది అదే. అలాకాక, 'అయోధ్య అయిపోయింది... కాశీ, మథుర మిగిలింది' లాంటి రెచ్చగొట్టే నినాదాలతో వైమనస్యాలు పెంచితే, దేశ సమైక్యతకే అది గొడ్డలిపెట్టు. మరో రావణకాష్ఠానికి మొదటి మెట్టు. ఈ దేశం నీది, నాది, మనందరిదీ అని అన్నివర్గాలూ అనుకోగలిగే ఏకాత్మ భావనే భిన్న సంస్కృతులు, ధర్మాల సమ్మిళితమైన భారతావనికి శ్రీరామరక్ష. పాత తప్పుల్ని తవ్వి తలకుపోసుకొనే పని మాని, కలసి నడవాల్సిన సమయమిది. ఆ దిశలో... నేటికీ కలగానే మిగిలిన నిరుద్యోగ నివారణ, దారిద్ర్య నిర్మూలన, స్త్రీలోకపు సశక్తీకరణ, పీడితజన సముద్ధరణ లాంటి లక్ష్యాలతో మన పాలకులు అడుగులు వేయాలని ఆశిద్దాం. అందరూ ఆ మహా సంకల్పం చెప్పుకొంటేనే ఏ సంబరానికైనా పుణ్యం, పురుషార్థం!

ఎన్ని తగ్గిస్తే అన్ని నెగ్గినంత!

కామెంట్



కరణ్ థాపర్

28 పార్టీల 'ఇండియా' కూటమి ప్రధాన లక్ష్యం ఏమిటి అన్నదాన్ని బట్టే అది తన లక్ష్యం సాధించగలదా లేదా అన్నది ఆధారపడి ఉంటుంది. బీజేపీని 272 సీట్ల కన్నా తక్కువకు నియంత్రించి, మిత్రపక్షాల మద్దతు లేనిదే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేని స్థితికి తేవడమా? లేక, కూటమిలోని 28 పార్టీలు దేనికదిగా అత్యధిక సీట్లలో విజయం సాధించటమా? ఈ రెండు కూడా వేర్వేరు లక్ష్యాలు. అత్యధిక సీట్లను గెలుచుకోవటమే 'ఇండియా' కూటమి లక్ష్యమైతే... చేజేతులా బీజేపీని తిరుగులేని విధంగా అధికారంలోకి రానివ్వటమే! అలా కాకూడదంటే, ఓట్లు చీలకుండా ఆ యా పార్టీలు తాము గెలవలేని రాష్ట్రాల్లో మిత్రపక్షాల కోసం సీట్లను త్యాగం చేయవలసి ఉంటుంది.

ఈరోజు నేను చెప్పాలనుకుంటున్న విషయం సరళమైనది, సూటిగా మాట్లాడుకోబోయేదీ. అదేమిటంటే – వచ్చే ఎన్నికల్లో నరేంద్ర మోదీని, భారతీయ జనతా పార్టీని 'ఓడించాలన్న' 28 పార్టీల 'ఇండియా' కూటమి కల నిజం అవుతుందా అన్నది! అయితే ఆ కల నిజం అవటం అన్నది ఒకే ఒక ప్రశ్నకు లభించే సమాధానం పైనే ఆధారపడి ఉంటుంది. 'ఇండియా' కూటమి లక్ష్యం ఏమిటన్నదే ఆ ప్రశ్న. బీజేపీని 272 సీట్ల కన్నా తక్కువకు నెట్టేసి, మిత్రపక్షాల మద్దతు లేనిదే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేని స్థితికి ఆ పార్టీ తేవడమా? లేక, కూటమిలోని 28 పార్టీలు దేనికదిగా అత్యధిక సీట్లలో విజయం సాధించటమా?

ఇవి రెండూ వేర్వేరు లక్ష్యాలు. ప్రస్తుత పరిస్థితుల్లో ఒకే లక్ష్యంగా అవి కూటమి కలను సాకారం చేయగలిగినవి కావు. రెండు లక్ష్యాలకు వేటికవిగా భిన్న విధానాలు, భిన్న వ్యూహాలు అవసరం. అత్యధిక సీట్లను గెలుచుకోవటమే తన లక్ష్యంగా 'ఇండియా' కూటమి పెట్టుకున్నట్లయితే... అది చేజేతులా చాలా పెద్ద సంఖ్యలో సీట్ల గెలుపుతో బీజేపీని తిరుగులేని విధంగా అధికారంలోకి రానివ్వటమే!

బీజేపీని 272 సీట్లకు దిగువనే ఉంచటానికి కూటమిలోని ప్రతి ఒక్క పార్టీ తన పరిమితుల్ని అంగీకరించవలసి ఉంటుంది. పైకి అదేమంత పెద్ద విషయంగా అనిపించకపోయినా ప్రధానంగా అదే పెద్ద విషయం. కూటమి లబ్ధి కోసం పార్టీలు తమ ప్రయోజనాలను త్యాగం చేయటం అవసరం. అప్పుడు మాత్రమే ఇండియా కూటమి కనీసం 400 సీట్లలో ప్రత్యర్థితో ముఖాముఖి తలపడగలదు. అప్పుడు మాత్రమే ప్రతిపక్ష కూటమికి పడిన 60 శాతం ఓట్లు... పోటీలో ఉన్న ఎక్కువమంది అభ్యర్థుల మధ్య చీలిపోయే అవకాశం ఉండదని ఆశించవచ్చు.

ఈ విషయం మీకు వివరంగా చెప్పడానికి కాంగ్రెస్‌ను నేను ఒక ఉదాహరణగా తీసుకుంటాను. ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లలో ఇటీవలి చరిత్రలను చూస్తే కనుక అక్కడ కాంగ్రెస్‌కు ఉన్న విజయావకాశాలు పరిమితమేననీ, వాటిని మెరుగుపరుచుకునే ప్రయత్నాలకు కూడా ఇది సమయం కాదనీ నిర్ధారణగా తెలుస్తుంది.

2014లో ఉత్తర ప్రదేశ్‌లో కాంగ్రెస్ రెండంటే రెండే లోక్‌సభ సీట్లను గెలుచుకుంది. యూపీలోనే 2022 విధాన సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చిన సీట్లు కూడా రెండే. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన ఓట్లు వరుసగా 6.4. శాతం, 2.4 శాతం. బెంగాల్‌లో మరీ హీనం. అక్కడ 2019లో కాంగ్రెస్ రెండు స్థానాల్లో మాత్రమే గెలిచింది. 2021 శాసనసభ ఎన్నికల్లోనైతే ఒక్క సీటు కూడా రాలేదు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు లభించిన ఓట్లు వరుసగా 5.7 శాతం, 3.1 శాతం.



ఇండియా కూటమి నేతలు

స్పష్టంగా తెలుస్తున్నది ఏమిటంటే, కాంగ్రెస్ ఎన్ని ఎక్కువ సీట్లకు పోటీ చేస్తే బీజేపీ అన్ని ఎక్కువ సీట్లలో గెలుస్తోంది. బిహార్‌లో సరిగ్గా ఇదే జరిగింది. 2020 బిహార్ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ 70 చోట్ల పోటీ చేస్తే, గెలిచింది 19 సీట్లు మాత్రమే. అంతకు ముందరి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన ఫలితాలే ఇక్కడా పునరావృతం అయ్యాయి. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ 9 సీట్లకు పోటీ చేస్తే ఒక్క చోట మాత్రమే విజయం సాధించింది.

అయితే, 'ఇండియా' కూటమిలోని తక్కిన పార్టీలు కూడా కాంగ్రెస్‌కు అనుకూలంగా త్యాగాలు చేయవలసిన రాష్ట్రాలు కొన్ని ఉన్నాయి. అవి: మధ్య ప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ. ఈ రాష్ట్రాల్లో సమాజ్‌వాది, ఆమ్ ఆద్మీ వంటి పార్టీలు తమ ప్రయోజనాలకు అతీతంగా పని చేయాలి. ఆశల రెక్కల్ని చాపుకోడానికి వాటికిది సమయం కాదు. బీజేపీని ఆ రాష్ట్రాలలో ఓడించగల స్థానంలో ఒక్క కాంగ్రెస్ మాత్రమే ఉంది.

అలాగే 'ఇండియా' కూటమికి సమస్యాత్మకమైన రాష్ట్రాలు కూడా ఉన్నాయి. వాటిల్లో పంజాబ్, ఢిల్లీ ప్రధానమైనవి. పంజాబ్‌లో లోక్‌సభ స్థాయిలో కాంగ్రెస్ 8 సీట్లు, ఆమ్ ఆద్మీ 1 సీటు గెలుచుకున్నాయి. శాసనసభ ఎన్నికలకు వచ్చేటప్పటికి ఈ పరిస్థితి పూర్తిగా తారుమారు అయ్యింది. ఆప్ 92 చోట్ల, కాంగ్రెస్ 18 చోట్ల విజయం సాధించాయి. ఇక ఢిల్లీలో కాంగ్రెస్ గానీ, ఆప్ గానీ ఒక్క లోక్‌సభ సీటును కూడా గెలుచుకోలేక పోయాయి. అయితే ఆప్ కంటే ఎక్కువ స్థానాల్లో కాంగ్రెస్ రెండవ స్థానంలో నిలిచింది. ఢిల్లీ శాసన సభ ఎన్నికల్లో మాత్రం ఆప్‌దే పైచేయిగా ఉంది. ఈ రెండు రాష్ట్రాలలో కూడా కూటమి పార్టీల మధ్య సీట్ల విభజన అంత సులభమేమీ కాదు. అయినప్పటికీ అత్యాశతో అవి విభజనకు ప్రయత్నించాయా... బీజేపీ గెలిచినట్లే!

నేను చెప్పాలనుకున్న ఈ విషయం ఎందుకింత సరళంగా, సూటిగా... అదే సమయంలో ఎందుకింత ముఖానికి కొట్టొచ్చినంత స్పష్టంగా కూడా ఉన్నదో మీకు అర్థమయిందా? నా ఈ విశ్లేషణతో విభేదించడం 'ఇండియా' కూటమికి స్వయంకృత పరాజయం మాత్రమే అవుతుందన్న విషయాన్ని కూడా మీరు అంగీకరించగలరా? బీజేపీని 272 సీట్లకంటే తక్కువకు పరిమితం చేయడానికి ప్రతిపక్షాలు కనీసంలో కనీసంగా తీసుకోవలసిన జాగ్రత్తలు ఇవే. త్యాగాలకు సిద్ధపడటం, అత్యాశను వదులుకోవటం. ఇవి కాకుండా వారు తెలుసుకోవలసినవి ఇంకొన్ని కూడా ఉన్నాయి.

మొదటిది: ప్రధానమంత్రిపై వ్యక్తిగత విమర్శలు పనికిరావు. రెండు: అదానీ, క్రోనీ క్యాపిటలిజం (రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు కుమ్మక్కు అవటం), చైనా వైఖరి పట్ల మోదీ బలహీనమైన ప్రతిస్పందన, లేదా మైనారిటీలను తక్కువగా చూడటం అనే అంశాలేవీ ఓట్లు రాల్చేవి కాదు. ఈ రెండు విషయాలను పక్కన పెట్టి, సామాన్య ప్రజల దైనందిన జీవితాలను ప్రభావితం చేస్తున్న ద్రవ్యోల్బణం, విద్య, ఆరోగ్యం, ఉద్యోగాలు, పేదరికం వంటి వాటిపై కూటమి దృష్టి పెట్టాలి.

ఇప్పుడు మరికొంచెం ముందుకు వెళతాను. 'మోదీకి పోటాపోటీ ఎవరు?' అనే ప్రశ్న... 'ఇంకెవరు? రాహుల్‌గాంధీ'నే అనే సంసిద్ధ సమాధానంతో పూర్తవదని ఇండియా కూటమి స్పష్టతను కలిగి ఉండాలి. రాహుల్ గాంధీ కూడా తను కనీసం సంభావ్య ప్రధాని మంత్రి అభ్యర్థినైనా కానని స్పష్టం చెయ్యాలి. అవసరమైతే, నిస్సందేహంగా అది ఆమోదం పొందేవరకూ రాహుల్ పదే పదే దాన్ని పునరుద్ఘాటించాలి.

చివరిగా కాంగ్రెస్‌కు ఒక మాట. మోదీని, బీజేపీని ఓడించడం తేలిక కాదు. ఆ పార్టీని 272 సీట్ల దిగువకు దింపడమే కాంగ్రెస్ పార్టీ 2024 లక్ష్యం కావాలి. 2029లో మాత్రమే కాంగ్రెస్ తను సొంతంగా మెజారిటీ సాధించేందుకు పని చేయాలి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఉత్తేజకర సంకేతం



ఇది భారత సంస్కృతికి ఉత్తేజకర కాలం. భూగోళ వ్యాప్తంగా వేద పునరుజ్జీవనం జరుగుతోంది. భారత్ లోపల, బయట నిర్మాణమయ్యే గొప్ప ఆలయాలు సనాతన ధర్మ సంస్కృతి పునరుద్ధరణకు సంకేతాలు.

– జెఫ్రీ ఆర్మ్‌స్ట్రాంగ్, వేదాంశాల రచయిత

ఏకత కోసం...



ఒక భారతీయ ముస్లింగా, నా తోటి పౌరులతో నేను రామ మందిర ప్రారంభోత్సవంలో పాల్గొంటున్నాను. దేశంలోని రెండో అతి పెద్ద మత సమూహంగా, అత్యధికులను ఒక దగ్గరికి చేర్చే ఇలాంటి వేడుకల్లో పాల్గొనడం అంతిమంగా దేశ ఏకత్వానికి తోడ్పడుతుంది.

– సనా హాష్మీ, ఫెలో

నిశ్శబ్ద హీరో



చరిత్రను ఏమార్చిన నెహ్రూవియన్ – మార్కిస్ట్ చరిత్రకారుల బండారం బయటపెట్టిన పురాతత్వవేత్త కె.కె.మహమ్మద్ లాంటి చరిత్రకెక్కని హీరోలకు (అయోధ్య రామాలయ నిర్మాణం సందర్భంగా) మనం కృతజ్ఞత చెప్పాలి. థ్యాంక్యూ సర్!

– వినోద్ కుమార్, ఏఐఎఫ్ వెటరన్

కారిపోతోంది...



కొద్ది రోజులుగా వాట్సాప్ చాట్లు, 'ఎక్స్' పోస్టులు ఎంత భక్తిమయం అయిపోయాయంటే... ఆ యాప్స్ ఓపెన్ చేసిన ప్రతిసారీ నేను చెప్పులు విడుస్తున్నాను.

– సందీప్ థాపర్, సెటైరిస్ట్

ఐ యామ్ సారీ!



ఇతర మతాలను అనుసరించే నా తోటి సోదర సోదరీమణులకు నా క్షమాపణలు. జరుగుతున్నది ఏదైనా, అది దేశ లౌకిక తత్వాన్ని చెడగొట్టేది, మతాన్ని రాజకీయం చేసేది, దేశ సమగ్రతకు భంగం కలిగించేది. నేను దేశం కోసం ప్రార్థిస్తాను.

– అంకుర్ మిశ్రా, అడ్వకేట్

మనం అంతే!




ఒకానొక కాలంలో... ఇండియాలోని ప్రతీ హిల్ స్టేషన్‌కు తనదైన ఒక ఆకర్షణ ఉండేది. కానీ ఇప్పుడు అన్నింటినీ వాలు మీద ఉన్న సరోజినీ నగర్‌లను చేశాం. (హిల్ స్టేషన్లు అన్నీ ఇరుకైన బస్తీల్లా మారాయన్న అర్థంలో.)

– పర్మీందర్ సింగ్, వ్యాపారవేత్త

ఇన్ బాక్స్

భారత స్వాతంత్ర్య సేనాని

మాతృదేశ స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్నే ధారపోసి, బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎంత త్వరగా అంతమొందించితే దేశానికంత మేలు అన్న లక్ష్యంతో పోరాటం సల్పిన మహానాయకుడు సుభాష్ చంద్రబోస్. 1897 జనవరి 23వ తేదీన కటక్‌లో ఒక బెంగాలీ కుటుంబంలో జన్మించాడు బోసు బాబు. ఉన్నత విద్యాభ్యాసమంతా కలకత్తాల్లో సాగింది. 1921 ఏప్రిల్‌లో ఐసీఎస్‌లో ఉత్తీర్ణుడై ఇంగ్లండ్ నుంచి భారత్‌కు తిరిగి వచ్చాడు కానీ ప్రభుత్వ సర్వీస్‌లో చేరలేదు. స్వాతంత్ర్యోద్యమంలో దూకాడు.



సుభాష్ చంద్రబోస్

1939లో గాంధీజీ పూర్తిగా బలపరిచిన భోగరాజు పట్టాభి సీతారామయ్యను ఓడించిన బోసు బాబుకు గాంధీజీతో పాటు కాంగ్రెస్ పెద్దలు చాలా మంది సహకరించలేదు. దీంతో కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి 'ఫార్వర్డ్ బ్లాక్' స్థాపించాడు. 1939 సెప్టెంబర్‌లో రెండవ ప్రపంచ యుద్ధం ఆరంభమైంది. బ్రిటిషు వాళ్లకు ఎటువంటి సహాయమూ చేయవద్దని బోస్ ప్రజలకు పిలుపునిచ్చాడు. 1940లో ప్రభుత్వం అరెస్టు చేసి గృహ నిర్బంధంలో ఉంచింది. 1941 జనవరిలో తన ఇంటికి కాపలాగా ఉన్న పోలీసుల కన్నుగప్పి జర్మనీ చేరాడు. 1942 ఏప్రిల్‌లో బెర్లిన్ రేడియో ద్వారా బ్రిటన్ శత్రువైన జర్మనీ మనకు మిత్రదేశమని ప్రకటించాడు. 1943లో జర్మనీ నుంచి ఒక జలాంతర్గామిలో సముద్రంలో ప్రయాణం చేసి సింగపూర్ చేరుకున్నాడు. బోసు 1943 జులై 4న రాస్ బిహారీ బోస్ నుంచి 'ఆజాద్ హింద్ ఫౌజ్' పగ్గాలు తీసుకున్నాడు. జపాన్ సహాయంతో బ్రిటిష్ సైన్యాలతో యుద్ధానికి తలపడ్డాడు.

1943 నవంబర్‌లో అండమాన్ నికోబార్ దీవులను ఆజాద్ హింద్ ఫౌజ్ వశపరచుకొన్నది. 1944 జనవరిలో బోసు ఇండియన్ నేషనల్ ఆర్మీ కేంద్ర కార్యాలయాన్ని రంగూన్‌కు మార్చి 'ఢిల్లీ చలో' (ఢిల్లీకి పదండి) అని తన సైన్యానికి పిలుపు ఇచ్చి 'మీ రక్తాన్ని నాకివ్వండి – మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను' అంటూ ఉత్తేజపరిచాడు. మార్చి నెలలో ఈ సైన్యం బర్మా సరిహద్దు దాటి భారత భూభాగంపై అడుగుపెట్టింది. అయితే హిరోషిమా, నాగసాకీలపై అమెరికా అణుబాంబులు వేయడంతో జపాన్ లొంగిపోయింది. దీంతో బోస్ సైన్యం ఎన్నో ఇక్కట్లు ఎదుర్కొంది. 1945 ఆగస్టు 18వ తేదీన 'ఫార్మోసా' దగ్గర జరిగిన ఒక విమాన ప్రమాదంలో బోసు మరణించినట్లు వార్త వెలువడింది. ఇప్పటికీ ఆయన మరణవార్తను చాలామంది నమ్మడంలేదు.

– దాసరి సుబ్రహ్మణ్యేశ్వర రావు । 94930 33534

(నేడు సుభాష్ చంద్రబోస్ జయంతి)

పెరుగుదల వేరు... మెరుగుదల వేరు!

అభిప్రాయం



డానీ

ఆర్థికరంగంలో 'వృద్ధి', 'అభివృద్ధి' అనే పదాల్ని చాలామంది తరచుగా ఒకే అర్థంలో వాడుతుంటారు. సామాజిక రంగంలో ఇవి రెండు భిన్నమైన భావనలే కాక పరస్పర విరుద్ధమైన భావనలు కూడ. దేశంలోని వస్తువులు, వస్తుసేవల ఉత్పత్తిలో పెరుగుదలను ఆర్థిక వృద్ధి సూచిస్తుంది. దీనిని సాధారణంగా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు ద్వారా కొలుస్తారు. ఆర్థిక వృద్ధికి పరిమాణం ముఖ్యం. ఒక దేశ /రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ తాలూకు మొత్తం పరిమాణాన్ని ఇది పరిగణన లోనికి తీసుకుంటుంది. ఇది విస్తృత అభివృద్ధికి అవసరమైన కొలమానమేగానీ సమాజంపై దాని ప్రభావాన్ని చూడడానికి అదొక్కటే సరిపోదు.

ఆర్థిక అభివృద్ధి అనేది మానవ శ్రేయస్సు, సామాజిక పురోగతి మరీ ముఖ్యంగా సామాజిక న్యాయం తదితర అంశాల్లో మెరుగుదలలను పరిశీలించే విస్తృత భావన. ఇందులో ఆర్థిక అంశాలే కాకుండా సామాజిక, రాజకీయ, సాంస్కృతిక కోణాలు కూడా ఉంటాయి.

వృద్ధి ఆధారిత ప్రభుత్వాధినేతలు ఉన్నప్పుడు ఏదో జరిగిపోతున్నట్టు ప్రదర్శన, హడావిడి ఉంటుందిగానీ ప్రజలకు ఆ సౌఖ్యాలు అందవు. అభివృద్ధి ఆధారిత ప్రభుత్వాధినేతలు ఉన్నప్పుడు ఆ ప్రదర్శనలు, హడావిడి ఉండవుగానీ ప్రజలకు సౌఖ్యాలు అందుతుంటాయి. మన రాజకీయ నాయకుల్లో ఈ రెండు కోవలకు చెందినవారూ ఉంటారు. ఆయా దశల్లో ఇందిరాగాంధీ, ఎన్టీ రామారావు, వైఎస్ రాజశేఖర రెడ్డి అభివృద్ధి ఆర్థిక విధానాలను అనుసరించారు. పీవీ నరసింహారావు, చంద్రబాబు, నరేంద్ర మోదీలది వృద్ధి ఆర్థిక విధానం. జీడీపీ బాగుంటుంది కానీ, పేదరికం పెరుగుతూ ఉంటుంది.

ఎన్నికల చరిత్రను పరిశీలించినప్పుడు ఆలోచనాపరుల ప్రభావం ఓటర్లపై అంతగా లేదనీ, వర్గ సిద్ధాంతాల ప్రాతిపదికగా ప్రజలు చాలాసార్లు ఓట్లు వేయలేదనీ అర్థమవుతుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో రెండు సందర్భాల్లో మాత్రమే వర్గ సిద్ధాంతాల ప్రాతిపదికగా ఎన్నికలు జరిగాయి. 1952లో హైదరాబాద్ స్టేట్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నిజాం-తెలంగాణ ప్రాంతంలో కమ్యూనిస్టులకు మంచి మెజారిటీ వచ్చింది. కానీ, నిజాం-హైదరాబాద్, మరాఠ్వాడ, కర్ణాటక ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు భారీ మెజారిటీ వచ్చి ఆ పార్టీ ప్రభుత్వం ఏర్పడింది. అప్పటి ఆంధ్ర రాష్ట్రంలో శ్రామిక, భూస్వామ్య-పెట్టుబడీదారుల మధ్య మరో ఉధృత వర్గపోరాటంగా 1955 అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అప్పుడూ కాంగ్రెస్‌కే ఆధిక్యత వచ్చింది. ఎమర్జెన్సీని ఎత్తేసిన తరువాత లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. ఇందులో దేశంలోని ఆలోచనాపరుల పాత్ర కూడ వుంది. ఎమర్జెన్సీ తరువాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన మూడు నాలుగు ఎన్నికల్లో



నక్సలైట్ల ప్రభావం కూడ కనిపించింది. నక్సలైట్ల మీద తీవ్రంగా విరుచుకు పడిన పార్టీలు ఓడిపోయేవి, నక్సలైట్లతో సత్సంబంధాలు పెట్టుకున్న పార్టీలు గెలిచేవి. తరువాత కాలంలో ఈ ప్రభావం మాయమయ్యింది.

ఇటు కమ్యూనిస్టులూ, అటు అంబేడ్కరిస్టులూ చెప్పే సిద్ధాంతాలకూ, ప్రజల ఓటింగ్ విధానాలకూ పొంతనే లేదు. దేశ జనాభాలో 85 శాతం శ్రామికవర్గమే అయినప్పటికీ కమ్యూనిస్టు పార్టీలకు ఎన్నికల్లో 2 శాతం ఓట్లు మాత్రమే వస్తున్నాయి. అలాగే దేశ జనాభాలో బహుజనులు 85 శాతం ఉన్నప్పటికీ బీఎస్పీ వంటి అంబేడ్కరిస్టు పార్టీలకు 4 శాతం ఓట్లు మాత్రమే వస్తున్నాయి.

ఈ ఫలితాల ఆధారంగా మనం రెండు సూత్రీకరణలు చేయవచ్చు. మొదటిది, కమ్యూనిస్టు, అంబేడ్కరిస్టు సిద్ధాంతాలను పెట్టుబడీదారీ పార్టీలు హైజాక్ చేశాయి అనేది. రెండోది; ప్రజలకు ఇప్పటి కమ్యూనిస్టు, అంబేడ్కరిస్టు పార్టీల నాయకుల మీద నమ్మకం లేదు అనేది.

కమ్యూనిజం వేరు, కమ్యూనిస్టు పార్టీలు వేరు అయినట్టు; అంబేడ్కరిజం వేరు, అంబేడ్కర్ పేరున వెలసిన పార్టీలు వేరు. అసలు విషయం ఏమంటే, ఈ పార్టీల్లో బహు అరుదుగాతప్ప నమ్మదగ్గ నాయకులు ప్రజలకు కనిపించడం లేదు. ఎవరయినా నమ్మదగ్గ నాయకులు ఎక్కడయినా కనిపిస్తే ప్రజలు కమ్యూనిస్టు, అంబేడ్కరిస్టు పార్టీలను అక్కడ గెలిపిస్తూనే ఉన్నారు. ఓటర్లకూ పార్టీల ప్రకటిత సిద్ధాంతాలకూ మధ్య ఒక వైరుధ్యం ఉంది. ముందుదాన్ని పరిష్కరించాలి.

రాజకీయాల్లో కాంగ్రెస్‌కు ప్రధాన సైద్ధాంతిక ప్రత్యర్థులయిన కమ్యూనిస్టుల్నీ, నక్సలైట్లనీ బల హీనపరచడానికి ఇందిరాగాంధీ భూసంస్కరణ చట్టాలు, అటవీ భూముల పరిరక్షణ చట్టాలు, బ్యాంకుల జాతీయీకరణ, రాజభరణాలు రద్దు వంటివాటిని తెచ్చారు. కమ్యూనిస్టు పార్టీలు కోరేదే కాంగ్రెస్ పార్టీ చేస్తున్నప్పుడు కమ్యూనిస్టు పార్టీలకు అభిమానులుగా ఉన్న ఓటర్లు సహితం కాంగ్రెస్ ఓటర్లుగా మారిపోయారు.

తాను ప్రకటించిన ఆదర్శాలను కాంగ్రెస్ చిత్తశుద్ధితో ఆచరించలేదు. సరిగ్గా ఎన్టీ రామారావు రంగ ప్రవేశం చేసి ఇందిరా గాంధీ వాడిన ఆయుధాలతోనే ఆమె పార్టీ అయిన కాంగ్రెస్‌ను ఓడించారు. కిలో రెండు రూపాయల బియ్యం, జనతా వస్త్రాలు, పేదలకు పక్కా ఇళ్ల వంటి పథకాలన్నీ ఇందిరా గాంధీ 'గరీబీ హటావో' నుండి పుట్టినవే.

ఎన్టీ రామారావు ప్రకటించిన ఆదర్శాలను చంద్రబాబు చిత్త శుద్ధితో ఆచరించలేదు. పైగా వారు పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన నూతన ఆర్థిక సంస్కరణలకు (లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్) తనను తాను బ్రాండ్ అంబాసిడర్‌గా సగర్వంగా ప్రకటించుకోవడం మొదలెట్టారు. అప్పుడు వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రజల నాడిని పట్టుకున్నారు. ఇందిరా గాంధీ అందించిన ఆయుధాలతో ఎన్టీ రామారావు కాంగ్రెస్‌ను ఓడించినట్టే, ఎన్టీ రామారావు అందించిన ఆయుధాలతో తెలుగు దేశం పార్టీని ఓడించడానికి వైఎస్ సిద్ధపడ్డారు. చంద్రబాబు విద్యుత్ సంస్కరణలు చేపడితే... వైఎస్ వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు నినాదంతో వాటిని చిత్తు చేశారు. ఆ తరువాత 'ఆరోగ్యశ్రీ' వంటివి వచ్చాయి.

కొత్త ఆంధ్ర ప్రదేశ్‌కు తొలి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు తన పాత విధానాలను మార్చుకోలేదు. మరొక్కసారి నూతన ఆర్థిక విధానాలనే అనుసరించారు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కొత్త రాజధానినీ, పోలవరం ప్రాజెక్టునూ నిర్మించి పెట్టాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది. అవి పూర్తయ్యేలోగా హైదరాబాద్‌ను రాజధానిగా కొనసాగించుకునే వీలుంది. అందులో అనవసరంగా జోక్యం చేసుకున్న చంద్రబాబు నూతన ఆర్థిక విధానాలను జొప్పించారు. అలాంటివి సింగపూర్ పెట్టుబడీదారులకు బాగుంటాయిగానీ ప్రజలకు బాగుండవు. గత ఎన్నికల్లో అమరావతి రాజధాని పరిధిలోని ఒక్క అసెంబ్లీ నియోజకవర్గంలోనూ టీడీపీ అభ్యర్థులు గెలవలేదు. ఇది ఏ సంకేతాన్ని ఇచ్చిందీ?

వైఎస్ జగన్ మరొక్కసారి ప్రజల నాడిని పట్టుకున్నారు. నూతన ఆర్థిక విధానాలకు పూర్తిగా వ్యతిరేకమయిన 'నవరత్నాల'ను ముందుకు తెచ్చారు. పేదల ఆర్థిక విధానం ముందు చంద్రబాబు మరొక్క సారి ఘోర పరాజయాన్ని చవిచూశారు.

చంద్రబాబు నూతన ఆర్థిక విధానాలను వదులుకోలేరు. దానికీ కొన్ని ఓట్లు ఉన్నాయన్నది వారి నమ్మకం. అయితే ఆ ఓట్లు ఎన్నికల యుద్ధంలో గెలవడానికి సరిపోవని వారికి స్పష్టంగా తెలుసు. వారికిప్పుడు అదనపు ఓట్ల కోసం పవన్ కల్యాణ్ కావాలి. తెలంగాణలో పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ జనసేన ఓడిపోవడమేగాక ఎక్కడా డిపాజిట్లను కూడ నిలబెట్టుకోలేక పోయింది. అదొక రికార్డు. రాజకీయాల్లో ప్రవేశించి దశాబ్దం దాటుతున్నా కనీసం ఎమ్మెల్యేగా కూడా గెలవలేని రికార్డు కూడ ఆయన సొంతం. వారిని చంద్రబాబు నమ్ముతున్నారు. పవన్ కల్యాణ్ ద్వారా బీజేపీ ఆశిస్సులు దక్కుతాయని చంద్రబాబు ఆశిస్తూ ఉండవచ్చు.

వ్యాసకర్త సమాజ విశ్లేషకులు, సీనియర్ జర్నలిస్ట్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** శు.త్రయోదశి రా.8.46 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** ఆరుద్ర పూర్తి (24 గంటలు), **వర్జ్యం:** ప.2.36 నుండి 4.12 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.49 నుండి 9.37 వరకు, తదుపరి రా.10.56 నుండి 11.44 వరకు, **అమృతఘడియలు:** రా.8.25 నుండి 10.04 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.38, **సూర్యాస్తమయం:** 5.46.

క్లుప్తంగా...

గణతంత్ర వేడుకలకు గిరిజన రైతు దంపతులు


డ్రాగన్ ఫ్రూట్ మొక్క వద్ద గంగరాజు దంపతులు

దుమ్ముగూడెం: ఢిల్లీలో ఈనెల 26న జరగనున్న గణతంత్ర వేడుకలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం కమలాపురానికి చెందిన గిరిజన రైతు దంపతులు పెనుబల్లి గంగరాజు–లక్ష్మికి ఆహ్వానం అందింది. ఈ విషయాన్ని జిల్లా ఉద్యాన అధికారి జినుగు మరియన్న సోమవారం వెల్లడించారు. మారుమూల గిరిజన గ్రామానికి చెందిన ఈ దంపతులు సంప్రదాయ పంటలకు బదులు డ్రాగన్ ఫ్రూట్, ఆయిల్‌పామ్, మామిడి, జామ, సీతాఫలం, ఆపిల్ బేర్ తదితర పంటలు సాగు చేస్తున్నారు. అంతేకాకుండా బిందు సేద్యం, మల్చింగ్ విధానం, సేంద్రియ పద్ధతులు అవలంబిస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచారు.

తొమ్మిదో తరగతి విద్యార్థిని ప్రసవం

మంచిర్యాలక్రైం: మంచిర్యాల జిల్లాకేంద్రంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బాలిక(14) స్థానిక మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో సోమవారం ప్రసవించింది. ఈ విషయం జిల్లాలో చర్చనీయాంశమైంది. ఆమెపై ఎవరైనా అఘాయిత్యం చేశారా లేక.. ప్రేమపేరుతో ఎవరైనా వంచించారా? ఆమె గర్భం దాల్చిన విషయాన్ని తల్లిదండ్రులు ఎందుకు గుర్తించలేదు? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. బాలికతో బెల్లంపల్లికి చెందిన ఓ యువకుడితో కొంతకాలంగా సన్నిహితంగా ఉంటున్నట్లు సమాచారం. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


నర్సింహులు

దోమ: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందిన సంఘటన దోమ మండల పరిధిలోని గుండాలలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గుండాల గ్రామానికి చెందిన కుక్కలి నర్సింహులు(56) పొలానికి నీరు పెట్టేందుకు సోమవారం ఉదయం వెళ్లాడు. మోటార్ స్టార్టర్ వద్ద తేలి ఉన్న కరెంటు తీగలను కానక తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే చనిపోయాడు. సమీపంలో ఉన్న నర్సింహులు కుమారుడు గమనించి పరుగున వచ్చి చూడగా అప్పటికే ఆయన అచేతనంగా మారాడు. ఈ విషయంపై నర్సింహులు భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కన్నతండ్రిని కడతేర్చిన కొడుకు

- పోషించలేక గొడ్డలితో నరికి హత్య


బచ్చన్న

వనపర్తి: అనారోగ్యంతో మంచానపడిన తండ్రిని పోషించలేక కన్నకొడుకే.. గొడ్డలితో నరికి కిరాతకంగా హత్య చేశాడు. ఈ హృదయ విదారకర ఘటన సోమవారం వనపర్తి జిల్లా చిమనగుంటపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బచ్చన్న (93)కు ముగ్గురు కుమారులు. ఒక్కొక్క కొడుకు వద్ద రెండు నెలల చొప్పున ఉంటూ జీవిస్తున్నాడు. ఇటీవల పెద్ద కుమారుడు తండ్రిని చూసుకోవాల్సిన వంతు వచ్చింది. దీంతో హైదరాబాద్‌లో రోజుకూలి పనిచేసుకుంటూ జీవించే పెద్దకొడుకు కుర్మయ్య తండ్రి బాధ్యత చూసుకునేందుకు నాలుగు రోజుల కిందట స్వగ్రామానికి వచ్చాడు. ఈ నేపథ్యంలో సోమవారం మద్యం తాగిన మత్తులో కుర్మయ్య మంచంపై పడుకుని ఉన్న తండ్రి బచ్చన్నను గొడ్డలితో నరికి హత్య చేశాడు. గమనించిన గ్రామస్తులు కుర్మయ్యను పట్టుకుని గ్రామ పంచాయతీ వద్దకు తీసుకొచ్చి పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేశ్వర్‌రావు తెలిపారు. విచారణలో పోషించలేకే తండ్రిని హత్య చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నాడని వెల్లడించారు.


కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం తోటబావి వద్ద బండారి చల్లుకున్న అనంతరం భక్తి పారవశ్యంలో శివసత్తులు, భక్తులు

పసుపు మయమైన కొమురవెల్లి

ఘనంగా పెద్దపట్నం, అగ్నిగుండం

కొమురవెల్లి (సిద్దిపేట): సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మల్లికార్జునస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం ఆలయతోట బావి ప్రాంగణంలో నగరానికి చెందిన యాదవులు పెద్దపట్నం, అగ్నిగుండం నిర్వహించారు. భక్తులు బండారిని (పసుపు) చల్లుకోవడంతో ఆలయ పరిసరాలన్నీ పసుపుమయమయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన భక్తుడు మానుక పోచయ్య వంశస్తులు మొదటి వారం అనంతరం అగ్నిగుండం, పెద్ద పట్నం నిర్వహించే ఆనవాయితీ ఉంది. ఒగ్గు పూజారులు పంచవర్ణాల పిండితో పెద్దపట్నం వేశారు. పంచ పల్లవాలతో (మామిడి, జువ్వి, రాగి, మేడి, మర్రి) నిప్పు చేసి అగ్నిగుండం వేశారు. ఆలయం నుంచి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దపట్నం, అగ్ని గుండం దాటి ఆలయంలోని మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మూడేళ్ల తర్వాత గణతంత్ర వేడుకల్లో తెలంగాణ శకటం

సాక్షి, న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో మూడేళ్ల తర్వాత గణతంత్ర దినోత్సవం రోజు ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో నిర్వహించనున్న పరేడ్‌లో తెలంగాణ శకటాన్ని ప్రదర్శించనున్నారు. 2015, 2020 తర్వాత మళ్లీ ఈ ఏడాది తెలంగాణ శకటానికి ప్రదర్శనకు అవకాశం దక్కింది. ఈ ఏడాదితోపాటు మరో రెండేళ్లు కూడా ప్రదర్శనకు అనుమతి లభించిందని సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్ అధికారులు తెలిపారు.

ఫామ్‌హౌస్‌లపై విజిలెన్స్!

- పంటసాగు ముసుగులో కరెంట్ చౌర్యం
- వ్యవసాయ బోర్లు.. నీటి వ్యాపారాలకు అడ్డాలు
- పెద్ద మొత్తంలో ఆదాయాన్ని కోల్పోతున్న విద్యుత్ సంస్థ
- కనెక్షన్ల వారీగా సర్వే.. అక్రమార్కులపై కేసులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) నష్ట నివారణ చర్యలపై దృష్టి సారించింది. ఫామ్‌హౌస్‌ల ముసుగులో కరెంట్ చౌర్యానికి పాల్పడుతున్న అక్రమార్కులను గుర్తించే పనిలో నిమగ్నమైంది. ఈ మేరకు ఔటర్ రింగ్ రోడ్డుకు అటు ఇటుగా ఉన్న వ్యవసాయ క్షేత్రాలు, వాటిలోని విద్యుత్ బోర్లు, భారీ నిర్మాణాలు, రిసార్టులు, క్రీడా మైదానాలు, క్లబ్ హౌస్‌ల్లో విద్యుత్ విజిలెన్స్ బృందాలు తనిఖీలు ప్రారంభించాయి. వాటికి సరఫరా అవుతున్న కరెంట్‌పై ఆరా తీయడంతోపాటు వ్యవసాయం ముసుగులో కరెంట్ దోపిడీకి పాల్పడుతున్న వారిని గుర్తించి వారిపై కేసులు కూడా నమోదు చేస్తున్నారు. ఇప్పటివరకు సంస్థకు వాటిల్లిన నష్టాలను జరిమానా రూపంలో తిరిగి రాబట్టడమే కాకుండా ఆయా వినియోగదారులకు లోడును బట్టి మీటర్లు కూడా జారీ చేస్తున్నారు.

సాగు ముసుగులో వ్యాపారాలు

హైదరాబాద్ శివార్లలో పలువురు సినీ, రాజకీయ, పారిశ్రామిక వేత్తలు పెద్దఎత్తున వ్యవసాయ భూములు కొనుగోలు చేశారు. వాటి చుట్టూ భారీ ప్రహరీలు, ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. కొంతమంది వాటిలో పండ్లు, కూరగాయలు, పూల తోటలు సాగు చేస్తుండగా, మరికొంత మంది ఫామ్‌హౌస్ పేరుతో విలాసవంతమైన భవనాలు నిర్మించి సినిమా షూటింగ్‌లు, బర్త్‌డే పార్టీలు, వీకెండ్ పార్టీలకు అద్దెకు ఇస్తున్నారు. మరికొంతమంది ఏకంగా రిసార్ట్‌లు, క్లబ్ హౌస్‌లు, క్రీడా మైదానాలు ఏర్పాటు చేశారు. వీరు ప్రభుత్వం వ్యవసాయ బోర్లకు కల్పించిన ఉచిత విద్యుత్ సదుపాయాన్ని వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారు. కొంతమందైతే ఏకంగా బోర్ల నుంచి నీటిని తోడి ట్యాంకర్ల ద్వారా హోటళ్లు, వసతి గృహాలు, బహుళ అంతస్తుల భవనాలకు సరఫరా చేసి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. పంటసాగు ముసుగులో కరెంట్ చౌర్యానికీ పాల్పడుతున్నారు. ఫలితంగా డిస్కం పెద్ద మొత్తంలో ఆదాయాన్ని కోల్పోతోంది.

సంక్షోభం నుంచి గట్టెక్కేందుకే..

గ్రేటర్‌లోని తొమ్మిది సర్కిళ్ల పరిధిలో మొత్తం 61,40,795 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వీటిలో 50,99,190 గృహ, 8,22,821 వాణిజ్య, 36,440 పారిశ్రామిక, 1,82,344 ఇతర (వ్యవసాయ కనెక్షన్లు రంగారెడ్డి జిల్లాలో 1,17,417 ఉండగా, మేడ్చల్‌లో 21,491 వరకు) కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం రోజుకు సగటున 2,500 మెగావాట్ల విద్యుత్ వినియోగమవుతోంది. వేసవిలో ఈ డిమాండ్ 3800 నుంచి 4000 మెగావాట్లు దాటుతోంది. అయితే డిస్కం సరఫరా చేస్తున్న విద్యుత్‌కు, మీటర్ రీడింగ్ నమోదు ద్వారా నెలవారీగా సంస్థకు వస్తున్న బిల్లులకు మధ్య భారీ వ్యత్యాసం ఉంటోంది. ఇప్పటికే గృహ, వాణిజ్య కనెక్షన్లపై అంతర్గత తనిఖీలు చేపట్టిన డిస్కం తాజాగా వ్యవసాయ కనెక్షన్లపైనా ఆరా తీస్తోంది. దీంతో అధికారులు సర్కిళ్ల వారీగా విజిలెన్స్ బృందాలను ఏర్పాటు చేసి, తనిఖీలు చేయిస్తున్నారు.

డీఈకి షోకాజ్ నోటీసులు

ఇటీవల డిస్కం సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన ఐఏఎస్ అధికారి ముషారఫ్ ఫరూఖీ నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు అంతర్గత నష్టాలపై ప్రధానంగా దృష్టిసారించారు. క్షేత్రస్థాయిలోని ఇంజనీర్లను పరుగెత్తించడంతో పాటు ఆయన కూడా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఫిర్యాదులకు స్పందించని ఇంజనీర్ల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన గచ్చిబౌలి డీఈ సహా పలువురు ఇంజనీర్లకు షోకాజ్ నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలిసింది. ఉద్యోగ సంఘాల ముసుగులో ఏళ్ల తరబడి విద్యుత్ బిల్లులు చెల్లించకుండా పెద్ద మొత్తంలో బిల్లుల ఎగవేతకు పాల్పడిన యూనియన్లపై కూడా ఫోకస్ పెట్టినట్లు తెలిసింది. డిస్కం సరఫరా చేస్తున్న ప్రతీ యూనిట్‌ను పక్కాగా లెక్కించేందుకు ఫీడర్లకు సెన్సర్లను ఏర్పాటు చేసే యోచనలో సీఎండీ ఉన్నట్లు సమాచారం.


ఫామ్‌హౌస్‌లలో తనిఖీలు చేస్తున్న అధికారులు

నగరానికి నీటి ముప్పు

▶ మొదటి పేజీ తరువాయి

మరింత అడుగుకు చేరే అవకాశం కనిపిస్తోంది. అత్యవసర పంపింగ్ చేపట్టినా డెడ్‌స్టోరేజీ వరకు మాత్రమే నీటిని పంపింగ్ చేసేందుకు వీలుంటుంది. ప్రస్తుతం కృష్ణాజలాల తరలింపుపై తెలంగాణ, ఏపీ మధ్య వివాదం నెలకొన్న దృష్ట్యా ఈ సమస్య మరింత జఠిలమయ్యే ప్రమాదం కనిపిస్తోంది.

సగంనీరు సాగర్ నుంచే...

మహానగరవాసుల దాహార్తి తీర్చేందుకు సరఫరా చేస్తున్న తాగునీటిలో సగానికి పైగా నాగార్జునసాగర్ జలాశయం నుంచి తరలిస్తున్నారు. నగరంతోపాటు ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని అత్యధిక ప్రాంతాలకు కృష్ణా జలాలే ఆధారం. సాగర్ నుంచి నిత్యం 290 ఎంజీడీ నీటిని నగరానికి తీసుకొచ్చి సరఫరా చేస్తున్నట్టు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు పరిధిలోని పుట్టంగండి పంప్‌హౌస్ నుంచి అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారానే నీటిని సేకరిస్తున్నారు. సాగర్ నీటిమట్టం 510 అడుగులకు పడిపోతే అక్కంపల్లి రిజర్వాయర్ నుంచి గ్రావిటీ ద్వారా నీటిని తరలించే పరిస్థితి ఉండదు. దీంతో కృష్ణాజలాల పంపింగ్ నిలిచిపోతుంది. గతంలో నీటి మట్టం కిందకు పడిపోతుండగానే అత్యవసర పంపింగ్‌కు ఏర్పాట్లు జరిగేవి. గత ఐదేళ్ల క్రితం నాటి పరిస్థితి తిరిగి పునరావృత్తమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇదీ పరిస్థితి

ఎగువన ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో కృష్ణాబేసిన్ వట్టిపోతోంది. నాగార్జునసాగర్‌లో నీటిమట్టం గతేడాది ఇదే రోజు నాటికి 571.900 అడుగులు ఉండగా, ఈసారి మాత్రం 520 అడుగులకు పడిపోయింది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం పరిశీలిస్తే గతేడాది 261.300 టీఎంసీలు ఉంటే, ఈ సారి మాత్రం 149.820 టీఎంసీలకు చేరింది. వాస్తవంగా నాగార్జునసాగర్‌లో 510 అడుగుల నీటిమట్టం ఉంటేనే ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు ద్వారా నగరానికి తాగునీటిని అందించడానికి ఎత్తిపోతల సాధ్యమవుతుంది. అంతకంటే నీటి మట్టం తగ్గితే అక్కడ పంపులను నడపడం సాధ్యం కాదు. మరోవైపు రెండు తెలుగు రాష్ట్రాల నీటి అవసరాలకుగాను 505 అడుగుల వరకు నీటిని వినియోగించుకునేందుకు ఒప్పందం కూడా జరగడంతో అత్యవసర పంపింగ్‌తో కూడా నగరానికి నీటి తరలింపు సమస్యగా మారే ప్రమాదం కనిస్తోంది.

జలాల తరలింపు ఇలా..


హైదరాబాద్ మహానగరానికి వివిధ జలాశయాల నుంచి ప్రతి నిత్యం సుమారు 560 నుంచి 590 ఎంజీడీ (మిలియన్ గ్యాలన్ పర్ డే) నీటిని తరలిస్తున్నారు. కృష్ణా నుంచి 290 ఎంజీడీలు, గోదావరి నుంచి 160 ఎంజీడీలు, సింగూరు, మంజీరాల నుంచి 103 ఎంజీడీలు, ఉస్మాన్‌సాగర్ నుంచి 14 ఎంజీడీల నీటిని తరలిస్తున్నారు. హిమాయత్‌సాగర్ నుంచి ప్రస్తుతం నీటి సేకరణ జరగడం లేదు. హిమాయత్‌సాగర్ నుంచి వచ్చే వేసవిలో అవసరాల మేరకు పాతనగరానికి నీటిని అందించి, కృష్ణా జలాల ప్రాంతాలకు సర్దుబాటు చేసే అవకాశాలు ఉన్నాయి. ఒక్క కృష్ణా జలాలు తప్ప అన్ని రిజర్వాయర్లలో సరిపడా నీటి నిల్వలు ఉన్నాయి.

హైదరాబాద్‌కు నీటిని సరఫరా చేసే జలాశయాల్లో నీటి మట్టం ఇలా...

జలాశయం	మొత్తం నీటిమట్టం	ప్రస్తుతం	గతేడాది (అడుగుల్లో)
నాగార్జున సాగర్	590.000	520.300	571.900
సింగూరు	523.600	522.476	522.840
మంజీరా	1651.750	1647.900	1648.800
అక్కంపల్లి	245.000	243.300	244.000
ఉస్మాన్‌సాగర్	1790.000	1786.950	1789.450
హిమాయత్‌సాగర్	1763.500	1761.200	1763.450

ఎమ్మెల్సీలుగా మహేశ్ గౌడ్, బల్మూరి ఏకగ్రీవ ఎన్నిక

- నియామక పత్రాలు అందజేసిన ఎన్నికల అధికారి


నియామక పత్రాలు అందుకున్న బల్మూరి, మహేశ్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీలుగా కాంగ్రెస్ పార్టీకి చెందిన బి.మహేశ్‌కుమార్ గౌడ్, బల్మూరి వెంకట్ నర్సింగరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం అసెంబ్లీ సచివాలయంలో ఎన్నికల అధికారి నర్సింహాచార్యులు చేతుల మీదుగా వారు నియామక పత్రాలు అందుకున్నారు. మండలిలో ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఈనెల 11న నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. ఈనెల 18న నామినేషన్ల గడువు పూర్తయ్యేసరికి ఈ ఇద్దరే నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో అప్పుడే ఎన్నిక ఏకగ్రీవమైనప్పటికీ సోమవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసేంత వరకు వేచి ఉన్న అధికారులు ఆ గడువు ముగిసిన అనంతరం ఈ ఇద్దరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర శాసనసభ వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్ బాబు, కాంగ్రెస్ నేతలు ఆకుల లలిత, పుష్పలీల, రమ్యారావు పాల్గొన్నారు. కాగా, మహేశ్ గౌడ్, బల్మూరి వెంకట్.. నవంబర్ 30, 2027 వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు.

కోరిక తీర్చాలంటూ వివాహితకు వేధింపులు

- అడ్డుకున్న మరో మహిళ చేతిని కారు డోరులో ఇరికించి రోడ్డుపై ఈడ్చుకెళ్లి..
- మైదంబండ గ్రామంలో కామాంధుడి అసభ్య ప్రవర్తన
- గ్రామస్తులు వెంబడించడంతో పరార్


దగ్ధమవుతున్న కారు

ముత్తారం (మంథని): పరుష పదజాలంతో దూషించడంతో పాటు అసభ్య సైగలు చేస్తూ ఓ కామాంధుడు తన కామవాంఛ తీర్చాలని వివాహితను వేధించాడు.. అడ్డుకోబోయిన మరో మహిళపై సైతం దాడిచేశాడు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మైదంబండ గ్రామంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ వివాహిత ఆదివారం మధ్యాహ్నం తన బాబును ఇంటి ఎదుట ఆడిస్తోంది. అదే గ్రామానికి చెందిన ఎర్రం సురేశ్ అక్కడకు చేరుకుని ఆమెను బూతులు తిడుతూ, అసభ్య సైగలతో కామవాంఛ తీర్చాలని వేధించాడు. బాధితురాలు కేకలు వేయడంతో స్థానికులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. వారిని చూసిన సురేశ్ అక్కడి నుంచి పారిపోయాడు. తిరిగి రాత్రి సమయంలో తన సహచరుడు రేగల గట్టయ్యతో కలిసి సురేశ్ కారులో మళ్లీ యువతి ఇంటికి చేరుకున్నాడు. సురేశ్, గట్టయ్య కలిసి ఆమెతో దురుసుగా ప్రవర్తించారు. అడ్డువచ్చిన స్థానికుడు బియ్యని కృష్ణస్వామిపై దాడికి దిగారు. తన భర్తను ఎందుకు కొడుతున్నావని కృష్ణస్వామి భార్య నవలోక దుండగులను ప్రశ్నించింది. దీంతో ఆగ్రహించిన సురేశ్ గట్టయ్య సాయంతో కారు డోర్‌లో నవలోక చెయ్యి ఇరికించి సుమారు 200 మీటర్ల దూరం ఈడ్చుకెళ్లాడు. అక్కడికి చేరుకున్న స్థానికులు బైక్‌లతో వెంబడించినా నిందితుల ఆచూకీ లభించలేదు. తీవ్రంగా గాయపడ్డ నవలోకను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై వివాహిత, బాధిత మహిళ కుటుంబ సభ్యులు వేర్వేరుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిందితుల కారు దగ్ధం..

స్థానికులు వెంబడించడంతో నిందితులు తమ కారులో మైదంబండ నుంచి మచ్చుపేట, లక్కారం మీదుగా సర్వారం వెళ్లే రోడ్డు మీదుగా పరారయ్యారు. చివరికి సర్వారంలోని ఓ డ్రైనేజీలో కారు దిగబడి ఆగిపోయింది. స్థానికులు అక్కడికి చేరుకోవడంతో నిందితులు తప్పించుకుని పారిపోయారు. అయితే, తెల్లవారేసరికి కారు కాలిపోయింది. ప్రమాదవశాత్తు కాలిపోయిందా, లేదా ఎవరైనా కాల్చివేశారా? అనేదానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

లైంగికదాడి కేసులో నిందితుడికి 34 ఏళ్ల జైలు

- స్పెషల్ కోర్టు జడ్జి తీర్పు

చివ్వెంల(సూర్యాపేట):బాలికపై లైంగికదాడి, కిడ్నాప్ కేసుల్లో ఓ దోషికి 34 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ సూర్యాపేట పోక్సో చట్టం, అత్యాచార కేసుల స్పెషల్ కోర్టు జడ్జి ఎస్.అమరావతి సోమవారం తీర్పు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా మోతె మండలం రాంపురం తండాకు చెందిన గంట మహేశ్ ప్రేమ పేరిట అదే తండాకు చెందిన బాలిక(16) వెంటపడ్డాడు. ఈ క్రమంలో ఒకరోజు బాధితురాలి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమెపై లైంగికదాడి చేశాడు. ఈ క్రమంలో 2021 డిసెంబర్ 27న కాలేజీకని బాలిక బయలుదేరింది. మోతె మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఉన్న బాలికకు మహేశ్ మాయమాటలు చెప్పి తన వెంట తీసుకెళ్లాడు. ఉర్లుగొండ శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆమె మెడలో తాళి కట్టాడు. రామచంద్రపురంలో ఒక గది అద్దెకు తీసుకుని కొన్ని రోజులపాటు ఆమెను అక్కడ ఉంచాడు. కాలేజీకి వెళ్లిన కుమార్తె ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మహేశ్‌పై ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో అతడు 2022 జనవరి 5వ తేదీన బాలికను మోతె మండల కేంద్రంలో వదిలిపెట్టాడు. ఇంటికి వెళ్లిన బాధితురాలు జరిగిన విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వివరించారు. దీంతో పోలీసులు మహేశ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. జడ్జి సాక్షులను విచారించి 34 సంవత్సరాల జైలుశిక్షతోపాటు రూ.60 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

వైభవోజ్వల ప్రాణప్రతిష్ట



సోమవారం బాలరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా శోభాయమానంగా అయోధ్య ఆలయం. కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు, భక్తజన సందోహం.

అయోధ్య భవ్య మందిరంలో రామ్‌లల్లా దర్శనం ఆరంభం

ప్రధాన యజమాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా కమనీయ ఘట్టం

- స్వర్ణ వజ్రాభరణాలు, పుష్పమాలల అలంకరణతో మైమరిపించిన బాలరాముడు
- రామాలయంతో పాటు నగరమంతటా పూల వర్షం కురిపించిన సైనిక హెలికాప్టర్లు
- నిర్విఘ్నంగా పూర్తయిన చరిత్రాత్మక వేడుక, అయోధ్యలో ఉత్సవ వాతావరణం
- దేశ విదేశాల్లో ఘనంగా ఉత్సవాలు.. ఇళ్లలో రామజ్యోతి వెలిగించిన భక్తులు

సాక్షి, అయోధ్య: దేశ ప్రజలంతా ఎప్పుడెప్పుడా అని ఆత్రుతగా ఎదురు చూసిన అద్భుత, చరిత్రాత్మక ఘట్టం వైభవోపేతంగా, నిర్విఘ్నంగా జరిగింది. అయోధ్య భవ్య మందిరంలో రామ్‌లల్లా సోమవారం మధ్యాహ్నం ప్రాణప్రతిష్ఠ జరుపుకున్నాడు. దివ్యమంగళ రూపంతో, మందస్మిత వదనంతో ఐదేళ్ల నీలమేఘ రాముడు భక్తులకు దర్శనం ఇస్తున్నాడు. ప్రత్యక్షంగా వేలాది మంది, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది టీవీల్లో ఈ వేడుకను కనులారా తిలకించి ఆనంద పరవశులయ్యారు. బంగారు ధనస్సు, బాణంతోపాటు విలువైన స్వర్ణ వజ్రాభరణాలు, పూల దండలు, తులసి మాలలతో అద్భుతంగా అలంకరించిన మర్యాద పురుషోత్తముడి విగ్రహం చూపరులను మంత్రముగ్ధులను చేసింది. ప్రధాన యజమాని(కర్త) హోదాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఉత్సవాన్ని తన చేతుల మీదుగా నిర్వహించారు. అటంకాలేవీ లేకుండా అనుకున్న ముహూర్తానికే గర్భగుడిలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ జరిగింది. ఈ కార్యక్రమం తర్వాత నూతన భవ్య మందిరంపై సైనిక హెలికాప్టర్లతో పూల వర్షం కురిపించారు. మన రామయ్య అయోధ్య నగరానికి వచ్చేశాడంటూ ప్రధానమంత్రి మోదీ అతిథుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. అయోధ్యలో జరిగిన రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని దేశ విదేశాల్లో లక్షలాది మంది భక్తులు వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. రాత్రి తమ ఇళ్లలో రామజ్యోతి వెలిగించి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు.

వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు

అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ ఉత్సవాలు సోమవారం ఉదయమే మొదలయ్యాయి. అతిథులు, ప్రముఖులు ఉదయం నుంచే బారులు తీరారు. సంప్రదాయ సంగీత కళాకారులు రాముడి భక్తి గీతాలు ఆలపించారు. సంగీత వాయిద్యాలతో ఆహూతులకు ఆధ్యాత్మిక పరిమళాలు పంచారు. ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీ నుంచి తొలుత అయోధ్య ఎయిర్‌పోర్టుకు, అక్కడి నుంచి ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. పట్టు వస్త్రాలు, పూజా ద్రవ్యాలతో మధ్యాహ్నం ఆలయం లోపలికి అడుగుపెట్టారు. ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్‌తో కలిసి గర్భగుడి ఎదుట కొన్ని క్రతువులు నిర్వహించారు. అనంతరం గర్భగుడిలోకి ప్రవేశించారు. మోదీ వెంట భాగవత్‌తో పాటు యూపీ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, సీఎం యోగి ఆదిత్యనాథ్ తదితరులున్నారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు ప్రతిధ్వనిస్తుండగా, జైశ్రీరామ్ అనే నినాదాలు మార్మోగుతుండగా గర్భాలయం లోపల నరేంద్ర మోదీ అభిజిత్ ముహూర్తంలో 84 సెకన్ల వ్యవధిలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. బాలరాముడి పాదాలకు నమస్కరించారు. విగ్రహం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆ తర్వాత సాష్టాంగ ప్రణామం చేశారు. ప్రాణప్రతిష్ఠ ముగిశాక ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికనుంచి మోదీ ప్రసంగించారు.

కుబేర తిల శివాలయంలో మోదీ పూజలు

రామమందిరంలో ప్రాణప్రతిష్ఠ తర్వాత ప్రధాని మోదీ ఇదే ప్రాంగణంలో ఉన్న కుబేర తిల శివాలయాన్ని దర్శించుకొని, పూజలు చేశారు. శివలింగానికి జలాభిషేకం నిర్వహించారు. శివాలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ప్రాచీన కుబేర తిల ఆలయాన్ని శ్రీరామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్టు అభివృద్ధి చేసింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో జటాయువు పక్షి విగ్రహాన్ని మోదీ ఆవిష్కరించారు. బాధ్యతల నిర్వహణలో జటాయువు పట్టుదలను ఆయన గుర్తుచేసుకున్నారు.

రామో విగ్రహవాన్ ధర్మః

- అద్భుత రూపంతో ఆకట్టుకుంటున్న బాలరాముని దివ్యమంగళ మూర్తి
- పీతవస్త్రం, ముచ్చటైన కిరీటం, స్వర్ణాభరణాలు, తులసి దళాలతో కనువిందు

సాక్షి, న్యూఢిల్లీ: మందస్మిత వదనం. విశాల వక్షస్థలం. చేత విల్లంబులు. ముద్దొచ్చే రూపం. అయోధ్య ఆలయంలో కొలువుదీరిన బాలరాముడు నఖశిఖ పర్యంతమూ రామచరితమానస్‌లో వర్ణించినట్టే శోభాయమానంగా ఉన్నాడని భక్తులు మురిసిపోతున్నారు. పచ్చలు, కెంపులు పొదిగిన కిరీటం, ఆభరణాలు, ముత్యాల దండలు, బంగారు దండ, మణికట్టుకు కడియాలు, పచ్చల కంఠాభరణం, వక్షస్థలంపై పేటల గొలుసు, కుడి చేత బాణం, ఎడమ చేత విల్లు, బంగారు జరీతో కూడిన పసుపు రంగు ధోతీ, ఎర్రని అంగ వస్త్రం, తులసిదళాల మాలతో బాలరాముడు ముచ్చటగొలుపుతున్నాడు. విగ్రహం ఆర్చికి ఇరువైపులా స్వస్తిక్, ఓం, చక్రం, గద, దశావతారాలైన మత్స్య, కూర్మ, వరాహ నృసింహ, వామన, పరశురామ, రామ, శ్రీకృష్ణ, బుద్ధ, కల్కి, గరుత్మంతుడు, హనుమంతుడు ఉన్నారు. ఆభరణాల రూపకల్పన కోసం వాల్మీకీ, తులసీ, అధ్యాత్మ రామాయణాలను సమగ్ర అధ్యయనం చేసినట్టు ఆలయ ట్రస్టు పేర్కొంది.

నేటినుంచి దర్శనం

మంగళవారం బాలరాముడు భక్తులకు దర్శనమివ్వనున్నాడు. రామ వనవాసాన్ని గుర్తుకు తెచ్చేలా రోజూ 14 గంటలపాటు ప్రజలకు స్వామి దర్శనం ఉంటుంది.



11 రోజుల అనుష్ఠానం విరమించిన ప్రధాని మోదీ

అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ అనంతరం ప్రధాని మోదీ 11 రోజుల అనుష్ఠాన దీక్షను ముగించారు. శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు కోశాధికారి గోవింద్ దేవ్‌గిరి మహారాజ్ ప్రధానికి చరణామృతం (ఉపచారాలకు వాడే పాలతో చేసిన తీపి పానీయం) ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఆయన పాదాలకు ప్రధాని నమస్కరించారు. ఉపవాస దీక్షను కొనసాగించిన మోదీ భక్తిని దేవ్‌గిరి ప్రశంసించారు. అనుష్ఠానం ఆసాంతం మోదీ కటిక నేలపై శయనిస్తూ కొబ్బరి నీళ్లు మాత్రమే తీసుకున్నారు. రోజూ గంటా 11 నిమిషాల పాటు మంత్ర జపం, ధ్యానం చేశారు.

రామాలయ కార్మికులకు ఘనంగా సన్మానం

అయోధ్య రామ మందిర నిర్మాణంలో భాగస్వాములైన కార్మికులను ప్రధాని మోదీ ఘనంగా సన్మానించారు. ప్రాణప్రతిష్ఠ అనంతరం కార్మికులపై ఆయన కృతజ్ఞతాపూర్వకంగా పూలు చల్లారు. దాంతో ప్రాణప్రతిష్ఠకు హాజరైన వంద మందికి పైగా కార్మికులు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు.



రామ్‌లల్లా పాత విగ్రహానికి పూజలు చేస్తున్న మోదీ



ప్రాణ ప్రతిష్ఠ అనంతరం బాలరామునికి మోదీ తొలి హారతి



రామ్‌లల్లాకు సాష్టాంగ ప్రణామం చేస్తున్న ప్రధాని మోదీ



మోదీ ఉపవాస దీక్షను విరమింపజేస్తున్న మహంత్ నృత్య గోపాల్ దాస్

అయోధ్య పురవీధుల నిండా... ప్రతిధ్వనించిన 'మంగళధ్వని'

అయోధ్య: రామాలయంలో ప్రాణప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 50 సంప్రదాయ సంగీత పరికరాల 'మంగళ ధ్వని'అయోధ్యలో ప్రతిధ్వనించింది. అయోధ్యకు చెందిన ప్రముఖ కవి యతీంద్ర మిశ్రా సారథ్యంలో కార్యక్రమం జరిగింది. ఆంధ్రప్రదేశ్ నుంచి ఘటం, యూపీ నుంచి పంఖవాజ్, ఫ్లూట్, ఢోలక్, కర్ణాటక నుంచి వీణ, పంజాబ్ నుంచి అల్గోజా, మహారాష్ట్ర నుంచి సుందరి, ఒడిశా నుంచి మర్దాలా, మధ్యప్రదేశ్ నుంచి సంతూర్, మణిపూర్‌కు చెందిన పుంగ్, అస్సాంకు చెందిన నగద, కలి, ఛత్తీస్‌గఢ్ నుంచి తెచ్చిన తంబుర తదితరాలు వీటిలో ఉన్నాయి. అంతకుముందు, సోను నిగమ్, అనురాధా పౌడ్వాల్, శంకర్ మహదేవన్ పలు గీతాలు ఆలపించారు.

అయోధ్య అంతటా ఉత్సవ వాతావరణమే

ఆర్మీ హెలికాప్టర్లు ఆలయ ప్రాంగణంతోపాటు అయోధ్య వీధుల్లో పూల వర్షం కురిపించాయి. ఆలయాలు, భవనాలు, ఇళ్లను విద్యుద్దీపాలతో అలంకరించారు. రామ్‌పథ్, ధరమ్ పథ్‌లను సుందరంగా తీర్చిదిద్దారు. ఇక్కడి ల్యాంప్ పోస్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సామూహిక భోజనశాలలు భక్తులకు వేడివేడిగా ఆహార పదార్థాలు అందించాయి.

ఆహూతులను ఆకట్టుకున్న నృత్య, సంగీత ప్రదర్శనలు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రాణ ప్రతిష్ఠ వేడుకను పురస్కరించుకుని ఏర్పాటుచేసిన నృత్య, సంగీత,నాటక ప్రదర్శనలు మంత్రిముగ్ధుల్ని చేశాయి. రామ చరితతోపాటు, 500 ఏళ్ల నుంచి రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ వరకు జరిగిన విశేషాలను ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. 'బధాయ్, చారీ, గూమర్, భవాయ్, ఝుమర్, ధోబియా, రాయ్, రస్లీల, మయూర్, ఖయాల్ నృత్యం, సతారియా'వంటి జానపద నృత్యాలతో కళాకారులు అమితానందం కల్గించారు. భరతనాట్యం, ఒడిస్సీ, కూచిపూడి, మణిపూరి, మోహిని ఆట్టం, కథాకళి, కథక్ వంటి భారతీయ శాస్త్రీయ నృత్యాల ప్రదర్శనలు జరిగాయి. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ప్రాణ ప్రతిష్ఠ ముగిసేదాకా ఈ నృత్య ప్రదర్శనలు జరిగాయి. సినీ, క్రీడా రంగ ప్రముఖులు, వ్యాపార, రాజకీయ దిగ్గజాలు ఈ నృత్య, సంగీత, నాటక ప్రదర్శనలను సెల్‌ఫోన్లలో బంధించారు. చలనచిత్ర, సంగీత కళాకారులు బాల రాముడిపై అభిమానాన్ని పాటల రూపంలో చాటారు. ప్రముఖ సంగీత కళాకారులు శంకర్ మహదేవన్, సోను నిగమ్ 'రామ్ భజన్' చేశారు. అనురాధ పౌడ్‌వాల్, మాలినీ అవస్థీ 'రామాష్టకం'తో అలరించారు. 'రాం సియా రాం' అంటూ సోను నిగం పాడిన పాట ఆకట్టుకుంది.

రామ భక్తి పారవశ్యంలో ఓలలాడిన భారతావని

కొట్టాయం/రాంచీ: అయోధ్యలో వేడుక స్వయంగా తమ ఇంట్లో, తమ వీధిలో జరిగినంత ఆనందంతో యావత్ భారతదేశ ప్రజలు పండుగలా జరుపుకున్నారు. అన్ని రాష్ట్రాల ప్రజలు స్థానిక ఆలయాలు, మైదానాలు, కూడళ్ల వద్ద ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో దేశవ్యాప్త పండగ వాతావరణాన్ని తెచ్చారు. ఇంటి ముందు ముగ్గులతో, గుమ్మాలకు తోరణాలతో తెల్లవారుజాము నుంచే పండగ సంబరం కనిపించింది. ఆలయాలను సందర్శించి అక్కడి పూజా కార్యక్రమాలు, భజనలు, సంకీర్తనల్లో పాల్గొన్నారు. రాజస్తాన్‌లో భారత్–పాక్ సరిహద్దు వెంట తనోత్ మాతా ఆలయంలో బీఎస్‌ఎఫ్ సైనికులు రామాయణం పఠించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని షిమ్లాలో 'అఖండ్ రామాయణ్' పఠనం జరిగింది. సాయంత్రం ఇళ్లు, దుకాణాలు, వ్యాపార సముదాయాల వద్ద ఐదు ప్రమిదలను వెలిగించి దీపావళి జరుపుకున్నారు. రాత్రిపూట బాణసంచా భారీ ఎత్తున కాల్చారు. **ఆ పిల్లాడి పేరు రామ్ రహీమ్:** ప్రాణప్రతిష్ఠ దివ్యముహూర్తంతో జన్మించిన తన కుమారుడికి ఒక ముస్లిం మహిళ 'రామ్ రహీమ్' అని పేరు పెట్టి మతసామరస్యాన్ని చాటారు. ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌లో ఈ పిల్లాడు సోమవారం మధ్యాహ్నం జన్మించాడు.

ప్రపంచ నలుమూలల్లోనూ ఘనంగా ప్రాణప్రతిష్ట వేడుకలు

వాషింగ్టన్/పోర్ట్ ఆఫ్ స్పెయిన్: అయోధ్య రామమందిరం ప్రాణప్రతిష్ఠ మహోజ్వల ఘట్టాన్ని ప్రత్యక్ష ప్రసారాల్లో చూసి ప్రపంచవ్యాప్తంగా భక్తులు పులకించిపోయారు. ఆస్ట్రేలియా నుంచి అమెరికా దాకా సంబరాలు జరుపుకున్నారు. న్యూయార్క్‌లో ప్రఖ్యాత టైమ్స్ స్క్వేర్ కూడలి వద్ద భారీ తెరలపై వందలాది భారతీయ అమెరికన్లు వేడుకను వీక్షించారు. సంప్రదాయ వస్త్రధారణలో భజనలు, కీర్తనలు చేశారు.

పాకిస్తానీ ముస్లింలు సైతం..

అమెరికాలో వర్జీనియా రాష్ట్రం ఫెయిర్‌ఫాక్స్ కౌంటీలోని శ్రీవెంకటేశ్వర లోటస్ టెంపుల్ వద్ద సిక్కులు, ముస్లింలు, పాకిస్తానీ అమెరికన్లు, క్రైస్తవులు సైతం వేడుకల్లో పాలుపంచుకున్నారు. అమెరికా స్టాక్ ఎక్స్ఛేంజ్ 'నాస్‌డాక్' స్క్రీన్ మీదా కోదండరాముని చిత్రాన్ని ప్రదర్శించారు. లాస్‌ఏంజిలెస్‌లో 1,000 మందికిపైగా 250 కార్ల ర్యాలీ చేపట్టారు. పారిస్‌లో ఈఫిల్ టవర్ వద్ద భారతీయులు జై శ్రీరామ్ అని నినాదాలు చేశారు. ట్రినిడాడ్, టొబాగో, మారిషస్, ఫిజీ, స్పెయిన్ తదితర దేశాల్లో సంబరాలు జరిగాయి. మెక్సికోలో తొలి రామాలయాన్ని అయోధ్య ప్రాణప్రతిష్ఠ ముహూర్తంలోనే ప్రారంభించారు.

రామ జ్యోతి వెలిగించిన మోదీ

న్యూఢిల్లీ: అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠ అనంతరం ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, పలువురు బీజేపీ నేతలు సోమవారం సాయంత్రం తమ ఇళ్లలో దీపాలు వెలిగించారు. ప్రధాని మోదీ లోక్ కల్యాణ్ మార్గ్‌లోని ఏడో నంబర్ అధికార నివాసంలో రాముడి విగ్రహం చిత్ర పటం ఎదుట దివ్వె వెలిగిస్తున్న ఫొటోలను 'ఎక్స్'లో షేర్ చేశారు. ఈరోజు దేశమంతా దీపావళి వేడుక జరుపుకుంటోంది. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో కుటుంబసభ్యులతో కలిసి రామజ్యోతిలను వెలిగించాలని కోరారు. నితిన్ గడ్కరీ తన నివాసంలో కుటుంబసభ్యులు, బధిరుల పాఠశాల విద్యార్థులతో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కూడా తన నివాసంలో దివ్వె వెలిగించారు. ఇది చారిత్రక దినమని పేర్కొన్నారు.



రూ.11 కోట్ల కిరీటం

అయోధ్య: అయోధ్య రామ్‌లల్లాకు సూరత్‌కు చెందిన వజ్రాల వ్యాపారి ముకేశ్ పటేల్ రూ.11 కోట్ల విలువైన బంగారు కిరీటాన్ని కానుకగా అందజేశారు. నాలుగు కిలోల బంగారం, వజ్రాలు, విలువైన రాళ్లు పొదిగిన ఈ కిరీటం ఆరు కిలోలుంది. గ్రీన్‌ల్యాబ్ డైమండ్ కంపెనీ అధిపతి ముకేశ్ తన కుటుంబసభ్యులతో కలిసి సోమవారం ప్రాణప్రతిష్ఠ సందర్భంగా రామాలయ ట్రస్ట్ సభ్యులకు ఈ కిరీటాన్ని అందజేశారు.

ఒకే రోజు 100 విమానాలు

న్యూఢిల్లీ: అయోధ్య విమానాశ్రయంలో సోమవారం ఒకే రోజు 100 చార్టర్డ్ విమానాలు ల్యాండయ్యాయి. రామాలయం ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి దేశ, విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రముఖులు విచ్చేశారు. వివిధ సంస్థలు, వ్యక్తులు అయోధ్యకు 100 చార్టర్డ్ విమానాలను బుక్ చేసుకున్నారని, ఇందులో 50 వరకు జెట్ విమానాలున్నాయని బిజినెస్ ఎయిర్ క్రాఫ్ట్ ఆపరేటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కెప్టెన్ ఆర్‌కే బాలి పీటీఐకి తెలిపారు.

అంబానీ కుటుంబం రూ. 2.51 కోట్ల విరాళం


అయోధ్య: రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ చైర్మన్ ముకేశ్ అంబానీ, ఆయన కుటుంబం సోమవారం అయోధ్యలో జరిగిన ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరయ్యారు. రూ.2.51 కోట్ల విరాళాన్ని ఆలయ ట్రస్టుకు అందజేయనున్నట్లు అనంతరం వారు ప్రకటించారు. ముకేశ్ అంబానీ, భార్య నీతా అంబానీతోపాటు, వారి కుమారులు అనంత్, ఆకాశ్, కూతురు ఇషా అంబానీ పాల్గొన్నారు.

32 ఏళ్లకు నెరవేరిన ప్రతిజ్ఞ

ముంబై: అయోధ్యలో బాలరాముడు కొలువుదీరిన నేపథ్యంలో మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి 32 ఏళ్ల తర్వాత పాదరక్షలు ధరించారు. 1992లో బాబ్రీ మసీదు విధ్వంసం జరిగాక, అక్కడ రామాలయం నిర్మాణం జరిగేదాకా చెప్పులు ధరించనంటూ జల్గావ్‌లో పాన్‌షాప్ నడుపుకునే విలాస్ భవ్‌సర్ (60) ప్రతిజ్ఞ బూనారు. అప్పటి నుంచి కాళ్లకు ఎటువంటి పాదరక్షలు లేకుండానే గడిపారు.

ప్రపంచంలోనే అదృష్టవంతుణ్ని

శిల్పి అరుణ్ యోగిరాజ్



అయోధ్య: అయోధ్య రామాలయంలో సోమవారం ప్రతిష్ఠించిన రామ్‌లల్లా విగ్రహాన్ని మలిచి అందరి ప్రశంసలు అందుకున్న మైసూరు శిల్పి అరుణ్ యోగిరాజ్ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ బృహత్కార్యానికి రాముడే తనను ఎంచుకున్నాడని, ప్రపంచంలో తనకంటే అదృష్టవంతుడు ఇంకెవరూ ఉండరని అన్నారు. తనను, తన కుటుంబాన్ని అన్నివేళలా రాముడే కాపాడుతుంటాడని నమ్ముతున్నానని చెప్పారు. మైసూర్ యూనివర్సిటీలో ఎంబీఏ చదివాక అరుణ్ ఆరు నెలలపాటు ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేశారు. ఆ పని సంతృప్తినివ్వలేదు. నాలుగు తరాలుగా వారసత్వంగా వస్తున్న శిల్పకళా వృత్తినే ఎంచుకున్నారు. ''ఈ శిల్పాన్ని చెక్కే క్రమంలో నిద్రలేని రాత్రులు గడిపాను. అందుకు ఫలితం లభించింది. ఇది నా జీవితంలోనే సుదినం. ఈ కళను తండ్రి నుంచి నేర్చుకున్నాను. ఆయనుంటే నేను చెక్కిన విగ్రహాన్ని చూసి గర్వించే వారు'' అని అరుణ్ అన్నారు.

అత్యుత్తమ క్రిష్ణ శిల

రామ్‌లల్లాను మలిచేందుకు అరుణ్ యోగిరాజ్ ఉపయోగించిన రాయి దక్షిణ భారతంలోనే అత్యంత పురాతనమైందని మైసూర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఒకరు చెప్పారు. దీని వయస్సు 300 కోట్ల సంవత్సరాలని ఆయన వివరించారు. అత్యుత్తమమైన ఈ క్రిష్ణ శిల గుజ్జెగౌడనపురలో లభించిందని చెప్పారు. ఆ స్థలం యజమాని రామదాస్ తన నాలుగు గుంటల స్థలాన్ని రామాలయ నిర్మాణానికి విరాళంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చారన్నారు. ఆ స్థలంలో సోమవారం స్థానికులు పూజలు చేశారు. ఇక్కడ నిర్మించే ఆలయంలో ప్రతిష్ఠించేందుకు కూడా విగ్రహాన్ని మలచాలని అరుణ్ యోగిరాజ్‌ను స్థానికులు కోరారు.

మన రాముడొచ్చాడు

అయోధ్యలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పారవశ్యం



సోమవారం అయోధ్య ఆలయంలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సంప్రదాయ వస్త్రధారణలతో గర్భాలయ ప్రవేశం చేస్తున్న ప్రధాని మోదీ



- శతాబ్దాల ఎదురుచూపులు, బలిదానాలు, త్యాగాలు, తపస్సులు ఫలించాయి
- బాలరాముడు ఇకపై డేరాలో ఉండడు.. భవ్య మందిరంలో శాశ్వత స్థానం
- జనవరి 22వ తేదీని వెయ్యేళ్ల తర్వాత కూడా ప్రజలు గుర్తుంచుకుంటారు
- రాజ్యాంగబద్ధంగానే రామాలయ నిర్మాణం జరిగింది
- శ్రీరాముడు నిప్పు కాదు.. ఒక శక్తి. వివాదం కాదు.. పరిష్కారం
- రాబోయే వెయ్యి సంవత్సరాల భారతదేశ నిర్మాణంపై ఇక దృష్టి పెట్టాలి
- రాముడి ఆశీస్సులతో దేశం కోసం పని చేస్తామంటూ మనమంతా ప్రతిజ్ఞ చేద్దాం
- రామ్‌లల్లా ప్రాణప్రతిష్ట అనంతరం సభలో ప్రసంగించిన మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: అయోధ్యకు మన రాముడు వచ్చేశాడని ప్రధానమంత్రినరేంద్ర మోదీ ఆనందం వ్యక్తం చేశారు. అయోధ్య ఆలయంలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ సాకారమైన వేళ ప్రతి పౌరుడు ఇకపై దేశ భవిష్యత్ నిర్మాణ మార్గాలపై ఆత్మపరిశీలన చేసుకోవాలని పిలుపునిచ్చారు. మన దేశ పురోగమనానికి, ప్రగతికి రామ మందిరం గొప్ప సాక్షిగా ఉంటుందని చెప్పారు. 'వికసిత్ భారత్'కు ఈ రామ మందిరం సాక్షి అవుతుందని పేర్కొన్నారు. రాముడు ఈ దేశ విశ్వాసం, ఆలోచన, చట్టం, ప్రతిష్ఠ, వైభవం అని ఉద్ఘాటించారు. రాముడి ప్రభావం ఈ భూమిపై వేల సంవత్సరాలు పాటు కొనసాగిందని గుర్తుచేశారు. ఇదే సరైన సమయమని, రాబోయే వెయ్యేళ్ల భారతదేశానికి పునాది వేయాలని సూచించారు. అయోధ్య ఆలయంలోసోమవారం రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ అనంతరం నిర్వహించిన సభలో ప్రధాని మోదీ అతిథులు, ప్రముఖులు, సాధుసంతులు, భక్త జనులను ఉద్దేశించి దాదాపు 40 నిమిషాలపాటు ప్రసంగించారు. భవ్య మందిరం నిర్మాణం పూర్తయ్యిందని, ఒక దేశ నిర్మాణంపై దృష్టి పెట్టాలని చెప్పారు. బలమైన, సమర్థవంతమైన, దివ్య, భవ్య భారతదేశాన్ని నిర్మించడానికి మనం ప్రతిజ్ఞ చేయాలని కోరారు. ప్రజల మనస్సాక్షిలో రాముడి ఆదర్శం ఉండాలని ఉద్బోధించారు. అయోధ్య సభలో ప్రధాని మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే...

ప్రజల త్యాగానికి నా కృతజ్ఞతలు

''సమిష్టి తత్వంతో సంఘటితంగా, సమర్థవంతంగా పని చేస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చు. ఇది భారతదేశ సమయం. దేశం మరింత ముందుకు సాగబోతోంది. శతాబ్దాల నిరీక్షణ తర్వాత ఇక్కడికి చేరుకున్నాం. మనమందరం ఈ యుగం కోసం, ఈ కాలం కోసం ఎదురు చూశాం. ఇప్పుడు మనం పరుగు ఆపబోం. అభివృద్ధిలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటాం. రామాలయాన్ని సుసాధ్యం చేసిన ప్రజల త్యాగానికి నా కృతజ్ఞతలు. సాధువులు, కర సేవకులు, రామభక్తులకు నా అభినందనలు. ఇది కేవలం శ్రీరాముడి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ మాత్రమే కాదు. శ్రీరాముడి రూపంలో వ్యక్తమయ్యే భారతీయ సంస్కృతిపై అచంచలమైన విశ్వాసాన్ని ప్రతిష్ఠించుకొనే కార్యక్రమం. మానవీయ విలువలు, అత్యున్నత ఆశయాలకు భారతీయ సంస్కృతి ప్రతిరూపం. ఇది యావత్ ప్రపంచానికీ అవసరం. ఇది రాముడి రూపంలో ఉన్న జాతీయ చైతన్య అలయం. శ్రీరాముడు భారతదేశ విశ్వాసం, పునాది, ఆలోచన, చట్టం, స్పృహ, ఆలోచన, ప్రతిష్ఠ, కీర్తి. రామ్ అనేది ఓ ప్రవాహం, ఓ ప్రభావం, ఓ నీతి, విశ్వవ్యాప్త ఆత్మ. శ్రీరాముని ప్రాణప్రతిష్ఠ ప్రభావం వేల సంవత్సరాల పాటు కొనసాగుతుంది.

నూతన కాలచక్రానికి నాంది

శతాబ్దాల ఎదురు చూపులు, ఎన్నో బలిదానాలు, లెక్కలేనన్ని త్యాగాలు, తపస్సుల తర్వాత ఎట్టకేలకు రాముడు మళ్లీ అయోధ్యకు చేరుకున్నాడు. ఈ శుభ సందర్భాన దేశ ప్రజలందరికీ నా శుభాకాంక్షలు. మన రామ్‌లల్లా ఇకపై డేరాలో ఉండడు. దివ్య మందిరంలో ఆయనకు శాశ్వత స్థానం లభించింది. జనవరి 22 అనేది కేవలం ఒక తేదీ కాదు. కొత్త కాలచక్రానికి ప్రతీక, నవశకానికి నాంది. వెయ్యేళ్ల తర్వాత కూడా ఈ తేదీని ప్రజలు గుర్తుపెట్టుకుంటారు. రామజన్మభూమి ఆలయ పూజ, అభివృద్ధి పనులు దేశ పౌరుల్లో కొత్త శక్తిని నింపాయి. రామ భగవానుడి ఆశీర్వాదం వల్లే ఈ మహత్తర సందర్భానికి మనం సాక్షిగా ఉన్నాం. రోజులు, దిశలు, ఆకాశాలు సహా ప్రతిదీ ఈ రోజు దైవత్వంతో నిండి ఉంది. ఇది సాధారణ కాలం కాదు. కాలక్రమేణా ముద్రించబడుతున్న చెరగని స్మృతి మార్గం. బానిస మనస్తత్వపు సంకెళ్లను తెంచుకుని, గత అనుభవాల నుంచి స్ఫూర్తి పొంది, చరిత్రను లిఖించే గొప్ప సందర్భమిది.

భారతీయుల హృదయాల్లో కొలువయ్యాడు

బాలరాముడి ప్రాణప్రతిష్ఠతో చిన్న చిన్న గ్రామాలతో సహా దేశం మొత్తం సంబరాలు చేసుకుంటోంది. దేవాలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దేశం మొత్తం ఈ రోజు దీపావళిని జరుపుకుంటోంది. సాయంత్రం వేళల్లో ప్రతి ఇంట్లో 'రామజ్యోతి' వెలిగించబోతున్నారు. రామసేతు ప్రారంభ బిందువు అయిన అరిచల్ మునైలో ఇటీవల పర్యటించా. రాముడు పాదం మోపిన అన్ని పవిత్ర ప్రదేశాలను 11 రోజుల అనుష్ఠాన సమయంలో సందర్శించా. నాసిక్‌లోని పంచవటీ ధామ్, కేరళలోని త్రిప్రయార్ దేవాలయం, ఆంధ్రప్రదేశ్‌లోని లేపాక్షి, శ్రీరంగంలోని శ్రీరంగనాథస్వామి దేవాలయం, రామేశ్వరంలోని శ్రీరామనాథ స్వామి దేవాలయం, ధనుష్కోటిని సందర్శించా. సముద్రం నుండి సరయూ నది వరకు నా ప్రయాణం సాగింది. రఘుకులోత్తమ రాముడు భారతదేశ ఆత్మకు చెందిన ప్రతి కణంతో అనుసంధానమై ఉన్నాడు. రాముడు భారతీయుల హృదయాల్లో కొలువయ్యాడు. భారతదేశంలో ఎక్కడైనా ప్రతి ఒక్కరి మనస్సాక్షిలో ఏకత్వ భావన కనిపిసుంది. సామూహికతకు ఇంతకంటే కచ్చితమైన సూత్రం మరొకటి లేదు. శ్రీరామ కథను అనేక భాషల్లో నేను ఆలకించాను. మన సంప్రదాయాలు, పండుగల్లో రాముడు ఉన్నాడు. ప్రతి యుగంలో ప్రజలు రాముడిని తలిచారు. తమదైన శైలిలో, మాటల్లో ఆ భగవంతుడిని వ్యక్తీకరించారు. ఈ 'రామ్‌రస్' జీవన ప్రవాహంలా నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుంది. రామకథ అనంతం. రామాయణం అంతులేనిది. రాముడి ఆదర్శాలు, విలువలు, బోధనలు ప్రతిచోటా ఒకే విధంగా ఉంటాయి.

ప్రతి ప్రయత్నానికీ బలం, సహకారం

ప్రతి భారతీయుడిలోని భక్తి, సేవ, అంకితభావం, ఏకత్వం, ఐక్యత అనే భావాలు సమర్థవంతమైన, గొప్ప, దైవిక భారతావనికి ఆధారమవుతాయి. ప్రజలు దేవుడి నుండి దేశానికి(దేవ్ టూ దేశ్), రాముడి నుండి రాజ్యానికి(రామ్ టూ రాష్ట్ర) చైతన్యాన్ని విస్తరింపజేయాలి. రామభక్త హనుమాన్ సేవ, భక్తి, అంకితభావాన్ని చూసి ప్రజలు ఎంతో నేర్చుకోవచ్చు. దేశంలో నిరాశకు తావు లేదు. తమను తాము చిన్నవారుగా, సామాన్యులుగా భావించేవారు రామాయణంలో రామయ్యకు ఉడుత అందించిన సేవలను గుర్తు చేసుకోవాలి. సంకోచాన్ని వదులుకోవాలి. చిన్నదైనా, పెద్దదైనా ప్రతి ప్రయత్నానికీ బలం, సహకారం ఉంటుంది. విపరీతమైన జ్ఞానం, అపారమైన శక్తి కలిగిన లంకాధీశుడు రావణుడితో పోరాడి ఓడిపోతానని తెలిసి కూడా చిత్తశుద్ధితో కర్తవ్యాన్ని నిర్వర్తించిన జటాయువును ఆదర్శంగా తీసుకోవాలి. ప్రస్తుత అమృత కాలంలో యువత అకుంఠిత విశ్వాసంతో ముందుకు సాగాలి. సంప్రదాయ స్వచ్ఛత, ఆధునికతలను మేళవించడం ద్వారా భారతదేశం తన లక్ష్యాన్ని చేరుకుంటుంది. శ్రీరాముడి తోడ్పాటు, ఆశీస్సులతో దేశం కోసం పని చేస్తామంటూ మనమంతా ప్రతిజ్ఞ చేద్దాం'' అని ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు.

న్యాయ వ్యవస్థకు ధన్యవాదాలు

శ్రీరాముడి ప్రతి పనిలో హనుమంతుడి ఉనికి తప్పనిసరిగా ఉంటుంది. సీతమ్మతో పాటు హనుమంతుడు, లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడిని సైతం ఈ సందర్భంలో గుర్తు చేసుకోవాలి. ఈ ఆలయ నిర్మాణ ప్రధాన ఘట్టంలో ఆధ్యాత్మిక సంస్థల పాత్ర మరువలేనిది. రామయ్యా.. నన్ను క్షమించు. అయోధ్యలో ఆలయ నిర్మాణం, ప్రాణప్రతిష్ఠ ఆలస్యమైనందుకు ప్రభు శ్రీరాముడిని క్షమాపణలు కోరుతున్నా. మన ప్రయత్నాలు, త్యాగాలు, తపస్సులో ఏదో లోటు జరిగిన కారణంగానే ఇన్ని శతాబ్దాలుగా అయోధ్యలో రామ మందిర నిర్మాణం చేయలేకపోయాం. రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠతో నేడు ఆ లోటు తీరింది. శ్రీరాముడు మనల్ని తప్పకుండా ఈ రోజు క్షమిస్తాడని నమ్ముతున్నా. రామాయణ కాలంలో అయోధ్య నగరం శ్రీరాముడితో 14 ఏళ్ల పాటు వియోగం పొందింది. ఈ యుగంలో అయోధ్యవాసులు, దేశ ప్రజలు రాముడి వియోగాన్ని వందల ఏళ్లపాటు అనుభవించారు. మన దేశ రాజ్యాంగం అసలు ప్రతిలో శ్రీరాముడు ఉన్నప్పటికీ, మందిర నిర్మాణం కోసం సుదీర్ఘ న్యాయ పోరాటం జరిగింది. న్యాయం గౌరవాన్ని చెక్కుచెదరకుండా ఉంచినందుకు భారతదేశ న్యాయ వ్యవస్థకు నా ధన్యవాదాలు. శ్రీరాముడి ఆలయ నిర్మాణం రాజ్యాంగబద్ధంగానే జరిగింది. దైవ ఆశీర్వాదం, దైవిక ఆత్మల వల్లనే మందిర నిర్మాణం పూర్తయ్యింది.

శ్రీరామ ప్రాణప్రతిష్ఠ సందర్భం కేవలం విజయానికి సంబంధించిన అంశం కాదు. ఇది వినయానికి సంబంధించినది. రామ్‌లల్లా ఆలయ నిర్మాణం శాంతి, సహనం, పరస్పర సామరస్యం, భారతీయ సమాజంలోని సమన్వయానికి ప్రతీక. అయోధ్యలో ఆలయం నిర్మిస్తే దేశం అగ్నిగుండం అవుతుందని కొందరు హెచ్చరించారు. పునరాలోచన

నిప్పు కాదు శక్తి పుట్టింది

చేయాలని వారిని కోరుతున్నా. ఈ కట్టడం వల్ల ఏ నిప్పూ పుట్టడం లేదు, శక్తి పుట్టడం చూస్తున్నాం. ఉజ్వల భవిష్యత్తు బాటలో ముందుకు సాగేందుకు రామమందిరం సమాజంలోని ప్రతి వర్గానికీ స్ఫూర్తినిస్తోంది. రాముడు నిప్పు కాదు.. అతడొక శక్తి. అతడు వివాదం కాదు.. పరిష్కారం. రాముడు మనకు మాత్రమే కాదు, అందరికీ చెందినవాడు. రాముడు అనంతుడు. 'వసుదైవ కుటుంబకమ్' ఆలోచనే రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ. దేశంలో నేడు నిరాశావాదానికి చోటు లేదు. హనుమ, ఉడత, జటాయువుల నుంచి కూడా కొత్త విషయాలు నేర్చుకుందాం.

జాతి మందిరమిది: యోగి

సాక్షి, న్యూఢిల్లీ: అయోధ్య వీధుల్లో ఇకపై బుల్లెట్ల మోతలు, కర్ఫ్యూలు ఉండవని, దీపోత్సవాలు, రామోత్సవాలు మాత్రమే జరుగుతాయని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. అయోధ్య వీధులు ఇకపై రామ నామ సంకీర్తనలతో మార్మోగుతాయన్నారు. అయోధ్య లో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠతో 500ఏళ్ల కల సాకారమైందని, కోట్లాది ప్రజల విశ్వాసం నెరవేరిందని, ఇది అలౌకిక ఆనంద క్షణమన్నారు. రామ మందిరంలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ అనంతరం ఆయన మాట్లాడారు. ''అయోధ్యలో శ్రీరాముడు మళ్లీ కొలువుదీరడం త్రేతాయుగాన్ని తలపిస్తోంది. ఇది జాతి మందిరం! భగవంతునికి తన జన్మ స్థలిలో ఆలయ నిర్మాణం కోసం దేశంలోని మెజారిటీ సామాజిక వర్గం ఇలా ఏకంగా 500 ఏళ్లు ఎదురు చూడాల్సిన రావడం ప్రపంచంలోనే తొలిసారి! ఎట్టకేలకు సంకల్పించిన చోటే భవ్యమైన ఆలయ నిర్మాణం జరిగింది. 'మందిర్ వహీ బనాయేంగే (ఆలయాన్ని అక్కడే నిర్మిస్తాం)' అన్న వాగ్దానాన్ని నిలబెట్టుకున్నాం. ఈ మహత్తర కార్యక్రమాన్ని చూడడం ఈ తరం అదృష్టం' అని అన్నారు.

ఆత్మగౌరవం తిరిగొచ్చింది: మోహన్ భాగవత్

అయోధ్య మందిరంలోకి 500 ఏళ్ల తర్వాత రాముని ఆగమనంతో దేశ ఆత్మగౌరవం తిరిగొచ్చిందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. ఇకనుంచి విభేదాలు మరచి కలిసి సాగుదామని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రాణ ప్రతిష్ఠ అనంతరం ఆయన మాట్లాడారు. '' ఈ ఆనందమయ క్షణం కోసం ఎన్నో తరాలు రక్తాన్ని, చెమటను ధారపోశాయి. రాముని దయ వల్లే ఈ స్వర్ణమయ రోజును చూస్తున్నాం'' అని పిలుపునిచ్చారు.



సాధ్వీ రితంబర కంటతడి



రవిశంకర్ ప్రసాద్ ఉద్వేగం




ఉమాభారతి



బాబా రామ్‌దేవ్



కంగనా రనౌత్



అనుపమ్ ఖేర్




జాకీష్రాఫ్




మిథాలీరాజ్, సైనా నెహ్వాల్



పీటీ ఉష, చిరంజీవి దంపతులు, రామ్‌చరణ్



సచిన్, రజనీకాంత్



ముకేశ్ అంబానీ దంపతులు



రణ్‌బీర్ దంపతులు, విక్కీ కౌశల్ తదితరులు



సాధు సంతులు, మహంతులు

ప్రముఖుల సందడి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని మోదీ ప్రధాన కర్తగా ఉండి జరిపించిన ప్రాణప్రతిష్ఠ క్రతువుకు అన్ని రంగాల దిగ్గజాలు సాధారణ ప్రేక్షకుల్లా మారి ఆసాంతం ఆస్వాదించారు. గంటలకొద్దీ సమయం వేచి ఉండి రామదర్శనం చేసుకున్నారు.

కుటుంబంతో కలసి మళ్లీ వస్తా

జనవరి 22వ తేదీ చారిత్రాత్మకమైన రోజు. నాతో పాటు దేశ ప్రజలు, ప్రపంచం నలుమూలల ఉన్న భారతీయుల కల సాకారమైన రోజు. రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ వేడకలో నేను పాల్గొనడం బాల రాముడు నాకు కల్పించిన గొప్ప అవకాశం. త్వరలో నా కుటుంబంతో కలసి మళ్లీ వచ్చి దర్శించుకుంటా.

– సచిన్ టెండూల్కర్, మాజీ క్రికెటర్

దేవుడిచ్చిన అవకాశం

బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో కుటుంబంతో కలసి భాగస్వామిని కావడం గొప్ప అవకాశంగా భావిస్తున్నాను. హనుమంతుడే నన్ను వ్యక్తిగతంగా పిలిచాడనే భావనతో భావోద్వేగంలో ఉన్నా. శతబ్ధాల కల నెరవేరినందుకు సంతోషిస్తున్నా.

– చిరంజీవి, సినీ హీరో

'రామ్ దీపావళి'

జనవరి 22 అనేది ప్రపంచంలోనే చారిత్రాత్మకమైన రోజు. 'రామ్' అనే పదం ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా మార్మోగుతుంది. ఈరోజు దేశ ప్రజలు 'రామ్ దీపావళి' పేరుతో సంబరాలు జరుపుకుంటున్నారు. ఈ వేడుకలో భాగస్వామి కావడం గర్వంగా ఉంది.

– ముకేశ్ అంబానీ, నీతూ అంబానీ

అందరికీ గొప్పరోజు

ఇది యావత్ భారత ప్రజానికానికి గొప్పరోజు. ప్రాణ ప్రతిష్ఠ పర్వంలో నేను భాగస్వామిని కావడం నా అదృష్టం. చాలాసేపు వేచి ఉండి రామదర్శనం చేసుకోవడం మాటల్లో చెప్పలేకపోతున్నా.

– సైనా నెహ్వాల్

కల నెరవేరింది

అందరి కల నెరవేరడం అనేది చాలా ఆనందంగా ఉంది.

–మిథాలీరాజ్, మాజీ క్రికెటర్

ఆలయాల సందర్శనల్లో బీజేపీ అగ్రనేతలు

న్యూఢిల్లీ: ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం వేళ బీజేపీ చీఫ్ జేపీ నడ్డా, హోం మంత్రి అమిత్ షా తదితరలు సోమవారం ఢిల్లీలో ఆలయ సందర్శన చేశారు. అక్కడి నుంచి టీవీల్లో ప్రత్యక్ష ప్రసారంలో కార్యక్రమాన్ని వీక్షించారు. జేపీ నడ్డా ఢిల్లీలోని ఝుండేవాలన్ ఆలయాన్ని సందర్శించి పూజలో పాల్గొన్నారు. అమిత్ షా, కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి, ఇతర నేతలు లక్ష్మీనారాయణ్ ఆలయం(బిర్లా టెంపుల్) సందర్శించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ప్రతిపక్ష నేతలు ఏం చేశారంటే..

న్యూఢిల్లీ: అయోధ్యలోని రామాలయంలో ప్రాణప్రతిష్ఠ ఒక వైపు అంగరంగ వైభోగంగా జరుగుతుండగా ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు ఆ కార్యక్రమానికి దూరంగా ఉండిపోయారు. తమకు అందిన ఆహ్వానాలను వారు పట్టించుకోలేదు. వేర్వేరు కార్యక్రమాల్లో పాల్గొని, ఈ సందర్భాన్ని తమదైన శైలిలో ఉపయోగించుకున్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో రాహుల్ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అస్సాంలోని నగావ్ జిల్లాలో ఉన్న శంకరదేవ జన్మస్థలిని దర్శించుకునేందుకు వెళ్లారు. సోమవారం బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కోల్‌కతాలో సర్వమత ర్యాలీ నిర్వహించారు. సీఎం కేజ్రీవాల్ ఢిల్లీలో సుందరకాండ పారాయణంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ నిర్ణయానికి వ్యతిరేకంగా ఆ పార్టీకి చెందిన హిమాచల్ ప్రదేశ్ సీఎం విక్రమాదిత్య సింగ్, పార్టీకే చెందిన ఎమ్మెల్యే సుధీర్ శర్మ అయోధ్యలో ప్రాణప్రతిష్ఠలో పాల్గొన్నారు.

ఆలయంలోకి రాహుల్ ప్రవేశం నిరాకరణ

- ధర్నాకు దిగిన కాంగ్రెస్ అగ్ర నేత
- అస్సాంలో భారత్ జోడో న్యాయ్ యాత్రలో ఉద్రిక్తత



ఆలయంలోకి అనుమతించకపోవడంతో బైఠాయించి ధర్నాకు దిగిన రాహుల్ గాంధీ

నగావ్: అస్సాంలో కొనసాగుతున్న భారత్ జోడో న్యాయ్ యాత్రలో సోమవారం హైడ్రామా నడిచింది. నగావ్ జిల్లా బోర్దువాలోని శ్రీశ్రీ శంకర్ దేవ్ సాత్ర ఆలయంలోకి రాహుల్ ప్రవేశాన్ని అధికారులు నిరాకరించడం ఉద్రిక్తతకు దారి తీసింది. సోమవారం స్థానిక ఆలయంలో పూజల తర్వాత రాహుల్ జోడో యాత్ర ప్రారంభించాల్సి ఉంది. ఇందుకోసం, పార్టీ నేతలతో కలిసి వస్తుండగా హైబొరాగావ్‌లో అధికారులు వారిని అడ్డుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత మాత్రమే ఆలయంలోకి వెళ్లేందుకు అనుమతి ఉందని చెప్పారు. ఆ ప్రాంతంలో భారీగా పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయంలోకి దారి తీసే అన్ని రోడ్లను దిగ్బంధించారు. మీడియాను సైతం రానివ్వలేదు. నిరసనగా రాహుల్, కాంగ్రెస్ మహిళా నేతలు అక్కడ బైటాయించారు. తనను ఎందుకు అడ్డుకున్నారో తెలపాలంటూ అధికారులను నిలదీశారు. ఎవరు, ఎప్పుడు ఆలయంలోకి వెళ్లాలో కూడా ఇప్పుడు ప్రధాని మోదీయే నిర్ణయిస్తున్నారా అంటూ ప్రశ్నించారు. ఆలయంలోకి ప్రతి ఒక్కరూ వెళ్లొచ్చు కానీ, తను వెళ్తే శాంతిభద్రతల సమస్య వస్తుందంటూ అడ్డుకోవడం వింతగా ఉందని మండిపడ్డారు. పార్టీ ఎంపీ గౌరవ్ గొగోయ్, బటద్రవ ఎమ్మెల్యే శిబమోని బోరా మాత్రమే ఆలయంలోకి వెళ్లి పూజలు చేసి, వచ్చారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి జనవరి 22వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ముందు ఆలయంలో ప్రవేశానికి అనుమతివ్వడం లేదని శనివారం ఆలయ కమిటీ తెలిపింది. అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం పూర్తవడా నికి ముందు ఆలయంలోకి రావొద్దంటూ రాహుల్‌కు విజ్ఞప్తి చేసినట్లు సీఎం శర్మ చెప్పారు. ఎంతో ప్రాముఖ్యత ఉన్న శంకరదేవ ఆలయంలోకి రాహుల్‌ను ఉద్దేశపూర్వకంగా అడ్డుకున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. జనవరి 11వ తేదీన రాహుల్‌కు అనుమతిచ్చిన ఆలయ అధికారులు, 20వ తేదీన మాత్రం మాటమార్చారని చెప్పారు.

మోరిగావ్‌లో పాదయాత్రకు అనుమతి లేదు

సంఘ వ్యతిరేక శక్తులు శాంతిభద్రతలు, సామరస్య వాతావరణానికి భంగం కలిగించే ప్రమాదం ఉన్నందున మోరిగావ్ జిల్లాలో భారత్ జోడో న్యాయ్ యాత్ర, ర్యాలీలు, పాదయాత్రలు నిర్వహించరాదని కాంగ్రెస్ నిర్వాహకులను కోరినట్లు జిల్లా కమిషనర్ దేవాశీష్ శర్మ తెలిపారు. బిహుతోలి పోలీస్ స్టేషన్ సమీపంలో ర్యాలీ, మోరిగావ్‌లోని శంకరదేవ చౌక్ నుంచి పాదయాత్ర చేపట్టాలని కాంగ్రెస్ ముందుగా నిర్ణయించిందని ఆయన తెలిపారు. మోరిగావ్ జిల్లా నుంచి గోల్‌సెపాకు చేరే వరకు రాహుల్ వాహన శ్రేణిని ఎక్కడా ఆపరాదని ఆయన కోరారు. స్థానిక యంత్రాంగం, పోలీసులకు సమాచారం ఇవ్వకుండా రాహుల్ వాహనం వీడి వెళ్లరాదని స్పష్టం చేశారు. మోరిగావ్ జిల్లా భారత్ జోడో న్యాయ్ యాత్రకు సంబంధించి గతంలో ఇచ్చిన అన్ని అనుమతులను రద్దు చేసినట్లు వివరించారు.

'బిల్కిస్' దోషులు జైలుకు

గోద్రా: బిల్కిస్ బానో కేసులో మొత్తం 11 మంది దోషులు గుజరాత్‌లోని గోద్రా సబ్ జైలులో అధికారుల ఎదుట లొంగిపోయారు. సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు ప్రకారం దోషులందరూ జనవరి 21వ తేదీ అర్ధరాత్రి జైలుకు వచ్చినట్లు స్థానిక క్రైం బ్రాంచి ఇన్‌స్పెక్టర్ ఎన్ఎల్ దేశాయ్ ధ్రువీకరించారు. 2002లో గుజరాత్‌లో మత కలహాల సమయంలో బిల్కిస్ బానో అనే అయిదు నెలల గర్భవతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడటంతోపాటు ఆమె కుటుంబంలోని ఏడుగురిని దుండుగులు దారుణంగా చంపేశారు. ఈ ఘటనకు సంబంధించి కోర్టు 11 మంది దోషులకు జీవిత ఖైదు విధించింది. అయితే, 14 ఏళ్లపాటు జైలు జీవితం గడిపిన వీరిని సత్ప్రవర్తన కలిగిన వారిగా పేర్కొంటూ 2022లో గుజరాత్ ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిర్ణయాన్ని ఈ నెల 8వ తేదీన సుప్రీంకోర్టు కొట్టివేసింది.

కోటి నివాసాలపై సోలార్ ప్యానెళ్లు: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: అయోధ్య రామ మందిరంలో ప్రాణప్రతిష్ఠ వేడుక దేశ ప్రజల ఇళ్లపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేయాలన్న తన సంకల్పాన్ని బలపరిచిందని ప్రధాని మోదీ అన్నారు. కోటి ఇళ్లకు సౌర శక్తిని ఇంధన వనరుగా మార్చే పథకాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. 'అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ నుంచి వచ్చాక ప్రధానమంత్రి సూర్యోదయ యోజన పథకాన్ని ప్రారంభించాలనే మొదటి నిర్ణయం తీసుకున్నాను. కోటి ఇళ్లపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేయడం ఈ పథకం లక్ష్యం' అని పేర్కొన్నారు.

క్లుప్తంగా...

ప్రజలు బీఆర్‌ఎస్‌ను తిరస్కరించలేదు

● నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్‌: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ప్రజలు తిరస్కరించలేదని, ఫలితాలు కుంగిపోయే విధంగా లేవని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్‌ పార్లమెంటు నియోజకవర్గాల సన్నాహక సమావేశాలు ముగిసిన సందర్భంగా ఆయన పార్టీ నేతలు మధుసూదనాచారి, బడుగుల లింగయ్య యాదవ్, రావుల చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. కేవలం 1.85 శాతం అంటే 4 లక్షల పైచిలుకు ఓట్ల తేడాతోనే బీఆర్‌ఎస్‌ ఓడిందన్నారు. అడ్డగోలు వాగ్దానాలిచ్చి గెలిచిన కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా గత ప్రభుత్వ పాలన మీదనే నిందారోపణలు చేస్తూ కాలం వెళ్లదీయాలని చూస్తోందని నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. ఖాళీ అయిన ఎమ్మెల్సీ సీట్లలో 2 సీట్లు కాంగ్రెస్‌కు వచ్చేట్లు బీజేపీ సహకరించిందని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌ను టీఆర్‌ఎస్‌గా మార్చాలనే చర్చ వచ్చిందని నిరంజన్‌రెడ్డి చెప్పారు.

ఫూలే విగ్రహం ఏర్పాటుపై అభ్యంతరమేంటి?

మంత్రి పొన్నంను ప్రశ్నించిన కల్వకుంట్ల కవిత



సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావ్‌ ఫూలే విగ్రహం ఏర్పాటు చేయడంపై ఉన్న అభ్యంతరమేంటని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. విగ్రహం ఏర్పాటుకు రాజకీయ రంగు ఎందుకు పులుముతున్నారని సోమవారం ఆమె ఒక ప్రకటనలో ప్రశ్నించారు. భారత జాగృతి సంస్థ కోరడమే మీకు అభ్యంతరమా? లేదా అసెంబ్లీలో ఫూలే విగ్రహం ఏర్పాటు చేయడమే మీకు అభ్యంతరమా? తెలపాలని డిమాండ్‌ చేశారు. స్ఫూర్తిదాయక వీరులకు మీరిచ్చే గౌరవం ఇదేనా? అని కవిత అడిగారు. ఉమ్మడి ఏపీలో జాగృతి సంస్థ ద్వారా పోరాటం చేసి అసెంబ్లీ ఆవరణలో అంబేడ్కర్‌ విగ్రహాన్ని ఏర్పాటు చేయించామని గుర్తుచేశారు. జ్యోతిరావ్‌ ఫూలే అణగారిన ప్రజల్లో చైతన్యం నింపిన మహా మనిషి అని కొనియాడారు. అందుకే ఏప్రిల్‌ 11 నాటికి ఫూలే విగ్రహాన్ని శాసనసభ ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని యావత్‌ తెలంగాణ ప్రజల తరపున కోరుతున్నామని కవిత అన్నారు.

అధికారంలో ఉన్నామన్న సోయి లేదు

ముఖ్యమంత్రి, మంత్రులు ఇంకా ప్రతిపక్షంలో ఉన్నట్టే మాట్లాడుతున్నారు: జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్‌: ముఖ్యమంత్రి, మంత్రులు అధికారంలో ఉన్నామన్న సోయి తప్పి మాట్లాడుతున్నారని మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి విమర్శించారు. అధికారంలోకి వస్తామని నమ్మకం లేక ఇష్టమొచ్చినట్టు హామీలు ఇచ్చిన కాంగ్రెస్‌ నాయకులు ఇప్పటికీ ప్రతిపక్షంలో ఉన్నట్టే మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. హామీల అమలును ప్రశ్నిస్తే వారిలో అసహనం పెరుగుతున్నదని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్‌ నేతల తీరును తూర్పారపట్టారు. తమ మీద కోపం ఉంటే తీర్చుకోండి తప్ప రాష్ట్రానికి నష్టం చేసే పనులు చేయొద్దని హితవు పలికారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎప్పుడేం మాట్లాడుతారో ఆయనకే తెలియదని, నవంబర్‌ నుంచి విద్యుత్‌ బిల్లులు కట్టొద్దని కోమటిరెడ్డి జనానికి చెప్పిన మాటనే కేటీఆర్‌ చెబితే కోమటిరెడ్డి నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. బీఆర్‌ఎస్‌ను 39 ముక్కలు చేస్తానని అంటున్నాడని, అది కోమటిరెడ్డి తాత తరం కూడా కాదని పేర్కొన్నారు.

ధరణిలో సమస్యలు పరిష్కరించాలి: సీపీఐ



సాక్షి, హైదరాబాద్‌: ధరణిలో ఉన్న అనేక సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ధరణి కమిటీకి లేఖ రాశారు. ధరణిలో లోపాలను సరిదిద్దడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక కమిటీ వేయడం హర్షణీయమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ధరణిని తెచ్చినా భూ సమస్యలు పరిష్కారం కాకపోగా.. లక్షల ఎకరాల భూములు వివాదాస్పదమయ్యాయని విమర్శించారు. కుటుంబ పెద్ద పేరున భూమి కలిగి ఉండి, వారు మరణించిన తర్వాత వారసులకు పట్టా బదలాయింపు (విరసత్‌) చేయడం సులభతరం చేయాలన్నారు. గతంలో ప్రభుత్వం చేపట్టిన భూప్రక్షాళన కార్యక్రమంలో వాస్తవ పట్టాదారులకు బదులుగా తప్పుగా ఇతర వ్యక్తుల పేర్లు పట్టాదారులుగా నమోదు చేశారని ఆరోపించారు. అలాగే పట్టాపై ఆధార్‌కార్డు లాంటివి లింక్‌ కాకపోవడం, సంబంధిత టెక్నికల్‌ సమస్యల వలన సన్న, చిన్న, నిరుపేద రైతులు వాస్తవ సాగుదారులు రైతు బీమా, రైతుబంధు తీసుకోలేకపోతున్నారని తెలిపారు. సమగ్ర భూసర్వే చేయించి ప్రతి పట్టాదారునికి రావాల్సిన భూమిని తన పేరుమీద నమోదు అయ్యేలా చూడాలని లేఖలో కోరారు.

ధరణి రోడ్‌మ్యాప్‌ కోసం కలెక్టర్లతో భేటీ

ఐదుగురు కలెక్టర్లను హైదరాబాద్‌కు పిలిపించేందుకు సీఎస్‌ అనుమతి కోరిన ధరణి కమిటీ

- బుధవారం ఉదయం 10 గంటలకు సమావేశం
- ధరణి దరఖాస్తుల పరిష్కార తీరు, కలెక్టర్ల అనుభవాలను తెలుసుకోనున్న సభ్యులు
- తర్వాత పక్కాగా రోడ్‌మ్యాప్‌కు రూపకల్పన చేయాలని నిర్ణయం
- సీపీఐ, పౌర సంఘాల ప్రతినిధులతో భేటీ అయిన కమిటీ సభ్యులు
- కలెక్టర్లతో భేటీ తర్వాత జిల్లాలకు వెళ్లే యోచనలో కమిటీ సభ్యులు



సీసీఎల్‌ఏ కార్యాలయంలో భేటీ అయిన ధరణి కమిటీ సభ్యులు కోదండరెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్‌: ధరణి పోర్టల్‌ పునర్నిర్మాణంలో భాగంగా రోడ్‌మ్యాప్‌ రూపొందించేందుకు జిల్లాల కలెక్టర్లతో సమావేశం కావాలని ధరణి కమిటీ నిర్ణయించింది. బుధవారం ఉదయం 10 గంటలకు సచివాలయంలోగానీ, భూపరిపాలన ప్రధాన కమిషనర్‌ (సీసీఎల్‌ఏ) కార్యాలయంలోగానీ ఐదు జిల్లాల కలెక్టర్లతో ఈ భేటీ నిర్వహించనుంది. ఈ మేరకు ఐదుగురు జిల్లా కలెక్టర్లను హైదరాబాద్‌కు పిలిపించేందుకు అనుమతి కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్‌)కి లేఖ రాసింది. సోమవారం ధరణి కమిటీ సభ్యులు ఎం.కోదండరెడ్డి, ఎం.సునీల్‌కుమార్, రేమండ్‌ పీటర్, నవీన్‌ మిట్టల్, మధుసూదన్‌లతోపాటు సీఎంఆర్‌వో పీడీ వి.లచ్చిరెడ్డి తదితరులు సీసీఎల్‌ఏ కార్యాలయంలో భేటీ అయ్యారు. దాదాపు మూడు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో ధరణి వర్క్‌ఫ్లో గురించి చర్చించారు. పోర్టల్‌కు వస్తున్న దరఖాస్తులు, వాటి పరిష్కార క్రమంలో తీసుకుంటున్న చర్యల గురించి సీసీఎల్‌ఏ యంత్రాంగం కమిటీ సభ్యులకు వివరించింది. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకునేందుకు జిల్లా కలెక్టర్ల అనుభవాలను, దరఖాస్తులు పరిష్కరిస్తున్న తీరు, నిజామాబాద్‌ భూభారతి ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలను తెలుసుకోవాలని కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు కలెక్టర్లతో సమావేశం కావాలని, ఆ తర్వాత రోడ్‌మ్యాప్‌కు ఓ రూపం ఇవ్వాలని తీర్మానించింది.

త్వరలో మధ్యంతర నివేదికలు

ధరణిపై రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక ఇచ్చేందుకు సమయం పట్టవచ్చన్న అంచనాల నేపథ్యంలో.. ప్రజలకు అవసరమైన అంశాలపైనా సమావేశంలో చర్చించారు. ఆయా అంశాలపై త్వరలోనే మధ్యంతర నివేదికలు ఇవ్వాలని నిర్ణయించారు. ఇక భూములకు సంబంధించిన డేటా కోసం రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, వ్యవసాయ శాఖల వద్ద ఉన్న వివరాలను సమగ్రంగా పరిశీలించి.. ఈ మూడింటి డేటాను క్రోడీకరించడం ద్వారా సమస్యల పరిష్కారానికి ఉన్న అవకాశాలపై చర్చించారు. ఈ సమావేశంలో భాగంగా సీపీఐతోపాటు పలు పౌరసంఘాల ప్రతినిధులతో కూడా చర్చించారు. క్షేత్రస్థాయిలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

విదేశీ కంపెనీని మారుస్తాం: కోదండరెడ్డి

సీసీఎల్‌ఏ కార్యాలయంలో కమిటీ భేటీ అనంతరం కోదండరెడ్డి, సునీల్‌కుమార్, రేమండ్‌ పీటర్‌ మీడియాతో మాట్లాడారు. ధరణి పోర్టల్‌ కారణంగా లక్షల మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికే తమకు వేలాది ఫిర్యాదులు అందాయని కోదండరెడ్డి చెప్పారు. ధరణి పోర్టల్‌ నిర్వహణను ఓ విదేశీ కంపెనీకి ఇవ్వడం పొరపాటని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించారని.. అయితే ఈ పోర్టల్‌ నిర్వహణను వేరే కంపెనీకి అప్పగించాలా? కేంద్ర పరిధిలోని సంస్థకు అప్పగించాలా అన్న దానిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. తమ కమిటీ ప్రతి అంశాన్ని పరిశీలిస్తుందని, వక్ఫ్, ఎండోమెంట్, భూదాన్, ప్రభుత్వ, సీలింగ్, అసైన్డ్‌ భూములన్నింటిపై అధ్యయనం చేస్తుందని వివరించారు. కాగా.. వ్యవసాయ, రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ అధికారులతో త్వరలోనే సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తామని రిటైర్డ్‌ ఐఏఎస్‌ అధికారి రేమండ్‌ పీటర్‌ చెప్పారు. ధరణి పోర్టల్‌ ద్వారా మెరుగైన భూపరిపాలన అందించేందుకు అవసరమైన మార్పులను మాత్రమే తమ కమిటీ సూచిస్తుందన్నారు.

సమస్యల పరిష్కారానికి మార్పులు సూచిస్తాం: సునీల్‌

ధరణి కమిటీ సమస్యలను పరిష్కరించేది కాదని, సమస్యల పరిష్కారానికి అవసరమైన మార్పులు, చేర్పులు, సలహాలు అందిస్తుందని కమిటీ సభ్యుడు, భూచట్టాల నిపుణుడు ఎం.సునీల్‌ కుమార్‌ చెప్పారు. ధరణి పోర్టల్‌లో ఎదురవుతున్న సమస్యల మూలాలను పరిశీలిస్తున్నామని, ఆర్వోఆర్‌ చట్టం–2020లో మార్పులు అవసరమా కాదా అన్నది కూడా పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా మహేందర్‌రెడ్డి!

▶ మొదటి పేజీ తరువాయి

టీఎస్‌పీఎస్సీని తీర్చిదిద్దేందుకు వీలుగా సలహా తీసుకున్నారు. దీనికితోడు రాష్ట్రంలో నిరుద్యోగులు ఉద్యోగాల భర్తీ కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల నియామకంపై సర్కారు దృష్టి పెట్టింది. ఈ పోస్టుల కోసం ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులు స్వీకరించింది. మొత్తంగా 370 వరకు దరఖాస్తులు అందాయి. దీంతో ప్రభుత్వం సెర్చ్‌ కమిటీని నియమించి.. దరఖాస్తుల పరిశీలన, అర్హులను సూచించే బాధ్యతలను అప్పగించింది. కమిటీ వేగంగా దరఖాస్తుల పరిశీలన చేపట్టింది. చైర్మన్‌ పదవి కోసం దరఖాస్తు చేసినవారిలోంచి మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి పేరును ప్రభుత్వానికి సూచించినట్టు తెలిసింది. గవర్నర్‌ తమిళిసై ఆమోదం పొందగానే.. నియామకాన్ని అధికారికంగా ప్రకటించనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. మహేందర్‌రెడ్డి టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా నియమితులైనా.. ఈ ఏడాది డిసెంబర్‌ వరకే కొనసాగే అవకాశం ఉంది. కమిషన్‌ నిబంధనల ప్రకారం.. 62 ఏళ్లు దాటితే పదవీ విరమణ చేయాల్సి ఉంటుంది. మహేందర్‌రెడ్డి 2022 డిసెంబర్‌లో డీజీపీగా పదవీ విరమణ పొందారు.

సభ్యుల ఎంపికపై కసరత్తు

రాష్ట్రంలో కొత్త సర్కారు ఏర్పాటైన తర్వాత టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ బి.జనార్దన్‌రెడ్డి, ఇతర సభ్యులు రాజీనామాలు చేశారు. దీనితో కమిషన్‌లో పోస్టులన్నీ ఖాళీ అయ్యాయి. కమిషన్‌లో చైర్మన్‌తోపాటు పది మంది సభ్యులు ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు గవర్నర్‌ ఆ పోస్టుల్లో నియామకాలు జరుపుతారు. అయితే చైర్మన్, సభ్యుల పోస్టులకు నామినేటెడ్‌ పద్ధతిలో కాకుండా అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించి భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో చైర్మన్‌ పేరును ఖరారు చేయగా.. సభ్యుల పోస్టుల కోసం దరఖాస్తుల పరిశీలన ముమ్మరంగా కొనసాగుతోందని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి.

పరీక్షలు, ఫలితాలపై ఆశలు

టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల రాజీనామాలతో పలు పరీక్షల నిర్వహణ, ఫలితాల ప్రకటన వాయిదాపడ్డాయి. ప్రధానంగా గ్రూప్‌–1 మెయిన్స్, గ్రూప్‌–2, గ్రూప్‌–3 తోపాటు వివిధ శాఖల్లో ఉద్యోగాల భర్తీ పరీక్షలు నిలిచిపోయాయి. వీటికితోడు వివిధ ప్రభుత్వ శాఖల్లో దాదాపు 30వేల పోస్టుల భర్తీకి సంబంధించి అర్హత పరీక్షలు నిర్వహించినా.. ఫలితాలు ప్రకటించలేదు. పరీక్షల నిర్వహణ, ఫలితాల ప్రకటనకు కమిషన్‌ చైర్మన్, సభ్యుల నిర్ణయం కీలకం. త్వరగా వారి నియామకాలు పూర్తయితే.. నిలిచిపోయిన ప్రక్రియలన్నీ మొదలవుతాయని నిరుద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గుత్తాతో కేటీఆర్‌ భేటీ

నల్లగొండ సమావేశం జరిగిన రోజే మండలి చైర్మన్‌ ఇంటికి..

సాక్షి, హైదరాబాద్‌: శాసనమండలి చైర్మన్‌ గుత్తా సుఖేందర్‌రెడ్డితో బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ సోమవారం రాత్రి భేటీ అయ్యారు. తెలంగాణభవన్‌లో నల్లగొండ లోకసభ నియోజకవర్గ బీఆర్‌ఎస్‌ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగిన రోజు రాత్రే గుత్తా ఇంటికి కేటీఆర్‌ వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. వచ్చే లోకసభ ఎన్నికల్లో తన కుమారుడు అమిత్‌రెడ్డికి నల్లగొండ ఎంపీగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని గుత్తా కోరుతున్నారు. తెలంగాణభవన్‌లో జరిగిన నల్లగొండ సమావేశంలోనూ పార్టీకి చెందిన వివిధస్థాయి నేతలు పార్టీ అంతర్గత సమస్యలతోపాటు లోకసభ అభ్యర్థి ఎంపిక విషయాన్ని కూడా ప్రస్తావించినట్టు సమాచారం. పార్టీ కేడర్‌ నిర్ణయం మేరకే అభ్యర్థుల ఎంపిక జరగాలని తాము కోరుకుంటున్నట్టు సన్నాహక సమావేశంలో మాట్లాడిన నేతలు స్పష్టం చేశారు. మరోవైపు గుత్తా అమిత్‌రెడ్డి అభ్యర్థిత్వంపైన కొందరు నేతలు తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో పరోక్షంగా విమర్శలు చేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో గుత్తా నివాసానికి కేటీఆర్‌ వెళ్లారు. ఆయనకు అమిత్‌రెడ్డి స్వాగతం పలికారు. అమిత్‌కు బీఆర్‌ఎస్‌ లోకసభ టికెట్‌ ఇవ్వాలని గుత్తా నివాసంలో ఉన్న కార్యకర్తలు కేటీఆర్‌ను కోరగా.. కార్యకర్తల అభిప్రాయం మేరకు అధినేత కేసీఆరే అభ్యర్థిని ఎంపిక చేస్తారని బదులిచ్చారు. కాగా మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డికి నడుమ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గత కొంతకాలంగా ఆధిపత్య పోరు కొనసాగుతున్నట్టు పార్టీలో ప్రచారం జరుగుతోంది. అమిత్‌కు ఎంపీ టికెట్‌పై జగదీశ్‌రెడ్డి వ్యతిరేకిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.

తెలంగాణకు ఛత్తీస్‌గఢ్‌ కేడర్‌ ఐఏఎస్‌ అధికారి

సాక్షి, హైదరాబాద్‌: ఛత్తీస్‌గఢ్‌ కేడర్‌ ఐఏఎస్‌ అధికారి యువరాజ్‌ మర్మట్‌ను తెలంగాణ కేడర్‌కు బదిలీ చేస్తూ కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ కేడర్‌ ఐపీఎస్‌ అధికారి పి.మౌనికను ఆయన వివాహం చేసుకోవడంతో ఈ మేరకు బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దంపతులిద్దరూ 2022 బ్యాచ్‌ అధికారులే.

కాంగ్రెస్‌ వాళ్లు ఇప్పుడే ఉలిక్కి పడుతున్నారు

కేసీఆర్‌ అసెంబ్లీకి వస్తే ఇంకెలా ఉంటుంది?: కేటీఆర్‌

- పార్టీ ఓటమికి అనేక కారణాలున్నాయ్‌
- నల్లగొండ ఎన్నికల ప్రచార సరళిలో ఎక్కడా ఓటమిపై అనుమానాలు రాలేదు
- ఫిబ్రవరి మొదటి వారం నుంచి అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షలు నిర్వహిస్తామని వెల్లడి
- గతంలో చేసిన పొరపాట్లు పునరావృతం కావు: టి.హరీశ్‌రావు
- కేసీఆర్‌ను దెబ్బతీయడానికి బీజేపీ, కాంగ్రెస్‌ కలిసి పనిచేశాయి: జగదీశ్‌రెడ్డి
- నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్‌. చిత్రంలో నిరంజన్‌రెడ్డి, మధుసూదనాచారి, జగదీశ్‌రెడ్డి, హరీశ్‌రావు, కడియం, తదితరులు

సాక్షి, హైదరాబాద్‌: ప్రభుత్వ వైఫల్యాలపై మాట్లాడటం ఇంకా మొదలుపెట్టక ముందే కాంగ్రెస్‌ వాళ్లు ఉలిక్కి పడుతున్నారని బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ ఎద్దేవా చేశారు. మరి కేసీఆర్‌ అసెంబ్లీకి వస్తే పరిస్థితి ఇంకెలా ఉంటుందో ఊహించుకోవాలన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పార్టీ సన్నాహక సమావేశాల్లో భాగంగా సోమవారం తెలంగాణ భవన్‌లో నల్లగొండ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్‌ మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల్లో పార్టీ ఓటమికి అనేక కారణాలున్నాయన్నారు. 'అధికారంలోకి వస్తామని కాంగ్రెస్‌ వాళ్లు కూడా కలగనలేదు. అందుకే ఇష్టమొచ్చినట్టు హామీలు గుప్పించారు. ఇప్పుడు హామీలకు కాంగ్రెస్‌ పంగనామాలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల్లో గెలిచేందుకు రేవంత్‌రెడ్డి అడ్డమైన మాటలు చెప్పారు. కార్యకర్తలు ఉదాసీన వైఖరిని వీడాలి. ఎన్నికల్లో కాంగ్రెస్‌ నేతలు ఏం మాట్లాడారో, ఇప్పుడేం చేస్తున్నారో ప్రజలకు విడమరచి చెప్పాలి'అని పేర్కొన్నారు. పార్టీకి, ప్రభుత్వానికి సమన్వయం లేకపోవడం వల్ల కూడా ఇలాంటి ఫలితాలు వచ్చినట్లు కార్యకర్తలు చెబుతున్నారన్నారు. సోషల్‌ మీడియాలో జరిగిన అసత్య ప్రచారాన్ని గట్టిగా తిప్పికొట్టడంలో విఫలమయ్యామని, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని భవిష్యత్‌ కార్యాచరణ రూపొందిస్తామని కేటీఆర్‌ వివరించారు.

ఓటమిపై అనుమానం రాలేదు

'నల్లగొండలో ఎన్నికల ప్రచార సరళి మనకు అనుకూలంగా ఉన్నట్టే అనిపించింది. ఎక్కడా ఓటమిపై అనుమానం రాలేదు. కానీ ఎన్నికల ఫలితాలు మరోలా వచ్చాయి. కేవలం సూర్యాపేటలో మాత్రమే గెలిచాం'అని కేటీఆర్‌ వ్యాఖ్యానించారు. 'కోమటిరెడ్డి వెంకటరెడ్డి గత నవంబర్‌ లోనే కరెంటు బిల్లులు కట్టవద్దని చెప్పారు. నల్లగొండ ప్రజలు బిల్లులు కట్టకుండా కోమటిరెడ్డికే పంపాలి. సాగర్‌ ఆయకట్టుకు కాంగ్రెస్‌ పాలనలో మొదటిసారి క్రాప్‌ హాలిడే ప్రకటించే దుస్థితి దాపురించింది. కృష్ణా రివర్‌ బోర్డుకు ప్రాజెక్టులను అప్పగించి తెలంగాణ జుట్టును కాంగ్రెస్‌ కేంద్రం చేతిలో పెడుతోంది. కరెంటు కోతలు అప్పుడే మొదలయ్యాయి. వీటన్నింటిని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను నాయకులు, కార్యకర్తలు సమర్థవంతంగా నిర్వహించాలి'అని సూచించారు. కాంగ్రెస్, బీజేపీ అక్రమ సంబంధం నల్లగొండ మున్సిపాలిటీ అవిశ్వాసంలో బయటపడిందని వ్యాఖ్యానించారు. రేవంత్‌ భుజం మీద తుపాకీ పెట్టి బీఆర్‌ఎస్‌ను కాలుస్తానని మోదీ అంటున్నారని, మైనారిటీ సోదరులకు కాంగ్రెస్, బీజేపీ అక్రమ సంబంధం గురించి వివరించాలన్నారు. కేసీఆర్‌పై ప్రజల్లో సానుభూతి వెల్లువలా ఉందని, ఈ పరిస్థితిని పార్లమెంటు ఎన్నికల్లో సానుకూలంగా మలచుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌కు ఇప్పటికే అనేక వర్గాలు దూరం అయ్యాయని, నల్లగొండ పార్లమెంటు ఎన్నికల్లో సమష్టిగా పనిచేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించుకోవాలన్నారు.

కష్టపడ్డ వారికే గుర్తింపు: హరీశ్‌రావు

17 లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించి నిర్వహించిన 16 సమావేశాల్లో 112 గంటల పాటు చర్చ జరిగిందని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. కార్యకర్తలు మంచి సూచనలు చేశారని, పార్టీకి ద్రోహం చేసిన వారిపై చర్యల కోసం డిమాండ్లు వచ్చాయన్నారు. పార్టీ సంస్థాగత బలోపేతంపై సూచనలు వచ్చాయని, గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా ముందుకు సాగుదామని చెప్పారు. కష్టపడ్డ వారికే పార్టీలో గుర్తింపు ఉంటుందని, ఉద్యమకారులకు సముచిత స్థానం ఇస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్‌ ఎండ్రకాయల పార్టీ అని, ఒకరి కాలు ఇంకొకరు పట్టి లాగుతుంటారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌ ఇచ్చిన 6 గ్యారంటీలను మరో 20 రోజుల్లో నెరవేర్చాలని, లేకపోతే ఎన్నికల కోడ్‌ వస్తుందని చెప్పారు. మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్‌ బీఆర్‌ఎస్‌ పేరిట దేశమంతా తిరిగితే బలోపేతం అవుతారని మోదీ భయపడి కాంగ్రెస్‌కు సహకరించారని, రాహుల్‌ను ఎదుర్కోవడం కన్నా కేసీఆర్‌ను ఎదుర్కోవడం కష్టమని భావించారన్నారు. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలను ఎండగడదామన్నారు.

'రియల్‌' అభివృద్ధికి ప్రాధాన్యం

రియల్‌ ఎస్టేట్‌ ప్రతినిధి బృందానికి డిప్యూటీ సీఎం భట్టి హామీ



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో రియల్‌ ఎస్టేట్‌ రంగం అభివృద్ధికి తమ ప్రభుత్వం తగిన ప్రాధాన్యతనిస్తుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇంగ్లండ్‌లోని థేమ్స్‌ నది మాదిరిగా మూసీ పరీవాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సంకల్పించామని, రీజినల్‌ రింగ్‌ రోడ్‌ నిర్మాణం వల్ల హైదరాబాద్‌లో మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. సోమవారం సచివాలయంలో భట్టి విక్రమార్కను నేషనల్‌ రియల్‌ ఎస్టేట్‌ డెవలప్‌మెంట్‌ కౌన్సిల్‌ తెలంగాణ విభాగం ప్రతినిధి బృందం కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో రియల్‌ ఎస్టేట్‌ మరింత అభివృద్ధి చెందేందుకు పలు సూచనలు, ప్రతిపాదనలను ఉప ముఖ్యమంత్రికి అందచేసింది. భట్టిని కలిసిన వారిలో నేషనల్‌ రియల్‌ ఎస్టేట్‌ డెవలప్‌మెంట్‌ కౌన్సిల్‌ తెలంగాణ విభాగం ప్రతినిధులు మేకా విజయసాయి, కె.శ్రీధర్‌రెడ్డి, కాశీ ప్రసాద్, దశరథ్‌రెడ్డి, చలపతిరావు, భూపాల్‌రెడ్డి, మారోజు శ్రీధర్‌రావు, అశోక్, రామిరెడ్డి వెంకట్‌రెడ్డి, కె.కె.రెడ్డి తదితరులు ఉన్నారు.

రియల్‌ ఎస్టేట్‌ బృందం ప్రతిపాదనలివీ..

- భవన నిర్మాణ అనుమతులకు ప్రస్తుతం ఉన్న 10 శాతం మార్ట్‌గేజ్‌ విధానాన్ని ఎత్తేయాలి.
- అధికంగా ఉన్న రిజిస్ట్రేషన్‌ చార్జీలను తగ్గించాలి. జీఓ 50ని ఎత్తేయాలి.
- పెండింగ్‌లో ఉన్న లక్షలాది ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి.
- రంగారెడ్డి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న టీఎస్‌ బీ–పాస్‌ దరఖాస్తులను వెంటనే క్లియర్‌ చేయాలి.
- రాష్ట్రంలో గత 6 నెలలు ఖాళీగా ఉన్న పర్యావరణ కమిటీని వెంటనే తిరిగి ఏర్పాటు చేయాలి.
- భవన నిర్మాణాలకు తీసుకుంటున్న తాత్కాలిక విద్యుత్‌ కనెక్షన్లపై యూనిట్‌కు వసూలు చేస్తున్న రూ. రూ. 14ను తగ్గించేలి.

వెల్త్‌ క్రియేటర్లను ఇబ్బంది పెట్టం..

రాష్ట్ర ఖజానాకు భారీగా ఆదాయం సమకూర్చే వెల్త్‌ క్రియేటర్లను ఇబ్బందిపెట్టబోమని, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తీర్చేందుకు చర్యలు చేపడతామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రియల్‌ ఎస్టేట్‌ ప్రతినిధి బృందానికి హామీ ఇచ్చారు. మూసీ నది శుద్ధితో సుందరీకరణ జరిగి పర్యాటకం అభివృద్ధి చెందుతుందన్నారు. తద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు హైదరాబాద్‌ ప్రధాన శక్తిగా మారుతుందన్నారు. హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చడానికి శివారు ప్రాంతాల్లో ఇండస్ట్రియల్, ఫార్మా క్లస్టర్లను ఏర్పాటు చేస్తామని భట్టి చెప్పారు. 'ధరణి'పై చేసే సూచనలను తాను పరిశీలించడంతోపాటు ధరణిపై ఏర్పాటు చేసిన కమిటీకి అందిస్తానని తెలిపారు. పెండింగ్‌ ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తుల పరిష్కారం విషయంలో ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందన్నారు.

మద్యం ధరలు పెంచొద్దు

ఆదాయ మార్గాలను వెతకండి

- ఎలైట్‌ బార్ల కేటాయింపులో ఏకీకృత విధానం అమలు కావాలి
- ప్రీ బడ్జెట్‌ సమావేశాల్లో ఎక్సైజ్‌ శాఖకు డిప్యూటీ సీఎం భట్టి దిశానిర్దేశం

సాక్షి, హైదరాబాద్‌: మద్యం ధరలను పెంచకుండా ఎక్సైజ్‌ శాఖ ఆదాయాన్ని పెంచే మార్గాలను, అందుబాటులో ఉన్న వనరులను గుర్తించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. ప్రీ బడ్జెట్‌ సమావేశాల్లో భాగంగా సోమవారం సచివాలయంలో ఎక్సైజ్, టూరిజం శాఖల అధికారులతో సంబంధిత మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ప్రొహిబిషన్‌ ఎక్సైజ్‌ శాఖ మద్యం విక్రయాలపైనే కాకుండా కట్టడిపైనా దృష్టి పెట్టి పనిచేయాలని కోరారు. ఎలైట్‌ బార్లతో పాటు ఎలైట్‌ షాప్‌ల విషయంలో ఏకీకృత విధానాలను అమలు చేయాలని, రాష్ట్రమంతటా ఒకటే నిబంధనలు అమలయ్యేలా మార్గదర్శకాలు రూపొందించాలని కోరారు. పోలీస్, సమాచార శాఖలతో కలిసి ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసుకుని డ్రగ్స్‌ను కట్టడి చేయాలని ఆదేశించారు. ఇందుకు సరైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలని, ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

టెంపుల్‌ టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

రాష్ట్రంలో పురాతన కట్టడాలు, దేవాలయాలు ఉన్న ప్రదేశాల్లో టెంపుల్, ఎకో టూరిజం అభివృద్ధికి గల అవకాశాలను అన్వేషించాలని, టెంపుల్‌ టూరిజం అభివృద్ధికి దేవాదాయ, పర్యాటక, ఆర్టీసీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని భట్టి కోరారు. తగిన మార్కెటింగ్‌ వ్యవస్థ లేని కారణంగా సహజసిద్ధమైన పర్యాటక ప్రదేశాలను వినియోగించుకోలేక పోతున్నామన్నారు. తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని అంతర్జాతీయ పర్యాటకులకు తెలియజేసేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఎక్సైజ్‌ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ అన్ని టూరిజం ప్రాజెక్టులను ప్రభుత్వమే చేపట్టలేదని, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో ప్రైవేటు కంపెనీల పెట్టుబడులకు అవసరమైన మార్గదర్శకాలను రూపొందించాలని కోరారు. సమావేశంలో భాగంగా కొత్త కార్యాలయ భవనాల నిర్మాణం, చెక్‌పోస్టుల పటిష్టత కోసం ఎక్సైజ్‌ శాఖ అధికారులు నిధులను కోరగా కొత్త పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, స్పిల్‌ఓవర్‌ పనులకు టూరిజం శాఖ నిధులను ప్రతిపాదించింది. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ఎక్సైజ్‌ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్‌శర్మ, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్‌ పాల్గొన్నారు.

దావోస్‌లో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు

- కాంగ్రెస్‌ది ఇండస్ట్రీస్‌ ఫ్రెండ్లీ ప్రభుత్వం: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- కొత్తూరులో ఏరోస్పేస్‌ మాన్యుఫాక్చరింగ్‌ యూనిట్‌ ప్రారంభం



ఏరోస్పేస్‌ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న శ్రీధర్‌బాబు

కొత్తూరు: దావోస్‌ వేదికగా ఇటీవల జరిగిన సమావేశాల్లో గతంలో ఎన్నడూ లేనంతగా రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన కోసం భారీగా పెట్టుబడులు వచ్చాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కొత్తూరు పట్టణ సమీపంలోని పారిశ్రామికవాడలో ఉన్న హరిజోన్‌ ఇండస్ట్రియల్‌ పార్క్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన జేఈఏహెచ్‌ ఏరోస్పేస్‌ మాన్యుఫాక్చరింగ్‌ యూనిట్‌ను స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో జరిగిన సదస్సులో కేవలం రూ.20 వేల కోట్లకు ఒప్పందాలు జరగగా.. ఈసారి రూ.40 వేల కోట్ల ఒప్పందాలు కుదుర్చుకున్నామని చెప్పారు. ఇక జెడ్డాలో నిర్వహించిన సదస్సులో భాగంగా ఓ ప్రముఖ ఫుడ్‌ ఇండస్ట్రీకి చెందిన సంస్థ తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో భారీ రెస్టారెంట్లను ప్రారంభించేందుకు ఒప్పందం చేసుకుందని చెప్పారు. ప్రభుత్వం అవలంబిస్తున్న సానుకూల విధానాలకు తోడు ఇండస్ట్రీ ఫ్రెండ్లీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పరిశ్రమల స్థాపన ఊహించని స్థాయికి చేరుకుందన్నారు. అనంతరం సంస్థ వ్యవస్థాపకులు విశాల్‌ సంఘ్వీ, వెంకటేశ్‌ మాట్లాడుతూ.. తమ ప్లాంట్‌లో విమానయాన, రక్షణరంగ సంస్థలకు అవసరమయ్యే విడిభాగాలు, పరికరాలను తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

'లోక్‌సభ'కు సన్నద్ధం

- సన్నాహక సమావేశాల్లో పార్టీ శ్రేణులకు కేటీఆర్‌ దిశానిర్దేశం
- 10 నుంచి 12 ఎంపీ సీట్లు గెలుపు లక్ష్యంగా... అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి గల కారణాలపై విశ్లేషణ
- జరిగిన పొరపాట్లు పునరావృతం కానివ్వమని భరోసా

సాక్షి, హైదరాబాద్‌: లోక్‌సభ సెగ్మెంట్‌ల సన్నాహక సమావేశాలతో బీఆర్‌ఎస్‌ శ్రేణుల్లో ఆ పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ జోష్‌ నింపారు. అసెంబ్లీ ఎన్నికల ఓటమితో నైరాశ్యంలో ఉన్నవారిలో ఆత్మవిశ్వాసం పెంచేందుకు ఈ సమావేశాలు దోహదపడ్డాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎన్నికల్లో ఓటమి నుంచి తేరుకోక ముందే పార్టీ అధినేత కేసీఆర్‌ తుంటి ఎముక విరిగి ఆస్పత్రి పాలు కావడంతో పార్టీ యంత్రాంగంలో ఒక్కసారిగా నైరాశ్యం ఆవరించింది. ఈ పరిస్థితుల్లో కేసీఆర్‌ ఆదేశాల మేరకు కేటీఆర్‌ జనవరి 3న తెలంగాణభవన్‌లో లోక్‌సభ నియోజకవర్గాల ఎన్నికల సన్నాహక సమావేశాలకు శ్రీకారం చుట్టారు. ఆదిలాబాద్‌ సెగ్మెంట్‌తో మొదలైన సమావేశాలు సోమవారం నల్లగొండతో ముగిశాయి. రోజుకో లోక్‌సభ నియోజకవర్గం చొప్పున 16 రోజులు జరిగిన సమావేశాల్లో (హైదరాబాద్, సికింద్రాబాద్‌ సమావేశాలు ఒకేరోజు జరిగాయి) దాదాపు 112 గంటల పాటు చర్చ జరిగింది. ప్రతి పార్లమెంట్‌ నియోజకవర్గానికి సంబంధించి ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన 500 నుంచి 800 వరకు వివిధ స్థాయిల్లోని నాయకులు ప్రతిరోజు తెలంగాణభవన్‌కు వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన సమావేశాల్లో వచ్చే లోక్‌సభ ఎన్నికలకు పార్టీని సమాయత్తం చేయడంతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఓటమికి గల కారణాలను విశ్లేషించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు వెలిబుచ్చిన అభిప్రాయాలను నివేదిక రూపంలో ఏరోజుకారోజు పార్టీ అధినేత కేసీఆర్‌కు నివేదించారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌కు 9 మంది ఎంపీలు ఉండగా, వచ్చే పార్లమెంట్‌ ఎన్నికల్లో 10 నుంచి 12 లోక్‌సభ సీట్లు గెలుచుకోవడమే లక్ష్యంగా పార్టీ సన్నాహక సమావేశాలు జరిగాయి.

ఆదిలాబాద్‌ నుంచి నల్లగొండ వరకు

తొలిరోజే ఆదిలాబాద్‌ లోక్‌సభ సెగ్మెంట్‌ నుంచే పార్టీ నాయకులు, కార్యకర్తలు ఓటమికి గల కారణాలను నిర్భయంగా పార్టీ అగ్రనేతల సమక్షంలో వెల్లడించారు. తొమ్మిదిన్నరేళ్ల పాలనలో తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన నాయకుల పరిస్థితి, ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులకు దక్కిన పదవుల గురించి నిక్కచ్చిగా తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అన్ని పార్టీల వారు బీఆర్‌ఎస్‌లోకి వచ్చి చేరడం మొదట్లో బాగున్నా, తర్వాత విభేదాలు పెరిగాయని, ఇవి కాంగ్రెస్, బీజేపీలకు కలిసి వచ్చాయని పలు నియోజకవర్గాల నాయకులు విశ్లేషించారు. బీజేపీ, కాంగ్రెస్‌ రెండు గట్టిగా ఉన్న చోట బీఆర్‌ఎస్‌ గెలిచిన విషయాలను సికింద్రాబాద్, చేవెళ్ల, మల్కాజిగిరి, కరీంనగర్, ఆదిలాబాద్‌ సమావేశాల్లో పార్టీ నాయకులు విశ్లేషించారు. బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, సోయం బాపురావు వంటి బీజేపీ ఎంపీలు, బీజేపీ సిట్టింగ్‌ ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు పోటీ చేసిన చోట్ల బీఆర్‌ఎస్‌ విజయం సాధించడాన్ని ప్రస్తావించారు. ఎమ్మెల్యేల తీరుపై కూడా బహిరంగంగానే వ్యాఖ్యానించడం గమనార్హం. కాగా పార్టీ శ్రేణుల అభిప్రాయాలను కేటీఆర్, హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, కేశవరావు, మధుసూదనాచారి వంటి సీనియర్లు ఓపిగ్గా వింటూ, అలా మరోసారి జరగకుండా చూస్తామని హామీ ఇచ్చి పార్టీ యంత్రాంగంలో ధైర్యం నింపారు.



తెలంగాణచౌక్‌లో ఆకట్టుకున్న క్రాకర్స్ షో



రాముని వేషధారణలో బాలుడు



తీగలగుట్టపల్లి కోదండరామాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు



సప్తగిరికాలనీలోని కోదండరామాలయంలో భక్తులు



జై శ్రీరాం.. రాజారాం

సాక్షి నెట్‌వర్క్: జైశ్రీరాం.. రాజారాం.. నినాదంతో జిల్లా మార్మోగింది. వీధివీధినా శ్రీరామ నామం ప్రతిధ్వనించింది. శ్రీరామునికి జిల్లావాసులు నీరాజనం పలికారు. సోమవారం అయోధ్యలో బాల రాముని ప్రాణప్రతిష్ఠాపనోత్సవం సందర్భంగా రాములోరి సేవలో తరించారు. అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు భజనలు, సంకీర్తనలు తదితర ప్రదర్శనలు నిర్వహించారు. టీవీలు, భారీ స్క్రీన్‌లలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని వీక్షించారు. జిల్లా కేంద్రంలోని మహాశక్తి ఆలయంలో జనం కిక్కిరిసిపోయారు. అయోధ్య రామాలయ సైకత శిల్పాన్ని వీక్షించి ముగ్ధులయ్యారు. ఆలయ నిర్వాహకులు, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపి బండి సంజయకుమార్ సైకత శిల్పం వద్ద పూజలు చేశారు. సాయంత్రం జిల్లా కేద్రంలోని తెలంగాణచౌక్‌లో ఎంపీ, నాయకులు నృత్యం చేస్తూ టపాసులు పేల్చి సంబురాలు జరుపుకున్నారు. – ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్



తెలంగాణ చౌక్‌లో సంబరాల్లో ఎంపీ సంజయ్ తదితరులు



గణేశ్‌నగర్ వినాయక అపార్ట్‌మెంట్‌లో..



చిన్నారుల నృత్యం



రామమందిరం సైకత శిల్పం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు



బాలరాముని సైకత శిల్పం వద్ద దీపాలు వెలిగించిన మహిళలు

న్యూస్‌రీల్

రవిచంద్రకు సన్మానం



సన్మానిస్తున్న శ్యాంప్రసాద్‌లాల్ తదితరులు

కరీంనగర్‌కల్చరల్: సినీ వార్తల రచయిత, సాంస్కృతిక కార్యకర్త, పాత్రికేయుడు కఫిసో అధ్యక్షుడు పొన్నం రవిచంద్రకు డాక్టరేట్ దక్కడంపై సోమవారం ఫిలింభవన్‌లో ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ మాట్లాడుతూ, రవిచంద్ర అనేక రంగాల్లో చేసిన బహుముఖ ప్రజ్ఞకు మంచి గుర్తింపు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీసీ మామిళ్ళ చంద్రశేఖర్, కవులు గాజోజు నాగభూషణం, అన్నవరం దేవేందర్, లక్ష్మీ గౌతమ్, కందుకూరి అంజయ్య, కూకట్ల తిరుపతి, బసవేశ్వర్ పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయంలోకి ఎమ్మెల్యే 'కవ్వంపల్లి'



కార్యాలయంలోకి వెళ్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని ఎల్‌ఎండీ కాలనీలో గల మానకొండూర్ నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలోకి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం ప్రవేశించారు. నియోజకవర్గంలోని ప్రజలు, అధికారులు, కాంగ్రెస్ కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. క్యాంపు కార్యాలయానికి ప్రజాభవన్‌గా ఎమ్మెల్యే నామకరణం చేశారు. ఇక నుంచి తాను కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. మండలానికి చెందిన 13 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కవ్వంపల్లి అనురాధ, పార్టీ మండల అధ్యక్షుడు మోరెపెల్లి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

24న వైద్య పోస్టులకు ఇంటర్వ్యూ

కరీంనగర్‌టౌన్: నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాం (ఎన్‌హెచ్‌ఎం) కింద జిల్లాలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేసేందుకు ఈనెల 24న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితాదేవి తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ వయస్సు, కుల ధ్రువీకరణ, లోకల్ స్టేటస్, 1 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఎంబీబీఎస్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ (1) కాపీ నకలు ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

ఒకటిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్

కరీంనగర్: జూనియర్ లైన్‌మెన్ పోస్టుల నియామకానికి ఫిబ్రవరి 1న అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌తో పాటు పలు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎస్‌ఈ వడ్లకొండ గంగాధర్ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థుల జాబితాను వారి చిరునామాకు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించినట్లు తెలిపారు. ఎవరికైనా లెటర్ అందకుంటే ఎస్‌ఈ కార్యాలయంలో వారి ఐడెంటీ కార్డు చూపించి కాల్ లెటర్లు పొందవచ్చునని తెలిపారు. నాల్గో జాబితాను కార్యాలయ నోటీసు బోర్డులో ఉంచినట్లు వెల్లడించారు.

శాతవాహన విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ మల్లేశ్

కరీంనగర్‌సిటీ: కేంద్ర ప్రభుత్వ యువజన కార్యకలాపాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎంఎల్‌ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ వారు ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో శాతవాహన విశ్వవిద్యాలయం విద్యార్థులు పాల్గొన్నారు. శాతవాహనలోని కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు రాయకంటి వంశీ, మంథని సుష్మ , ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ కళాశాలకు చెందిన పి.సంధ్యారాణి శిబిరంలో సత్తాచాటారు. శిబిరంలో దేశంలోని 12 రాష్ట్రాల నుంచి వివిధ యూనివర్సిటీలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు. కాగా శాతవాహన విద్యార్థులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రదర్శించి ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను శాతవాహన ఉపకులపతి ప్రొఫెసర్ సంకశాల మల్లేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.వరప్రసాద్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మనోహర్, ప్రోగ్రాం ఆఫీసర్స్ తిరుపతి, డి.విజయ్ ప్రకాష్ అభినందించారు.

వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిరక్షించండి

- కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: జిల్లాలోని వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిరక్షించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులు, బోర్డు సభ్యులతో సమీక్షించారు. తహసీల్దార్లు, సభ్యులు వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిశీలించి తదుపరి జరగనున్న సమావేశంలోగా పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని సూచించారు. గెజిట్ ప్రకారం ధరణిలో నమోదు చేయాలని, ఆక్రమణలకు గురైతే తిరిగి స్వాధీనం చేసుకోవాలన్నారు. వక్ఫ్ ఆస్తులలో అద్దెకు ఇచ్చిన వాటి వివరాలను పరిశీలించాలని, ఇప్పటి వరకు వసూలు చేసిన అద్దె, ఇంకా వసూలు చేయవలసిన వాటి వివరాలు తెలియజేయాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్‌వో పవన్‌కుమార్, కరీంనగర్, హుజురాబాద్ ఆర్డీవోలు కుందారపు మహేశ్వర్, సోలిపేట రాజు, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఖాజానజీమొద్దీన్, డిప్యూటీ రిజిస్ట్రార్ బి.ప్రవీణ్‌కుమార్, వక్ఫ్‌బోర్డు సహాయ ఇన్‌స్పెక్టర్ హర్షద్, అడ్వకేట్ అసద్ అలీ, సభ్యులు మెహ్మద్ అన్సారీ, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఆడపిల్లల భవిష్యత్తుకు బాటలు వేద్దాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, అధికారులు

కరీంనగర్: సమాజ మణిహారమైన ఆడపిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆడపిల్లల బంగారు భవితకు పునాది వేసి స్వేచ్ఛాయుత వాతావరణం, పోషకాహారం అందించాలన్నారు. అనంతరం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బ్యానర్‌పై సంతకాలు చేసి పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్‌వో పవన్‌కుమార్, జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, కరీంనగర్, హుజురాబాద్ ఆర్డీవోలు మహేశ్వర్, రాజు, డీఆర్డీవో శ్రీలత, డీఎంహెచ్‌వో లలితాదేవి, అధికారులు పాల్గొన్నారు.

పిల్లలకు అన్ని వసతులు కల్పించాలి

కరీంనగర్: పిల్లలకు అన్ని వసతులు అందేలా చూడాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. పిల్లల సంరక్షణ కేంద్రాల తనిఖీలో భాగంగా సోమవారం బాలసదన్‌ను సందర్శించారు. అనంతరం పిల్లలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న భవనం చాలా పాతది అయినందున, తొందరగా మరమ్మతులు చేయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ధనలక్ష్మి, డీసీపీవో శాంత, చైల్డ్ హెల్ప్‌లైన్ కో ఆర్డినేటర్ సంపత్, మెడికల్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ

- 120 దరఖాస్తులు స్వీకరణ
- భూ సమస్యలే అధికం



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

కరీంనగర్ అర్బన్: క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యం.. బాధితులు నిరాశగా వెనుదిరగడం.. మళ్లీ ప్రజావాణిని ఆశ్రయించడం రివాజుగా మారింది. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి క్రమేణా బాధితుల సంఖ్య పెరుగుతుందే కానీ తగ్గడం లేదు. పైగా వచ్చిన దరఖాస్తులే మళ్లీ మళ్లీ రావడం ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపానికి నిదర్శనం. కాగా ప్రజావాణికి 120 అర్జీలు రాగా అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్ స్వీకరించారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి 17, జిల్లా పంచాయతి కార్యాలయం 10, శంకరపట్నం తహసీల్దార్ కార్యాలయం 7, మిగతా శాఖలకు సంబంధించి 86 ఫిర్యాదులు స్వీకరించామని కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సుధాకర్ వివరించారు.

డిప్యూటేషన్ రద్దు చేయాలి

కరీంనగర్: హుజూరాబాద్ బీసీ కళాశాల బాలికల హాస్టల్ సంరక్షణ అధికారిణికి అదనంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కళాశాల వసతిగృహానికి డిప్యూటేషన్ ఇవ్వడం సరికాదని, తక్షణమే డిప్యూటేషన్ రద్దు చేయాలని జాతీయ బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సిరిశెట్టి రాజేశ్‌గౌడ్ సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరీంనగర్‌లో అనేక సంక్షేమ వసతి గృహాల అధికారులు ఉండగా, వారికి కరీంనగర్ బాధ్యతలు అప్పగించకుండా హుజూరాబాద్ అధికారికి అప్పగించడంలో ఆంతర్యమేమిటని అన్నారు. దీనిపై వెంటనే విచారణ జరిపించి డిప్యూటేషన్ రద్దు చేయాలని కోరారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న వార్డు సభ్యులు

జమ్మికుంట(హుజూరాబాద్): మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామ పంచాయతీలో హైమాస్ట్ లైట్లు, రేకుల షెడ్ నిర్మాణంలో సర్పంచ్, ఉప సర్పంచ్, కార్యదర్శి అక్రమాలకు పాల్పడ్డారని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వార్డు సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా 10 హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారని, ఒక్కో లైటుకు రూ.40వేల విలువ ఉండగా, రూ.88 వేలకు పైగా బిల్లు వేసి నిధులు రూ.10లక్షల వరకు దుర్వినియోగం చేశారని, పంచాయతీ స్థలంలో అక్రమంగా రేకుల షెడ్ నిర్మించారని ఆరోపించారు. గతంలో కలెక్టర్, డీపీవోకు ఫిర్యాదు చేశామని, ఆ సమయంలో బిల్లులు పెండింగ్‌లో పెట్టి, ప్రస్తుతం పాలకవర్గ సభ్యులకు తెలియకుండా బిల్లు తీసుకున్నారని పేర్కొన్నారు. అవినీతి, నిధులు దుర్వినియోగానికి పాల్పడిన సర్పంచ్, ఉప సర్పంచ్, కారదర్శిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యులు భాగ్య, లక్ష్మి, సౌభాగ్య, మధుసూదన్, స్వరూప ఫిర్యాదులో పేర్కొన్నారు.

తప్పెవరిదో.. శిక్ష నాకా!



గ్రామంలోని 307 సర్వే నంబర్‌లో 6 గుంటల భూమి ఉంది. సదరు భూమిని కొత్త పాస్‌బుక్‌లో చేర్చలేదు. పాత పాస్‌బుక్‌లో ఉండగా ధరణి వచ్చాకా ఇచ్చిన పాస్‌బుక్‌లో వివరాలు లేవు. ఇదెక్కడి అన్యాయమని రెవెన్యూ అధికారులను కలిస్తే చేస్తామంటూ తిప్పుకుంటున్నారు. న్యాయం చేయాలని కోరినా పట్టించుకోవడం లేదు. ధరణి పహాణీలో నమోదు చేయాల్సినవారు తప్పు చేస్తే నాకెందుకు శిక్ష. – ఎం.మల్లేశం, ఖాజీపూర్, కరీంనగర్ రూరల్

బై నంబర్లతో మార్చేస్తున్నారు



గ్రామ శివారులో సర్వే నంబర్ 444/రూలో 1.22 ఎకరాల భూమి ఉంది. 22 ఏళ్ల క్రితం రిజిస్ట్రేషన్ ద్వారా కొనుగోలు చేయగా రికార్డుల్లో, మోకాపై ఉండి వ్యవసాయం చేసుకుంటున్నా. ఎవరి నిర్లక్ష్యమో కానీ 444/లు గా బై నంబర్ మార్చి వేరే వారి పేరున మార్చారు. భూమిని అనుభవిస్తూ కూడా రికార్డులో పేరు లేక నానాపాట్లు పడుతున్నా. కలెక్టర్ గారూ న్యాయం చేయాలే. – కొంతం భూమయ్య, నగునూరు, కరీంనగర్‌రూరల్

నాకిదేం గోస



ధరణి ఏమో గానీ నాకుండాల్సిన భూమి రికార్డులో లేదు. ఇదెక్కడి అన్యాయమని అధికారులను కలిస్తే ఉపశమన మాటలే తప్ప చర్యలు శూన్యం. గతంలో ఉన్న పాసుపుస్తకంలో 423 సర్వే నంబర్‌లో 0.27, 414 సర్వేనంబర్‌లో 1.20ఎకరాల భూమి ఉంది. కానీ సదరు భూ వివరాలు కొత్త పాసుపుస్తకంలో లేవు. ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా.– కొత్త మల్లయ్య, చెర్లపల్లి, గంగాధర

వనదేవతల జాతర వైభవంగా నిర్వహించాలి



సమ్మక్క, సారలమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు తదితరులు

- ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు
- సమ్మక్క, సారలమ్మకు మొక్కులు చెల్లింపు

కరీంనగర్: వనదేవతలైన సమ్మక్క, సారలమ్మ జాతరను వైభవంగా నిర్వహించాలని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ వై.సునీల్‌రావు అన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రూ.కోటి నిధులతో రేకుర్తిలోని సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద చేపడుతున్న ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి రెండేళ్లకోసారి రేకుర్తిలో వనదేవతల జాతర వైభవంగా సాగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే అమ్మవార్ల గద్దెల చుట్టూ సీసీ రోడ్లు, రెయిలింగ్ తదితర ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఫిబ్రవరిలో జాతర జరగనున్న నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించేందుకు నగరపాలక సంస్థ ద్వారా మరో రూ.కోటి నిధులు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. జాతరకు ఈసారి కూడా 5 లక్షలకు పైగా భక్తులు వచ్చి అమ్మవార్లను దర్శించుకుంటారని, భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం తగు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం టవర్‌సర్కిల్ సమీపంలో వాల్మీకి మహర్షి ఆలయాన్ని ప్రారంభించి ప్రత్యేక పూజలు చేశారు. 18,19వ డివిజన్ పరిధిలోని శ్రీ కంకాలమ్మ కేతేశ్వర ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాల్లో కార్పొరేటర్లు సుధగోని మాధవి కృష్ణ, ఏదుల్ల రాజశేఖర్, వంగల శ్రీదేవి పవన్, పిట్టల వినోద శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ కుట్రలను సోషల్ మీడియా వారియర్స్ ఎండగట్టాలి

కరీంనగర్: కాంగ్రెస్, బీజేపీల కుట్రలు ఎండగట్టడమే లక్ష్యంగా సోషల్ మీడియా వారియర్స్ అప్రమత్తంగా వ్యవహరించి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మేయర్ వై.సునీల్‌రావుతో కలిసి సోషల్ మీడియా వారియర్స్ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈనెల 24న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కరీంనగర్‌కు రానున్నారని, రేకుర్తిలోని రాజశ్రీ గార్డెన్‌లో సోషల్ మీడియా వారియర్స్‌తో సమావేశం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, కాంగ్రెస్, బీజేపీల గోబెల్స్ ప్రచారానికి అడ్డుకట్ట వేయడం, పదేళ్లలో బీఆర్‌ఎస్ నిర్వహించిన కార్యక్రమాలు, అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజాక్షేత్రంలో వివరించేలా పార్టీ అధినేత కేటీఆర్ దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకులు సిద్దం వేణు, గవ్వ వంశీధర్‌రెడ్డి, పొన్నం అనిల్‌కుమార్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.





రాజన్న క్షేత్రం.. భక్తజన సంద్రం

వేములవాడ అర్బన్: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ రాజన్న ఆలయం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర నేపథ్యంలో స్వామివారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన తర్వాత కల్యాణ కట్టలో తల నీలాలు సమర్పించారు. అనంతరం క్యూలైన్లలో వెళ్లి, స్వామివారికి కోడె మొక్కులు చెల్లించి, ప్రత్యేక పూజలు చేశారు. రాజన్న గుడి చెరువు పార్కింగ్ స్థలం వాహనాలతో నిండిపోయింది. భక్తుల ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

కొండగట్టులో శ్రీరామునికి పూజలు


పూజలు చేస్తున్న అర్చకులు


హాజరైన భక్తులు

కొండగట్టు(చొప్పదండి): అయోధ్యలో సోమవారం శ్రీరాముడు కొలువుదీరే సమయానికి కొండగట్టు కొండమీద శ్రీరాముని, హనుమాన్ ఆలయాల్లో అధికారులు, అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు శ్రీరాముడిని దర్శించుకున్నారు. అయోధ్యలో జరిగిన కార్యక్రమాన్ని కొండపై ఈవో కార్యాలయంలోని కంప్యూటర్లలో వీక్షించారు. ఏఈవో శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ మారుతిస్వామి, అధికారులు సునీల్, శ్రీనివాస శర్మ, అర్చకులు పెద్ద జితేంద్రప్రసాద్ స్వామి, చిరంజీవ స్వామి, కపిందర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

రెనె ఆస్పత్రిలో కరసేవకులకు సన్మానం


కరసేవకులను సన్మానించిన డాక్టర్ స్వామి

కరీంనగర్‌టౌన్: అయోధ్యలో శ్రీరాముని ఆలయ ప్రారంభం సందర్భంగా నాడు కరసేవలో పాల్గొన్న కరీంనగర్ కరసేవకులను రెనె హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ బంగారి స్వామి ఆధ్వర్యంలో సోమవారం ఆస్పత్రిలో సన్మానించారు. బొమ్మకంటి కిషన్, గుజ్జ శ్రీనివాస్, సాయిని మల్లేశం, కోమల ఆంజనేయులు, సూర్య భానులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సనాతన ధర్మం, ఉన్నత విలువలకు ప్రతిరూపం అయిన శ్రీరామునికి అయోధ్యలో మందిరం నిర్మించడం, ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. రాముని జీవన విధానం, అన్నదమ్ముల అనుబంధం, విలువలు అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో దేశంలో రామరాజ్య స్థాపన జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బంగారి రజనీ ప్రియదర్శిని, ప్రజ్ఞా భారతి నాయకులు నిరంజనాచారి, విశ్వహిందూ పరిషత్ నాయకులు కోమల్ల రాజేందర్ రెడ్డి, జగదీశ్, ఇనుగుర్తి రమేశ్, మధుసూదన్ రెడ్డి, డాక్టర్ రవీంద్రాచారి, అరవింద్‌రావు, మహేందర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కరీంనగర్ రీజియన్‌కు 129 కొత్త బస్సులు

సాక్షి ఎఫెక్ట్

కరీంనగర్: కరీంనగర్ రీజియన్‌కు త్వరలో 129 కొత్త బస్సులు రానున్నాయని ఆర్‌ఎం సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న 'పాత బస్సుల్లో ప్రయాణమెలా?' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. 37 పల్లె వెలుగు, 79 ఎక్స్‌ప్రెస్, 13 ఏసీ బస్సులు వస్తాయన్నారు. వీటితో రీజియన్‌కు కొత్త కళ రాబోతుందని, ప్రయాణికులకు ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక


కావ్యశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాగసుధారాణి, ఉపాధ్యాయులు

జగిత్యాలరూరల్: మండలంలోని కండ్లపల్లి మోడల్ స్కూల్ విద్యార్థిని పి.కావ్యశ్రీ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ వినిత్‌కుమార్ తెలిపారు. ఇటీవల మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ అండర్-19 విభాగంలో ఆమె ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు మహారాష్ట్రలోని ముంబాయిలో జరిగే జాతీయ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున కావ్యశ్రీ ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నాగసుధారాణి, వైస్ ప్రిన్సిపాల్ రవీందర్, ఉపాధ్యాయులు ఆమెను సోమవారం అభినందించారు.

అట్టముక్కలతో అయోధ్య రామాలయం

చందుర్తి(వేములవాడ): మండలంలోని బండపల్లికి చెందిన అంబాల శశాంత్ (ఐదోతరగతి), మల్యాల గ్రామానికి చెందిన ఎంజాల హరిహరణ్(ఏడోతరగతి) అయోధ్య రామ మందిర నమూనాను అట్టముక్కలతో రూపొందించారు. వీరిని గ్రామస్తులు అభినందించి, బహుమతి ప్రదానం చేశారు.



ఆలయ నమూనాలతో శశాంత్, హరిహరణ్

ప్రభుత్వ స్థలం విషయంలో గొడవ

- ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన స్థానికులు
- గద్దెను కూల్చిన ముస్లిం మైనార్టీలు


ప్రతిష్ఠించిన హనుమాన్ విగ్రహం, గద్దె కూల్చిన దృశ్యం

మానకొండూర్ రూరల్: మానకొండూర్ శివారులోని బోరగుట్ట వద్ద సోమవారం ఉదయం ఉద్రిక్తత నెలకొంది. అయోధ్యలో బలరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని స్థానికంగా ఆంజనేయ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు స్థానిక హిందువులు పూనుకున్నారు. ఇందుకోసం గద్దె నిర్మించి, విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విషయం తెలుసుకున్న కొందరు ముస్లిం మైనార్టీలు అక్కడికి చేరుకొని, గద్దెను కూల్చారు. ఈ స్థలం తమదని, ఇక్కడ చాలా ఏళ్లుగా ఖబరస్తాన్ ఉందని, తమ పూర్వీకుల సమాధులున్నాయని గొడవకు దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. వారు నచ్చజెప్పినా వినకపోవడంతో కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు, సీఐ రాజ్‌కుమార్ వచ్చారు. ఇరువర్గాలతో మాట్లాడి, శాంతింపజేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. తహసీల్దార్ రాజుతో భూ తగాదా విషయమై చర్చించారు. సర్వే నంబర్ 336లో ప్రభుత్వ స్థలం ఉందని, దీన్ని ఎవరికీ కేటాయించలేదని ఆయన తెలిపారు. అందులో నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా, స్థలాన్ని ఆక్రమించినా బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఏ వర్గానికి చెందిన వారైనా ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఏసీపీ హెచ్చరించారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

కొండగట్టు ప్రమాద బాధితులను ఆదుకుంటాం

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యం

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు బస్సు ప్రమాద బాధితులను ఆదుకుంటామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కొడిమ్యాల మండలంలోని రాంసాగర్ గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గతంలో ఇచ్చిన హామీ మేరకు కొండగట్టు బాధితులందరికీ పింఛన్ సౌకర్యం కల్పించి, అర్హులందరికీ ఔట్‌సోర్సింగ్‌లో ఉద్యోగాలు ఇస్తామని పేర్కొన్నారు. అనంతరం రాంసాగర్ అభివృద్ధికి రూ.15 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఏడాదిలోగా సాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ప్రశాంతి, సర్పంచ్ మాధవి, ఎంపీటీసీ సభ్యుడు జగన్మోహన్‌రెడ్డి, నాయకులు నారాయణ, గంగారావు, ప్రభాకర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలులో ప్రయాణికురాలికి తీవ్ర అస్వస్థత

- ఆస్పత్రికి తరలించాక మృతి
- మృతురాలిది బిహార్

రామగుండం: ఆస్పత్రిలో చికిత్స పొందిన ఓ మహిళ రైలులో ప్రయాణించి, తీవ్ర అస్వస్థతకు గురైంది.. ఆస్పత్రికి తరలించగా మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. బిహార్‌కు చెందిన సలేఖా ఖాతూన్(39), ఆమె భర్త ఉపాధి నిమిత్తం పదేళ్ల క్రితం కేరళలోని అంబలప్పుజకు వచ్చారు. ఈ నెల 3న దంపతుల మధ్య గొడవ జరగడంతో ఖాతూన్ ఒంటిపై శానిటైజర్ పోసుకొని, నిప్పంటించుకుంది. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొంది, ఈ నెల 21న డిశ్చార్జి అయ్యింది. కుటుంబసభ్యులతో కలిసి బిహార్ వెళ్లేందుకు రప్తిసాగర్ రైలెక్కింది. సోమవారం ఉదయం రామగుండం రైల్వేస్టేషన్‌కు చేరుకోవడానికి ముందే ఖాతూన్ తీవ్ర అస్వస్థతకు గురైంది. రైల్వే అధికారులకు సమాచారం అందడంతో వారిని రామగుండంలో దింపి, 108 వాహనం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షిస్తుండగా ఆమె మృతిచెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి తిరుపతి తెలిపారు.

ఎస్సారార్ కళాశాలలో చేరాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

కరీంనగర్ సిటీ: కరీంనగర్ ఎస్సారార్ కళాశాలలో చేరాలని ప్రిన్సిపాల్ రామకృష్ణ కోరారు. కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరం ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సారార్ గతేడాది 1,520కి పైగా ప్రవేశాలు పొందిన కళాశాలగా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరం అడ్మిషన్ల కోసం దోస్త్ వెబ్‌సైట్ ద్వారా నోటిఫికేషన్ త్వరలో రానుందన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేయబోయే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దోస్త్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఎస్సారార్‌లో చేరాలని కోరారు. కార్యక్రమంలో జీసీ జీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య, ప్రమోద్ కుమార్, మ్యాథమేటిక్స్ హెచ్‌వోడీ శ్రీనివాస్, జువాలజీ విభాగాధిపతి రాజు, ఇంగ్లిష్ శాఖాధిపతి ఉమామహేశ్వరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ పైనుంచి పడి వ్యక్తి మృతి


తిరుపతి (ఫైల్)

పెగడపల్లి(ధర్మపురి): ట్రాక్టర్ పైనుంచి పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై సతీశ్ వివరాల ప్రకారం.. పెగడపల్లి మండలంలోని నామాపూర్‌కు చెందిన సిలువేరి తిరుపతి(43)కి సొంత ట్రాక్టర్ ఉండగా తానే నడుపుతున్నాడు. సోమవారం గ్రామానికి చెందిన ఓ రైతు పొలం దున్నుతూ ప్రమాదవశాత్తు కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు.

గుర్తు తెలియని మహిళ ..



కరీంనగర్ క్రైం: కరీంనగర్ బస్టాండ్‌లో గుర్తు తెలియని మహిళ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బస్టాండ్‌లో సోమవారం 30 నుంచి 35 ఏళ్ల వయసు గల ఓ మహిళ స్పృహతప్పి పడిపోయింది. ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమె మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. ఎవరైనా గుర్తు పడితే వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

అప్పు పుట్టడం లేదని యువకుడి ఆత్మహత్య


అజయ్ (ఫైల్)

చందుర్తి(వేములవాడ): అప్పు పుట్టడం లేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. చందుర్తి మండలంలోని జోగాపూర్‌కు చెందిన గసికంటి అజయ్(22) ఉన్న ఊరిలో ఉపాధి లేక గల్ఫ్ వెళ్లాలనుకున్నాడు. రెండు నెలలుగా తెలిసినవారందరినీ అప్పు అడుగుతున్నాడు. ఎవరూ ఇవ్వకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం ఇంట్లో దూలానికి ఉరేసుకున్నాడు. మృతుడికి తల్లిదండ్రులు, అక్క ఉన్నారు. తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గాలన్న మృతికి మాజీ మంత్రి సంతాపం

చొప్పదండి: నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ భర్త గాలన్న మృతికి మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. తెలంగాణ సాధన కోసం గాలన్న పోరాడారని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. ఇటువంటి కష్ట సమయంలో ఆ కుటుంబానికి భగవంతుడు ధైర్యం ఇవ్వాలని కోరారు.

బొగ్గు రైలు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు


గాయపడిన మహేశ్

గోదావరిఖని(రామగుండం): బొగ్గు రైలు ఢీకొని ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ఆకుల మహేశ్ గోదావరిఖని 7బీ కాలనీలో నివాసముంటూ ఓసీపీ-3 సీహెచ్‌పీలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం రాత్రి రైలు ప్రమాదానికి గురయ్యాడు. అయితే, ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా లేదా మహేశ్ ఆత్మహత్యాయత్నం చేశాడా అనే విషయం తెలియాల్సి ఉంది. అతని ఎడమ చేతికి తీవ్ర గాయాలవడంతో బంధువులు చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు.

గంజాయి విక్రేతల అరెస్టు

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన ప్రభుదయాల్, విద్యానగర్‌కు చెందిన మహేశ్‌బాబు హైదరాబాద్ నుంచి గంజాయి తీసుకువస్తూ కరీంనగర్‌లో విక్రయిస్తున్నారు. వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారు. ఈ నెల 20న సాయంత్రం పోలీసులు తనిఖీలు చేస్తుండగా వీరు కరీంనగర్‌లోని సంతోష్‌నగర్‌లో 1.100 కేజీల గంజాయి తీసుకెళ్తూ పట్టుబడ్డారు. సోమవారం ఇద్దరినీ కోర్టులో హాజరుపరిచి, జైలుకు తరలించినట్లు సీఐ వెంకటేశ్ తెలిపారు. ఆయన వెంట ఎస్సై శేఖర్, సిబ్బంది ఉన్నారు.

జీడీకే-2వ గనిలో ప్రమాదం

- మైనింగ్ సర్దార్‌కు తీవ్ర గాయాలు


గాయపడిన సమ్మిరెడ్డి

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-1 పరిధిలోని జీడీకే-2వ గనిలో ఓ మైనింగ్ సర్దార్ తీవ్రంగా గాయపడ్డాడని కార్మికులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. సోమవారం మొదటి షిఫ్టులో గనిలోని ఆరో రేస్ హాలర్ వద్ద లోడింగ్ ట్రబ్బులు జాయింట్ ఊడిపోయి, వేగంగా కిందకు వచ్చి అక్కడున్న మైనింగ్ సర్దార్ మందల సమ్మిరెడ్డిని ఢీకొట్టాయి. ఈ ప్రమాదంలో అతని కాళ్లు, చేతులు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. పక్కటెముకలు విరిగిపోయాయి. బాధితుడిని హుటాహుటిన గోదావరిఖని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ కార్పొరేట్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. కాగా, అదే ప్రాంతంలో ఉన్న మరో ఏడుగురు కార్మికులు అక్కడి నుంచి దూరంగా పారిపోయి త్రుటిలో తప్పించుకున్నారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని కార్మికులు ఆరోపిస్తున్నారు. రక్షణ అధికారులు రక్షణను విస్మరించి, ఉత్పత్తిపై దృష్టిసారిస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

అంతర్ జిల్లా నేరస్తుడిపై పీడీయాక్ట్

- చర్లపల్లి జైలుకు తరలింపు



నేరస్తుడిని జైలులో అప్పగిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

సిరిసిల్ల క్రైం: వస్తువులను చౌకగా సరఫరా చేస్తానని నమ్మబలికి, అమాయకులను మోసం చేస్తున్న అంతర్ జిల్లా నేరస్తుడిని అరెస్టు చేసినట్లు ఎల్లారెడ్డిపేట సీఐ శశిధర్‌రెడ్డి సోమవారం తెలిపారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశానుసారం అతనిపై పీడీయాక్ట్ అమలు చేసి, చర్లపల్లి జైలుకు పంపించినట్లు పేర్కొన్నారు. సీఐ వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని మల్లాపూర్‌కు చెందిన కటుకోజ్వల రమేశ్‌చారి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి, గతంలో మోసాలకు పాల్పడగా 8 కేసులు నమోదయ్యాయి. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో పీడీయాక్ట్ నమోదు చేయగా ఏడాది జైలు జీవితం గడిపాడు. విడుదలైన తర్వాత రమేశ్‌చారిలో ఎలాంటి మార్పు రాలేదు. మళ్లీ బంగారు, ఎలక్ట్రానిక్ వస్తువులను తక్కువ ధరలకు ఇస్తానంటూ అమాయకుల నుంచి రూ.కోట్లు వసూలు చేశాడు. దీంతో రాజన్నసిరిసిల్ల జిల్లాలో అతనిపై 12 కేసులు నమోదయ్యాయి.

చికిత్స పొందుతూ యువకుల మృతి


బీరయ్య (ఫైల్)


ప్రశాంత్ (ఫైల్)

చొప్పదండి: మండలంలోని చాకుంట గ్రామానికి చెందిన పెద్ది బీరయ్య(26) ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఉపేంద్రాచారి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బీరయ్య తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ పనులు చేసేవాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈ నెల 19న ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి, కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులకు బీరయ్య మనస్తాపం చెంది, ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని మండెపల్లికి చెందిన నేనర్ల ప్రశాంత్(25) చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ప్రశాంత్ సెంట్రింగ్ పనులు చేస్తూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉండేవాడు. జీవితంపై విరక్తితో గత శనివారం మధ్యాహ్నం క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం చనిపోయాడు. మృతుడికి తల్లి అరుణ, తండ్రి శంకర్, చెల్లెలు ఉన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- రూ.2 లక్షలు మాయం

జూలపల్లి(పెద్దపల్లి): మండలంలోని తెలుకుంటకు చెందిన ఓ రైతు ఇంట్లో చోరీ జరిగింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. మారం మల్లేశం సోమవారం ఉదయం గంగస్నానానికి వెళ్లాడు. అతని భార్య వ్యవసాయ పనులకు, కూతురు కాలేజీకి వెళ్లారు. కుమారుడు హైదరాబాద్‌లో ఉంటున్నాడు. మల్లేశం గంగస్నానం చేసి, మధ్యాహ్నం ఇంటికి రాగా తాళం తీసి ఉంది. లోపలికి వెళ్లగా బీరువా తాళాలు కూడా తీసి ఉన్నాయి. అనుమానం వచ్చి చూడగా అందులో దాచిన రూ.2 లక్షలు కనిపించలేదు. దొంగతనం జరిగిందని నిర్ధారించుకొని, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై వెంకటకృష్ణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చోరీ ఘటనపై ఇంటి యజమాని ఇంకా ఫిర్యాదు ఇవ్వకపోవడంతో కేసు నమోదు చేయలేదని ఆయన పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరు ..


ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఎలిగేడు(పెద్దపల్లి): మండలంలోని ర్యాకల్‌దేవుపల్లిలో 25 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరును ఆదివారం రాత్రి దుండగులు చోరీ చేశారని ఏఈ సంపత్‌కుమార్, లైన్‌మెన్ భాస్కర్ తెలిపారు. ఆ తీగ విలువ దాదాపు రూ.70 వేలు ఉంటుందన్నారు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. కాగా, గత నెలలో ర్యాకల్‌దేవుపల్లిలో రెండు, ఇప్పుడు ఒకటి, ఎలిగేడు ఫీడర్‌కు సంబంధించి ఒకటి మొత్తం 4 ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరును ఎత్తుకెళ్లారని రైతులు తెలిపారు. వరుస ఘటనలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

పత్తి ధర రూ.6,800

జమ్మికుంట(హుజూరాబాద్): స్థానిక వ్యవసాయ పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ.6,800 పలికింది. సోమవారం మార్కెట్‌కు 53 వాహనాల్లో 430 క్వింటాళ్ల పత్తిని రైతులు తీసుకువచ్చారు. క్వింటాల్‌కు మోడల్ ధర రూ.6,550, కనిష్ఠ ధర రూ.6,000కు వ్యాపారులు కొనుగోలు చేశారు. క్రయవిక్రయాలను మార్కెట్ కార్యదర్శి రెడ్డినాయక్ పర్యవేక్షించారు.



సప్తగిరి కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం



మంకమ్మతోట భక్తాంజనేయ ఆలయంలో శ్రీరాముని సైకత శిల్పం

మది నిండుగా.. రాములోరి పండుగ

- రామనామ జపంతో మార్మోగిన వీధులు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఎల్‌ఈడీ స్క్రీన్లలో రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం వీక్షణ

కరీంనగర్‌కల్చరల్/కరీంనగర్‌టౌన్/కరీంనగర్‌రూరల్: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం కరీంనగర్‌తో పాటు కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. మహిళలు ఇంటిని శుభ్రం చేసి ఐదు దీపాలు వెలిగించారు. యువకులు కాషాయ జెండాలు పట్టుకొని ద్విచక్ర వాహనాలతో ర్యాలీలు నిర్వహించారు. పలు చోట్ల ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేయడంతో అయోధ్యలోని బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని భక్తులందరూ ప్రత్యక్ష్యంగా చూశారు. మహాశక్తి ఆలయం భక్తజనంతో కిక్కిరిసిపోయింది. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు ప్రధాన ఆకర్షణగా నిలిచిన ఆకుల వెంకటేశ్ రూపొందించిన అయోధ్య రామాలయ సైకత శిల్పాన్ని చూసి ముగ్ధులయ్యారు. ఆలయ నిర్వాహకుడు, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ సైకత శిల్పం వద్ద పూజలు జరిపారు. జైరామ్ నినాదాల మధ్య ఐదు రామజ్యోతులు వెలిగించారు. తీగలగుట్టపల్లిలోని కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం, ప్రత్యేక పూజలు చేశారు.



ఐఎంఏ హాల్‌లో తిలకిస్తున్న వైద్యులు



గణేశ్‌నగర్ ప్రసన్నాంజనేయ ఆలయంలో..



మంకమ్మతోట భక్తాంజనేయ ఆలయంలో..

అయోధ్య కరసేవలో పాల్గొనడం నా అదృష్టం

అయోధ్య కరసేవలో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నానని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. సోమవారం మహాశక్తి ఆలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు అయోధ్య రామ్‌లల్లాకు స్వాగతం పలుకుదామన్నారు. ప్రపంచమంతా ఎదురుచూసే రామమందిర నిర్మాణానికి ప్రధాని మోదీ చేసిన కృషికి ప్రజలంతా ఋణపడి ఉండాలని తెలిపారు. అనంతరం వాల్మీకినగర్ వాల్మీకి ఆలయం, పాతబజార్ గౌరీ శంకరాలయం, మారుతీనగర్ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు జరిపారు. తాను చదివిన సరస్వతీ శిశుమందిర్ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. తన నివాసంలో రామ కల్యాణాన్ని జరుపుతూ ప్రత్యక్ష ప్రసారాన్ని కుటుంబ సభ్యులతో కలసి వీక్షించారు.





పాతబజార్ శివాలయంలో..



మానేరులో వివిధ వేషధారణలో విద్యార్థులు

విద్యాసంస్థల్లో ..


సప్తగిరికాలనీ(కరీంనగర్): అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం కరీంనగర్‌లోని పలు విద్యాసంస్థల్లో రామ్‌లల్లా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలను అందంగా ముస్తాబు చేశారు. శ్రీరాముడు, సీతాదేవీల విగ్రహాలకు పూజలు చేశారు. చెందిన పలువురు విద్యార్థులు శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, హనుమంతుడు తదితరుల వేశాధారణలో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వివిధ వేశాధారణలతో జై శ్రీరాం..జై శ్రీరాం అంటు ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా ఆయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని విద్యార్థులందరికీ ప్రత్యక్ష ప్రసారాన్ని చూపించారు. రామ నామ స్మరణతో పాఠశాలలు మారుమోగాయి. శ్రీరాం ఆకృతిని చేసి అలరించారు. ఈ వేడుకల్లో విద్యాసంస్థల చైర్మన్లు, డైరెక్టర్‌లు, కరస్పాండెంట్‌లు, ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



సిద్ధార్థలో..



భగవతిలో..



శ్రీరామ్ ఆకృతిలో అచీవర్స్ విద్యార్థులు



నగునూరులో టీవీలో చూస్తున్న మహిళలు



చెర్లభూత్కూర్‌లో హోమం



దుర్శేడ్‌లో ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు



జ్యోతినగర్‌లో ఎల్‌ఈడీ స్క్రీన్‌లో చూస్తున్న భక్తులు



బొమ్మకల్‌లో వేసిన రాముని ముగ్గు

క్లుప్తంగా

కర సేవకులకు సన్మానం



కరీంనగర్‌టౌన్: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మారుతీనగర్ కాపువాడలో పూజాకార్యక్రమంతో పాటు కరసేవకులు మాణిక్యరావు, రఘు, గుజ్జ శీను, కుంటల మధు, మిరియాల్‌కార్ ఆనంద్‌లను తోట అనిల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఈస్ట్ జోన్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యక్రమ నిర్వాహక అధ్యక్షుడు దర్శనాల కృష్ణ, పోరెడ్డి శ్రీధర్, గూడెం ఉమామహేశ్వర్, లక్కాకుల మునీందర్, సాగర్, తిరుమణి కరుణాకర్ పాల్గొన్నారు.

ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలి

కరీంనగర్: చిగురుమామిడి మండలం ముదిమాణిక్యం గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీని ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ అంబేడ్కర్ యువజన సంఘం, గ్రామదళితుల పక్షాన సోమవారం ఆర్డీవో మహేశ్వర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్, రమేశ్‌లు మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో 500 జనాభా ఉందని తమకు గ్రామపంచాయతీ దూరం ఉండటం వల్ల అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని, దానికి తోడు కాలనీపై అభివృద్ధి విషయంలో వివక్షత చూపుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సుధాకర్, అజయ్‌కుమార్, కొమురయ్య, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

లైబ్రేరియన్స్ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఐఈఓ

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల లైబ్రేరియన్స్ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను సోమవారం జిల్లా డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి ఆవిస్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సంఘం రాష్ట్ర నాయకుడు రవీందర్ రెడ్డి, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు శశిధర్ శర్మ, నాయకులు రామ్మోహన్, రాజ్ కుమార్, జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల లైబ్రేరియన్స్ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస కుమార్, మార్కండేయ, సిరిసిల్ల జిల్లా సంఘం అధ్యక్ష కార్యదర్శులు కిరణ్ కుమార్, సరోజ, పెద్దపల్లి జిల్లా కోశాధికారి విజయ, వెంకటలక్ష్మి, శంకర్ పాల్గొన్నారు.

జిల్లా అర్బన్ యూనిట్..

కరీంనగర్: కరీంనగర్ జిల్లా అర్బన్ యూనిట్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర అధ్యక్షుడు వీర్ల వెంకటేశ్వరరావు సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ అధ్యక్షుడు పెంచాల మురహరిరావు, ప్రధాన కార్యదర్శి లక్కాకుల సురేందర్‌రావు, గౌరవ అధ్యక్షుడు హన్మంతరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ యుగందర్‌రావు, పరుశురాం రావు, బాలకిషన్ రావు, పృథ్వీధర్‌రావు, ఆంజనేయ రావు, రామారావు, మోహన్‌రావు, మధుసూదన్‌రావులతో పాటు రాష్ట్ర నాయకులు, అర్బన్ యూనిట్ కులబాంధవులందరూ పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ

కరీంనగర్: అసోం రాష్ట్రంలో కొనసాగుతున్న భారత్ జోడో న్యాయ్‌యాత్రపై బీజేపీ నాయకులు చేసిన దాడిని ఖండిస్తూ సోమవారం కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. నగరంలోని బస్టాండ్ నుంచి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అసోంలో దేశ సమైక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన యాత్రలో పాల్గొన్న నాయకులపై కొంతమంది బీజేపీ నాయకులు దాడి చేయడాన్ని ఖండించారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో దేశ ప్రజల సంపూర్ణ మద్దతుతో వారి ఆశీస్సులతో రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, పద్మాకర్ రెడ్డి, అంజన్‌కుమార్, సమద్ నవాబ్ ,చర్ల పద్మ, ఆంజనేయులుగౌడ్, శ్రావణ్ నాయక్, అరుణ్‌కుమార్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ఉచిత విద్యతో ఉజ్వల భవిష్యత్తు

- మైనార్టీ గురుకులంలో విద్యావకాశం
- ఇంటింటికీ ఉపాధ్యాయుల ప్రచారం
- పిల్లలను చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు

కరీంనగర్‌రూరల్: మైనార్టీ గురుకుల పాఠశాలల్లో చేరాలంటూ ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. గురుకులంలోని విద్యా సౌకర్యాలను వివరిస్తూ పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం చేర్పించాలంటూ తల్లిదండ్రులను కలిసి విజ్ఞప్తి చేస్తున్నారు. ఉపాధ్యాయులు చేస్తున్న ప్రచారానికి తల్లిదండ్రులు సానుకూలంగా స్పందిస్తున్నారు. 2024–25 విద్యాసంవత్సరానికి గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఇటీవల ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే నెల ఫిబ్రవరి 6 వరకు గడువు ఉండటంతో ఉపాధ్యాయులు విస్తృతంగా ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. కరీంనగర్ జిల్లాలో బాలురకు కరీంనగర్–1, 2, 3, మానకొండూరు, హుజురాబాద్ పాఠశాలలు, బాలికలకు కరీంనగర్–1, 2, చొప్పదండి, జమ్మికుంటలో పాఠశాలలున్నాయి. పెద్దపల్లి జిల్లాలో బాలురకు రామగుండం, బాలికలకు పెద్దపల్లి, మంథనిలో పాఠశాలలున్నాయి. 5వ తరగతిలో ప్రవేశానికి మొత్తం 80 సీట్లలో మైనార్టీలకు 60, బీసీ 10, ఎస్సీ 5, ఎస్టీ 3, ఇతరులు 2 సీట్లున్నాయి. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో మొత్తం 40 సీట్లలో మైనార్టీలకు 30, బీసీ 5, ఎస్సీ 2, ఎస్టీ 2, ఇతరులకు 1 సీటుంది. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, హెచ్ఈసీ కోర్సులతో పాటు బాలురకు ప్రత్యేకంగా ఒకేషనల్ కోర్సులున్నాయి.



విద్యార్థికి కరపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

కార్పొరేట్ తరహాలో సౌకర్యాలు

కార్పొరేట్ స్కూల్ తరహాలోనే మైనార్టీ పాఠశాలల్లో ప్రభుత్వం సౌకర్యాలు కల్పించింది. విద్యార్థులందరికీ ఉచితంగా నోట్‌బుక్స్, టెక్ట్స్‌బుక్స్, యూనిఫామ్, షూస్‌తో పాటు అంతర్జాతీయ ప్రమాణాలతో ఉచిత వసతి, పౌష్టికాహారం అందిస్తోంది. విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనేందుకు ఉచితంగా గ్రూప్స్, సివిల్స్ పరీక్షలపై అవగాహన సదస్సుల నిర్వహణ, నీట్, ఐఐటీ ఫౌండేషన్, ఒలింపియాడ్, సీఏ కోచింగ్ సౌకర్యం కల్పించారు.

నాణ్యమైన విద్య

కార్పొరేట్ స్థాయికి అనుగుణంగా సాంకేతికతో విద్యాబోధన చేస్తున్నాం. ప్రస్తుతం 5వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఫిబ్రవరి 6 వరకు దరఖాస్తులకు గడువు ఉంది. తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించి ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేయాలి.

– కె.సురేశ్, ఆర్ఎల్‌సీ, కరీంనగర్

బేస్‌బాల్ క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న చల్ల హరిశంకర్

కరీంనగర్‌స్పోర్ట్స్: చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని కోర్బాలో ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు జరుగనున్న 67వ జాతీయస్థాయి పాఠశాలల అండర్–14 బేస్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులను బేస్‌బాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ సోమవారం అభినందించారు. ఎంపికైన అక్షయ్‌కార్తీక్, ఎం.రఘులు జాతీయస్థాయి పోటీల్లో సత్తాచాటి తెలంగాణ రాష్ట్రానికి, జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకోవాలని సూచించారు. రాబోయే క్రీడా క్యాలెండర్‌లో కరీంనగర్‌లో రాష్ట్ర, జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలు నిర్వహించేందుకు సన్నద్ధంగా ఉన్నట్లు తెలిపారు. క్రీడాకారులను బేస్‌బాల్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ యూనిష్ పాష, సంఘం బాధ్యులు రాంమోహన్, రమేశ్, శ్రీనివాస్, రమేశ్, మహేష్, తిరుపతి, మహేందర్ పలువురు అభినందించారు.

నేటి నుంచి జాతీయ సదస్సు

కరీంనగర్‌రూరల్: మండలంలోని నగునూరు సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో మంగళ, బుధవారాల్లో ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ అండ్ మానిటరింగ్ టెక్నిక్స్‌పై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జి.సమత తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సౌజన్యంతో రసాయన, సూక్ష్మజీవ శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో జరిగే సదస్సులో పాల్గొనే విద్యార్థులు స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ఒకరికి కరోనా

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సోమవారం ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించగా ఒకరికి కరోనా పాజిటివ్ వచ్చినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. వీరారెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 18 కేసులు నమోదు కాగా అందరూ ఆరోగ్యంగా ఉన్నారని వెల్లడించారు. రాష్ట్రంలో ఒమిక్రాన్ సబ్ వేరియంట్ జేఎన్1 విస్తరిస్తుండడంతో ప్రజలు కరోనా నిబంధనలు పాటించాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ శివారులోని ఉజ్వల పార్కు వద్ద ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మానకొండూర్ మండలం వేగురుపల్లికి చెందిన డ్రైవర్ టి.అరవింద్‌ను పట్టుకొని ఇతర వివరాలు అడుగగా పారిపోయాడు. ఈమేరకు అరవింద్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎరువుల దుకాణం తనిఖీ

చొప్పదండి: పట్టణంలోని ఎరువులు, ఫర్టిలైజర్ షాపులను ఏవో వంశీకృష్ణ సోమవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లు, కాంప్లెక్స్ ఎరువుల స్టాక్, ఈపీఓఎస్ మిషిన్లను పరిశీలించారు. కార్యక్రమంలో దుకాణ యజమానులు పాల్గొన్నారు. సైదాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం మండల వ్యవసాయాధికారి వైదేహి ఎరువుల దుకాణాలను విస్తృతంగా తనిఖీ చేశారు. రికార్డులు, ఈ పోస్ మిషన్, స్టాక్ రిజిష్టర్ గ్రౌండ్ బ్యాలన్స్ చెక్ చేశారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామపంచాయతీ పరిధిలోని రజ్వీచమాన్‌లో అర్ధాంతరంగా నిలిపివేసిన రోడ్డు పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కు సోమవారం రజ్వీచమాన్‌కాలనీ వాసులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మూడు నెలలక్రితం రజ్వీచమాన్ రోడ్డు నం.1లో సీసీరోడ్డు నిర్మాణం కోసం కంకర పోసి వదిలేశారన్నారు. రోడ్డు నిర్మించకపోవడంతో కంకరతో ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వాహనాల రాకపోకలతో ఇళ్లల్లోకి దుమ్ముధూళీ వస్తుందని అన్నారు. సగం పనులు చేసి విడిచిపెట్టిన కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు సయ్యద్ ముజాఫర్, అఫ్జల్, అంజాద్ అలీ, బద్రుద్దిన్, షాహిద్, ముస్తాక్, యూనస్, బహువొద్దిన్, అలీముద్దిన్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రజ్వీచమాన్ కాలనీవాసులు

డైరీ ఆవిష్కరణకు ఆహ్వానం

కరీంనగర్ అర్బన్: డైరీ ఆవిష్కరణకు రావాలని టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు, ఉద్యోగుల జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. సోమవారం సంఘం నేతలతో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. డైరీ ఆవిష్కరణతో పాటు ఉద్యోగుల సదస్సు ఉందని వివరించగా త్వరలోనే వస్తానని తెలిపారు. అలాగే మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కలిసి ఆహ్వానం అందించారు. ఈ కార్యక్రమాల్లో సంఘం జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, ముప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, సర్దార్ హర్మీందర్‌సింగ్, సుమంత్‌రావు, రాగి శ్రీనివాస్, రమేశ్, ప్రసాద్, పోలు కిషన్, రాజయ్య, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నంతో టీఎన్జీవో నాయకులు

రెస్ట్ హౌస్ బోర్డును యథావిధిగా ఏర్పాటు చేయాలి

కరీంనగర్: నగరానికి తలమానికంగా మారిన కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌస్‌కు బోర్డును ఎందుకు తొలగించారో? ఎవరు తొలగించారో? విషయాన్ని నగర ప్రజలకు తెలియజేయాలని మేయర్ సునీల్ రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నగరంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కరీంనగర్ పేరుతో ఎంతో ప్రతిష్టాత్మకంగా అందంగా అన్ని రకాల వసతి సౌకర్యాలతో భవనాన్ని నిర్మించామని అన్నారు. భవనం నగరానికి తలమానికంగా మారిందని, అలాంటి భవనంపై గ్రీనరీ, లైటింగ్‌తో కూడిన కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌస్ పేరుగల బోర్డును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. భవనంపై ఉన్న బోర్డును గుర్తు తెలియని వ్యక్తులు తొలగించడం బాధకరమన్నారు. కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌస్ పేరుతో ఉన్న బోర్డును తిరిగి యథావిధిగా ఏర్పాటు చేయాలని ప్రజల పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్‌హౌస్ పేరు మార్చడం సరికాదు

నగరంలోని కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్‌హౌస్ పేరు మార్చడం సరికాదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఒక ప్రకటనలో అన్నారు. ప్రభుత్వ అతిథి గృహాన్ని తొలగించి అధునాతన సౌకర్యాలతో నూతన భవనాన్ని నిర్మించి కరీంనగర్ పేరును గొప్పగా చెప్పుకునే విధంగా అతిథిగృహానికి కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్‌హౌస్ పేరు పెట్టారని తెలిపారు. రెస్ట్‌హౌస్‌పై ఉన్న పేర్లను తొలగించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించడంతో తొలగించడం సరికాదన్నారు. గెస్ట్‌హౌస్‌కి కరీంనగర్ పేరు ఉండటం మీకు ఇష్టం లేదా? కరీంనగర్‌కి గొప్ప పేరు రావడం మీకు నచ్చటం లేదా? వెల్లడించాలని డిమాండ్ చేశారు.



హైకోర్టులో ప్రత్యేక పూజలు

సాక్షి, హైదరాబాద్: అయోధ్యలో భవ్య మందిర నిర్మాణం, రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం సందర్భంగా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్(హెచ్‌సీఏఏ) ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఇందులో దాదాపు 2 వేల మంది పాల్గొన్నారని, హైకోర్టు చరిత్రలో ఇంతమందితో కార్యక్రమం జరగడం ఇదే ప్రథమమని అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కల్యాణ్‌రావు చెంగల్వ పేర్కొన్నారు. కల్యాణ్‌రావు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అడిషనల్ సొలిసిటర్ జనరల్ నరసింహ శర్మ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు సూర్యకరణ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అసోసియేషన్ కార్యదర్శి పులి దేవేందర్, బైరెడ్డి శ్రీనివాస్, పూర్ణశ్రీ, శారద, నాగులూరి కృష్ణకుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి వేలమంది

ఏపీలో సమ్మె విరమణ దిశగా అంగన్‌వాడీల అడుగులు

- ఫలిస్తున్న ప్రభుత్వ సామరస్య పూర్వక యత్నాలు
- పేదలకు పౌష్టికాహారం కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఇబ్బంది పడకుండా చర్యలు
- రాజకీయ శక్తుల చేతుల్లోకి ఉద్యమం.. 'చలో' భగ్నం



సాక్షి, అమరావతి: ఏపీ ప్రభుత్వాన్ని అభాసుపాలు చేసి రాజకీయ లబ్ధి పొందేందుకు యత్నించిన పార్టీల కబంధ హస్తాల నుంచి అంగన్‌వాడీలు బయటపడుతున్నారు. పునరాలోచనలో పడ్డ అంగన్‌వాడీలు సమ్మె బాట వీడి విధుల్లోకి చేరుతున్నారు. రెండు రోజులుగా రాష్ట్రంలో దాదాపు 32 వేల మంది అంగన్‌వాడీలు విధుల్లోకి చేరినట్లు సమాచారం. రానున్న రెండు రోజుల్లో మరింత మంది విధుల్లోకి రానుండటంతో విపక్షాల రాజకీయ క్రీడకు తెర పడనుంది. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు 42 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ఇప్పటివరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత సంయమనం పాటించింది. వారి డిమాండ్లపై సానుకూలంగా స్పందించి ఇప్పటికే మూడు దఫాలు చర్చలు జరిపింది. వారు ప్రస్తావించిన అన్ని సమస్యలను పరిష్కరించి వాటి అమలుకు చర్యలు చేపట్టింది. కేవలం ఒక్క డిమాండ్ వేతన పెంపుపై ప్రభుత్వం కొంత సమయం కోరింది.

స్పాన్సర్డ్ శిబిరాలు..

అంగన్‌వాడీల పేరుతో రాజకీయ పార్టీలకు చెందిన యూనియన్లు సమ్మె శిబిరాలను నిర్వహిస్తున్నాయి. పలు చోట్ల టీడీపీ నేతలు వీటిని స్పాన్సర్ చేస్తున్నారు. టెంట్లు, కుర్చీలు, భోజనాలు సమకూరుస్తూ కొన్ని శక్తులను ఆందోళనకు పురిగొల్పుతున్నారు. అంగన్‌వాడీల ముసుగులో అసాంఘిక శక్తులు ఉద్రిక్తతలు, హింసను ప్రేరేపించేలా అరాచకంగా వ్యవహరిస్తున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అంగన్‌వాడీల పేరుతో రాజకీయ లబ్ధి కోసం కొన్ని పార్టీలు సోమవారం 'ఛలో విజయవాడ'కు పిలుపునిచ్చాయి. శాంతి భద్రతల సమస్య సృష్టించేందుకు జరుగుతున్న కుట్రలను ముందుగానే గుర్తించిన నిఘా వర్గాలు హెచ్చరించడంతో పోలీసులు ఈ కార్యక్రమాన్ని భగ్నం చేశారు. అసాంఘిక శక్తుల ఉచ్చులో చిక్కుకుంటే ఇబ్బందులు తప్పవని అంగన్‌వాడీలకు నోటీసులు ఇచ్చారు.

ఇటు ఆహ్వానం.. అటు ప్రత్యామ్నాయం

అంగన్‌వాడీల సమస్యలపై సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తున్న ప్రభుత్వం మరోవైపు ప్రత్యామ్నాయ చర్యలపై కూడా దృష్టి సారించింది. విధుల్లో చేరిన వారిని కొనసాగిస్తూ ఇతర చోట్ల పేదలకు ఇబ్బందులు ఎదురు కాకుండా కలెక్టర్లు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. విధుల్లో చేరని చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలకు వర్కర్లు, హెల్పర్లను కొత్తగా నియమించేందుకు ఈ నెల 24, 25వ తేదీల్లో నోటిఫికేషన్లు జారీ చేసేందుకు పలు జిల్లాల కలెక్టర్లు సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. గర్భిణిలు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహార పంపిణీ, అత్యవసర సేవలకు అవరోధం లేకుండా ఈమేరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టారు.

24న బంద్‌కు పిలుపు

అంగన్‌వాడీల పేరుతో కొన్ని రాజకీయ పక్షాలు, యూనియన్లు తలపెట్టిన ఛలో విజయవాడ విఫలం కావడంతో ఈ నెల 24వతేదీన రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. అందుకు వామపక్ష పార్టీలతోపాటు టీడీపీ, జనసేన మద్దతు ఇవ్వడం గమనార్హం. బంద్‌కు అనుకూలంగా విజయవాడలో మంగళవారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సీపీఎం ప్రకటించింది. అంగన్‌వాడీలను చర్చలకు పిలిచి సమ్మె విరమణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది.

ఆ నష్టాన్ని కేసీఆర్ ఫ్యామిలీనే భరించాలి

- కేవలం కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు
- భద్రాద్రి పవర్ ప్లాంట్‌లో కేసీఆర్, జగదీశ్‌రెడ్డికి వాటా
- ప్రభాకరరావును అడ్డుపెట్టుకుని విద్యుత్ శాఖలో అవినీతికి పాల్పడ్డారు
- ఉచిత విద్యుత్ అమలు చేస్తాం.. సందేహం వద్దు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, రామగిరి(నల్లగొండ): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులో పిల్లర్లు కూలి రూ.లక్ష కోట్లు వృథా అయ్యాయని, ఆ నష్టాన్ని మాజీ సీఎం కేసీఆర్ కుటుంబమే భరించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు ప్రజలు లేఖలు రాయాలని ఆయన పిలుపునిచ్చారు. నాణ్యత లేకపోవడం వల్లే పిల్లర్లు కూలి రూ.లక్ష కోట్ల నష్టం జరిగిందన్నారు. సోమవారం నల్లగొండ కలెక్టరేట్‌లో ప్రజావాణిలో పాల్గొన్న అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టును కేవలం కమీషన్ల కోసం నిర్మించారని ఆరోపించారు. ప్రజలు కరెంట్ బిల్లులు కట్టొద్దని కేటీఆర్ అనడం సిగ్గుచేటన్నారు. ఉచిత విద్యుత్‌ను వెంటనే అమలు చేద్దామని భావించామని, కానీ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చూస్తే రూ.80 వేల కోట్ల అప్పుల్లో విద్యుత్ శాఖ ఉందన్న వాస్తవం తేలిందన్నారు. ప్రభాకర్‌రావును పెట్టుకుని అవినీతికి పాల్పడి విద్యుత్ శాఖను అప్పుల పాలు చేయడం వల్ల నేడు జీతాలు కూడా ఇచ్చే పరిస్థితిలో లేదని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్పుడు నిఖార్సయిన ఐఏఎస్ అధికారి రిజ్వీని నియమించామని, ఇప్పుడిప్పుడే విద్యుత్ శాఖ గాడిన పడుతోందని చెప్పారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అమలు చేస్తామని అందులో ఎలాంటి సందేహం లేదనీ మంత్రి భరోసానిచ్చారు.

అవినీతిపరులు జైలుకెళ్లక తప్పదు

యాదాద్రి పవర్ ప్లాంట్ రూ.29 వేల కోట్లకు డిజైన్ చేస్తే ప్రస్తుతం రూ.50 వేల కోట్లకు పెరిగిందని అది నామినేషన్ పద్ధతిన ఇచ్చి దండుకున్నారని మంత్రి కోమటిరెడ్డి ఆరోపించారు. మిషన్ భగీరథలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరుగబోతోందని, అవినీతిపరులు జైలుకు వెళ్లక తప్పదని ఆయన హెచ్చరించారు.

మూడేళ్లలో సొరంగ మార్గం పూర్తి..

మూడేళ్లలో ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గంతోపాటు బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు పనులు పూర్తి చేసి సాగునీటికి శాశ్వత పరిష్కారం చూపిస్తామని కోమటిరెడ్డి స్పష్టం చేశారు. ఎఎమ్మార్పీ ప్రధాన కాల్వ, డిస్ట్రిబ్యూటరీ లైనింగ్ కోసం రూ.500 కోట్లు మంజూరు చేయించామని, పనులు పూర్తయితే మరో 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. నాడు బీఆర్‌ఎస్ పాలనలో ప్రగతి భవన్‌కు మంత్రులు కూడా వెళ్లే అవకాశం ఉండేది కాదని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కలు దగ్గరుండి మరీ ప్రజాదర్బార్ ద్వారా సామాన్యుల నుంచి వినతులు స్వీకరిస్తున్నారని చెప్పారు. గత బీఆర్‌ఎస్ పాలనకు, ప్రస్తుత కాంగ్రెస్ పాలనకు ఇదే తేడా అని ఆయన వ్యాఖ్యానించారు.

భద్రాద్రి పవర్ ప్లాంట్‌లో రూ.10 వేల కోట్ల కుంభకోణం

భద్రాద్రి పవర్ ప్లాంట్‌లో సగం వాటా కేసీఆర్ కుటుంబానిదైతే, సగం వాటా జగదీష్‌రెడ్డిదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం తిప్పర్తి మండలం జొన్నలగడ్డ గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భద్రాద్రి పవర్ ప్లాంట్‌లో రూ.10వేల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపించారు. గతంలో విద్యుత్ శాఖ మంత్రిగా ఉన్న జగదీష్‌రెడ్డి యాదాద్రి పవర్ ప్లాంట్ అంచనా విలువను రూ.29వేల నుంచి రూ.54 వేలకు పెంచారని నిందించారు. మంత్రి పదవి చేపట్టకముందు ఏమీ లేని జగదీష్‌రెడ్డికి వందల ఎకరాల భూమి, కోట్ల రూపాయల భవనాలు ఎలా వచ్చాయో సమాధానం చెప్పాలని కోమటిరెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్‌లో కేసీఆర్ కుటుంబం, జగదీష్‌రెడ్డితో సహా సగం మంది జైలుకు పోవడం ఖాయమన్నారు. ఆరు నెలల్లో తమ ప్రభుత్వం కూలబోతుందని కేటీఆర్ కలలు కంటున్నాడని ఆయన ఎద్దేవా చేశారు.

సరికొత్తగా రైతు వేదికలు

సాక్షి, హైదరాబాద్: రైతు వేదికలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకు చాలాచోట్ల నిర్వహణాలోపంతో కునారిల్లుతున్న వాటిని కూడా రైతులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మేరకు వాటిని ఆధునీకరించేందుకు రంగం సిద్ధం చేశారు. అందులో భాగంగా ప్రతీ జిల్లాలోని కొన్ని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సేవలను తీసుకువచ్చారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 110 రైతు వేదికల్లో అందుబాటులోకి తెచ్చారు. తదుపరి విడతల వారీగా అన్ని రైతు వేదికల్లో ఈ వీడియో కాన్ఫరెన్స్ సేవలను విస్తరిస్తారు. వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులు, శాస్త్రవేత్తలు వివిధ దశల్లో రైతులతో నేరుగా మాట్లాడి సూచనలు సలహాలు ఇస్తారు. పంటలను ఆశించే చీడ పీడలను శాస్త్రవేత్తలకు వివరిస్తారు. ఉన్నతాధికారులు కూడా వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా రైతులతో సమావేశమై ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, పథకాలపై అవగాహన కల్పిస్తారు. మంత్రులు సైతం నేరుగా రైతులతో మాట్లాడుతారు. రైతులు కూడా తమ సమస్యలను నేరుగా విన్నవించుకునే అవకాశం కల్పిస్తారు.

అందుబాటులోకి వీడియో కాన్ఫరెన్స్‌లు

- తొలి విడతగా 110 వేదికల్లో
- ఆ తర్వాత అన్ని వేదికల్లోనూ ఏర్పాటు
- రైతులకు నేరుగా శాస్త్రవేత్తల సూచనలు
- రాష్ట్ర వ్యవసాయశాఖ కీలక నిర్ణయం

ఒక్కో వేదికకు రూ. 3.72లక్షలతో వీసీ సౌకర్యం

అన్నదాతలకు సాగులో సూచనలు ఇచ్చేందుకు 2,642 రైతు వేదికలను నిర్మించారు. ఒక్కో వేదిక నిర్మాణానికి రూ.22 లక్షలు వెచ్చించారు. ఇందులో రూ.12 లక్షలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించగా... మిగతా రూ.10 లక్షలు ఉపాధి హామీ పథకం నిధుల నుంచి ఇచ్చారు. మొత్తంగా అన్నింటికీ కలిపి రూ.572 కోట్లు ఖర్చు చేశారు. అయితే నిర్వహణా లోపంతో రైతు వేదికల లక్ష్యం నీరుగారిపోతుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం వీటిని మరింత ఆధునీకరించాలని నిర్ణయించింది. రైతులకు, ప్రభుత్వానికి మధ్య సంధానంగా ఇవి ఉండేలా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఒక్కో రైతు వేదికకు రూ.3.72 లక్షలు ఖర్చు చేసి వీడియో కాన్ఫరెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తోంది.

రైతు వేదికలు ఇక ప్రజావేదికలు...

రైతు వేదికలను ఇకపై ప్రజావేదికలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులందరినీ రైతు వేదికల వద్దకు పిలిపించి వారికి అవగాహన కల్పిస్తారు. ఆ మేరకు మండల అధికారులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ ఇప్పటికే స్పష్టం చేసింది. మరోవైపు రైతు వేదికల వద్ద నానో యూరియా అమ్మకాలు జరపాలని మార్క్‌ఫెడ్ నిర్ణయించింది. ఆ మేరకు అనుమతి ఇవ్వాలని కోరుతూ వ్యవసాయశాఖకు గతంలోనే ప్రతిపాదనలు పంపింది. కానీ వ్యవసాయశాఖ మాత్రం ఈ ప్రతిపాదనకు అంత సుముఖంగా లేదనీ, ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని అంటున్నారు.



దావోస్ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి సోమవారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

మంచిర్యాలటౌన్: జాతీయ హ్యాండ్ బాల్ పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారిణులు ఎంపికైనట్లు హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోనె శ్యాంసుందర్‌రావు, కనపర్తి రమేశ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు మంచిర్యాలలో సోమవారం మిఠాయిలు తినిపించి అభినందించారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు ఆసిఫాబాద్ గిరిజన క్రీడా పాఠశాలలో నిర్వహించిన 45వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు మూడోస్థానాన్ని సాధించిందని తెలిపారు. అదే జట్టు నుంచి కెరమెరికి చెందిన టి.సత్యభామ, తిర్యానికి చెందిన బి.అంజలి, జైనూర్‌కు చెందిన ఎస్.అనిత జాతీయ పోటీలకు ఎంపికయ్యారని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, ఆసిఫాబాద్ జిల్లా గిరిజన పాఠశాలల క్రీడల అధికారి మీనారెడ్డి తెలిపారు. ఈ నెల 27 నుంచి 31 వరకు బీహార్ రాష్ట్రంలోని నరేస్ పట్టణంలో జరిగే జాతీయ పోటీల్లో వీరు తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.



జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులతో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

ఢిల్లీ రిపబ్లిక్‌డే పరేడ్‌కు జిల్లా క్రీడాకారిణి

ఈ నెల 26న దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించే రిపబ్లిక్ డే పరేడ్‌కు జిల్లాకు చెందిన జాతీయ హ్యాండ్‌బాల్ క్రీడాకారిణి తుమ్రామ్ సత్యభామను ఆహ్వానించారు. ఈ ఆహ్వానంపై ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. సంఘం అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతం కెరమెరికి చెందిన సత్యభామకు ప్రధాని నుంచి ఆహ్వానం అందడం గర్వంగా ఉందన్నారు. క్రీడాకారిణిని హ్యాండ్‌బాల్ కోచ్ సునార్కర్ అరవింద్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్, కోశాధికారి అలుగువెల్లి రమేశ్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు.

గుంజాలకు 'మెస్రం' పాదయాత్ర



పాదయాత్రగా గుంజాలకు చేరుకున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: నాగోబా మహాపూజకు అవసరమయ్యే గంగాజలం సేకరణ కోసం ఆదివారం కేస్లాపూర్ నుంచి బయల్దేరిన మెస్రం వంశీయులు రాత్రి కేస్లాగూడ పొలిమేరలో బస చేశారు. తమ గ్రామానికి ఝురి(కలశం)రావడంతో గ్రామస్తులు ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి పాదయాత్ర సాయంత్రం వరకు నార్నూర్ మండలం గుంజాలకు చేరుకున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు. కార్యక్రమంలో మెస్రం వంశీయులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవోగా ఖుష్బూ గుప్తా

బోథ్: ఉట్నూర్ ఐటీడీఏ పీవోగా ఉన్న చాహత్ బాజ్‌పాయ్ ఆరు నెలల పాటు మెటర్నిటీ సెలవుపై వెళ్లారు. ఈ మేరకు ఆదిలాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఖుష్బూ గుప్తాకు ఐటీడీఏ పీవోగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఈమె బోథ్ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కూడా వ్యవహరించనున్నారు.

కడెం కాలువకు నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న రైతులు

కడెం: కడెం ప్రాజెక్ట్ కుడి కాలువకు సోమవారం నీటిని విడుదల చేశారు. ప్రాజెక్ట్‌లో నీటిమట్టం లేనందున యాసంగికి సాగు నీటిని విడుదల చేయడం లేదని నీటి పారుదల శాఖ అధికారులు గతంలోనే తెలిపారు. అయితే పశువుల తాగు నీటి అవసరాల నిమిత్తం కొండుకూర్ గ్రామ రైతులు ఉన్న కొద్దిపాటి నీటిని విడుదల చేసుకున్నట్లు ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు.

జాతీయస్థాయి సెమినార్‌లో రిమ్స్ పీజీ విద్యార్థి ప్రతిభ

ఆదిలాబాద్‌టౌన్: 45వ జాతీయస్థాయి ఫోరెన్సిక్ మెడిసిన్ కాన్ఫరెన్స్‌లో రిమ్స్ పీజీ విద్యార్థి ప్రతిభ కనబర్చింది. ఈనెల 18 నుంచి 20 వరకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో సెమినార్ నిర్వహించారు. ఇందులో డాక్టర్ మేజర్ కారుణ్య పాల్గొని ద్వితీయ ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కారుణ్యతో పాటు ఫోరెన్సిక్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ డాక్టర్ కరుణాకర్‌ను రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ సోమవారం సన్మానించి అభినందించారు. జాతీయస్థాయిలో ఆదిలాబాద్ రిమ్స్‌కు గుర్తింపు రావడంపై హర్షం వ్యక్తం చేశారు.



అవార్డు అందుకున్న డాక్టర్ కారుణ్య

రూ.పదివేలకు పౌరసత్వం

- ఇష్టానుసారంగా గుర్తింపుకార్డులు సృష్టించిన సత్తార్ ముఠా
- పాస్‌పోర్టుల డెలివరీలపై సీఐడీ గురి
- వెరిఫికేషన్ అనంతరం ఎక్కడ తీసుకున్నారని ఆరా
- 92 పాస్‌పోర్టుల్లో చిరునామాలో ఉండని మెజారిటీ వ్యక్తులు
- వారంతా పోస్టాఫీసుల్లోనే పాస్‌పోర్టులు తీసుకున్నారని అనుమానం
- వివరాల కోసం 'పీఎం యాప్'ను పరిశీలించనున్న సీఐడీ అధికారులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: పదివేల రూపాయలకు పౌరసత్వం ఏంటి అనుకుంటున్నారా? వినడానికి వింతగా ఉన్నా.. ఇది చేదు వాస్తవం. జగిత్యాల జిల్లా కోరుట్లలో వెలుగుచూసిన పాస్‌పోర్టుల స్కాంలో వెలుగుచూసిన వాస్తవం ఇది. విదేశీయులకు మనదేశంలో గుర్తింపు కార్డులకు ఒక రేటు, పాస్‌పోర్టులకు మరో రేటు నిర్ణయించి మరీ విక్రయించిన తీరు పోలీసులను విస్మయానికి గురిచేస్తోంది. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించడంలో ఆరితేరిన ముఠా.. ఆధార్, పాన్, ఎస్సెస్సీ, డ్రైవింగ్ లైసెన్స్ తదితరాలు సృష్టించి వారికి పాస్‌పోర్టు దరఖాస్తు చేశారు. వీరిలో బంగ్లాదేశ్, రోహింగ్యాలు కూడా ఉన్నారు. వీరంతా చూసేందుకు భారతీయుల్లానే ఉంటారు. చట్టప్రకారం.. వీరంతా పౌరసత్వం పొందేందుకు అనేక ప్రక్రియలు ఉంటాయి. కానీ, సత్తార్ ముఠాకి ఇవేమీ అక్కర్లేదు. రూ.పదివేలిస్తే.. పౌరసత్వం ఇచ్చే ధ్రువీకరణపత్రాలు, విద్యార్హతలు, ఇంకాస్త ఖర్చు పెడితే.. ఏకంగా పాస్‌పోర్టులు, వీసాలు ఇప్పించి వీడుకోలు పలికారు.

పోస్టాఫీసుల్లోనే డెలివరీ..

స్థానికేతరులు, విదేశీయులకు పాస్‌పోర్టులను పప్పుబెల్లాల్లా పంచిపెట్టిన సత్తార్ ముఠా అక్రమాలు సీఐడీ దర్యాప్తులో ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఫేక్ డాక్యుమెంట్లతో దాదాపు 92 పాస్‌పోర్టులను సంపాదించిన ముఠా.. వారందరినీ గుట్టుగా దేశం దాటించింది. అయితే, ఈ 92 పాస్‌పోర్టులు ఎక్కడ డెలివరీ అయ్యాయన్న విషయంపై సీఐడీ ఆరా తీయడం ప్రారంభించింది. భారత పౌరులు, అన్ని పత్రాలు సక్రమంగా ఉన్న వారంతా పోలీసు విచారణ అనంతరం పాస్‌పోర్ట్‌ను ఇంటి వద్దనే తీసుకుంటారు. కానీ, ఇక్కడ అనుమానిత 92 పాస్‌పోర్టుల్లో వ్యక్తుల్లో అత్యధికం ఇంటివద్ద కాకుండా బయట లేదా పోస్టాఫీసుల్లో డెలివరీ తీసుకున్నట్లుగా సీఐడీ అధికారులు అనుమానిస్తున్నారు. ఎందుకంటే సత్తార్ ముఠాను ఆశ్రయించిన వారంతా విద్యార్హతలు లేనివారు, స్థానికేతరులు, విదేశీయులు. వీరు స్థానికంగా నివాసముండరు. స్పెషల్ బ్రాంచ్ పోలీసులు, పోస్టుమ్యాన్‌లు ఇంటిదాకా వస్తే గుట్టు బయటపడే ప్రమాదాలున్నాయి.

'పీఎం యాప్'లో డెలివరీ యాప్ వివరాలు..!

పాస్‌పోర్టు ఆఫీసులో పత్రాల సమర్పణ అనంతరం ఎస్‌బీ అధికారుల విచారణ అనివార్యం. ఆ సమయంలో ఇంటి వద్ద ఉండాలని, ఫలానా రోజున విచారణ ఉంటుందని పాస్‌పోర్టు దరఖాస్తులో ఉన్న నెంబరుకు ఎస్.ఎం.ఎస్ వస్తుంది. ఇది వచ్చిన వెంటనే సత్తార్ ముఠా అప్రమత్తమవుతుంది. ముందుగానే కొందరు ఎస్బీ పోలీసులను మేనేజ్ చేసుకుని ఉండటంతో విచారణ తూతూ మంత్రంగా సాగింది. అనంతరం పాస్‌పోర్టు డెలివరీ సమయంలోనూ పోస్ట్‌మాన్ రూపంలో మరో గండం ఉంది. ఆ గండాన్ని కూడా తెలివిగా దాటారు. పోస్టాఫీసు నుంచి డిస్పాచ్ మెసేజ్ రాగానే అలర్టవుతారు. పోస్ట్‌మాన్ పాస్‌పోర్టు డెలివరీ చేసేందుకు వచ్చినపుడు తాము అందుబాటులో లేమని ఫోన్‌లో చెప్పి, మరునాడు పోస్టాఫీసుకు వెళ్లి తీసుకున్నారని సమాచారం. సాధారణంగా డెలివరీ సమయంలో పాస్‌పోర్టు పొందిన వారి నుంచి పోస్టుమ్యాన్లు సంతకాలు తీసుకుంటారు. అదే సమయంలో పోస్టుమ్యాన్ల వద్ద 'పోస్ట్‌మేన్' అనే యాప్ ఉంటుంది. అందులో ఎవరి పాస్‌పోర్టు, ఎక్కడ డెలివరీ చేశారో వివరాలు నమోదు చేస్తారు. డెలివరీ సమయంలో ఏ ప్రాంతంలో ఉన్నారో తెలిపేలా జియోగ్రాఫికల్ వివరాలు కూడా యాప్‌లో నమోదవుతాయి. ఈ లెక్కన అనుమానితులు ఎవరెవరు? ఎక్కడ పాస్‌పోర్టు డెలివరీ తీసుకున్నారు? అన్న విషయాలు స్పష్టంగా సీఐడీకి తెలిసిపోతాయని పోస్టల్ ఉద్యోగులు స్పష్టంచేస్తున్నారు.

మార్క్‌ఫెడ్ పాలకవర్గం రద్దు..?

- ఏటా రెండుసార్లు సమావేశం కావాల్సిన పాలకవర్గం
- 2020 నుంచి ఒక్కసారైనా సమావేశం కాని వైనం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న మార్క్‌ఫెడ్ పాలకవర్గాన్ని రద్దు చేయాలన్న డిమాండ్లు పెరిగిపోతున్నాయి. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నంతకాలం ఈ విషయంపై ఎలాంటి అభ్యంతరాలూ వ్యక్తం కానప్పటికీ.. ప్రభుత్వం మారగానే పాలకవర్గానికి వ్యతిరేక గళాలు పెరుగుతున్నాయి. వాస్తవానికి మార్క్‌ఫెడ్‌లో 13 మంది సభ్యులతో కూడిన పాలకవర్గం (దీనిని ఎంసీ కమిటీ /మెంబర్స్ కమిటీ/డైరెక్టర్స్ అని కూడా పిలుస్తారు) 2020 మార్చి 11న కొలువుదీరింది. అప్పటి నుంచి ఇంతవరకూ ఒకసారి కూడా పాలకవర్గం సమావేశం (జెనరల్ బాడీ సమావేశం) నిర్వహించలేదు. నిబంధనల ప్రకారం.. ఏడాదిలో రెండుసార్లు (ఆర్నెల్లకోసారి లేదా 12నెలలోపు రెండుసార్లు) సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. ఒకవేళ నిర్వహించకపోతే.. మార్క్‌ఫెడ్ నిబంధనల ప్రకారం.. 32 (1)ఏ సబ్ సెక్షన్ (1) ప్రకారం.. 12 నెలలు పూర్తయిన మరునాడే ఆ పాలకవర్గం చట్టరీత్యా రద్దు కావాలి. కానీ అలా జరగలేదు. నాలుగేళ్లు గడుస్తున్నా.. ఇంతవరకూ ఎలాంటి సమావేశం నిర్వహించలేదని స్వయంగా మార్క్‌ఫెడ్ అంగీకరించడం గమనార్హం.

ఆర్టీఐతో వెలుగులోకి..!

మార్క్‌ఫెడ్‌లో సభ్యుడైన మనువాడ ప్యాక్స్ చైర్మన్ వి.దుర్గారెడ్డి సింగిల్ విండో చైర్మన్ ఈ పాలకవర్గం కొనసాగడంపై ఇటీవల అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినా మార్క్‌ఫెడ్ జనరల్ అలాగే కొనసాగుతుండటాన్ని సవాల్ చేస్తూ ఆర్టీఐ కింద దరఖాస్తు చేశారు. ఇంతవరకూ జనరల్ బాడీ ఎన్నిసార్లు సమావేశం నిర్వహించారని తన దరఖాస్తులో ప్రశ్నించారు. దీనికి మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు స్పందించి 2020 మార్చి 11 నుంచి 05-12-2023 వరకు ఎలాంటి జనరల్ బాడీ సమావేశం నిర్వహించలేదని స్పష్టంచేసింది. దీంతో దుర్గారెడ్డి ఈ జనరల్ బాడీని వెంటనే రద్దు చేయాలని సహకారశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, రిజిస్ట్రార్ ఆఫ్ కోపరేటివ్ ఆఫ్ హైదరాబాద్, మార్క్‌ఫెడ్ సంస్థ ఎండీ లీగల్ నోటీసులు పంపానని 'సాక్షి'కి వెల్లడించారు. అయినా ఇప్పటివరకూ బాడీని రద్దు చేయకుండా తాత్సారం చేస్తున్నారని దుర్గారెడ్డి ఆరోపిస్తున్నారు. విషయాన్ని ఇప్పటికే మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబుకు వివరించానని, త్వరలోనే సీఎం దృష్టికి సైతం తీసుకుపోతానని తెలిపారు. పాలకవర్గం విషయంపై వివరణ కోరేందుకు మార్క్‌ఫెడ్ జీఎం, ఆర్సీఎస్‌ను సంప్రదించేందుకు 'సాక్షి' ప్రయత్నించినా వారు అందుబాటులోకి రాలేదు.

'శ్రీరాముడు మానవాళికి ఆదర్శనీయుడు'



రాముని జపం చేస్తున్న భక్తులు

కరీంనగర్‌టౌన్: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని సోమవారం ఉదయం కరీంనగర్ ప్రశాంత్‌నగర్ కాలనీలోని ప్రసన్నాంజనేయ దేవస్థానం ఆవరణలో ఎల్‌ఈడీ స్క్రీన్‌పై వీక్షించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు పొల్సాని సుగుణాకర్‌రావు మాట్లాడుతూ.. శ్రీరాముడు ప్రపంచ మానవాళికి ఆదర్శనీయుడని కొనియాడారు. పితృవాక్య, ప్రజా సంక్షేమ పాలన, ఆదర్శమైన జీవన విధానం, ఒకే మాట ఒకే బాణం లాంటి అనేక ప్రత్యేకతలు ఆయన సొంతమన్నారు. అలాంటి రాముడు పుట్టిన స్థలంలో భవ్య రామమందిర నిర్మాణం సంతోషకరమని పేర్కొన్నారు. ఆలయ అర్చకుడు మురళీధరాచార్యులు, నాయకులు కన్నబోయిన ఓదెలు, గంప జగన్, దుర్గం మారుతి భక్తులు పాల్గొన్నారు.

మానసికం

అతిగా ఆలోచన ఆనందానికి శత్రువు



'నేను చేసింది తప్పేమో'
'నేను చేసిన పని వల్ల ఇలా అవుతుందేమో'
'వాళ్లు అలా చేస్తే ఏం చేయాలి?'
'నా పరువు పోతుందేమో'...
చిన్న చిన్న కారణాలకు కూడా ఎంతో ఆలోచిస్తూ బాధ పడుతూ ఉంటారు కొందరు.
దీనిని 'ఓవర్‌థింకింగ్' అంటారు మానసిక నిపుణులు.
'ఇలాంటివారిని ఒకచోట చేర్చి ఆలోచనలు పంచుకుంటే ధైర్యం వస్తుంది' అంటుంది వర్షా విజయన్.
ఈమె మొదలు పెట్టిన 'ఓవర్‌థింకర్స్ క్లబ్' ఇలాంటి క్లబ్‌ల అవసరాన్ని తెలియచేస్తోంది.

'ఓ మీరూ అంతేనా?' అంది ఒక మహిళ ఆ పార్క్‌కు వచ్చిన మరో మహిళతో.

తిరువనంతపురానికి చెందిన 27 ఏళ్ల వర్షా విజయన్ 'ఓవర్‌థింకర్స్ క్లబ్'ను ప్రారంభించింది. ఇదేదో ఒక భవంతో, క్లినిక్కో కాదు. పార్కులో కొంతమంది కలవడమే. సోషల్ మీడియా ద్వారా ఈ క్లబ్ గురించి ఆమె ప్రచారం చేసింది. 'ప్రతి దానికీ తీవ్రంగా ఆలోచించే మనం ఈ ఆలోచనల నుంచి బయటపడదాం రండి' అనే ఆమె పిలుపునకు స్పందించిన స్త్రీ, పురుషులు రకరకాల వయసుల వాళ్లు వారానికి ఒకసారో నెలలో రెండుసార్లు కలవసాగారు.

'జీవితంలో మార్పులు సహజం. కాని జరగబోయే మార్పు గురించి చదువు, ఉద్యోగం, వివాహం, విడాకులు, పిల్లల ఆరోగ్యం లేదా తల్లిదండ్రుల చివరి రోజులు... వీటి గురించి రోజుల తరబడి ఆలోచిస్తూ ఉంటారు కొందరు. ఆ ఆలోచనలు పాజిటివ్ వైపు కాకుండా నెగెటివ్ వైపుగా వెళ్లడంతో ఆందోళన చెందుతుంటారు. దాని వల్ల డిప్రెషన్ వస్తుంది. అన్నింటికీ మించి ఏ నిర్ణయమూ జరక్క ఏ పనీ ముందుకు కదలదు. వర్తమానంలో ఉండే ఆనందాన్ని అనుభవించక ఎప్పుడో ఏదో నష్టం జరుగుతుందేమోనన్న ఆందోళనతో బాధ పడుతుంటారు ఓవర్‌థింకర్లు' అంటుంది వర్షా విజయన్.

ఆలోచన.. అతి ఆలోచన

'ఆలోచన మంచిదే. కాని అతి ఆలోచన మంచిది కాదు' అంటుంది వర్షా విజయన్. ఓవర్‌థింకర్ల క్లబ్‌కు హాజరైన వారు ఒకరి మాటల్లో మరొకరు తెలుసుకునే విషయం ఏమిటంటే తమ చేతుల్లో లేని వాటి గురించి కూడా అధికంగా ఆలోచించడం. ఉదాహరణకు ఎప్పుడో పెట్టుకున్న శుభకార్యం రోజు వాన పడితే... వాన పడితే... వాన పడితే అని ఆలోచించడం. వానను ఆపడం మన చేతుల్లో లేదు. పడితే పడుతుంది... లేకపోతే లేదు. పడినప్పుడు అందుకు తగ్గ సర్దుబాట్లతో పనులు అవసరం అవుతాయి. అలా అనుకుని వదిలేయాలి గాని అదే పనిగా ఆలోచించడం ఆరోగ్యం కాదు. దాని వల్ల ఇవాళ్టి ఆనందాలు మిస్ అవుతాయి.

ఓవర్‌థింకర్ల లక్షణాలు

- ఆత్మవిమర్శ అధికంగా చేయడం
- ఒక పని పూర్తిగా లోపరహితంగా చేయాలనుకోవడం (పర్‌ఫెక్షనిజం)
- జరిగిపోయిన ఘటనలు, మాటలు తలచుకుని వాటిలో ఏమైనా తప్పులు జరిగాయా, పొరపాట్లు జరిగాయా, వాటి పర్యవసానాలు ఏమిటి అని తల మునకలు కావడం
- ప్రయాణాల్లో ప్రమాదాలు ఊహించడం
- శుభకార్యాలప్పుడు అవి సరిగ్గా జరుగుతాయో లేదోనని ఆందోళన చెందడం
- చిన్న చిన్న సమస్యలకు కూడా పెద్ద పర్యవసానాలు ఊహించడం
- ఎవరికీ చెప్పుకోక ఆ ఆందోళనల్లోనే రోజుల తరబడి ఉండటం.



ధ్యాస మళ్లించాలి

ఓవర్‌థింకర్లు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్ల మెరుగ్గా ఉండొచ్చు అంటుంది వర్షా విజయన్ ● అతిగా ఆలోచించే చాలా విషయాలు పడే భయాలు దాదాపుగా నిజం కావు. పిల్లల్ని స్కూల్ బస్ ఎక్కించాక దానికి ప్రమాదం జరిగితే.. ప్రమాదం జరిగితే అని ఆలోచించడం మంచిది కాదు. అలా లక్షసార్లలో ఒకసారి జరుగుతుంది. ఆ ఒకసారి గురించి అతి ఆలోచన చేయకూడదు ● ఎక్కువ ఆత్మవిమర్శ చేసుకోకుండా ఏదో ఉన్నంతలో బెస్ట్ చేద్దాం... చేశాం అని ముందుకెళ్లాలి. ఏదో ఒక మేరకు సంతృప్తి చెంది పని జరిగేలా చూడాలి ● ఆలోచనలు శ్రుతి మించుతుంటే స్నేహితులతో మాట్లాడాలి. చెప్పుకోవాలి. కొత్త పనులేవైనా నేర్చుకుని ధ్యాస మళ్లించాలి ● సోషల్ మీడియాలో పనికిమాలిన పరిజ్ఞానం, వీడియోలు తగ్గించాలి ● ఈ క్షణంలో ఉండటం ప్రాక్టీస్ చేయాలి. అందుకు యోగా ఉపయోగపడుతుంది ● అన్ని మనం అనుకున్నట్టుగా జరగవు అనే వాస్తవాన్ని యాక్సెప్ట్ చేయాలి. సమస్య ఎదురైనప్పుడు చూసుకుందాంలే అనుకుని ధైర్యంగా ఉండాలి.

వినూత్నం

నాట్య వెన్నెల

వెన్నెలకు పరిమితులు ఉండవు. ధనిక, పేద, దివ్యాంగులు అనే తేడాలుండవు. 'నృత్యం కూడా వెన్నెలలాంటిదే. అది అందరి కోసం. అందరిదీ' అంటున్న మెథిల్ దేవిక బధిరుల కోసం కొత్త నృత్యశైలిని సృష్టించింది. నాట్యంలో మూడు దశాబ్దాల అనుభవం ఉన్న కేరళకు చెందిన దేవిక డ్యాన్స్ రిసెర్చ్ స్కాలర్, ఎడ్యుకేటర్, కొరియోగ్రాఫర్‌గా పేరు తెచ్చుకుంది. సైన్‌లాంగ్వేజ్ నేర్చుకుంది. హస్తముద్రలను, సైన్‌లాంగ్వేజ్‌తో మిళితం చేసి 'క్రాస్ ఓవర్' నృత్యానికి రూపకల్పన చేసింది.



గత నెల తిరువనంతపురంలో దేవిక ఇచ్చిన శాస్త్రీయ నృత్యప్రదర్శనను ప్రేక్షకుల గ్యాలరీలో కూర్చున్న బధిరులు ఆనందంగా ఆస్వాదించారు. ఒకసారి నృత్యప్రదర్శన ఇవ్వడానికి గుజరాత్‌కు వెళ్లిన దేవిక అక్కడ బధిరుల బృందాన్ని చూసింది. నృత్యం చూడాలనే ఆసక్తి వారిలో ఉన్నా సంపూర్ణంగా ఆస్వాదించగలరా? నృత్యం ద్వారా చెప్పే కథను వారు అర్థం చేసుకోగలరా? వారికి సులభంగా అర్థం కావాలంటే ఏంచేయాలి... ఇలాంటి విషయాలు ఎన్నో ఆలోచించింది దేవిక.

దేవిక సందేహించినట్లుగానే వారు తన నృత్యప్రదర్శనతో కనెక్ట్ కాలేదు. అర్థం కానట్లు ముఖం పెట్టారు. ఇక అప్పటి నుంచి 'డ్యాన్స్ ఫిలాంత్రపి అండ్ సోషల్ ఇన్‌క్లూజన్' ప్రాజెక్ట్‌పై దృష్టి పెట్టింది. డ్యాన్స్ వొకాబ్యులరీని అభివృద్ధి చేయడానికి ఎంతోమందితో మాట్లాడింది. 'నృత్యకారులకు తమతో తాము సంభాషించుకునే, తమలో ఊహాలోకాన్ని ఆవిష్కరించుకునే ఏకాంతంలో కొత్త ఆలోచనలు వస్తుంటాయి. నృత్యప్రదర్శనలు లేని ఖాళీ సమయంలో బధిరులను దృష్టిలో పెట్టుకొని మనసులోనే డ్యాన్స్‌ను కంపోజ్ చేశాను. ఊహల్లోని నృత్యానికి వాస్తవరూపం ఇవ్వడానికి సైన్ లాంగ్వేజ్ నేర్చుకున్నాను' అంటుంది దేవిక.

కేరళలోని పాలక్కాడ్‌లో కళాకారుల కుటుంబంలో పుట్టింది దేవిక. నాలుగేళ్ల వయసులోనే కాలికి గజ్జె కట్టింది. 20 సంవత్సరాల వయసులో సోలో పెర్‌ఫార్మెన్స్ ఇచ్చింది. కూచిపూడి నృత్యంలో మాస్టర్స్ డిగ్రీ చేసింది. 'కేరళ కళామండపం'లో విద్యార్థులకు నాట్య పాఠాలు బోధించింది. టీవీ డ్యాన్స్ షోలకు జడ్జిగా వ్యవహరించింది. 'నృత్యానికి పరిమితులు ఉన్నప్పుడు దాని ఉద్దేశం నెరవేరదు. అది సంపన్న కళాప్రియులకే కాదు అందరికీ చేరువ కావాలి' అంటున్న దేవిక తన నృత్యప్రదర్శన సామాన్యులకు చేరువ చేయడానికి ప్రయత్నిస్తోంది.

తిరువనంతపురం డ్యాన్స్ షోలో బధిరులు తన హస్తముద్రలను అనుకరించడం దేవికకు సంతోషం ఇచ్చింది. 'అదొక గొప్ప అనుభవం. వారి కళ్లు ఆనందంతో వెలిగిపోయాయి. ఎన్నో సంస్కృతులు, ఎన్నో భాషలకు చెందిన ప్రేక్షకుల ముందు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రదర్శనలు ఇచ్చాను. ఆ సంతోషాన్ని మించిన సంతోషం ఇది. నా నృత్యం వారి హృదయానికి దగ్గరైంది. నా ఉద్దేశం నెరవేరింది' అంటోంది దేవిక.

'నృత్యాన్ని ప్రజాస్వామీకరించాలి. అది అందరికీ చేరువ కావాలి' అంటున్న దేవిక తన ప్రాజెక్ట్ ద్వారా మరిన్ని ప్రదర్శనలు ఇవ్వాలనుకుంటోంది. మనం ఒక ప్రయోగానికి సిద్ధపడినప్పుడు కంఫర్ట్ జోన్ నుంచి బయటకు రావాలి. దేవిక అలాగే చేసింది. ధైర్యంగా ముందు అడుగు వేసింది. బధిరులలో ఎంతోమందికి నృత్యం నేర్చుకోవాలనే ఆసక్తి ఉండవచ్చు. అయితే ప్రతికూల ఆలోచనలు వారిని వెనక్కి లాగవచ్చు. అలాంటి వారిని నృత్యకారులుగా తయారుచేయడానికి దేవిక సృష్టించిన నృత్యశైలి ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది అనడంలో సందేహం లేదు.

బాదంకూ ఉంది ఓ రోజు!



బాదంపప్పుల ప్రయోజనాల ప్రాముఖ్యతను తెలియజేయడానికి ప్రతి యేటా జనవరి 23న 'నేషనల్ ఆల్మండ్ డే' ని జరుపుకుంటారు. ఈ సందర్భంగా నలభై ఏళ్లుగా వెల్‌నెస్ అండ్ న్యూట్రిషన్ కన్సల్టెంట్ అయిన షీలా కృష్ణస్వామి రోజువారీ ఆహారంలో బాదంపప్పును చేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేస్తున్నారు.

★ ప్రతిరోజూ పది బాదం పప్పులు తినడం వల్ల శరీరానికి కావల్సిన విటమిన్ ఇ, మెగ్నీషియం, ప్రొటీన్, జింక్.. వంటి 15 ముఖ్యమైన పోషకాలు అందుతాయి ★ రోజూ కొన్ని బాదంపప్పులు తింటే ఆహారం తక్కువ తీసుకున్నా పొట్ట, బ్రెయిన్ సంతృప్తితో నిండిన భావన కలుగుతుంది. అంటే, బాదంపప్పులు బరువును బ్యాలెన్స్ చేయడంలో సహాయపడతాయి ★ బాదంపప్పులను రోజూ తీసుకుంటే చెడు కొలెస్ట్రాల్ తగ్గి, గుండెకు హాని కలిగించే సమస్యల నుంచి విముక్తి లభిస్తుంది ★ బాదంపప్పులో కాల్షియం ఎక్కువగా ఉంటుంది. ఎముకలు, దంతాలు, కండరాల పనితీరు నిర్వహణకు తోడ్పడుతుంది.

సాగుబడి

శ్రవణ కార్తె: జనవరి 24 నుంచి

- రెండేళ్ల క్రితం తొలుత అండుకొర్ర విత్తిన రైతు హేమాద్రిరెడ్డి
- పంట కోత తర్వాత తిరిగి దుక్కి చేసి నీరు పెడితే చాలు.. విత్తనాలు వేయకుండానే రాలిన విత్తనాలే తిరిగి మొలుస్తున్న వైనం..
- కోతకు సిద్ధంగా నాలుగో పంట.. ఎకరానికి ప్రతి పంటలోనూ పది క్వింటాళ్ల దిగుబడి
- 5 ఎకరాలతో అండుకొర్ర సాగు ప్రారంభించి 20 ఎకరాలకు విస్తరించిన రైతు

ఒక్కసారి విత్తితే.. నాలుగు పంటలు!

అండుకొర్ర.. చిన్న చిరుధాన్యా(స్మాల్ మిల్లెట్స్)ల్లో విశిష్టమైన పంట. పంట కాలం 90–100 రోజులు. ధాన్యపు పంట ఏదైనా కోత కోసి, దుక్కి చేసిన తర్వాత మళ్లీ పంట రావాలంటే తిరిగి విత్తనాలు ఎదపెట్టాల్సిందేనని మనకు తెలుసు. అయితే, అండుకొర్ర పంటను రెండేళ్లుగా సాగు చేస్తున్న కర్నూలు జిల్లా కోడుమూరుకు చెందిన కె. హేమాద్రిరెడ్డి అనుభవం అందుకు భిన్నంగా ఉంది.

2022 జూలైలో తొలిసారి 5 ఎకరాల్లో అండుకొర్ర విత్తనం వేసి, అక్టోబర్‌లో పంట కోసుకున్నారు. నవంబర్‌లో దుక్కిచేసి మినుము చల్లి, నీటి తడి పెట్టారు. అండుకొర్ర వత్తుగా మొలవటంతో ఆశ్చర్యం కలిగింది. అండుకొర్ర కోత కోసే సమయంలో రాలిన ధాన్యమే నెల రోజుల తర్వాత దుక్కి చేసి తడి పెట్టగానే మొలిచిందన్నమాట. మినుము మొలకలు కనిపించినా అవి ఎదగలేకపోయాయి. అండుకొర్ర ఏపుగా పెరిగింది. సరే.. ఇదే పంట ఉండనిద్దామని నిర్ణయించుకొని.. ట్రాక్టర్‌తో సాళ్లు తీసి అండుకొర్ర పంటనే కొనసాగించారు. అదే విధంగా మూడు పంటలు పూర్తయ్యాయి. నాలుగో పంట ఇప్పుడు కోతకు సిద్ధంగా ఉందని, ప్రతి పంటలోనూ ఎకరానికి 10 క్వింటాళ్ల అండుకొర్ర దిగుబడి వస్తోందని, పంట పంటకు దిగుబడి ఏమాత్రం తగ్గలేదని, తక్కువ ఖర్చుతోనే అండుకొర్ర పంట అధికాదాయాన్ని అందిస్తోందని రైతు హేమాద్రి రెడ్డి సంతోషంగా చెప్పారు. అనంతపురంలో ఇటీవల జరిగిన మూడు రోజుల చిరుధాన్యాల సమ్మేళనం ప్రారంభోత్సవానికి హాజరైన ఆయన 'సాక్షి సాగుబడి'తో తన ఆనందాన్ని పంచుకున్నారు. కదిరికి చెందిన ఎర్త్ 360 సంస్థ వ్యవస్థాపకులు దినేశ్ సూచనలు, సహాలతో చిరుధాన్యాల సాగు చేపట్టానని ఆయన తెలిపారు.


అండుకొర్ర పొలంలో హేమాద్రిరెడ్డి

కలుపు బాధ లేని అండుకొర్ర పంట

40 ఎకరాల ఆసామి అయిన హేమాద్రిరెడ్డి సాగు భూమిని చాలా కాలంగా కౌలుకు ఇస్తూ వచ్చారు. రెండేళ్ల క్రితం మనుమడి సూచన మేరకు 5 ఎకరాల్లో అండుకొర్ర చిరుధాన్యాల సాగు ప్రారంభించారు. కూలీల కొరతతో ఇబ్బంది అవుతుందని తొలుత సంశయించానని, అయితే అండుకొర్ర పంటకు కలుపు సమస్య లేకపోవటంతో హాయిగా ఊపిరి పీల్చుకున్నానని ఆయన అన్నారు. పెద్దగా ప్రయాస పడాల్సిన అవసరం లేని చక్కని పంట అండుకొర్ర అన్నారాయన. కలుపు మొక్కల కన్నా అండుకొర్ర మొక్కలు వేగంగా పెరుగుతుంది. అందువల్ల కలుపు పెరిగే అవకాశమే లేదన్నారు. దీంతో ప్రయాస లేకుండానే పంట చేతికి వస్తోందని, యంత్రంతో కోతలు జరుపుతున్నారు. ఇప్పుడు మొత్తం 20 ఎకరాలకు అండుకొర్ర సాగును విస్తరించారు.

మోళ్లు కలియదున్నుతాం..

దుక్కి చేసిన తర్వాత గొర్రెలను పొలంలో నిల్వగడతారు. గొర్రెల మలమూత్రాలు పొలాన్ని సారవంతం చేస్తాయి. ఆ తర్వాత కలియదున్నిన తర్వాత వరుసల మధ్య 15 అంగుళాలు ఉండే ట్రాక్టర్ గొర్రుతో ఎకరానికి 5 కిలోల అండుకొర్ర విత్తనాలను తొలి ఏడాది విత్తారు. రెండో పంట నుంచి.. పంట కోత తర్వాత మోళ్లను రొటవేటర్‌తో భూమిలో కలియదున్నుతున్నారు. పంట కాలంలో మూడు దఫాలు హంద్రీ నది నుంచి మోటారుతో తోడిన నీటిని పారగడుతున్నారు. నల్లరేగడి నేల కావటంతో ఎక్కువగా తడి ఇవ్వటం లేదని, ఇది మెట్ట పంట కాబట్టి నీరు ఎక్కువ పెడితే రొట్ట పెరుగుతుంది తప్ప దిగుబడి రాదని హేమాద్రి రెడ్డి వివరించారు. గొర్రెలు ఆపటానికి ఎకరానికి రూ. 1,500 ఖర్చవుతోంది. దుక్కి, అంతర సేద్యం అంతా సొంత ట్రాక్టర్‌తోనే చేస్తున్నారు. బయటి ట్రాక్టర్‌తో ఈ పనులు చేస్తే ఎకరానికి పంటకు రూ. 3 వేలు ఖర్చు వస్తుంది.

'అంతకు మించి చేసేదేమీ లేదు. చీడపీడలు, తెగుళ్ల సమస్య లేదు కాబట్టి పురుగుమందుల పిచికారీ అవసరం రావటం లేద'న్నారాయన. కలుపు, చీడపీడల సమస్యలు లేని, కూలీల అవసరం పెద్దగా లేని అండుకొర్ర పంటను సునాయాసంగా సాగు చేస్తూ.. క్వింటాకు రూ. 9,500 ఆదాయం పొందుతున్నానని హేమాద్రిరెడ్డి తెలిపారు. మిషన్‌తో పంట కోత ఖర్చు, గడ్డి అమ్మితే సరిపోతోందన్నారు. కొర్ర కూడా సాగు చేస్తున్నానని, వచ్చే సీజన్ నుంచి అరికలు కూడా వేద్దామనుకుంటున్నానన్నారు.

అండుకొర్ర అద్భుత పంట



అద్భుతమైన చిరుధాన్య పంట అండుకొర్ర.. కలుపును ఎదగనివ్వదు. ఈ విత్తనానికి నిద్రావస్థ పెద్దగా ఉండదు. గింజ బాగా తయారైన తర్వాత కోత కోసి నూర్పిడి చేస్తే, వారం రోజుల తర్వాత మొలుస్తుంది. ఒక్కసారి విత్తి వరుసగా నాలుగో పంట తీసుకుంటున్న హేమాద్రి రెడ్డి సాగు అనుభవం రైతులకు స్ఫూర్తిదాయకంగా ఉంది. పంట కోసిన తర్వాత మోళ్లను భూమిలోకి కలియదున్నటం, గొర్రెలను నిలపటం వల్ల భూమి సారవంతమవుతోంది. మార్కెట్‌లో అండుకొర్రలు సహా అన్ని చిరుధాన్యాలకు ఇప్పుడు మంచి గిరాకీ ఉంది. ధర తగ్గే ప్రమాదం లేదు.

– **దినేశ్** (94408 70875),
చిరుధాన్యాల నిపుణుడు, ఎర్త్ 360, కదిరి

క్వింటా రూ.9,500

రెండేళ్ల క్రితం తొలిసారి 5 ఎకరాల్లో అండుకొర్ర విత్తినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతి పంటా ఎకరానికి పది క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. తొలి పంట క్వింటా రూ. 5 వేలకు అమ్మాను. రెండో పంటను క్వింటా రూ.7,500కు అమ్మాను. గత ఏడాది ఖరీఫ్‌లో మరో 15 ఎకరాల్లో కూడా అండుకొర్ర వేశా. మూడో పంటను క్వింటా రూ. 9,500కు అమ్మాను. నాలుగో పంట కొద్ది రోజుల్లో కోతకు సిద్ధమవుతోంది. రైతులకు విత్తనంగా కూడా ఇస్తున్నాను. ఎకరానికి రూ. 20 వేలు ఖర్చులు పోగా మంచి నికరాదాయం వస్తోంది. 3 సార్లు నీరు కడుతున్నాం. నీరు ఎక్కువైతే దిగుబడి తగ్గిపోతుంది. ఒక పొలంలో జనుము సాగు చేసి రొటవేటర్ వేస్తే ఆ తర్వాత అండుకొర్ర దిగుబడి ఎకరాకు 15 క్వింటాళ్ల వరకు వచ్చింది. ప్రయాస లేని పంట అండుకొర్ర

– **కె. హేమాద్రిరెడ్డి** (93469 22110),
అండుకొర్ర రైతు, కోడుమూరు, కర్నూలు జిల్లా

'చిరు' యంత్రాల ఫౌండేషన్!





టేబుల్ టాప్ హల్లర్

దేశంలోనే తొలి 'స్మాల్ మిల్లెట్ టేబుల్ టాప్ ఇంపాక్ట్ హల్లర్ వి3' ఇది. చిన్న చిరుధాన్యాల పైపొట్టు తీసి బియ్యం తయారు చేసుకోవడానికి ఉపయోగపడే చిన్న యంత్రం ఇది. బరువు 30 కిలోలు. ముప్పావు మీటరు ఎత్తు, అర మీటరు పొడవు, అర మీటరు వెడల్పు ఉంటుంది. ఇంట్లో చిన్న టేబుల్ మీద పెట్టుకొని వాడుకోవచ్చు. మహిళలు, పిల్లలు సైతం ఉపయోగించడానికి అనువైనది. ఎక్కడికైనా సులువుగా తీసుకెళ్లవచ్చు. అతి తక్కువ 0.5 హెచ్ పి విద్యుత్తుతో పనిచేస్తుంది. సింగిల్ ఫేజ్ విద్యుత్తు లేదా సౌర విద్యుత్తు లేదా పెట్రోలు మోటారుతోనూ నడుస్తుంది. 90% సామర్థ్యంతో పనిచేస్తుంది. ఒకసారి మర పడితే 10% మెరికలు వస్తాయి. రెండోసారి మళ్లీ మరపడితే వంద శాతం బియ్యం సిద్ధమవుతాయి. చిరుధాన్యం రకాన్ని బట్టి గంటకు 30 నుంచి 80 కిలోల ధాన్యాన్ని మర పట్టొచ్చు. ఏ రకం చిన్న చిరుధాన్యాన్నయినా ఈ యంత్రానికి ఎటువంటి మార్పులు చేయాల్సిన అవసరం లేకుండానే మర పట్టుకోవచ్చు. అర కేజీ ధాన్యం ఉన్నా సరే దీన్ని ఉపయోగించవచ్చు. తక్కువ శబ్దం చేస్తుంది. 2 గంటల తర్వాత ఓ గంట విరామం ఇవ్వాలి. దీని ధర రూ. 88 వేలు (18% జీఎస్టీ అదనం).


కొర్రలు, అండుకొర్రలు, సామలు, ఊదలు, అరికెలు వంటి చిన్న చిరుధాన్యాల (స్మాల్ మిల్లెట్స్) ధాన్యాన్ని వండుకొని తినాలంటే పైపొట్టు తీసి బియ్యం తయారు చేసుకోవాల్సి ఉంటుంది. పూర్వం దంపుకొని చిరుధాన్యాల బియ్యం తయారు చేసుకునే వారు. ఇది చాలా శ్రమతో కూడిన పని.

కొన్ని సంవత్సరాలుగా మిక్సీలను ఉపయోగించి ఇంటి స్థాయిలో మిల్లెట్ బియ్యం తయారు చేసుకోవటం ప్రారంభమైంది. అయితే, మిక్సీకి ఉన్న పరిమితుల దృష్ట్యా వాణిజ్య దృష్టితో చిన్న చిరుధాన్యాల బియ్యం ఉత్పత్తి చేయదలచిన రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సహకార సంఘాలు, మహిళా స్వయం సహాయక బృందాలు, చిన్న వ్యాపారులు యంత్రాలను ఆశ్రయించక తప్పట్లేదు. యంత్రాల ధర అందుబాటులో లేని పరిస్థితుల్లో చిన్న చిరుధాన్యాల ప్రాసెసింగ్ పెద్ద సంస్థలు, కంపెనీలకే పరిమితం అవుతూ వచ్చింది. ఇది గ్రామాల్లో పేద రైతులు, మహిళా బృందాలు, చిన్న వ్యాపారులకు ఈ ప్రక్రియ పెద్ద సవాలుగా నిలిచింది.

ఈ సవాలును అధిగమించడానికి ఇంటి స్థాయిలో, గ్రామస్థాయిలో మహిళలు, పిల్లలు సైతం ఉపయోగించడానికి అనువైన అనేక చిన్న యంత్రాల రూపుకల్పనలో అనేక ఏళ్లుగా విశేష కృషి చేస్తున్న తమిళనాడుకు చెందిన స్మాల్ మిల్లెట్ ఫౌండేషన్ (డెవలప్‌మెంట్ ఆఫ్ హ్యూమన్ యాక్షన్ – ధాన్ – ఫౌండేషన్ అనుబంధ సంస్థ) విజయం సాధించింది. ఈ సంస్థ రూపొందించిన చిన్న యంత్రాల్లో ఒకటి.. దేశంలోనే తొలి 'టేబుల్ టాప్ డీహల్లర్ మిషన్'. కొర్రలు, అండుకొర్రలు, సామలు, ఊదలు, అరికెలు వంటి ఏ రకం చిరుధాన్యాలతోనైనా, అర కిలో అయినా సరే, ఈ యంత్రంతో బియ్యం తయారు చేసుకోవచ్చు. ఇటువంటివే మరికొన్ని చిన్న యంత్రాలను ఈ ఫౌండేషన్ రూపొందించింది. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి వచ్చిన మేలైన సాగు, శుద్ధి, విలువ జోడింపు పద్ధతులు, యంత్రాలపై నీతి ఆయోగ్ 'మిల్లెట్ సంకలనం'ను న్యూఢిల్లీలో ఇటీవల విడుదల చేసింది. స్మాల్ మిల్లెట్ ఫౌండేషన్ ప్రజలు, శాస్త్రవేత్తలు, రైతులు అవసరాల మేరకు తయారు చేసి అందుబాటులోకి తెచ్చిన చిన్న యంత్రాలను ప్రశంసిస్తూ ఒక కథనం ప్రచురించటం విశేషం. నీతి ఆయోగ్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ నీలం పటేల్ తదితరులు ఈ సంకలనానికి సంపాదకులుగా వ్యవహరించారు.

పోర్టబుల్ ఇంపాక్ట్ హల్లర్





టేబుల్ టాప్ హల్లర్ కన్నా కొంచెం పెద్దది స్మాల్ మిల్లెట్ పోర్టబుల్ ఇంపాక్ట్ హల్లర్ (ఎస్.ఎం.ఎఫ్. వి2). ఇది గంటకు 100 నుంచి 500 కిలోల చిన్న చిరుధాన్యాలను ప్రాసెస్ చేస్తుంది. 1 హెచ్‌పి మోటారుతో త్రీఫేస్ విద్యుత్తుతో పనిచేస్తుంది. బరువు 98 కిలోలు. మీటరు పొడవు, మీటరు ఎత్తు, ముప్పావు మీటరు వెడల్పు ఉంటుంది. ఎక్కువ గంటల పాటు వాడొచ్చు. మహిళలు సైతం సురక్షితంగా, సులువుగా వాడటానికి అనువైనది. ఎస్.ఎం.ఎఫ్. వి2 ధర రూ. 1,68,000. (18% జీఎస్టీ అదనం). ఈ యంత్రాలపై ఆసక్తి గల వారు తమిళనాడులోని కృష్ణగిరి కేంద్రంగా పనిచేస్తున్న స్మాల్ మిల్లెట్ ఫౌండేషన్ (ఎస్.ఎం.ఎఫ్.) సాంకేతిక విభాగం ఇన్‌చార్జ్ శరవణన్‌ను 86675 66368 నంబరులో ఇంగ్లిష్ లేదా తమిళంలో సంప్రదించవచ్చు.

11న దేశీ గోవ్యాధులపై సదస్సు

ఫిబ్రవరి 11(ఆదివారం) న ఉ. 7 గం. నుంచి సా. 4 గం. వరకు గుంటూరు జిల్లా కొర్నెపాడులోని రైతునేస్తం ఫౌండేషన్ ఆవరణలో దేశీ గో–జాతుల వ్యాధులు, ఇతర సమస్యలపై రాష్ట్ర స్థాయి సదస్సు, ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వేంకటేశ్వరరావు తెలిపారు. దేశీ ఆవుల ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలపై గో పోషకులకు అవగాహన కల్పిస్తారు. గోవులకు ఉచిత వైద్య శిబిరంతోపాటు ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అందరూ ఆహ్వానితులే. ప్రవేశం ఉచితం. **వివరాలకు** 97053 83666.



ఇండోనేసియా మాస్టర్స్ టోర్నీకి సాత్విక్ జోడీ దూరం

జకార్తాలో నేటి నుంచి జరిగే ఇండోనేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ నుంచి సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ వైదొలిగింది. ఈ టోర్నీలో సాత్విక్-చిరాగ్‌లకు టాప్ సీడింగ్ దక్కింది. ఈ నెలలో ఆడిన రెండు టోర్నీల్లోనూ (మలేసియా ఓపెన్, ఇండియా ఓపెన్) సాత్విక్-చిరాగ్ జంట రన్నరప్‌గా నిలిచింది. ఇండోనేసియా ఓపెన్‌లో పురుషుల సింగిల్స్ విభాగంలో భారత అగ్రశ్రేణి ఆటగాళ్లు ప్రణయ్, శ్రీకాంత్, లక్ష్య సేన్, ప్రియాన్షు రజావత్ బరిలో ఉన్నారు.

విజయమే లక్ష్యంగా సిరియాతో బరిలోకి...

ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నీలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిన భారత జట్టు నేడు జరిగే గ్రూప్ 'బి' చివరి లీగ్ మ్యాచ్‌లో సిరియా జట్టుతో ఆడుతుంది. సాయంత్రం 5 గంటలకు మొదలయ్యే ఈ మ్యాచ్‌ను జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. నాకౌట్ దశకు అర్హత సాధించాలంటే సునీల్ ఛెత్రి నాయకత్వంలోని భారత జట్టు ఈ మ్యాచ్‌లో సిరియాపై తప్పనిసరిగా నెగ్గాలి. ఇతర గ్రూప్‌ల ఫలితాలు కూడా తమకు అనుకూలించాలని ఆశించాలి.



ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీకి హుసాముద్దీన్




న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ బాక్సింగ్ తొలి క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత పురుషుల, మహిళల జట్లను ప్రకటించారు. ఈ టోర్నీ ఫిబ్రవరి 29 నుంచి మార్చి 12 వరకు ఇటలీలో జరుగుతుంది. తెలంగాణ బాక్సర్ హుసాముద్దీన్ 57 కేజీల విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తాడు. 29 ఏళ్ల హుసాముద్దీన్ గత ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాన్ని సాధించాడు. 2018, 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో, 2022 ఆసియా చాంపియన్‌షిప్ లోనూ కాంస్య పతకాలను సొంతం చేసుకున్నాడు.

భారత పురుషుల జట్టు: దీపక్ (51 కేజీలు), హుసాముద్దీన్ (57 కేజీలు), శివ థాపా (63.5 కేజీలు), నిశాంత్ దేవ్ (71 కేజీలు), లక్ష్య చహర్ (80 కేజీలు), సంజీత్ (92 కేజీలు), నరేందర్ (ప్లస్ 92 కేజీలు). **మహిళల జట్టు:** జాస్మిన్ (60 కేజీలు), అంకుశిత బోరో (66 కేజీలు).

తొలి రెండు టెస్టులకు కోహ్లి దూరం

వ్యక్తిగత కారణాలతో వైదొలిగిన భారత స్టార్ క్రికెటర్



న్యూఢిల్లీ: తెలుగు క్రికెట్ అభిమానులకు ఇది కచ్చితంగా నిరాశపరిచే వార్తే! భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి హైదరాబాద్, విశాఖపట్నంలలో ఇంగ్లండ్ జట్టుతో జరిగే తొలి రెండు టెస్టు మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. వ్యక్తిగత కారణాలతోనే ఈ టాపార్డర్ బ్యాటర్ తప్పుకున్నట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తెలిపింది. భారత పర్యటన కోసం ఇంగ్లండ్ ఆటగాళ్లు ఆదివారమే హైదరాబాద్ చేరుకున్నారు. ఈ టూర్‌లో బెన్ స్టోక్స్ బృందం ఐదు టెస్టుల ద్వైపాక్షిక సిరీస్‌లో పాల్గొంటుంది. ఈ నెల 25 నుంచి ఉప్పల్ స్టేడియంలో తొలి టెస్టును, ఫిబ్రవరి 2 నుంచి విశాఖపట్నంలోని వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో రెండో టెస్టును ఆడుతుంది. సీనియర్ స్టార్లంతా ఉంటారని తెలుగు ప్రేక్షకులు టికెట్లు కొనుగోలు చేశారు. అయితే అనూహ్యంగా కోహ్లి ఈ రెండు మ్యాచ్‌లకు గైర్హాజరు కానున్నాడు. 'కోహ్లి కోరిక మేరకే ఆడటం లేదు. ఈ మేరకు బోర్డుతో ముందుగానే అనుమతి తీసుకున్నాడు. కెప్టెన్ రోహిత్ శర్మతో ఈ విషయమై మాట్లాడాడు. టీమ్ మేనేజ్‌మెంట్‌తోనూ కోహ్లి చర్చించాడు. అతను లేకపోవడం జట్టుకు ఇబ్బందికరమే అయితే వ్యక్తిగత కారణాల వల్లే దూరమవుతున్నాడు' అని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు. అతని నిర్ణయాన్ని బీసీసీఐ గౌరవిస్తుందని, అతనికి మద్దతుగా నిలుస్తుందని జై షా చెప్పారు. అఫ్గానిస్తాన్‌తో ఇటీవల జరిగిన టి20 సిరీస్‌లోనూ కోహ్లి తొలి మ్యాచ్‌కు దూరంగా ఉన్నాడు. దక్షిణాఫ్రికా పర్యటనలోనూ భారత్ అంతర్గత జట్ల మధ్య జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్ నుంచి విశ్రాంతి తీసుకొని లండన్ వెళ్లొచ్చాడు. టెస్టులకు సంబంధించి 2021లో విరాట్ కోహ్లి ఆస్ట్రేలియా పర్యటనలో తొలి టెస్టు ఆడి తర్వాతి మూడు టెస్టులకు గైర్హాజరయ్యాడు. తన భార్య, బాలీవుడ్ నటి అనుష్క శర్మ ప్రసవం కోసం అతను స్వదేశానికి వచ్చాడు. తాజా ఇంగ్లండ్ సిరీస్ కోసం కోహ్లి స్థానాన్ని రజత్ పటిదార్, సర్ఫరాజ్ ఖాన్‌లలో ఒకరితో భర్తీ చేసే అవకాశముంది.

అల్‌కరాజ్ అలవోకగా...

- తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన స్పెయిన్ స్టార్
- మెద్వెదెవ్, జ్వెరెవ్ కూడా ముందుకు



అల్‌కరాజ్

మెల్‌బోర్న్: గత ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు దూరంగా ఉన్న ప్రపంచ రెండో ర్యాంకర్ కార్లోస్ అల్‌కరాజ్ ఈ ఏడాది మాత్రం జోరు మీదున్నాడు. మరో అలవోక విజయంతో ఈ స్పెయిన్ స్టార్ తొలిసారి ఈ టోర్నీలో క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో 20 ఏళ్ల అల్‌కరాజ్ 6-4, 6-4, 6-0తో మియోమిర్ కెచ్‌మనోవిచ్ (సెర్బియా)పై గెలిచాడు. గంటా 49 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో అల్‌కరాజ్ ఐదు ఏస్‌లు సంధించాడు. 43 విన్నర్స్ కొట్టిన ఈ మాజీ నంబర్‌వన్ 19 అనవసర తప్పిదాలు చేశాడు. ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసిన అల్‌కరాజ్ తన సర్వీస్‌లో మాత్రం ఒక్కసారి కూడా బ్రేక్ పాయింట్ అవకాశం ఇవ్వలేదు. క్వార్టర్ ఫైనల్లో ఆరో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)తో అల్‌కరాజ్ తలపడతాడు. హోరాహోరీగా సాగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో జ్వెరెవ్ 4 గంటల 5 నిమిషాల్లో 7-5, 3-6, 6-3, 4-6, 7-6 (10/3)తో 19వ సీడ్ కామెరాన్ నోరీ (బ్రిటన్)ను ఓడించి ఊపిరి పీల్చుకున్నాడు. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో మూడో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) 6-3, 7-6 (7/4), 5-7, 6-1తో నునో బోర్జెస్ (పోర్చుగల్)పై, తొమ్మిదో సీడ్ హుర్కాజ్ (పోలాండ్) 7-6 (8/6), 7-6 (7/3), 6-4తో ఆర్థర్ కాజుక్స్ (ఫ్రాన్స్)పై గెలిచి క్వార్టర్ ఫైనల్లో అమీతుమీకి సిద్ధమయ్యారు.

దయానా సంచలనం

మహిళల సింగిల్స్ విభాగంలో ప్రపంచ 93వ ర్యాంకర్, క్వాలిఫయర్ దయానా యాస్‌ట్రిమ్‌స్కా సంచలన విజయంతో తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. కెరీర్‌లో 16వసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆడుతున్న ఈ ఉక్రెయిన్ క్రీడాకారిణి ప్రిక్వార్టర్ ఫైనల్లో 7-6 (8/6), 6-4తో రెండుసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్, ప్రపంచ మాజీ నంబర్‌వన్, 18వ సీడ్ అజరెంకా (బెలారస్)ను బోల్తా కొట్టించింది. లిండా నొస్కోవా (చెక్ రిపబ్లిక్), అనా కలిన్‌స్కాయ (రష్యా) కూడా తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ చేరగా... చైనా అమ్మాయి, 12వ సీడ్ కిన్‌వెన్ జెంగ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తొలిసారి క్వార్టర్ ఫైనల్ బెర్త్ దక్కించుకుంది. నొస్కోవా 3-0తో ఆధిక్యంలో ఉన్నప్పుడు ఆమె ప్రత్యర్థి స్వితోలినా (ఉక్రెయిన్) గాయంతో వైదొలిగింది. కిన్‌వెన్ జెంగ్ 6-0, 6-3తో ఒసీన్ డోడిన్ (ఫ్రాన్స్)పై, కలిన్‌స్కాయ 6-4, 6-2తో జాస్మిన్ పావోలిని (ఇటలీ)పై విజయం సాధించారు.

టైటాన్స్‌కు 13వ ఓటమి

సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో తెలుగు టైటాన్స్ ఖాతాలో 13వ పరాజయం చేరింది. హరియాణా స్టీలర్స్‌తో సోమవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 30-37తో ఓడిపోయింది. టైటాన్స్ తరఫున సంజీవి, ప్రఫుల్ 6 పాయింట్ల చొప్పున స్కోరు చేశారు. మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 42-25తో బెంగాల్ వారియర్స్‌పై గెలిచింది.

పాయింట్ల పట్టిక (PKL)

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
జైపూర్ పింక్ పాంథర్స్	15	11	2	2	63
పుణేరి పల్టన్	13	11	2	0	57
దబంగ్ ఢిల్లీ	14	8	4	2	49
గుజరాత్ జెయింట్స్	14	8	6	0	44
హరియాణా స్టీలర్స్	14	8	5	1	44
బెంగాల్ వారియర్స్	14	6	6	2	38
యు ముంబా	13	6	6	1	37
పట్నా పైరేట్స్	14	6	7	1	37
బెంగళూరు బుల్స్	15	6	9	0	37
తమిళ్ తలైవాస్	14	5	9	0	30
యూపీ యోధాస్	15	3	11	1	23
తెలుగు టైటాన్స్	15	2	13	0	16

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

ఐసీసీ టి20 జట్టు కెప్టెన్‌గా సూర్యకుమార్



దుబాయ్: భారత స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ 2023 సంవత్సరానికి ఐసీసీ టి20 టీమ్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. 2023 క్యాలెండర్ ఇయర్‌లో టి20 ఫార్మాట్‌లో కనబరిచిన ప్రదర్శన ఆధారంగా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) జట్టును ఎంపిక చేయగా... ఇందులో మరో ముగ్గురు భారత ఆటగాళ్లు చోటు దక్కించుకోవడం విశేషం. ఓపెనర్ యశస్వి జైస్వాల్, స్పిన్నర్ రవి బిష్ణోయ్, లెఫ్టార్మ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌లు ఐసీసీ టి20 టీమ్‌లో ఉన్నారు. గతేడాది సూర్య టి20 ఫార్మాట్‌లో అసాధారణ ఫామ్‌లో ఉన్నాడు. 18 మ్యాచ్‌లు ఆడిన అతను 2 సెంచరీలు, 4 అర్ధ సెంచరీలతో కలిపి మొత్తం 733 పరుగులు చేశాడు. ఐసీసీ మహిళల టి20 జట్టులో భారత్ నుంచి ఒక్క దీప్తి శర్మకే చోటుదక్కింది.

ఆంధ్ర ఘన విజయం

- రాణించిన లలిత్ మోహన్, మనీశ్



లలిత్

దిబ్రూగఢ్: రంజీ ట్రోఫీ తాజా సీజన్‌లో ఆంధ్ర జట్టు తొలి విజయాన్ని అందుకుంది. అస్సాం జట్టుతో జరిగిన ఎలైట్ గ్రూప్ 'బి' మూడో మ్యాచ్‌లో రికీ భుయ్ నాయకత్వంలోని ఆంధ్ర జట్టు 172 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. 363 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన అస్సాం జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 48.2 ఓవర్లలో 190 పరుగులకు ఆలౌటైంది. చివరిరోజు ఓవర్‌నైట్ స్కోరు 81/5తో ఆట కొనసాగించిన అస్సాం మరో 101 పరుగులు జోడించి మిగతా ఐదు వికెట్లను కోల్పోయింది. ఆంధ్ర బౌలర్లు లలిత్ మోహన్ (4/81), గిరినాథ్ రెడ్డి (3/57), గొలమరు మనీశ్ (3/19) అస్సాం జట్టును కట్టడి చేశారు. బెంగాల్‌తో జరిగిన తొలి మ్యాచ్‌ను 'డ్రా' చేసుకున్న ఆంధ్ర జట్టు రెండో మ్యాచ్‌లో ముంబై చేతిలో ఓడిపోయింది. ఈనెల 26 నుంచి జరిగే నాలుగో మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్‌తో ఆంధ్ర ఆడుతుంది.

గిల్‌కు బీసీసీఐ అవార్డు



సాక్షి, హైదరాబాద్: ఓపెనర్ శుబ్‌మన్ గిల్‌ను బీసీసీఐ 2023 సంవత్సరానికి 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డుకు ఎంపిక చేసింది. గిల్ గతేడాది వన్డేల్లో విశేషంగా రాణించి ఐదు సెంచరీలు చేయడంతోపాటు వేగంగా 2000 పరుగుల్ని పూర్తి చేసిన భారత బ్యాటర్‌గా నిలిచాడు. మరోవైపు మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి సేవలకు గుర్తింపుగా ఆయనకు 'లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్' అవార్డును అందజేయనుంది.

భారత జట్టుకు క్లిష్టమైన డ్రా

లుసానే: ఈ ఏడాది జూలై-ఆగస్టులలో జరిగే పారిస్ ఒలింపిక్స్‌కు సంబంధించిన హాకీ ఈవెంట్ 'డ్రా'ను సోమవారం తీశారు. భారత పురుషుల జట్టుకు క్లిష్టమైన 'డ్రా' ఎదురైంది. ప్రస్తుత ఒలింపిక్ చాంపియన్, ప్రపంచ రెండో ర్యాంకర్ బెల్జియం, రియో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అర్జెంటీనా, ప్రపంచ మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఐర్లాండ్‌లతో కలిసి భారత్‌కు పూల్ 'బి'లో చోటు కల్పించారు. పూల్ 'ఎ'లో నెదర్లాండ్స్, జర్మనీ, బ్రిటన్, స్పెయిన్, ఫ్రాన్స్, దక్షిణాఫ్రికా జట్లు ఉన్నాయి.

క్వార్టర్ ఫైనల్లో బోపన్న జోడీ



పురుషుల డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న (భారత్)-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో రెండో సీడ్ బోపన్న-ఎబ్డెన్ ద్వయం 7-6 (10/8), 7-6 (7/4)తో కూలాఫ్ (నెదర్లాండ్స్)-మెక్‌టిక్ (క్రొయేషియా) జంటను ఓడించింది. బుధవారం జరిగే క్వార్టర్ ఫైనల్లో మోల్టెని-మాక్సిమో గొంజాలెజ్ (అర్జెంటీనా) ద్వయంతో బోపన్న-ఎబ్డెన్ జోడీ తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే 43 ఏళ్ల బోపన్న ఈనెల 29న విడుదలయ్యే ఏటీపీ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో తొలిసారి నంబర్‌వన్ ర్యాంక్‌కు చేరుకుంటాడు.

సినిమా

ఓ సినిమా ప్రేక్షకులకు కనెక్ట్ అయితే ఆ కథకు సీక్వెల్ తీసే పనిలో ఉంటారు. అయితే కొనసాగించాలంటే కథలో స్కోప్ ఉండాలి. ఫైగా 'అసలు కథ ఇప్పుడే మొదలైంది' అన్నట్లుగా ఉండాలి. అలా కొన్ని చిత్రాలకు స్కోప్ దొరికింది. 'అసలు కథ ఇప్పుడే మొదలైంది' అన్నట్లు తొలి భాగం చివర్లో ట్విస్ట్ ఇచ్చి, మలి భాగం రూపొందించే పనిలో ఉన్నారు. ఈ ఏడాది అరడజనుకు ఫైగా సీక్వెల్ చిత్రాలు రానున్నాయి. ఈ రెండు భాగాల చిత్రాల గురించి తెలుసుకుందాం...

అసలు కథ ఇప్పుడే మొదలైంది!



స్వాతంత్య్రం రాక ముందు...

సేనాపతి వీరశేఖరన్, అతని కొడుకు చంద్రబోస్ సేనాపతిల కథలను 'ఇండియన్' (1996) సినిమాలో చూశాం. ఈ రెండు పాత్రల్లోనూ కమల్‌హాసన్ నటించారు. శంకర్ దర్శకత్వం వహించారు. పాతికేళ్ల తర్వాత 'ఇండియన్'కు సీక్వెల్‌గా కమల్‌హాసన్, శంకర్ కాంబినేషన్‌లోనే 'ఇండియన్ 2' రూపొందుతోంది. ఇందులోనూ కమల్‌ది ద్విపాత్రాభినయం. ఈ చిత్రంలో సేనాపతికి, అతని తండ్రికి మధ్య జరిగే కథను చూపిస్తారట శంకర్. అంటే.. కథ దేశ స్వాతంత్య్రానికి పూర్వం ఉంటుందని తెలుస్తోంది. అలాగే ప్రస్తుత కాలాన్ని కూడా కనెక్ట్ చేశారట. 'ఇండియన్ 2' ఏప్రిల్‌లో విడుదల కానుందని తెలిసింది.



మిత్రులే శత్రువులు

ఎంతోమంది జీవితాలను మార్చిన ఖాన్సార్ ('సలార్' చిత్రం కోసం క్రియేట్ చేసిన ప్రాంతం) ఇద్దరు మిత్రులు దేవరథ, వరదరాజ మన్నార్‌లను మాత్రం శత్రువులుగా చేసింది. మరి... ఈ మిత్రులు ఎందుకు శత్రువులు కావాల్సి వచ్చిందనే కథను 'సలార్' మలి భాగం 'సలార్: శౌర్యాంగ పర్వం'లో చూడాలంటున్నారు ఈ చిత్ర దర్శకుడు ప్రశాంత్ నీల్. ప్రభాస్ హీరోగా దేవరథ పాత్రలో నటిస్తుండగా, దేవ మిత్రుడు వరదరాజ మన్నార్‌గా పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నారు. విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్న 'సలార్: శౌర్యాంగపర్వం' చిత్రం ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ప్రారంభంలో రిలీజయ్యే చాన్స్ ఉంది. ఇక హీరో ప్రభాస్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లోని 'సలార్'లోని తొలి భాగం 'సలార్: సీజ్‌ఫైర్' బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'సలార్: శౌర్యాంగ పర్వం' రానుంది.

గృహిణి, యూట్యూబర్ అనుపమా మోహన్‌గా 'భామా కలాపం'లో మెప్పించారు ప్రియమణి. డైరెక్ట్‌గా ఓటీటీలో విడుదలైన ఈ సినిమాకు వ్యూయర్స్ నుంచి మంచి స్పందన లభించింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'భామాకలాపం 2'ను రెడీ చేస్తున్నారు. బాపినీడు, సుధీర్ ఈదర నిర్మిస్తున్న ఈ సినిమాకు అభిమన్యు దర్శకుడు. అలాగే అంజలి నటించిన తొలి ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ 'గీతాంజలి'. రాజ్‌కిరణ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం 2014లో విడుదలై, మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'గీతాంజలి మళ్ళీ వచ్చింది' తెరకెక్కుతోంది. రచయిత, నిర్మాత కోన వెంకట్ సమర్పణలో ఎంవీవీ సత్యనారాయణ, జీవీ నిర్మిస్తున్న ఈ సీక్వెల్‌కు శివ తుర్లపాటి దర్శకుడు. అలాగే అనుష్కా శెట్టి హిట్ ఫిల్మ్ 'భాగమతి'కు సీక్వెల్‌గా 'భాగమతి 2' తెరకెక్కనుంది.



పుష్పగాడి రూల్

'పుష్ప' సినిమాలో సిండికేట్ రూల్స్‌ను దాటి హెడ్ అయ్యాడు పుష్పరాజ్. మరి.. సిండికేట్ మెంబర్స్‌కు పుష్పరాజ్ ఎలాంటి రూల్స్ పాస్ చేశాడు? ఈ రూల్స్‌ను ఎవరైనా బ్రేక్ చేయాలనుకుంటే పుష్పరాజ్ ఏం చేసాడనేది 'పుష్ప: ది రూల్' చిత్రంలో చూడొచ్చు. పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్ నటిస్తున్నారు. సుకుమార్ దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్‌లు నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న రిలీజ్ కానుంది. 'పుష్ప: ది రైజ్'కు సీక్వెల్‌గా 'పుష్ప: ది రూల్' రూపొందుతోంది.

డబుల్ ఇస్మార్ట్

కిరాయి రౌడీ ఇస్మార్ట్ శంకర్‌కు సీబీఐ ఆఫీసర్ అరుణ్ మెమొరీని సైంటిఫిక్‌గా ఇంజెక్ట్ చేసి, చిప్ పెడితే ఏం జరుగుతుంది? అనేది 'ఇస్మార్ట్ శంకర్' సినిమా కథ. ఈ చిత్రానికి పూరి జగన్నాథ్ దర్శకుడు. రామ్ టైటిల్ రోల్ చేయగా, సీబీఐ ఆఫీసర్ అరుణ్‌గా సత్యదేవ్ నటించారు. 2019లో విడుదలైన 'ఇస్మార్ట్ శంకర్'కి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' చేస్తున్నారు రామ్, పూరి. కాగా అరుణ్ జ్ఞాపకశక్తి పూర్తిగా శంకర్‌కు వచ్చేస్తే ఏం జరుగుతుంది? ఓ కిరాయి రౌడీ సీబీఐ ఆఫీసర్ అయితే ఏం చేస్తాడు? శంకర్ నిజంగానే గతం మర్చిపోతాడా? ఈ ప్రశ్నలకు సమాధానం మార్చి 18న రిలీజయ్యే 'డబుల్ ఇస్మార్ట్' చూస్తే తెలుస్తుంది.

'బింబిసార 2', 'డెవిల్ 2' ఉంటాయన్నట్లుగా కల్యాణ్ రామ్ పేర్కొన్నారు. 'మ్యాడ్ 2' మత్తు వదలరా 2' చిత్రాల స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. 'హను-మాన్'కు సీక్వెల్‌గా 'జై హను-మాన్'ను ప్రశాంత్ వర్మ ప్రకటించారు. 'రాక్షసుడు 2'ని దర్శకుడు రమేశ్ వర్మ ఆల్రెడీ ప్రకటించారు. ఇంకొన్ని సీక్వెల్ చిత్రాలున్నాయి.

యాత్ర 2

ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జీవితంలోని కొన్ని ఘటనలు, ఆయన పాద యాత్ర నేపథ్యంలో రూపొందిన హిట్ ఫిల్మ్ 'యాత్ర'. మహి వి. రాఘవ్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. తాజాగా 'యాత్ర' సినిమాకు సీక్వెల్‌గా 'యాత్ర 2' తెరకెక్కించారు మహి వి. రాఘవ్. వైఎస్ రాజశేఖర రెడ్డి తనయుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా నేతగా ఎదిగిన తీరు, 2009 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజకీయ ఘటనల ఆధారంగా 'యాత్ర 2' రూపొందింది. ఈ చిత్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి పాత్రలో మమ్ముట్టి నటించగా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాత్రలో తమిళ నటుడు జీవా నటించారు. శివ మేక నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 9న విడుదల కానుంది.

రెట్టింపు వినోదం

డీజే టిల్లుగానితో ఎట్లుంటదో 'డీజే టిల్లు' సినిమాలో చూశారు ఆడియన్స్. 2022లో విడుదలైన ఈ సినిమా బంపర్ హిట్ సాధించింది. దీంతో ఈ సినిమాకు సీక్వెల్‌గా 'డీజే టిల్లు స్క్వేర్' రానుంది. 'డీజే టిల్లు'లో టైటిల్ రోల్‌ని సిద్ధు జొన్నలగడ్డ చేయగా, విమల్ కృష్ణ దర్శకత్వం వహించారు. సీక్వెల్‌లో సిద్ధూనే హీరో. అయితే మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 9న విడుదల కావాల్సింది. కానీ వాయిదా పడిందని తెలుస్తోంది.

గూఢచారి 2

ఏజెంట్ గోపీ 116 అనగానే తెలుగు ప్రేక్షకులకు అడివి శేష్ స్పై థ్రిల్లర్ 'గూఢచారి' సినిమా గుర్తుకు వస్తుంది. 2018లో విడుదలైన ఈ సినిమా బంపర్ హిట్. శశికిరణ్ తిక్క దర్శకుడు. ప్రస్తుతం 'గూఢచారి 2'తో బిజీగా ఉన్నారు అడివి శేష్. వినయ్ కుమార్ ఈ సినిమాకు దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్టైన్మెంట్స్ నిర్మిస్తున్న 'గూఢచారి 2' ఈ ఏడాది చివర్లో విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

రీల్స్

విశ్వనేత



- అభయ్ డియోల్

భారత ప్రధాని నరేంద్ర మోదీ జీవితం ఆధారంగా 'విశ్వనేత' చిత్రం తెరకెక్కనుంది. అభయ్ డియోల్ టైటిల్ రోల్‌లో నీనా గుప్తా, అనుపమ్ ఖేర్, పల్లవి జోషి ముఖ్య పాత్రలు చేయనున్నారు. ''ఆర్టికల్ 370 రద్దు, డిమానిటైజేషన్, జీఎస్టీ, రామమందిర నిర్మాణాలతో భారతీయుల గుండెల్లో కొలువు దీరారు నరేంద్ర మోదీ. చాయ్‌వాలా నుంచి విశ్వనేతగా ఎదిగిన ఆయన జీవిత ప్రస్థానానికి దృశ్యరూపం ఇవ్వనున్నాం'' అని యూనిట్ పేర్కొంది. సీహెచ్ క్రాంతికుమార్ దర్శకత్వంలో కాశీరెడ్డి శరత్‌రెడ్డి నిర్మించనున్న ఈ చిత్రానికి సంగీతం: ఎంఎం కీరవాణి.

మస్తు షేడ్స్ ఉన్నాయ్



- అభినవ్ గోమఠం

'ఈ నగరానికి ఏమైంది, ఫలక్‌నుమా దాస్, మీకు మాత్రమే చెబుతా' తదితర చిత్రాలతో కామెడీ, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు అభినవ్ గోమఠం. అభినవ్ హీరోగా తొలి చిత్రం 'మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా' చిత్రం రూపొందుతోంది. తిరుపతి రావు ఇండ్ల దర్శకత్వంలో భవాని కాసుల, ఆరెమ్ రెడ్డి, ప్రశాంత్ .వి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ''అభినవ్ గోమఠంలోని కొత్త కోణాన్ని ఈ చిత్రంలో చూస్తారు. అన్ని భావోద్వేగాలతో లవ్, కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాను. ఫిబ్రవరి ద్వితీయార్ధంలో రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు తిరుపతి రావు. 'పొలిమేర-2' చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసిన నిర్మాత, పంపిణీదారుడు వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.

హను-మాన్‌లో అదే పెద్ద సవాల్



- ఉదయ్ కృష్ణ

ఆంజనేయుడు భూమి నుంచి ఆకాశానికి ఎదిగే సీన్ 'హను-మాన్'లో మేజర్ హైలైట్. క్లైమాక్స్‌లో వచ్చే ఈ సీన్ ప్రేక్షకుల ఒళ్లు పులకరించేలా చేస్తుంది. విజువల్ ఎఫెక్ట్స్‌తో మేజిక్ చేసిన ఇలాంటి సన్నివేశాలు ఈ చిత్రంలో చాలానే ఉన్నాయి. అయితే క్లైమాక్స్‌లో భూమ్యాకాశాలకు విస్తరించే హనుమాన్‌కు జీవం పోయడం ఈ చిత్రం పరంగా తాను ఫేస్ చేసిన పెద్ద సవాల్ అంటున్నారు వీఎఫ్‌ఎక్స్ నిపుణుడు ఉదయ్ కృష్ణ. తేజ సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో శ్రీమతి చైతన్య సమర్పణలో కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన చిత్రం 'హను-మాన్'. సంక్రాంతి సందర్భంగా విడుదలైన ఈ చిత్రం ఇప్పటికి రూ. 200 కోట్ల గ్రాస్‌ని రాబట్టింది. ఈ చిత్రానికి వీఎఫ్‌ఎక్స్ చేసిన ఉదయ్ కృష్ణ మాట్లాడుతూ - ''విజువల్ ఎఫెక్ట్స్‌లో దాదాపు 25 ఏళ్ల అనుభవం ఉన్న నాకు 'హను-మాన్' చిత్రం చేసే చాన్స్ రావడం పూర్వజన్మ సుకృతం. వీఎఫ్‌ఎక్స్‌ని అద్భుతంగా వినియోగించుకునే ప్రతిభ ప్రశాంత్ వర్మలో ఉంది. ఎన్నో ప్రతికూలతలు, పరిమిత వనరులతో ఈ సినిమా చేశాం. ఈ సినిమా విజయం మా కష్టం మరచిపోయేలా చేసింది. వీఎఫ్‌ఎక్స్ నిపుణుడిగా అంతర్జాతీయ ప్రమాణాలతో హైదరాబాద్‌లో ఓ సంస్థను నెలకొల్పాలన్న నా కలను 'బీస్ట్ బెల్స్'తో నెరవేర్చుకుంటున్నాను'' అన్నారు. 'బాహుబలి'కి సంబంధించిన కొంత వీఎఫ్‌ఎక్స్ వర్క్ చేశానని, హిందీలో 'జోథా అక్బర్', 'పద్మావత్' వంటి చిత్రాలు, త్రీడీ యానిమేషన్ ఫిల్మ్ 'అర్జున: ది వారియర్ ప్రిన్స్', పూర్తి స్థాయి వీఎఫ్‌ఎక్స్ మూవీ 'అల్లాదీన్' వంటివి చేశానని ఉదయ్‌కృష్ణ తెలిపారు.

వినోదాల బాలరాజు

సోహైల్ టైటిల్ రోల్ చేసిన సినిమా 'బూట్‌కట్ బాలరాజు'. శ్రీ కోనేటి దర్శకత్వంలో ఎండీ పాషా నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 2న రిలీజ్ కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో సోహైల్ మాట్లాడుతూ- ''నేను షార్ట్‌ఫిల్మ్ నుంచి ఒక్కో మెట్టు ఎదుగుతూ ఈ స్థాయికి వచ్చాను. హీరో వెంకటేశ్‌గారికి మా సినిమా గురించి మెసేజ్ చేశాను. ఆల్ ది బెస్ట్ చెబుతూ, వాయిస్ మెసేజ్ పంపారు. అంత పెద్ద హీరో రిప్లయ్ ఇవ్వడం ధైర్యాన్నిచ్చింది. నాలాంటి యంగ్ స్టర్స్ ఇలాంటి సపోర్ట్ ఆశిస్తారు. పాషాగారు హార్డ్‌వర్క్ చేసి, ఈ సినిమా తీశారు'' అన్నారు. ''వినోదాత్మక చిత్రమిది'' అన్నారు శ్రీ కోనేటి.



- మేఘా లేఖ, సోహైల్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (శనివారం ముగింపు)	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
260	51
71,424	21,572

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటల ముగింపు)			
నాస్‌డాక్	15,832	△	73
డోజోన్స్	37,934	△	130
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,494	△	26
డాక్స్	16,683	△	128
షాంఘై	2,756	▽	76
నికాయ్	36,547	△	584

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.75	83.77
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.56	107.12
€	యూరో	ఎస్‌బీఐ	89.46	91.83
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.54	56.80
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.85	55.78
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.21	62.67
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.19	22.81
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.69	23.51
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.39	12.49

ఆర్థిక వ్యవస్థకు శ్రీరామజయం

అయోధ్యకు పర్యాటకుల తాకిడి

- ఏటా 5 కోట్ల మంది సందర్శన
- దేశ ఆర్థిక వ్యవస్థకు బూస్టింగ్
- ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం
- బ్రోకరేజీ సంస్థ జెఫరీస్ అంచనా





న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య ఇక ప్రముఖ పర్యాటక ప్రాంతంగా శోభిల్లనుంది. దేశంలోని ఇతర ప్రముఖ ఆధ్యాత్మిక, పుణ్యక్షేత్రాలను దాటి పర్యాటకుల సందర్శన పరంగా అయోధ్య మొదటి స్థానానికి చేరుకోనుంది. బ్రోకరేజీ సంస్థ జెఫరీస్ వేసిన అంచనా ప్రకారం ఏటా సుమారు 5 కోట్ల మంది సందర్శకులు అయోధ్యకు రానున్నారు. నూతన విమానాశ్రయం, పునరుద్ధరించిన రైల్వే స్టేషన్, టౌన్‌షిప్, రహదారుల అనుసంధానం కోసం చేసిన 10 బిలియన్ డాలర్ల వ్యయానికి తోడు కొత్త హోటళ్ల రాక ఇవన్నీ అయోధ్యలో ఆర్థిక కార్యకలాపాల విస్తృతిని పెంచుతాయని జెఫరీస్ విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. అంతర్జాతీయ సాంస్కృతిక, ఆధ్యాత్మిక కేంద్రంగా అయోధ్య విలసిల్లుతుందని అభిప్రాయం వ్యక్తం చేసింది. ప్రస్తుతం దేశంలో ఎంతో విశిష్టత కలిగిన తిరుమల ఆలయాన్ని ఏటా 3 కోట్ల మంది వరకు భక్తులు సందర్శిస్తున్నారు. అమృత్‌సర్‌లోని గోల్డెన్ టెంపుల్‌కు సైతం ఇదే స్థాయిలో సందర్శకులు వస్తున్నారు. అంతర్జాతీయంగా చూస్తే వాటికన్ సిటీని ఏటా 90 లక్షల మంది, సౌదీ అరేబియాలోని మక్కాను 2 కోట్ల మంది సందర్శిస్తున్నారు.

అయోధ్యలో వసతులు

అయోధ్య ఎయిర్‌పోర్ట్ మొదటి దశ అందుబాటులోకి రాగా, ఏటా 10 లక్షల మంది ప్రయాణికుల సామర్థ్యాన్ని కలిగి ఉంది. 60 లక్షల ప్రయాణికుల సామర్థ్యానికి సేవలు అందించే అదనపు దేశీయ, అంతర్జాతీయ టెర్మినల్ 2025 నాటికి రానుంది. రోజువారీ 60 వేల మంది ప్రయాణికులకు సేవలు అందించేలా రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేశారు. 1,200 ఎకరాల్లో గ్రీన్‌ఫీల్డ్ టౌన్‌షిప్ నిర్మాణాన్ని తలపెట్టారు. రోడ్ల కనెక్టివిటీని పెంచారు. ప్రస్తుతం 17 హోటళ్లు 590 రూమ్‌లను కలిగి ఉన్నాయి. కొత్తగా 73 హోటళ్లకు ప్రణాళికలు ఉన్నాయి. ఇందులో 40 హోటళ్ల నిర్మాణం ఇప్పటికే ప్రారంభమైంది. ఇండియన్ హోటల్స్, మారియట్, విందమ్ ఇప్పటికే హోటళ్ల కోసం ఒప్పందాలు చేసుకున్నాయి. ఐటీసీ సైతం హోటల్ ఏర్పాటు అవకాశాలను పరిశీలిస్తోంది. ఓయో సైతం 1,000 హోటల్ రూమ్‌లను తన ప్లాట్‌ఫామ్‌పైకి తీసుకురావాలని భావిస్తోంది.

ఊపందుకోనున్న టూరిజం

''ఆధ్యాత్మిక పర్యాటకం అనేది భారత పర్యాటక రంగంలో అతిపెద్ద విభాగంగా ఉంది. మౌలిక వసతుల సమస్యలు ఉన్నప్పటికీ పలు ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రాలకు ఏటా 1–3 కోట్ల మధ్య పర్యాటకులు విచ్చేస్తున్నారు. మరింత మెరుగైన వసతులు, అనుసంధానంతో కొత్తగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కేంద్రం (అయోధ్య) చెప్పుకోతగ్గ స్థాయిలో ఆర్థిక ప్రభావం చూపించనుంది''అని జెఫరీస్ తన నివేదికలో పేర్కొంది. కరోనాకు ముందు 2018–19 ఆర్థిక సంవత్సరం జీడీపీలో పర్యాటక రంగం 194 బిలియన్ డాలర్ల వాటా కలిగి ఉంటే, అది ఏటా 8 శాతం కాంపౌండెడ్ వృద్ధితో 2032–22 నాటికి 443 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేసింది. దేశ జీడీపీలో పర్యాటక రంగం వాటా 6.8 శాతంగా ఉందని, అభివృద్ధి చెందిన, ప్రముఖ అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోలిస్తే తక్కువగా ఉన్నట్టు వివరించింది. ''పర్యాటకం అయోధ్యకు ఆర్థికపరమైన, మతపరమైన వలసలను పెంచుతుంది. దీంతో హోటళ్లు, ఎయిర్ లైన్స్, హాస్పిటాలిటీ, ఎఫ్ఎంసీజీ, పర్యాటక అనుబంధ రంగాలు, సిమెంట్ రంగాలు లాభపడనున్నాయి''అని జెఫరీస్ పేర్కొంది.

జీ–సోనీ విలీన డీల్ రద్దు!!

- జీ సంస్థకు నోటీసు పంపిన సోనీ
- ఒప్పంద నిబంధనలు ఉల్లంఘించినట్లు ఆరోపణ
- దాదాపు రూ.750 కోట్ల బ్రేకప్ ఫీజు కోసం డిమాండ్



న్యూఢిల్లీ: దాదాపు రెండేళ్లుగా కొనసాగుతున్న జీ ఎంటర్‌టైన్‌మెంట్, సోనీ గ్రూప్ భారత విభాగ విలీన డీల్ ఊహాగానాలకు అనుగుణంగానే రద్దయింది. సోనీ గ్రూప్ కార్పొరేషన్ సోమవారం ఈ మేరకు ప్రకటన చేసింది. ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ (జీల్)కు నోటీసు పంపింది. ఒప్పంద నిబంధనలను ఉల్లంఘించినందుకు, ఆర్బిట్రేషన్‌కు తెర తీసినందుకు గాను 90 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.750 కోట్లు) బ్రేకప్ ఫీజు చెల్లించాలంటూ డిమాండ్ చేసింది. 'సోనీ గ్రూప్ కార్పొరేషన్‌లో భాగమైన సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా (ప్రస్తుతం కల్వర్ మ్యాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్) సంస్థ .. జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ (జీల్) విలీనానికి సంబంధించి 2021 డిసెంబర్ 22న ప్రకటించిన ఒప్పందాలను రద్దు చేస్తూ, నోటీసులు ఇచ్చింది' అని సోనీ గ్రూప్ ఒక ప్రకటనలో తెలిపింది. విలీన సంస్థకు ఎవరు సారథ్యం వహించాలనే విషయంపై ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు ఈ విషయమై సోనీ నుంచి నోటీసులు వచ్చినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు జీల్ తెలిపింది. 'విలీన ఒప్పందాన్ని పూర్తి చేసేందుకు నిబద్ధతతో అన్ని ప్రయత్నాలు చేశాం. మాకు వన్‌టైమ్ ప్రాతిపదికన, మళ్లీ మళ్లీ ఖర్చులకు దారి తీసే చర్యలు కూడా తీసుకున్నాం' అని తెలిపింది. డీల్ రద్దు వ్యవహారంపై చట్టపరంగా తీసుకోదగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. నిబంధనల పాటింపునకు, నియంత్రణ సంస్థల నుంచి అనుమతులు తెచ్చుకునేందుకు జీల్ 2023 సెప్టెంబర్ వరకు దాదాపు రూ. 367 కోట్లు వెచ్చించింది.

ఇదీ జరిగింది..

ఎస్‌పీఎన్‌ఐలో జీల్‌ను విలీనం చేసేందుకు సంబంధించి 2021 డిసెంబర్‌లో ఇరు సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీని ప్రకారం 24 నెలల్లోగా విలీనం జరగాలి. అలా జరగకపోవడంతో నెల రోజుల పాటు జనవరి 21 గడువు పొడిగించారు. డీల్ సాకారమై ఉంటే దేశీయంగా 10 బిలియన్ డాలర్ల మీడియా దిగ్గజం ఆవిర్భవించేది. విలీన సంస్థలో సోనీకి 50.86 శాతం, జీల్ ప్రమోటర్లయిన గోయెంకా కుటుంబానికి 3.99 శాతం వాటాలు ఉండేవి. 70 పైగా టీవీ చానల్స్, రెండు వీడియో స్ట్రీమింగ్ సర్వీసులు, రెండు ఫిలిమ్ స్టూడియోలతో భారత్‌లో అతి పెద్ద ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్‌గా ఉండేది. ఈ ఒప్పందానికి నియంత్రణ సంస్థల నుంచి కూడా అనుమతులు లభించాయి. అయితే, ఈలోగా జీ ప్రమోటర్లయిన సుభాష్ చంద్ర, ఆయన కుమారుడు .. సీఈవో పునీత్ గోయెంకాలపై నిధుల మళ్లింపు ఆరోపణలు రావడంతో వారిని లిస్టెడ్ కంపెనీల్లో డైరెక్టర్లుగా ఉండకూడదంటూ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిషేధం విధించింది. దీనిపై సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో గోయెంకాకు స్టే లభించింది. కానీ, ప్రాథమికంగా డీల్ కింద విలీన సంస్థ సారథ్య బాధ్యతలను గోయెంకాకు అప్పగించాలని భావించినప్పటికీ ఈ పరిణామాలతో ఆ అంశంపై సందిగ్ధత నెలకొంది. గోయెంకాను సీఈవోగా కొనసాగించడాన్ని సోనీ ఇష్టపడటం లేదని, ఆయన వెనక్కి తగ్గటం లేదని వార్తలు వచ్చాయి. దీనిపై నిర్దిష్ట డెడ్‌లైన్‌లోగా ఇరు పక్షాలూ అంగీకారానికి రాకపోవడంతో డీల్ రద్దు కానుందంటూ ఊహాగానాలు వచ్చాయి.

ఇప్పుడేంటి..

ఆదాయాలు, లాభాల క్షీణతతో కొన్నాళ్లుగా జీ ఆర్థిక పనితీరు తగ్గుతూ వస్తోంది. సోనీతో డీల్ రద్దు అయిన నేపథ్యంలో జీల్‌కి సమస్యలు మరింత పెరిగే అవకాశం ఉంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, వాల్ట్ డిస్నీ భారత మీడియా వ్యాపార విలీనమైతే ఏర్పడే భారీ సంస్థతో పోటీపడేందుకు మళ్లీ వ్యూహాలు రచించుకోవాలి. కొన్ని క్రికెట్ ఈవెంట్ల ప్రసారం కోసం డిస్నీలో భాగమైన స్టార్‌తో జీల్‌కి ఒప్పందం ఉంది. దీని కోసం నాలుగేళ్ల వ్యవధిలో 1.32–1.44 బిలియన్ డాలర్ల వరకు చెల్లించాలి. సోనీతో డీల్ రద్దు అయినందున ఈ ఒప్పందంపైనా ప్రభావం పడొచ్చు. మరోవైపు, ప్రాంతీయ భాషల్లో జీల్‌కి ఉన్న కంటెంట్, టీవీ చానల్స్ అందుబాటులో ఉండవు కాబట్టి సోనీ కూడా భారత్‌లో తన కార్యకలాపాల వ్యూహాలను పునఃసమీక్షించుకోవాల్సి రావచ్చని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

వికాస్ లైఫ్‌కేర్ చేతికి స్కై 2.0

60 శాతం వాటా కొనుగోలుకి సై



న్యూఢిల్లీ: దేశీ కంపెనీ వికాస్ లైఫ్‌కేర్ లిమిటెడ్ తాజాగా దుబాయ్ సంస్థ స్కై 2.0 క్లబ్‌లో మెజారిటీ వాటాను కొనుగోలు చేయనుంది. ఇందుకు 7.9 కోట్ల డాలర్లు(సుమారు రూ. 650 కోట్లు) వెచ్చించనుంది. 2023–24 లోపు వాటా కొనుగోలు ప్రక్రియ ముగియనున్నట్లు కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. స్కై 2.0 క్లబ్ హోల్డింగ్ సంస్థ బ్లూ స్కై ఈవెంట్ హాల్ ఎఫ్‌జెడ్–ఎల్‌ఎల్‌సీ(దుబాయ్)తో ఇందుకు వాటా మార్పిడి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. 60% వాటాతోపాటు.. భవిష్యత్ బిజినెస్ వెంచర్లనూ సొంతం చేసుకోనున్నట్లు వివరించింది. 13 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువలో ఇందుకు డీల్ కుదిరినట్లు తెలిపింది.

కరూర్ వైశ్యా లాభం హైజంప్

క్యూ3లో రూ. 412 కోట్లు

ముంబై: ప్రైవేట్ రంగ సంస్థ కరూర్ వైశ్యా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 43 శాతం జంప్‌చేసి రూ. 412 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 289 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 2,013 కోట్ల నుంచి రూ. 2,497 కోట్లకు చేరింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 1.12 శాతం మెరుగుపడి 1.58 శాతానికి చేరాయి. గత క్యూ3లో 2.7 శాతంగా నమోదయ్యాయి. నికర ఎన్‌పీఏలు సైతం 0.9 శాతం నుంచి 0.42 శాతానికి దిగివచ్చాయి. వృద్ధి, లాభదాయకత, రుణాల నాణ్యత తదితర అంశాలలో మరోసారి నిలకడైన, పటిష్ట పనితీరును ప్రదర్శించగలిగినట్లు బ్యాంక్ ఎండీ, సీఈవో బి.రమేష్ బాబు పేర్కొన్నారు.



ఫలితాల నేపథ్యంలో శనివారం కరూర్ వైశ్యా బ్యాంక్ షేరు బీఎస్ఈలో 0.3 శాతం బలపడి రూ. 170 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్ / 100కు రూ.లలో)

23-1-2024	
విశాఖ	563–00
చిత్తూరు	563–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	555–00
విజయవాడ	555–00
రిటైల్ ధర (డజను)	72.00
22-1-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	536–00
వరంగల్	538–00
రిటైల్ ధర	5.95

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ప్రతిష్టాత్మక సంస్థల్లో ఫిజిక్స్ కోర్సులు

జెస్ట్ 2024

పీజీ, పీహెచ్‌డీల్లో ప్రవేశాలు » స్టైపెండ్ అందుకునే అవకాశం

ఉజ్వల కెరీర్ అవకాశాలను అందించే సబ్జెక్టుల్లో ఫిజిక్స్ ఒకటి. ఈ సబ్జెక్టుపై ఆసక్తి ఉండి, రాణించాలనుకునే వారికి దేశంలోని పలు ప్రతిష్టాత్మక సంస్థలు ఉన్నత విద్య కోర్సులను అందిస్తున్నాయి. ఇందుకోసం జాయింట్ ఎంట్రన్స్ స్క్రీనింగ్ టెస్ట్ (జెస్ట్)ను నిర్వహించి.. అర్హత సాధించిన వారికి పోస్ట్‌గ్రాడ్యుయేట్,ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ, పీహెచ్‌డీల్లో ప్రవేశాలు కల్పిస్తున్నాయి. జెస్ట్2024 దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో... ఈ పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారం.. సైన్స్,టెక్నాలజీ రంగాల్లో పరిశోధనలకు ఫిజిక్స్ ఎంతో కీలకం. ఈ సబ్జెక్టుపై ఆసక్తి ఉన్న విద్యార్థులను పరిశోధనల దిశగా ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా ఉన్న పలు ప్రముఖ విద్యాసంస్థలు జెస్ట్‌లో ప్రతిభ ఆధారంగా ఫిజిక్స్, అనుబంధ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తునాయి.

స్టైపెండ్

ఈ కోర్సుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ప్రతినెల స్టైపెండ్ కూడా అందుతుంది. ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ పీహెచ్‌డీలో ప్రవేశం పొందిన వారికి నెలకు రూ.12వేలు చొప్పున రెండేళ్లపాటు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తారు. అనంతరం జేఆర్ఎఫ్‌లో భాగంగా నెలకు రూ.37 వేలు, ఎస్ఆర్ఎఫ్ స్థాయిలో రూ.42వేలు చొప్పున చెల్లిస్తారు. నేరుగా పీహెచ్‌డీలో ప్రవేశాలు పొందిన వారు మొదటి రెండేళ్లు రూ.37 వేలు, ఆ తర్వాత రెండేళ్లు రూ.42 వేలు అందుకోవచ్చు. వీటితోపాటు ఉచిత వసతి లేదా స్టైపెండ్‌లో 30శాతం హెచ్ఆర్ఏ చెల్లిస్తారు.

కోర్సులు ఇవే

ఆస్ట్రానమీ, ఆస్ట్రో ఫిజిక్స్, అట్మాస్ఫిరిక్ ఫిజిక్స్, స్పేస్ అండ్ అట్మాస్ఫిరిక్ సైన్సెస్, బయో ఫిజిక్స్, కాంప్లెక్స్ సిస్టమ్స్ అండ్ నెట్ వర్క్స్, కండెన్స్‌డ్ మ్యాటర్ ఫిజిక్స్,క్వాంటమ్ ఫిజిక్స్ అండ్ క్వాంటమ్ ఇన్ఫర్మేషన్,న్యూక్లియర్ అండ్ రేడియేషన్ ఫిజిక్స్, ఆప్టిక్స్ అండ్ అటామిక్ ఫిజిక్స్, హైఎనర్జీ ఫిజిక్స్,బయో ఫిజిక్స్.. ఇలా పలు ఫిజిక్స్ స్పెషలైజేషన్లతో.. ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ, ఇంటిగ్రేటెడ్/ఎమ్మెస్సీ/ఎంటెక్–పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లను అందిస్తున్నాయి.

అర్హతలు

- **ఫిజిక్స్ పీహెచ్‌డీ కోర్సులకు:** ఎమ్మెస్సీలో ఫిజిక్స్ ఉత్తీర్ణులై ఉండాలి. లేదా ఫిజిక్స్ సంబంధిత విభాగాల్లో ఏదైనా పీజీ, ఎంటెక్‌తో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. పలు సంస్థలు బీఈ/బీటెక్ వారికి కూడా అవకాశం కల్పిస్తున్నాయి.
- **ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్–ఎమ్మెస్సీ/ఎంటెక్ పీహెచ్‌డీ:** బీఎస్సీ ఫిజిక్స్ ఉత్తీర్ణతతో ఈ కోర్సుల్లో చేరవచ్చు. కొన్ని సంస్థలు గ్రాడ్యుయేషన్‌లో మ్యాథ్స్, ఇంజనీరింగ్ చదివిన వారిని కూడా చేర్చుకుంటున్నాయి.
- **థియరిటికల్ కంప్యూటర్ సైన్స్:** కంప్యూటర్ సైన్స్‌లో ఎమ్మెస్సీ, ఎంటెక్ లేదా ఎంసీఏ చదివుండాలి. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటికల్ సైన్సెస్‌లో ఈ కోర్సు ఉంది.

వంద మార్కులకు పరీక్ష

జెస్ట్ పరీక్షను వంద మార్కులకు 3 గంటల వ్యవధిలో నిర్వహిస్తారు. మొత్తం మూడు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒక విభాగంలో 15 ప్రశ్నలు, ప్రతి ప్రశ్నకు 3 మార్కులు. తప్పు జవాబుకు ఒక మార్కు తగ్గిస్తారు. మరో విభాగంలో 10 ప్రశ్నలు, ప్రతి ప్రశ్నకు 3 మార్కులు. నెగిటివ్ మార్కులు లేవు. ఇంకో విభాగం నుంచి 25 ప్రశ్నలు, ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున ఉంటాయి. తప్పు సమాధానానికి మూడోవంతు మార్కు చొప్పున తగ్గిస్తారు. ఫిజిక్స్ లేదా థియరిటికల్ కంప్యూటర్ సైన్స్ రెండింటిలో ఏదో ఒక పేపరే రాయడానికి వీలుంది. పీహెచ్‌డీ, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీలకు ఒకటే ప్రశ్నపత్రం ఉంటుంది.

కోర్సులను ఆఫర్ చేసే సంస్థలు

ఆర్యభట్ట రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అబ్జర్వేషనల్ సైన్సెస్, నైనిటాల్; బోస్ ఇన్‌స్టిట్యూట్, కోల్‌కతా; హోమీ బాబా నేషనల్ ఇన్‌స్టిట్యూట్, ముంబయి; ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ థియరిటికల్ సైన్సెస్(ఐసీటీఆర్–టీఐఎఫ్ఆర్), బెంగళూరు; హరీష్ చంద్ర రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, అలహాబాద్; ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్, కల్పక్కం; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్ (ఐఐఎ), బెంగళూరు; ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటికల్ సైన్సెస్(ఐఎమ్ఎస్సీ), చెన్నై; ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్లాస్మా రీసెర్చ్(ఐపీఆర్), గాంధీనగర్; ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ (ఐయూసీఏఏ), పుణె; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ), బెంగళూరు; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్ఈఆర్)–భోపాల్; బరంపూర్, కోల్‌కతా, మొహాలి,పుణె,తిరువనంతపురం, తిరుపతి; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐఐఎస్టీ), తిరువనంతపురం.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** జనవరి 24, 2024
- **పరీక్ష తేదీ:** మార్చి 03, 2024
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం
- **వెబ్‌సైట్:** https://www.jest.org.in

అగ్నివీర్‌లకు ఆహ్వానం

» అగ్నివీర్ వాయు 1/2025 నోటిఫికేషన్ విడుదల
» పైలట్స్, కమిషన్డ్ ఆఫీసర్స్, నేవిగేటర్స్, ఎయిర్‌మెన్ కొలువులు
» అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా నియామకాలు
» మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్.. నిరంతరం గగనతల గస్తీతో..దేశ రక్షణలో అత్యంత కీలకమైన విభాగం. ఇంటర్మీడియెట్ అర్హతతోనే..ఎయిర్‌ఫోర్స్‌లో చేరే అవకాశం స్వాగతం పలుకుతోంది! అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా ఎయిర్‌ఫోర్స్‌లో పైలట్స్, కమిషన్డ్ ఆఫీసర్స్, నేవిగేటర్స్, ఎయిర్‌మెన్ కొలువులు సొంతం చేసుకోవచ్చు!! తాజాగా అగ్నివీర్ వాయు 1/2025కు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అగ్నివీర్ వాయు పోస్టులు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలు..

కేంద్ర ప్రభుత్వ అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా.. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ గత రెండేళ్లుగా అగ్నివీర్–వాయు పేరిట నియామకాలను చేపడుతోంది. తాజా నోటిఫికేషన్(అగ్నివీర్ వాయు 1/2025) ద్వారా కమిషన్డ్ ఆఫీసర్, పైలట్స్, నేవిగేటర్స్, ఎయిర్‌మెన్ పోస్టులను భర్తీ చేయనుంది.

అర్హతలు

- ఆయా పోస్టులను అనుసరించి ఎంపీసీ, ఇతర గ్రూప్‌లతో ఇంటర్మీడియెట్/నిర్దేశిత బ్రాంచ్‌లతో డిప్లొమా/ఒకేషనల్ ఇంటర్మీడియెట్‌లో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి.
- **సైన్స్ సబ్జెక్ట్స్‌కు అర్హతలు:** 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్(ఎంపీసీ) ఉత్తీర్ణత లేదా మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ఆటోమొబైల్/ కంప్యూటర్ సైన్స్ /ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బ్రాంచ్‌లతో మూడేళ్ల డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి(లేదా)మ్యాథ్స్,ఫిజిక్స్‌లు సబ్జెక్ట్‌లుగా రెండేళ్ల ఒకేషనల్ కోర్సుల ఉత్తీర్ణత ఉండాలి.
- **సైన్సేతర సబ్జెక్ట్స్‌కు అర్హతలు:** 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ (జనరల్, ఒకేషనల్) ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** 17 1/2– 21 ఏళ్ల మధ్య ఉండాలి (అభ్యర్థులు జనవరి 2, 2004 – జూలై 2, 2007 మధ్యలో జన్మించి ఉండాలి).

మూడు దశల ఎంపిక ప్రక్రియ

అగ్నివీర్ వాయు నియామకాలకు మూడు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ఆయా పోస్ట్‌లకు అనుగుణంగా.. సైన్స్, సైన్సేతర సబ్జెక్ట్స్, సైన్స్ సబ్జెక్ట్స్ అండ్ సైన్సేతర సబ్జెక్ట్‌ల పేరిట అర్హతలను, పరీక్ష విధానాన్ని పేర్కొన్నారు. మూడు దశల ఎంపిక ప్రక్రియలో భాగంగా తొలి దశలో ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ టెస్ట్ మూడు సబ్జెక్ట్‌ల అభ్యర్థులకు వేర్వేరుగా ఉంటుంది.

తొలిదశ పరీక్షలు వేర్వేరుగా

ఆయా పోస్టులకు సరితూగేలా అభ్యర్థుల పరిజ్ఞానాన్ని పరిశీలించేందుకు తొలిదశ ఆన్‌లైన్ టెస్ట్‌ను మూడు విధానాల్లో నిర్వహిస్తారు. టెక్నికల్ విభాగాల్లో చేరాలనుకునే వారు సైన్స్ సబ్జెక్ట్స్ పరీక్షకు, నాన్–టెక్నికల్ విభాగాల్లో చేరాలనుకునే అభ్యర్థులు సైన్సేతర సబ్జెక్ట్ పరీక్షకు, ఈ రెండు విభాగాల్లోనూ చేరాలనుకుని,సంబంధిత అర్హతలున్న వారు సైన్స్, సైన్సేతర సబ్జెక్ట్ పరీక్షలకు హాజరవ్వాల్సి ఉంటుంది.

సైన్స్ సబ్జెక్ట్స్‌కు టెస్ట్ ఇలా

సైన్స్ సబ్జెక్ట్స్‌లో నిర్వహించే పరీక్ష.. 60 నిమిషాల వ్యవధిలో 70 మార్కులకు ఉంటుంది. ఇంగ్లిష్ నుంచి 20 ప్రశ్నలు; మ్యాథమెటిక్స్ నుంచి 25 ప్రశ్నలు, ఫిజిక్స్ నుంచి 25 ప్రశ్నలు చొప్పున అడుగుతారు.

సైన్సేతర సబ్జెక్ట్స్‌కు పరీక్ష

ఈ విభాగానికి సంబంధించిన పరీక్ష 45 నిమిషాల వ్యవధిలో 50 మార్కులకు ఉంటుంది. రీజనింగ్ అండ్ జనరల్ అవేర్‌నెస్ నుంచి 30 ప్రశ్నలు, ఇంగ్లిష్ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు.

సైన్స్, సైన్సేతర సబ్జెక్ట్స్ పరీక్ష

ఈ విభాగం పరీక్ష 85 నిమిషాల వ్యవధిలో 100 మార్కులకు ఉంటుంది. ఇంగ్లిష్ నుంచి 20 ప్రశ్నలు; రీజనింగ్ అండ్ జనరల్ అవేర్‌నెస్ నుంచి 30 ప్రశ్నలు; మ్యాథమెటిక్స్ నుంచి 25, ఫిజిక్స్ నుంచి 25 ప్రశ్నలు చొప్పున అడుగుతారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. ప్రతి తప్పు సమాధానానికి 0.25 నెగెటివ్ మార్క్ నిబంధన విధించారు.

రెండో దశ.. పీఎఫ్‌టీ-1

ఎంపిక ప్రక్రియ రెండో దశలో భాగంగా.. ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్–1 పేరుతో శారీరక ద్రుఢత్వ పరీక్ష నిర్వహిస్తారు. 1.6 కిలోమీటర్ల దూరాన్ని పురుష అభ్యర్థులు ఏడు నిమిషాల్లో; మహిళా అభ్యర్థులు ఎనిమిది నిమిషాల్లో చేరుకోవాల్సి ఉంటుంది.

మూడో దశ.. పీఎఫ్‌టీ-2

ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్–1లో ఉత్తీర్ణత సాధించిన వారికి.. మూడో దశలో ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్–2 పేరుతో పలు ఫిజికల్ ఈవెంట్స్‌లో పరీక్ష నిర్వహిస్తారు. పురుష అభ్యర్థులు 10 పుష్–అప్స్(1 నిమిషం); 10 సిట్–అప్స్(1 నిమిషం); 20 స్క్వాట్స్ (1 నిమిషం) చేయాల్సి ఉంటుంది. మహిళా అభ్యర్థులు 10 పుష్–అప్స్(1:30 నిమిషాలు వ్యవధి); 15 స్క్వాట్స్ (1 నిమిషం) తీయాల్సి ఉంటుంది.

చివరగా అడాప్టబిలిటీ టెస్ట్

తొలిదశలో ఆన్‌లైన్ టెస్ట్, తర్వాత పీఎఫ్‌టీ-1, 2లలో ప్రతిభ చూపిన వారికి చివరగా అడాప్టబిలిటీ టెస్ట్ ఉంటుంది. ఇందులో భాగంగా సిట్యుయేషన్ రియాక్షన్ టెస్ట్ నిర్వహిస్తారు. అడాప్టబిలిటీ టెస్ట్–1లో అభ్యర్థుల వ్యక్తిత్వాన్ని పరిశీలిస్తారు. అడాప్టబిలిటీ టెస్ట్–2లో గ్రూప్ డిస్కషన్ ఉంటుంది.



ఎయిర్‌ఫోర్స్ జాబ్స్

వైద్య పరీక్షలు

అడాప్టబిలిటీ టెస్ట్‌లోనూ విజయం సాధించిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి.. అగ్నివీర్ వాయుగా నియామకం ఖరారు చేస్తారు.

నాలుగేళ్లు విధులు

ఎంపికైన అభ్యర్థులకు నాలుగేళ్ల పాటు విధులు నిర్వర్తించే అవకాశం కల్పిస్తారు. వీరికి మొదటి ఏడాది నెలకు రూ.30 వేలు, రెండో ఏడాది రూ.33 వేలు, మూడో ఏడాది రూ.36,500, నాలుగో ఏడాది రూ.40 వేలు చొప్పున వేతనం లభిస్తుంది. వేతనంలోంచి ప్రతి నెల 30 శాతం చొప్పున అగ్నివీర్ కార్పస్ ఫండ్‌కు జమ చేస్తారు. ఈ 30 శాతానికి సమానమైన మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం కూడా జమ చేస్తుంది. ఇలా నాలుగేళ్లు పూర్తయ్యే సరికి అభ్యర్థుల కార్పస్ ఫండ్‌లో రూ.10.04 లక్షలు జమ అవుతాయి. వేతనంతోపాటు రిస్క్ అండ్ హార్డ్‌షిప్ అలవెన్స్, ట్రావెల్ అలవెన్స్‌లను కూడా అందిస్తారు. దీంతోపాటు నాన్–కంట్రిబ్యూటరీ జీవిత బీమా పేరుతో రూ.48 లక్షల మొత్తానికి బీమా కల్పిస్తారు. అదేవిధంగా విధి నిర్వహణ సమయంలో ప్రమాదవశాత్తు మరణిస్తే మరో రూ.44 లక్షల పరిహారం అందిస్తారు.

స్కిల్ సర్టిఫికెట్

నాలుగేళ్లపాటు విధులు పూర్తి చేసుకున్న వారికి అగ్నివీర్ స్కిల్ సర్టిఫికెట్ పేరుతో ధ్రువ పత్రం అందజేస్తారు. ఫలితంగా అభ్యర్థులు ప్రైవేట్, ప్రభుత్వ రంగాల్లో సెక్యూరిటీ విభాగాల్లో ఉద్యోగాలు సొంతం చేసుకునేందుకు వీలుంటుంది.

టెక్నికల్, నాన్-టెక్నికల్ విధులు

- అగ్నివీర్–వాయుగా నియమితులైన వారు టెక్నికల్, నాన్–టెక్నికల్ విభాగాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.
- ఎయిర్‌మెన్‌గా ఎంపికైన వారు ఎయిర్‌మెన్ గ్రూప్–ఎక్స్ పరిధిలో ఎయిర్‌ఫోర్స్‌లోని టెక్నికల్ విభాగాల్లో పని చేయాల్సి ఉంటుంది. గ్రూప్–వై పరిధిలో నాన్–టెక్నికల్ విభాగాల్లో పనిచేస్తారు.
- నేవిగేటర్‌గా ఎంపికైన వారు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్, ఫ్లయింగ్ విభాగం, గ్రౌండ్ డ్యూటీ విభాగాల మధ్య సమన్వయం చేస్తూ విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.
- పైలట్‌గా నియమితులైన వారు యుద్ధ విమానాలు, వైమానిక దళానికి చెందిన ఇతర ఎయిర్ క్రాఫ్ట్‌ను నడపాల్సి ఉంటుంది.
- కమిషన్డ్ ఆఫీసర్ హోదాలో నియమితులైన వారికి.. ఫ్లయింగ్ ఆఫీసర్, ఫ్లయిట్ లెఫ్టినెంట్, వింగ్ కమాండర్, స్క్వాడ్రన్ లీడర్, గ్రూప్ కెప్టెన్ వంటి హోదాలు లభిస్తాయి.

రాత పరీక్షలో రాణించేలా

- రాత పరీక్షలో రాణించేందుకు అభ్యర్థులు దృష్టి పెట్టాల్సిన అంశాలు..
- **ఇంగ్లిష్:** బేసిక్ గ్రామర్ నైపుణ్యాలు పరీక్షించే విభాగం ఇది. ఇందులో ప్రిపొజిషన్స్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, యాక్టివ్, ప్యాసివ్ వాయిస్, ప్యాసేజ్ కాంప్రహెన్షన్, డైరెక్ట్–ఇన్‌డైరెక్ట్ స్పీచ్, వెర్బ్స్, టెన్సెస్, పంక్చుయేషన్స్, యాంటానిమ్స్, సినానిమ్స్‌లపై పట్టు సాధించాలి.
- **సైన్స్:** ఇంటర్మీడియెట్ స్థాయిలోని కైనమాటిక్స్, వర్క్, ఎనర్జీ చలన నియమాలు, మెకానిక్స్, హీట్, థర్మో డైనమిక్స్, ఎలక్ట్రోస్టాటిస్టిక్స్, వేవ్స్, కరెంట్ ఎలక్ట్రిసిటీ,మ్యాగ్నటిజం,సెమీ కండక్టర్స్ వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి.
- **మ్యాథమెటిక్స్:** క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, కాంప్లెక్స్ నెంబర్స్, సమితులు,ప్రమేయాలు,ట్రిగ్నోమెట్రీ, స్ట్రెయిట్ లైన్స్, పెర్ముటేషన్స్–కాంబినేషన్స్, వెక్టార్స్, స్టాటిస్టిక్స్, 3–డి జామెట్రీ, డిఫరెన్షియేషన్స్, డెరివేటివ్స్, అల్జీబ్రా వంటి ఇంటర్మీడియెట్ స్థాయి గణిత అంశాలపై పట్టు సాధించాలి.
- **జనరల్ అవేర్‌నెస్:** ఈ విభాగంలో రాణించడానికి కరెంట్ అఫైర్స్‌తోపాటు భారతదేశ చరిత్ర, జాగ్రఫీ, పోర్ట్‌లు, తీర ప్రాంతాలు, ముఖ్యమైన వ్యక్తులు, సదస్సులు, క్రీడలు–విజేతలు, రక్షణ రంగానికి సంబంధించి తాజా పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** జనవరి 17 – ఫిబ్రవరి 6, 2024
- **ఆన్‌లైన్ పరీక్ష తేదీలు:** మార్చి 17 నుంచి..
- **వెబ్‌సైట్:**https://agnipathvayu.cdac.in

అక్కడ ఇళ్లు ఎన్నో.. గుడులు అన్ని!

అయోధ్యలో 8వేలకుపైగా ఆలయాలు.. ఇందులో రామాయణ గాథతో ముడిపడిన వాటి అభివృద్ధిపై దృష్టి

కోటలు, రాజ భవనాల వంటి నిర్మాణాలపైనా దృష్టి.. భక్తులు ప్రధాన ఆలయంతోపాటు వీటినీ సందర్శించేలా ఏర్పాట్లు

అయోధ్య నుంచి 'సాక్షి'ప్రతినిధి
గౌరీభట్ల నరసింహమూర్తి

దేశంలో ఎన్నో ఆధ్యాత్మిక పట్టణాలున్నా వాటిలో అయోధ్య తీరే వేరు. రామ జన్మభూమిగా భావించే అయోధ్యలో ఇళ్లు, చెట్టు, పుట్ట సర్వం రామమయమే. రామనామ సంకీర్తనతో సూర్యోదయాన్ని చూసే అయోధ్య.. రామ భజన తర్వాతే నిద్రకు ఉపక్రమిస్తుంది. ఇలా ఆధ్యాత్మిక పట్టణాల్లో స్థానికంగా దైవ సంకీర్తనలు సహజమే.. కానీ ఆ ఊరిలో ఎన్ని ఇళ్లుంటాయో అన్ని గుడులు ఉండటం మాత్రం అయోధ్యకే చెల్లింది. ఆ పట్టణంలో 8 వేలకుపైగా ఆలయాలు ఉన్నాయని అయోధ్య వాసులు చెప్తున్నారు. మహమ్మదీయ రాజుల కాలంలో ధ్వంసంగా కాగా మిగిలిన వాటి సంఖ్య ఇదని అంటున్నారు.



ప్రతి ఇల్లూ ఓ ఆలయమే..

అయోధ్యలో ప్రతి హిందువు ఇంట్లో ఓ చిన్నపాటి దేవాలయం ఉంటుంది. మన ఇళ్లలో పూజా మందిరం ఉన్నట్టుగా కాకుండా పెద్ద పరిమాణంలోని విగ్రహాలతో ఓ చిన్న గుడి ఉంటుంది. నిత్య పూజలు, నైవేద్యాలు, గుడిని తలపించే పూజాదికాలు జరుగుతుంటాయి. అందుకే అయోధ్యలో ప్రతి ఇల్లూ ఓ ఆలయమే అంటారు. అయోధ్య పట్టణంలో ఉన్న ఇళ్ల సంఖ్య 10,026. అంటే అక్కడ ఇళ్లు ఎన్నో.. గుడులు కూడా అన్ని ఉన్నట్టు.

ముఖ్యమైన ఆలయాల పునరుద్ధరణ

కొత్త రామాలయం ప్రతిష్ఠాపన ఉత్సవాలు ముగిశాక అయోధ్యలోని ఇతర ప్రధాన దేవాలయాలను కూడా పునరుద్ధరించాలని యూపీ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎనిమిది వేల గుడులున్నా వాటిలో ముఖ్యమైనవి వంద వరకు ఉంటాయని అంచనా. ఇవన్నీ చారిత్రక ప్రాధాన్యమున్నవే. వందల ఏళ్లుగా పూజాదికాలు జరుగుతున్నవే. వాటిలో కొన్ని ఆలయాలు చాలా పురాతనమైనవి కూడా. శ్రీరాముడి జీవిత ఘట్టాలు, వ్యక్తులతో ముడిపడిన ఆలయాలు ఉన్నాయి. హనుమంతుడు, లక్ష్మణుడు, భరత–శత్రుఘ్నులు, సుగ్రీవుడు, జాంబవంతుడు, విశ్వామిత్రుడు, వశిష్ఠుడు, జనకమహారాజు, దశరథుడు.. ఇలా ఎన్నో గుడులు ఉన్నాయి.

➤ సీతమ్మ వంట చేసినట్టుగా పేర్కొనే సీతా రసోయీ, దశరథుడు నివసించినట్టు చెప్పే రాజభవనం, మణిమాణిక్యాలను కానుకలుగా తెచ్చిన జనక మహారాజు పేరుతో ఏర్పడ్డ మణి పర్వత, సుగ్రీవ ఖిలా.. ఇలాంటి నిర్మాణాలు కూడా ఎన్నో ఉన్నాయి. వీటిలో నిర్వహణ లోపాలు, వాతావరణ ప్రభావంతో కొన్ని శిథిలమయ్యాయి. ఇప్పటికీ సలక్షణంగా ఉన్న గుడులు, నిర్మాణాలను గుర్తించి అభివృద్ధి చేయనున్నారు. అయోధ్యకు వచ్చే భక్తులు ప్రధానాలయ దర్శనానికే పరిమితం కాకుండా.. ఇవన్నీ చూసేలా ఏర్పాట్లు చేయాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది.

కోనేరులకూ యోగం..

అయోధ్యలో చాలా చోట్ల ఆలయాలతోపాటు అనుసంధానంగా కోనేరులు ఉన్నాయి. వాటికి కూడా రామాయణ గాథలతో ముడిపడిన చరిత్ర ఉంది. వీటిలో ముఖ్యమైన 35 కోనేరులను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే సరయూ నది రివర్‌ఫ్రంట్‌ను అహ్మదాబాద్ సబర్మతీ తీరం తరహాలో అభివృద్ధి చేశారు. లైట్ అండ్ మ్యూజిక్ షో, లేజర్ షో ఏర్పాటు చేశారు. సాయంత్రం నదీ హారతి ఇస్తున్నారు.



మెట్రో ఫేజ్‌-2 రూట్‌మ్యాప్ ఖరారు

- రెండో దశలో 70 కి.మీ. మేర కొత్త మార్గం
- ప్రస్తుతం మూడు కారిడార్లలో 69 కిలోమీటర్లు
- కారిడార్ 2 పొడిగింపు. కొత్తగా 4, 5, 6, 7 కారిడార్ల రూట్‌మ్యాప్

సాక్షి, హైదరాబాద్: నగరంలో పెరిగిన ట్రాఫిక్ రద్దీని నివారించడంతోపాటు భవిష్యత్ రవాణా అవసరాలను, ఎయిర్‌పోర్టు కనెక్టివిటీని దృష్టిలో ఉంచుకొని మెట్రోరైలు రెండో దశ ప్రతిపాదనలను అధికారులు సిద్ధం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు 70 కిలోమీటర్ల పొడవుతో రూపొందించిన ఫేజ్–2 మెట్రో రూట్‌మ్యాప్‌ను ఖరారుచేశారు. రెండో కారిడార్ పొడిగింపుతోపాటు నాలుగు కొత్త కారిడార్లు కలిపి కొత్త రూట్‌మ్యాప్‌ను రూపొందించారు. దీనికి ప్రభుత్వపరంగా ఆమోదముద్ర పడితే తదుపరి ప్రక్రియ మొదలవుతుందని హెచ్‌ఎంఆర్‌ఎల్ అధికారులు తెలిపారు. గత ప్రభుత్వం రూపొందించిన విస్తరణ ప్రణాళికలను పక్కనబెట్టి, తక్కువ ఖర్చుతో ఎక్కువ మందికి మెట్రో కనెక్టివిటీ రీచ్ అయ్యేలా కొత్త రూట్‌ను డిజైన్ చేశారు. హైదరాబాద్ పాత నగరంతోపాటు కొత్తగా అభివృద్ధి చెందిన ప్రాంతాలకు కూడా కనెక్టివిటీ ఉండేలా రూపొందించడం విశేషం.

రెండోదశ మెట్రో రూట్ మ్యాప్ ఇదీ...

హైదరాబాద్ మెట్రో ప్రస్తుతం మూడు కారిడార్లలో 69 కి.మీ. మేర అందుబాటులో ఉంది. మియాపూర్ టు ఎల్బీ నగర్, జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్, నాగోల్ టు రాయదుర్గం వరకు కనెక్టివిటీ ఉంది. జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకున్న రెండో కారిడార్‌ను ఫేజ్–1లో ప్రతిపాదించిన ఫలక్‌నుమా వరకు పొడిగించి, అక్కడి నుంచి చాంద్రాయణగుట్ట క్రాస్‌రోడ్స్ వరకు మొత్తంగా 7 కి.మీ. పొడిగించాలని కొత్త రూట్‌మ్యాప్‌లో ప్రతిపాదించారు.

కారిడార్ 4: నాగోల్ మెట్రో స్టేషన్ నుంచి ఎల్బీ నగర్ మెట్రో స్టేషన్ వరకు, అక్కణ్నుంచి చాంద్రాయణగుట్ట క్రాస్ రోడ్డు, మైలార్‌దేవ్ పల్లి, పీ7 రోడ్డు నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు (మొత్తం 29 కి.మీ.), అలాగే మైలార్‌దేవ్ పల్లి నుంచి ఆరాంఘర్ మీదుగా రాజేంద్రనగర్‌లో ప్రతిపాదించిన హైకోర్టు వరకు (4 కి.మీ.) ఉంటుంది.

కారిడార్ 5: రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి బయో డైవర్సిటీ జంక్షన్, నానక్ రామ్ గూడ జంక్షన్, విప్రో జంక్షన్, అమెరికన్ కాన్సులేట్ (ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్) వరకు (8 కి.మీ.)

కారిడార్ 6: మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి బీహెచ్‌ఈఎల్ మీదుగా పటాన్‌చెరు వరకు (14 కి.మీ.)

కారిడార్ 7: ఎల్బీ నగర్ మెట్రో స్టేషన్ నుంచి వనస్థలిపురం, హయత్ నగర్ వరకు (8 కి.మీ.)



అగ్గిపుల్ల 'లల్లా' రామ్

కుషాయిగూడవాసి మైక్రో ఆర్టిస్ట్ కృష్ణ సృష్టి

సాక్షి, హైదరాబాద్: న భూతో: న భవిష్యత్ అనేలా సర్వాంగ సుందరంగా ప్రారంభమైన అయోధ్య రామమందిర ప్రారంభ మహోత్సవంతో దేశమంతా ఆధ్యాత్మికశోభను సంతరించుకుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ కుషాయిగూడకు చెందిన మైక్రో ఆర్టిస్ట్ కృష్ణ అగ్గిపుల్లలపై సూక్ష్మ సీతారామ, లక్ష్మణ, హనుమాన్ సమేత ప్రతిమలను సృష్టించి అబ్బురపరిచారు. మైక్రో ఆర్టిస్ట్ కృష్ణ ఇదివరకు పెన్సిల్, చాక్‌పీస్‌లపై అతి సూక్ష్మమైన ఆకారాలను సృష్టించడంతోపాటు లీఫ్ ఆర్ట్, పేపర్ క్రాఫ్ట్‌లో ఎన్నో అద్భుతాలను తయారు చేశారు. అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా అగ్గి పుల్లలను సీతా, రామ లక్ష్మణ, హనుమాన్‌లుగా చెక్కానని కృష్ణ తెలిపారు.


రామదీపం వెలిగిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


రాముడికి పూజలు చేస్తున్న గవర్నర్ తమిళిసై

29 నుంచి అయోధ్యకు ఆస్తా రైళ్లు

- బీజేపీ రైళ్ల షెడ్యూల్ ఖరారు
- రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా అయోధ్యకు భక్తులు
- ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 200 మందికి అవకాశం
- అయోధ్యకు వెళ్లి వచ్చేందుకు 5 రోజుల సమయం

సాక్షి, హైదరాబాద్: రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ తర్వాత రాష్ట్రంలోని భక్తులను అయోధ్య రామ మందిరానికి రైళ్లలో తీసుకువెళ్తామని హామీనిచ్చిన భారతీయ జనతాపార్టీ ఆ మేరకు ప్రత్యేక ఆస్తా రైళ్ల షెడ్యూల్‌ను ప్రకటించింది. రాష్ట్రంలోని 17 పార్లమెంటు నియోజకవర్గాల వారీగా ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి 200మందిని తీసుకువెళ్లనుంది. ఆ ప్రత్యేక ఆస్తా రైలులో మొత్తం 20 బోగీలు ఉంటాయనీ, ఒక్కో ట్రైన్‌లో 14 వందల మందికి ప్రయాణించే అవకాశం ఉంటుందనీ, అయోధ్యకు వెళ్లి వచ్చేందుకు 5 రోజుల సమయం పట్టనుందని వెల్లడించింది. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం ప్రయాణికులు వెళ్లే రైలు జనవరి 29 వ తేదీన బయలుదేరుతుందనీ, వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం ప్రయాణికుల రైలు జనవరి 30న, హైదరాబాద్ ప్రయాణికుల రైలు జనవరి 31, కరీంనగర్– ఫిబ్రవరి 1న, మల్కాజ్‌గిరి– ఫిబ్రవరి 2న, ఖమ్మం– ఫిబ్రవరి 3న, చేవెళ్ల– ఫిబ్రవరి 5, పెద్దపల్లి– ఫిబ్రవరి 6, నిజామాబాద్– ఫిబ్రవరి 7, అదిలాబాద్– ఫిబ్రవరి 8, మహబూబ్‌నగర్– ఫిబ్రవరి 9. మహబూబ్‌బాద్– ఫిబ్రవరి 10, మెదక్– ఫిబ్రవరి 11, భువనగిరి– ఫిబ్రవరి 12, నాగర్ కర్నూల్ – ఫిబ్రవరి 13, నల్లగొండ – ఫిబ్రవరి 14, జహీరాబాద్ ప్రయాణికుల రైలు– ఫిబ్రవరి 15న బయలుదేరుతాయి. సికింద్రాబాద్, నిజమాబాద్, జహీరాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, మల్కాజ్ గిరి, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గాల ప్రయాణీకుల రైళ్లు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరతాయనీ, నల్లగొండ, వరంగల్, మహబూబ్ బాద్, ఖమ్మం, పెద్దపల్లి, కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గాల ప్రయాణికుల రైళ్లు కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరుతాయని బీజేపీ పేర్కొంది.

హిందువుల కల సాకారమైంది

గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

సాక్షి, హైదరాబాద్/గన్‌ఫౌండ్రీ: ఐదు శతాబ్దాల హిందువుల కల అయిన అయోధ్య రామ మందిరాన్ని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. సోమవారం నిజాం కళాశాల మైదానంలో ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్ ఆధ్వర్యంలో అయోధ్య బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గవర్నర్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అయోధ్య రామమందిరం కేవలం గుడిమాత్రమే కాదని సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక అవుతుందని కిషన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. బర్కత్‌పుర చమన్ వద్ద కిషన్‌రెడ్డి దంపతులు రామ దీపాలు వెలిగించారు. నారాయణమ్మ ఇంజనీరింగ్ కాలేజీలో వర్చువల్ జరిగిన అయోధ్య బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ వేడుకల్లో కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. నారాయణమ్మ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు జి.పుల్లారెడ్డి రామాలయ నిర్మాణం కోసం పరితపించారన్నారు. కొంపల్లి హనుమాన్ దేవాలయం, బోయిన్‌పల్లిలోని రామాలయం, బీఎన్ రెడ్డి నగర్‌లోని హనుమాన్ దేవాలయం, ఓల్డ్ అల్వాల్‌లోని హనుమాన్ దేవాలయం, మౌలాలి, అల్వాల్ తదితర ప్రాంతాల్లో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద రాష్ట్ర కార్యదర్శి ఎస్ ప్రకాష్‌రెడ్డి, పార్టీ నాయకులు టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

అసలు వాళ్లు ఈ దేశ పౌరులేనా? రామమందిరాన్ని వ్యతిరేకిస్తారా!

ఎంపీ బండి సంజయ్

కరీంనగర్ కల్చరల్: 'అయోధ్య రామమందిరంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠను వ్యతిరేకించే వాళ్లు ఈ దేశ పౌరులేనా..? అయోధ్యలో రాముడు పుట్టారనడానికి, రామమందిరం ఉందనడానికి ఆధారాల్లేవని అంటారా..? సాక్షాత్తు అత్యున్నత సుప్రీంకోర్టే తీర్పు ఇచ్చిన తరువాత ప్రశ్నిస్తారా..? అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి అనుగుణంగా ఇచ్చిన తీర్పును అవమానిస్తారా..?'అంటూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై నిప్పులు చెరిగారు. సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణచౌక్‌లో టపాసులు కాల్చి కాషాయదండుతో కలిసి నృత్యం చేశారు. అనంతరం బండి మాట్లాడుతూ గొప్ప మహత్కార్యాన్ని వీక్షించిన ఈతరం ప్రజలు చేసుకున్న పూర్వ జన్మ సుకృతమని వ్యాఖ్యానించారు. 'అయోధ్యలో పాతకట్టడం కూల్చివేతలో పాల్గొన్న కరసేవకుల తొలి బ్యాచ్ మాదే. నాతోపాటు గుజ్జ శ్రీనివాస్ సహా ఎంతోమంది కరసేవకులు ఆ నాడు కరసేవ సందర్భంగా తిండి లేక ఇబ్బంది పడ్డాం'అని గుర్తు చేసుకున్నారు. రాహుల్ గాంధీ అసోంలో ధర్నా పెద్ద డ్రామా అని విమర్శించారు. '1959లో రామ మందిరాన్ని కూల్చివేసిన చోటకు రాహుల్ తాత నెహ్రూ వెళ్లి బాబర్ మసీదును సందర్శించిన మాట నిజం కాదా..? 1968లో ఇందిరాగాంధీ శ్రీకృష్ణ జన్మస్థానమైన మధిరను ఈద్గాకు కేటాయిస్తానని అఫిడవిట్ ఇచ్చిన మాట వాస్తవం కాదా..?'అని బండి ప్రశ్నించారు.



మరోసారి 'వ్యూహం'ను రివ్యూ చేయండి

సీబీఎఫ్‌సీకి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ దర్శకత్వం వహించిన 'వ్యూహం' చిత్ర విడుదలకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్(సీబీఎఫ్‌సీ) ఇచ్చిన సర్టిఫికెట్‌ను రద్దు చేస్తూ తెలంగాణ హైకోర్టు తీర్పు వెలువరించింది. రివైజింగ్ కమిటీ ఇచ్చిన నివేదికలో లోటుపాట్లు ఉన్నాయని పేర్కొంటూ మరోసారి రివ్యూ చేయాలని సీబీఎఫ్‌సీని ఆదేశించింది. 3 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని చెబుతూ పిటిషన్‌ను అనుమతించింది. 'వ్యూహం'చిత్రానికి సీబీఎఫ్‌సీ సర్టిఫికెట్ జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ టీడీపీ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ సూరేపల్లి నందా ఈ నెల 11న తీర్పు రిజర్వు చేసి సోమవారం తీర్పు వెలువరించారు. కాగా, సింగిల్ జడ్జి ఆదేశాలను చిత్ర నిర్మాత ద్విసభ్య ధర్మాసనం వద్ద ఒకట్రెండు రోజుల్లో సవాల్ చేసే అవకాశముంది.

బీసీ గురుకుల సొసైటీ విద్యార్థులకు ఫెన్సింగ్‌లో పతకాలు

సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో పతకాలు సాధించిన బీసీ గురుకుల విద్యార్థులను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో పతకాలు సాధించిన విద్యార్థులను మంత్రి సన్మానించారు. నల్లగొండ జిల్లా తుమ్మడం బీసీ గురుకుల పాఠశాలకు చెందిన జి.భవజ్ఞ జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించగా ముగ్గురు విద్యార్థులు ఎం.అక్షయ (8వ తరగతి), కె.హరిప్రియ (7వ తరగతి), జె.మనస్విని (8వ తరగతి) రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గురుకుల విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని, భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి డాక్టర్ మల్లయ్య బట్టు తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.